

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 31

మంగళవారం 23-4-2024



దోచుకోవడమే కాంగ్రెస్ లక్ష్యం

కాంగ్రెస్‌కు అధికారమిస్తే సర్వం లూటీ చేస్తారన్న ప్రధాని మోదీ - 6లో



కొనసాగిన కొనుగోళ్ల జోరు

సూచీలకు రెండోరోజూ లాభాలే.. సెన్సెక్స్ లాభం 560 పాయింట్లు - 15లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

న్యూస్‌రీల్

ఆ నియామకాలు రద్దు



ఎన్నికల వేళ పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ ప్రభుత్వానికి కలకత్తా హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఎస్‌ఎల్‌ఎస్‌టీ–2016 రిక్రూట్‌మెంట్ పరీక్ష ద్వారా చేపట్టిన 24,640 నియామకాలన్నీ రద్దు చేస్తున్నట్లు హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పునిచ్చింది.

- వివరాలు 6లో

● అత్యాచార బాధిత బాలిక..

30 వారాల గర్భ విచ్ఛిత్తికి అనుమతి



అత్యాచారానికి గురై గర్భం దాల్చిన 14 ఏళ్ల బాలిక 30 వారాల గర్భ విచ్ఛిత్తికి సుప్రీం కోర్టు అసాధారణ అనుమతి మంజూరు చేసింది. ప్రత్యేక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, ఏప్రిల్ 4న బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును పక్కన పెడుతున్నట్లు వివరించింది.

- వివరాలు 6లో

ఏపీలో ప్రతిభ చాటిన పేదింటి పిల్లలు



ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యా రంగంలో తెచ్చిన సంస్కరణల ఫలాలు పదో తరగతి ఫలితాల్లో మరోసారి ప్రస్ఫుటించాయి. సోమవారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో 86.69 ఉత్తీర్ణత శాతం నమోదైంది.

- వివరాలు 5లో

ఇక శాశ్వత రిజిస్ట్రేషన్లూ షోరూంలలోనే..!



వాహనాలు కొనుగోలు చేసిన షోరూంలలోనే శాశ్వత రిజిస్ట్రేషన్లు చేసేందుకు రవాణా శాఖ కసరత్తు చేపట్టింది.ఏపీలో విజయవంతంగా అమలవుతున్న విధానాన్ని ఇక్కడా అమలు చేసేందుకు అధ్యయనం చేస్తోంది.

- వివరాలు 16లో

గులాబీ రథం..ప్రజాపథం

రేపట్నుంచి 17 రోజుల పాటు కేసీఆర్ బస్సుయాత్ర

- విస్తృత స్థాయిలో ప్రజలను కలిసేలా ఏర్పాట్లు
- ఎక్కడికక్కడ ఎంపీ అభ్యర్థి, నియోజకవర్గ నేతలతో కలిసి రోడ్ షోలు
- ఉదయం వేళ రైతులు, మహిళలు, యువత, దళితులు, గిరిజనులు, మైనారిటీలు తదితర సామాజిక వర్గాలతో ప్రత్యేకంగా భేటీలు
- రోడ్ షోలు ముగిసిన తర్వాత సంబంధిత నియోజకవర్గ నేతలతో సమావేశాలు
- పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో సాధించిన అభివృద్ధిపై వివరణ
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేలా ఎన్నికల ప్రచారం
- తెలంగాణ ఉద్యమం తరహాలో ప్రజల్లో ఆలోచన రేకెత్తించేలా పర్యటన
- కేసీఆర్ యాత్ర చుట్టూ రాజకీయాలు కేంద్రీకృతమయ్యేలా ప్రణాళిక





సాక్షి, హైదరాబాద్: పార్లమెంటు ఎన్నికల్లో మెజారిటీ సీట్లు సాధించడమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ పార్టీ ప్రచార వ్యూహానికి పదును పెడుతోంది. వివిధ స్థాయిల్లో నేతలు లోక్‌సభ నియోజకవర్గాల్లో ప్రచారం కొనసాగిస్తుండగానే..మరోవైపు పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు స్వయంగా రంగంలోకి దిగనున్నారు. బుధవారం నుంచి రాష్ట్రంలో బస్సు యాత్రకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ పర్యటనలో కేవలం రోడ్ షోలకే పరిమితం కాకుండా, కేసీఆర్ ఎక్కడికక్కడ ప్రజలతో మమేకం కానున్నారు. పార్టీ ఎంపీ అభ్యర్థుల గెలుపు కోసం అధినేత విస్తృత స్థాయిలో ప్రజలను కలుస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును వివరించడంతో పాటు, కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల హామీలు అమలు చేయకపోవడాన్ని ఎండగడుతూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు చెబుతున్నారు. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమ సమయం నాటి వాతావరణాన్ని తలపిస్తూ ఉద్వేగాన్ని తట్టి లేపేలా బస్సు యాత్ర కొనసాగుతుందని అంటున్నారు. అదే సమయంలో గత పదేళ్లలో బీఆర్‌ఎస్‌కు, అదేవిధంగా

మిగతా 2వ పేజీలో ▶



ప్రజలకు కాంగ్రెస్‌పై నమ్మకం పోయింది

- వంద రోజుల్లోనే వ్యతిరేకత..
- ప్రజల పక్షాన కొట్లాడేది బీఆర్‌ఎస్సేనని భావిస్తున్నారు
- 8 నుంచి 10 స్థానాల్లో కారుదే విజయం: కేటీఆర్

10లో

వారిది కళ్ల మంట

సంక్షేమ పథకాలతో కాంగ్రెస్‌ను ప్రజలు ఆదరిస్తుంటే ఓర్వలేకపోతున్నారు

అందుకే పడగొట్టాలని, ఓడగొట్టాలని అంటున్నారు.. బీఆర్‌ఎస్, బీజేపీలపై సీఎం రేవంత్ ఫైర్

మోదీ, కేసీఆర్ ఇద్దరూ తోడు దొంగలే..

- వారి కుట్రపూరిత, కుమ్మక్కు రాజకీయాలను ప్రజలు తిప్పికొట్టాలి
- మోదీకి ఓటమి భయం పట్టుకోవడంతోనే అవాస్తవ ఆరోపణలు
- కాంగ్రెస్ హిందువుల ఆస్తులను ముస్లింలకు పంచుతుందని ఎలా అంటారు?
- మతాల మధ్య చిచ్చు పెట్టి.. రాజకీయ వ్యాపారం చేస్తున్నారు
- నేను హిందువుగా గర్విస్తా.. ముస్లిం, సిక్కు, క్రిస్టియన్లను గౌరవిస్తా...
- సెప్టెంబర్ 17లోగా నిజాం షుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తాం
- నిజామాబాద్‌లో పసుపు బోర్డును ఏర్పాటు చేస్తాం
- మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు కడతామని వెల్లడి
- నిజామాబాద్, ఆదిలాబాద్, మల్కాజిగిరి జనజాతర సభల్లో ప్రసంగించిన సీఎం



నిజామాబాద్ జనజాతర సభలో ఎంపీ అభ్యర్థిగా జీవన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్/ సాక్షి, ఆదిలాబాద్/సాక్షి, మేడ్చల్ జిల్లా: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజల ఇళ్లలో వెలుగులను చూసి బీఆర్‌ఎస్, బీజేపీ కళ్లలో నిప్పులు పోసుకుంటున్నాయని టీపీసీసీ చీఫ్, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలను అమలు చేస్తున్నామని తమపై కక్షగట్టారని.. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టాలని, ఓడగొట్టాలని అంటున్నారని విమర్శించారు. మోదీ, కేసీఆర్ ఇద్దరూ తోడు దొంగలని.. వారి కుట్రపూరిత రాజకీయాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆదిలాబాద్, నిజామాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అంతాయిపల్లిలో నిర్వహించిన కాంగ్రెస్

మిగతా 2వ పేజీలో ▶

'మండే' ఎండలు

రాష్ట్రంలో సోమవారం 45 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు

- మరో రెండు రోజులు సాధారణం కంటే ఎక్కువే ఉంటాయన్న వాతావరణ శాఖ
- అక్కడక్కడా తేలికపాటి వానలు పడవచ్చని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు మళ్లీ భగ్గుమంటున్నాయి. చాలా ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై కనిపిస్తున్నా.. ఉష్ణోగ్రతలు, ఉక్కపోత ఏమాత్రం తగ్గడం లేదు. ఉదయం ఏడు గంటల నుంచే వేడి గాలి వీస్తోంది. మధ్యాహ్నానికి మండిపోతున్న పరిస్థితి. సోమవారం రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రత 45 డిగ్రీలు నమోదైంది. నల్లగొండ జిల్లా టీక్యా తండాలో 45 డిగ్రీలు నమోదవగా.. బుగ్గబావిగూడ, ముదిగొండలో 44.9 డిగ్రీలు, ధర్మపురి, మామిళ్లగూడలలో 44.8 డిగ్రీలు, కట్టంగూరులో 44.7 డిగ్రీలు, అశ్వాపురంలో 44.5 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మొత్తంగా సోమవారం రాష్ట్రవ్యాప్తంగా సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా ఖమ్మం, భద్రాచలం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఎండల తీవ్రత మరింత ఎక్కువగా ఉంది.



మరో రెండు రోజులు ఇలాగే..

రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని.. ఉక్కపోత మరింత పెరుగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. అధిక ఉష్ణోగ్రతలకు తోడు ఉత్తర ప్రాంత జిల్లాల్లో వడగాడ్పులు వీచే అవకాశం

మిగతా 2వ పేజీలో ▶



జాతీయం..

రెండో విడతలో నువ్వా నేనా!?

- రాజస్తాన్‌లో ఆసక్తికరంగా ఎన్నికల పోరు... 13 లోక్‌సభ స్థానాలకు 26న పోలింగ్
- బరిలో గహ్లోత్, వసుంధర కుమారులు... గెలుపు మాజీ సీఎంలిద్దరికీ ప్రతిష్టాత్మకమే

11లో

తెలంగాణ



కరీంనగర్ కింగ్ ఎవరు ?

కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ హోరాహోరీ

10లో

ఆంధ్రప్రదేశ్



సర్వనాశనం నిజమే!

బాబు దోపిడీతో కుదేలైన రాష్ట్రాన్ని సంస్కరణలతో పునర్నిర్మిస్తున్న ఏపీ సీఎం వైఎస్ జగన్

12లో

'టార్గెట్ 14, మిషన్ 15' కష్టసాధ్యమే అంటున్న పార్టీ అంతర్గత సర్వేలు!

- ఇప్పటికే ఏఐసీసీకి నివేదికలు
- 10–11 స్థానాల్లో పరిస్థితి సానుకూలమని తేలినట్టు సమాచారం
- మూడుచోట్ల నో చాన్స్! రెండుచోట్ల బీజేపీతో, ఒకచోట బీఆర్‌ఎస్‌తో టఫ్ ఫైట్!
- హైదరాబాద్ ఎలాగూ ఎంఐఎందేనని స్పష్టీకరణ



కాంగ్రెస్ లక్ష్యం.. దూరమే!

సాక్షి, హైదరాబాద్: పోలింగ్ సమయం సమీపిస్తున్న కొద్దీ లోక్‌సభ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ తన లక్ష్యాన్ని చేరుకుంటుందా లేదా అన్న దానిపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు తమ నాలుగు నెలల పాలనకు రెఫరెండం అని ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి అండ్ టీం ఏ మేరకు విజయ తీరాలను చేరుతుంది? టార్గెట్ 14, మిషన్ 15 పేరుతో రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాల్లో ప్రచారం చేస్తున్న ఆ పార్టీ ఆశలు నెరవేరుతాయా? అనే అంశాలు అటు కాంగ్రెస్ పార్టీలోనూ, ఇటు రాష్ట్ర రాజకీయ వర్గాల్లోనూ చర్చనీయాంశమవుతున్నాయి. ఈ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు వచ్చేందుకు అవకాశం ఉన్నా.. అనుకున్న టార్గెట్‌ను చేరడం మాత్రం కష్టసాధ్యమేనని పార్టీ అంతర్గత సర్వేల్లో స్పష్టమవుతుండటం గమనార్హం. ప్రత్యర్థి పార్టీల కంటే కాస్త ఎక్కువ సీట్లు లభించినా వాటి ప్రభావాన్ని నియంత్రించగలిగే పరిస్థితి లేదని ఆ సర్వేల్లో వెల్లడైనట్లు సమాచారం.

ఏఐసీసీ ఒకటి.. పీసీసీ మూడు

రాష్ట్రంలో లోక్‌సభ ఫలితాలు ఎలా ఉండబోతున్నాయన్న దానిపై ఏఐసీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం సర్వే నిర్వహించిందని,

మిగతా 2వ పేజీలో ▶

ఇదండీ సంగతి



ఆర్థికంగా, ఆరోగ్యంగా చాలా పుష్టిగా ఉన్నాడు... మనం కొనలేం సార్!

● జిత్తులమారి బాబు కోసం...

గ్రామాల్లోకి గుంట నక్కలు



బాబు కోసం సిద్ధమైన టీడీపీ ఎన్‌ఆర్‌ఐల మంద

- గుంపులుగా రాష్ట్రంలోకి ప్రవేశించి ఎన్నికల అక్రమాలు
- కులోన్మాదం, డబ్బు మదంతో ప్రజలను ఏమార్చే యత్నాలు
- గ్రామాల్లోకి వెళ్లి ఓటర్లను ప్రలోభ పెట్టడంపై దిశా నిర్దేశం
- కోమటి జయరాం నేతృత్వంలో శిక్షణ
- వైఎస్సార్‌సీపీ ఓటర్లను ప్రభావితం చేయడమే లక్ష్యం
- సోషల్ మీడియాలో ఎన్‌ఆర్‌ఐ బ్యాచ్‌ల వీర విహారం
- విరాళాల సేకరణ నుంచి ఓట్లు వేయించే వరకు కీలక బాధ్యతలు
- ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదమంటున్న విశ్లేషకులు.. ఎన్నికల సంఘం దృష్టి పెట్టాలని సూచన

12లో

అమ్మ ఒడి.. సర్కారు బడి

జగన్ ఇచ్చిన నమ్మకం

- పిల్లలను బడికి పంపే ప్రతి తల్లికీ రూ.15వేలు ఇస్తానని హామీ
- చెప్పినట్టే అర్హులందరి ఖాతాల్లోకి తొలి ఏడాది నుంచే జమ..
- కానీ ఇద్దరు పిల్లలకు ఇస్తామని.. ఒక్కరికే ఇస్తున్నారంటూ రామోజీ కేకలు

5లో

శభాష్ గుకేశ్...

క్యాండిడేట్స్ చెస్ టోర్నీ టైటిల్ గెలిచిన భారత యువ గ్రాండ్‌మాస్టర్



టొరంటో: అంచనాలకు మించి రాణించిన భారత యువ గ్రాండ్ మాస్టర్, చెన్నై కుర్రాడు దొమ్మరాజు గుకేశ్ క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో టైటిల్ సాధించాడు. తద్వారా ఈ ప్రతిష్టాత్మక టైటిల్ నెగ్గిన పిన్న వయస్కుడిగా కొత్త రికార్డు నెలకొల్పాడు. 40 ఏళ్లుగా గ్యారీ కాస్పరోవ్ (1984లో 22 ఏళ్లు) పేరిట ఈ రికార్డు ఉంది. 2014లో విశ్వనాథన్ ఆనంద్ తర్వాత క్యాండిడేట్స్ టోర్నీ టైటిల్ గెలిచిన రెండో భారతీయ ప్లేయర్‌గా 17 ఏళ్ల గుకేశ్ గుర్తింపు పొందాడు. ఎనిమిది మంది మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య జరిగిన ఈ టోర్నీలో నిర్ణీత 14 రౌండ్ల తర్వాత గుకేశ్ 9 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ విజయంతో గుకేశ్ ఈ ఏడాది చివర్లో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ కోసం జరిగే మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా)తో తలపడతాడు.

ఇంతింతై.. అనతికాలంలోనే అద్భుత ఫలితాలు సాధించిన గుకేశ్ 14లో



చేవెళ్ల బీజేపీ లోక్‌సభ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నామినేషన్ వేసిన అనంతరం మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్. చిత్రంలో లక్ష్మణ్ తదితరులు

మోదీ హ్యాట్రిక్ ఖాయం

కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ 10లో

ఒక్క రుణమాఫీపైనే ఒట్టా..

మిగతా హామీలన్నీ గట్టున పెట్టినట్టేనా?

- 411 వాగ్దానాలను ఆగస్టులో నెరవేరుస్తారా? రాజీనామా చేస్తారా?
- సీఎం రేవంత్‌రెడ్డికి బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రశ్న
- కేసీఆర్‌తో మంత్రి కోమటిరెడ్డి టచ్‌లో ఉన్నారనిపిస్తోందని వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: రైతు రుణమాఫీని ఆగస్టు 15న కచ్చితంగా అమలు చేస్తామని ఒట్టేసి చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మిగిలిన 411 హామీలపై ఒట్టు.. గట్టున పెట్టినట్లేనా అని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చిన హామీలను అమలు చేయలేకపోతే ఆగస్టు 15న రాజీనామా చేస్తారా అని నిలదీశారు. సోమవారం

మిగతా 2వ పేజీలో ▶

ఆంక్షల యోచన లేదు!

సాక్షి, హైదరాబాద్: 'ధరలు పెంచే ఎత్తులు'పేరిట సాక్షిలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ శాఖ స్పందించింది. బెంగళూరు తరహాలో హైదరాబాద్‌లోనూ హైరైజ్ భవనాల ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ (ఎఫ్‌ఎస్‌ఐ)పై ఆంక్షలు విధించే యోచన ఏమీ లేదని ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే డెవలపర్ల నుంచి స్పెషల్ ట్యాక్స్ వసూలు చేసే ఉద్దేశం కూడా లేదని పేర్కొంది. బహుళ అంతస్తుల భవనాల అనుమతులేవీ పెండింగ్‌లో లేవని వివరించింది. గతేడాది డిసెంబర్ 7 తర్వాత జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో 33కుపైగా హైరైజ్ అపార్ట్‌మెంట్లకు అనుమతులు మంజూరు చేసినట్లు ప్రకటనలో తెలిపారు.

ఒక్క రుణమాఫీ పైనే ఒట్టా..

▶ మొదటి పేజీ తరువాయి

బీజేపీ కార్యాలయంలో మహేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ప్రజల్లో కాంగ్రెస్ ఇమేజీ, క్రెడిబులిటీ దెబ్బతిందన్నారు. ఫలితంగా ఈ లోక్‌సభ ఎన్నికల్లో నాలుగైదు సీట్లలో తప్ప కాంగ్రెస్.. బీజేపీకి అసలు పోటీనివ్వడం లేదని ప్రీపోల్‌సర్వేలు, ఇంటెలిజెన్స్ రిపోర్ట్‌లు స్పష్టం చేశాయని చెప్పారు. దీంతో ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయావకాశాలు పెంచేందుకే ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తామని సీఎం ప్రకటిస్తున్నారని, ఇది రైతులతో సహా అన్ని వర్గాలనూ మోసగించడం కాదా అని నిలదీశారు. రైతు రుణమాఫీతో సహా ఆగస్టు 15లోగా అన్ని హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాసినట్టు తెలిపారు.

అసలు ఆగస్ట్ వరకు రేవంత్ పదవిలో ఉంటారా?

జూలైలో ఓటుకు కోట్లు కేసులో విచారణ మొదలవుతున్న నేపథ్యంలో అసలు రేవంత్ ఆగస్టు వరకు పదవిలో ఉంటారా అన్న అనుమానం కలుగుతోందని మహేశ్వర్ రెడ్డి వ్యాఖ్యానించారు. తన పదవికి గండం ఎదురయ్యే 'ఆగస్టు సంక్షోభం' భయంతోనే కోమటిరెడ్డి వెంకటరెడ్డితో సహా కాంగ్రెస్ నేతలను ఎక్కడికక్కడ వాళ్లే సీఎం అని రేవంత్‌రెడ్డి చెబుతున్నారని ఎద్దేవా చేశారు. మాజీ సీఎం కేసీఆర్ తమతో 20 మంది టచ్‌లో ఉన్నారన్న మాటలు చూస్తే , ఆయనతో కోమటిరెడ్డి వెంకటరెడ్డి టచ్‌లో ఉన్నారేమోననే అనుమానం కలుగుతోందన్నారు.

విద్యార్థినులకు స్కూటీల మాటేమైంది

గత నాలుగున్నర నెలల్లో రాష్ట్రంలో అనేక కుంభకోణాలు జరిగాయని మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. ఎన్నడూ లేని విధంగా రైతులు గోస పడుతున్నారని, ఒకవైపు నీళ్లు లేక బాధపడుతుంటే ఇంకో వైపు ధాన్యం కొనుగోలు గాక ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో ధాన్యం తడిచినా ప్రభుత్వం కొనడం లేదని, పంటకు బోనస్ ఇవ్వడం లేదని విమర్శించారు. కళ్యాణ లక్ష్మీతో పాటు తులం బంగారం వస్తదని ఆడపడుచులు పెళ్లిళ్లు కూడా వాయిదా వేసుకుంటున్నారన్న మహేశ్వర్‌రెడ్డి.విద్యార్థినులకు స్కూటీల మాటేమైందని ప్రశ్నించారు.

గాంధీ, నెహ్రూల చరిత్రను కాదనే శక్తి బీజేపీకి ఉందా?

- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సూటి ప్రశ్న



సాక్షి, హైదరాబాద్: పురాణాల్లో రామాయణం, మహాభారతాలకు ఎలాంటి చరిత్ర ఉందో స్వాతంత్ర్యానంతరం గాంధీ కుటుంబానికి అలాంటి చరిత్ర ఉందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. జవహర్ లాల్ నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడే దేశంలో శ్రీరాముని పాలన మొదలైందన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం జైలు జీవితం గడిపిన నెహ్రూ, గాంధీ రక్తపాతం లేకుండా శాంతి మార్గంలో పయనించి ఆధునిక భారతదేశానికి పునాదులు వేశారని చెప్పారు. సోమవారం గాంధీభవన్‌లో రాష్ట్ర మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల చైర్మన్ మెట్టు సాయికుమార్, టీపీసీసీ అధికార ప్రతినిధులు భవానీ రెడ్డి, కమల్‌తో కలిసి జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. ఈ చరిత్రను కాదనే శక్తి బీజేపీ నేతలకుందా అని ప్రశ్నించారు. దేశంలో ఆకలి చావులు ఉండొద్దని సాగునీటి ప్రాజెక్టులు కట్టిన చరిత్ర నెహ్రూదనీ, అలాంటి కుటుంబం గురించి ఇప్పటి బీజేపీ నేతలు విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ చరిత్ర గురించి చెప్పకపోయినా ఫర్వాలేదనీ కానీ అబద్ధపు ప్రచారం సరైంది కాదన్నారు. గాంధీ, నెహ్రూ జీవిత చరిత్రలను పాఠ్యాంశాల్లో చేర్చాలని సీఎం రేవంత్‌ను కలిసి కోరుతానని జగ్గారెడ్డి చెప్పారు.

'మండే' ఎండలు

▶ మొదటి పేజీ తరువాయి

ఉందని హెచ్చరించింది. మరోవైపు దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుంచి విదర్భ, మరాఠ్వాడ మీదుగా అంతర్గత కర్ణాటక వరకు ఉపరితల ద్రోణి కేంద్రీకృతమై ఉందని.. దాని ప్రభావంతో మంగళ, బుధవారాల్లో కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడవచ్చని వెల్లడించింది.

సోమవారం ప్రధాన కేంద్రాల్లో నమోదైన ఉష్ణోగ్రతలివీ..

కేంద్రం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	45.4	27.8
కడప	43.8	27.8
ఆదిలాబాద్	42.8	25.7
ఖమ్మం	42.6	26.2
భద్రాచలం	42.5	27.0
నల్లగొండ	41.5	23.4
నిజామాబాద్	41.5	26.8
మహబూబ్‌నగర్	41.5	28.5
రామగుండం	41.0	27.4
మెదక్	40.6	22.5
హన్మకొండ	40.0	25.5
హైదరాబాద్	39.8	27.3



ఆదిలాబాద్ సభలో డోలు వాయిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



ఆదిలాబాద్ జన జాతర సభకు హాజరైన ప్రజలు

వారిది కళ్ల మంట

▶ మొదటి పేజీ తరువాయి

జన జాతర సభల్లో రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''ఐదేళ్లు పాలించేందుకు ప్రజలు మాకు అవకాశమిచ్చారు. మేం ప్రజలకు ఇచ్చిన మాట నిలుపుకొనేందుకు కృషి చేస్తున్నాం. మూడు నెలల్లో 30వేల ఉద్యోగాలిచ్చాం. దీంతో కడుపులో ద్వేషం నింపుకొని విషం కక్కుతున్నారు. ప్రభుత్వాన్ని పడగొట్టాలంటున్నారు. కాంగ్రెస్‌ను ఓడించాలంటున్నారు. ఎందుకు ఓడించాలి? ఆడబిడ్డలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినందుకా? ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం కల్పించినందుకా? 40లక్షల కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నందుకా? పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నందుకా?కాంగ్రెస్‌ను పడగొట్టినా.. ఓడగొట్టినా పేదలకు నష్టం జరుగుతుంది. కేసీఆర్ ఇందిరమ్మ ఇండ్లను డబ్బా ఇళ్లంటూ.. డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తానని మోసం చేశారు. యువతకు ఉద్యోగాలు ఇవ్వలేదు. కేంద్రంలో బీజేపీ ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామంది. అంటే పదేళ్లలో 20కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలి. అవి ఏమయ్యాయి? మోదీ సంకుచిత స్వభావంతో నిధులన్నీ గుజరాత్‌కు తీసుకెళ్లారు.

ఐదు చోట్ల బీఆర్‌ఎస్ డమ్మీ అభ్యర్థులు

తన బిడ్డ కవిత బెయిల్ కోసం మాజీ సీఎం కేసీఆర్ ఐదు లోక్‌సభ సీట్లను మోదీకి తాకట్టు పెట్టారు. ఇప్పుడు మోదీ, కేసీఆర్ ఇద్దరూ తొడు దొంగలే. బీజేపీ అభ్యర్థులను గెలిపించడానికి లోక్‌సభ బరిలో బీఆర్‌ఎస్ డమ్మీ అభ్యర్థులను నిలిపింది. ఈ కుట్రపూరిత, కుమ్మక్కు రాజకీయాలను ప్రజలు తిప్పి కొట్టాలి. మేం ఆగస్టు 15లోగా రైతుల రుణమాఫీ చేస్తాం, ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తాం. అప్పుల ఊబిలో కూరుకుపోయి మూతపడే పరిస్థితి నుంచి ఆర్టీసీని కాపాడి.. 50వేల మంది కార్మికులను, వారి కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ ఆదుకుంది. రాష్ట్రంలో బీసీల లెక్కలు తీస్తున్నాం. జనాభా దామాషా లెక్కన వారి వాటా వారికి ఇవ్వాలన్నది మా ఆలోచన. బీసీలు రాజ్యాధికారంలో వాటా అడుగుతారన్న ఉద్దేశంతో బీజేపీ దీన్ని అడ్డుకోవాలని చూస్తోంది.

తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు కడతాం.

నాడు కాంగ్రెస్ ప్రభుత్వం అంబేడ్కర్ పేరిట తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును ప్రారంభించింది. కానీ కేసీఆర్ ఆ ప్రాజెక్టును మార్చారు. అంబేడ్కర్ పేరు తొలగించారు. ఆదిలాబాద్‌కు సాగునీరు అందకుండా చేశారు. మేం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు కడతాం. మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూమికి సంబంధించి ఆ రాష్ట్ర ప్రభుత్వంలో చర్చలు జరుపుతున్నాం. ఆ ప్రాంత రైతాంగాన్ని ఒప్పించి, సరైన నష్టపరిహారం ఇప్పించి అంబేడ్కర్ పేరిట తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మిస్తాం. ఆదిలాబాద్‌లో యూనివర్సిటీ ఏర్పాటు చేస్తాం. బోథ్‌లో కుప్టి ప్రాజెక్టును నిర్మిస్తాం. కడెం ప్రాజెక్టుకు మరమ్మతులు చేపడతాం. ప్రైవేట్ వ్యక్తులతో మాట్లాడైనా ఆదిలాబాద్‌లో మూతపడ్డ సీసీఐ ఫ్యాక్టరీని పునరుద్ధరించేందుకు చర్యలు చేపడతాం.

నిజాం షుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తాం.. పసుపు బోర్డు తెస్తాం..

2014లో కవితను ఎంపీగా గెలిపిస్తే పసుపు, సోయా, ఎర్రజొన్నలకు ధర దక్కుతుందని.. నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తారని నిజామాబాద్ రైతులు భావించారు. కానీ నిజాం షుగర్స్‌ను తెరిపించకుండా మోసం చేయడంతో తర్వాతి ఎన్నికల్లో కవితను ఓడించారు. అప్పుడు గెలిచిన బీజేపీ ఎంపీ అర్వింద్ కూడా షుగర్ ఫ్యాక్టరీని తెరిపించలేదు. కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే నిజాం షుగర్స్‌ను తెరిపించేందుకు మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, జీవన్‌రెడ్డిలతో సబ్ కమిటీ వేశాం. ఆ కమిటీ విధివిధానాలు రూపొందిస్తోంది. సెప్టెంబర్ 17లోగా షుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తాం. ఇక పసుపు బోర్డు తెస్తానని రైతులకు బాండ్ పేపర్ రాసిచ్చిన అర్వింద్.. స్పైసెస్ బోర్డు రీజనల్ ఆఫీస్‌ను చూపించి పసుపు బోర్డుగా చెప్తున్నారు. అసలు పసుపు బోర్డు హిమాలయాల్లో ఉందో, శంకరగిరి మాన్యాల్లో ఉందో తెలియదు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిని పార్లమెంట్‌కు పంపితే.. పసుపు బోర్డును నిజామాబాద్‌కు తీసుకొస్తారు. రైతుబిడ్డ అయిన జీవన్‌రెడ్డిని గెలిపించుకుంటే పార్లమెంట్‌లో రైతుల వాణి వినిపిస్తారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే.. ఆయనను వ్యవసాయ మంత్రిని చేయిస్తాం..'' అని రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆయా సభల్లో మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, లోక్‌సభ అభ్యర్థులు, స్థానిక ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

మోదీది నీచ రాజకీయం!

కాంగ్రెస్ గెలిస్తే హిందువుల ఆస్తులను గుంజుకుని ముస్లింలకు పంచుతారని మోదీ అంటున్నారు. అలా ఎలా పంచుతారు? ఇంత నీచమైన రాజకీయం మోదీకి తగదు. ఓటమి భయంతోనే ఇలా ప్రచారం చేస్తున్నారు. మత ప్రాతిపదికన విభజించి, అశాంతిని సృష్టిస్తే దేశం కుప్పకూలుతుంది. అంబేడ్కర్ రాజ్యాంగం ప్రకారం ఇది సెక్యులర్ దేశం. కానీ మోదీ మతాల మధ్య చిచ్చు పెడుతున్నారు. రాముడి పేరుతో ఎంతకాలం రాజకీయం చేస్తారు? దేవుడు గుడిలో ఉండాలి. భక్తి గుండెల్లో ఉండాలి. నేను హిందువుగా గర్విస్తా.. ముస్లిం, సిక్కు, క్రిస్టియన్లను గౌరవిస్తా.. ఎవరి ధర్మం, ఎవరి జాతి వారిదే. అందరినీ గౌరవించుకోవాలి. దేవుడు, మతం పేరుతో రాజకీయ వ్యాపారం చేసే వారిని తరిమికొట్టాలి.



ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను పరిచయం చేస్తున్న రేవంత్‌రెడ్డి



మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డితో కలసి అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

కేసీఆర్- ఈటల మధ్య ఒప్పందం

మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్.. కేంద్రం నుంచి హుజూరాబాద్‌కు నిధులు తీసుకొస్తే అక్కడి ప్రజలు ఎందుకు ఆయనను ఓడించారు? మోదీ, అమిత్‌షా తన చేతుల్లో ఉన్నారని చెప్పుకొంటున్న ఈటల.. మరి కేసీఆర్, కేటీఆర్‌ల అవినీతిపై కేంద్ర సంస్థలతో దర్యాప్తు ఎందుకు చేయించలేకపోతున్నారు. ఫోన్ ట్యాపింగ్‌పై ఎందుకు స్పందించడం లేదు? అంటే కేసీఆర్- ఈటల మధ్య ఒప్పందం ఏంటో ప్రజలకు గ్రహించాలి. ఈటల రాజేందర్ కమ్యూనిస్టు ముసుగులో మోదీ భజన చేస్తున్నారు. 2019 ఎన్నికల్లో కార్యకర్తలే ముందుండి తనను మల్కాజిగిరి ఎంపీగా గెలిపించారు. ఇప్పుడు సునీతా మహేందర్‌రెడ్డిని కూడా అలాగే గెలిపించాలి. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు పరాయి వారిలో చేతిలో ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కాంగ్రెస్ వారే ఎంపీగా ఉంటే సమస్యలు పరిష్కారం అవుతాయి. తనను నిలబెట్టి రాజకీయ భవిష్యత్ ఇచ్చిన మల్కాజిగిరిని గుండెల్లో పెట్టుకుని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా.

హైదరాబాద్ నలుదిక్కులా అభివృద్ధి చేస్తాం: శ్రీధర్‌బాబు

హైదరాబాద్ నగరంలో నలుదిక్కులా ఐటీ, ఇండస్ట్రియల్ కారిడార్ గా అభివృద్ధి చేస్తామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. మల్కాజిగిరి సభలో ఆయన మాట్లాడారు. ఇక్కడి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గతంలో మంత్రిగా ఉన్నప్పుడు ప్రజలకు రేషన్‌కార్డులు ఇవ్వకపోగా.. ఆరోగ్యశ్రీని నీరుగార్చారని ఆరోపించారు.

బీజేపీని ఓడించాలి: సీపీఐ నేత చాడ

మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుందని సీపీఐ రాష్ట్ర నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి మల్కాజిగిరి సభలో విమర్శించారు. మతాల మధ్య చిచ్చు పెడుతున్న బీజేపీని ఈ ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. సోనియా గాంధీ తెలంగాణ ఇస్తే.. కేసీఆర్ లూటీ చేశారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డికి మరింత బలం రావాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. తమ మద్దతు కాంగ్రెస్‌కు ఉంటుందన్నారు.

సీఎం సభలో డ్రోన్ కలకలం

శామీర్‌పేట్: హైదరాబాద్ శివార్లలోని తూంకుంట మున్సిపాలిటీ అంతాయిపల్లిలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్న సభలో ఒక డ్రోన్ కలకలం సృష్టించింది. సీఎం హెలికాప్టర్ వచ్చే ముందు, తర్వాత ఈ డ్రోన్ తిరుగాడింది. ఎలాంటి అనుమతి లేకుండా.. ఎండీ ఇద్రిస్, గణేశ్‌రెడ్డి, అక్షయ్ అనే వ్యక్తులు ఆ డ్రోన్‌ను వినియోగించినట్టు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

ముఖ్యమంత్రి 4 రోజుల ప్రచార షెడ్యూల్ ఖరారు

నేడు కొడంగల్‌కు.. సాయంత్రం నాగర్‌కర్నూల్‌లో పర్యటన

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మరో నాలుగు రోజుల పాటు సీఎం రేవంత్‌రెడ్డి వరుసగా జిల్లాలకు వెళ్లనున్నారు. ఈ మేరకు ప్రచార షెడ్యూల్‌ను సీఎం కార్యాలయం సోమవారం విడుదల చేసింది. ఈ షెడ్యూల్ ప్రకారం మంగళవారం ఉదయం ఆయన తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌కు వెళ్లనున్నారు. అక్కడ స్థానిక నేతలతో సమావేశమైన అనంతరం సాయంత్రం నాగర్‌కర్నూల్‌లో పర్యటిస్తారు. ఈనెల 24న ఉదయం సికింద్రాబాద్ అభ్యర్థి దానం నాగేందర్ నామినేషన్ ర్యాలీకి హాజరవుతారు. సాయంత్రం వరంగల్ ప్రచార సభకు హాజరవుతారు. 25న సాయంత్రం చేవెళ్ల నియోజకవర్గంలో ప్రచార సభ, 26న సాయంత్రం జహీరాబాద్ నియోజకవర్గంలో ప్రచార ర్యాలీకి సీఎం రేవంత్ హాజరు కానున్నారు.

గులాబీ రథం.. ప్రజాపథం

▶ మొదటి పేజీ తరువాయి

కేసీఆర్‌కు వ్యతిరేకంగా, ఉద్దేశపూర్వకంగా జరిగిన ప్రచారాన్ని తిప్పికొట్టేలా కేసీఆర్ ప్రసంగాలు ఉంటాయని సమాచారం. మొత్తం మీద కేసీఆర్ బస్సు యాత్ర చుట్టూనే రాష్ట్ర రాజకీయాలు కేంద్రీకృతమయ్యేలా, ప్రజల్లో ఆలోచన రేకెత్తించేలా పర్యటన ఉంటుందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ఈ నెల 24 నుంచి మే 10 వరకు 17 రోజుల పాటు జరగనున్న యాత్ర షెడ్యూలు రెండు రోజుల క్రితం ఖరారైన విషయం తెలిసిందే.

పూర్తిగా క్షేత్రస్థాయిలోనే ఉండేలా..

గత 23 ఏళ్లలో ఉద్యమ నేతగా, ముఖ్యమంత్రిగా వందలాది బహిరంగ సభలు, వేలాది సమావేశాలు, రోడ్ షోలు తదితరాలతో కేసీఆర్ రాష్ట్రాన్ని చుట్టివచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్టీ నిర్వహించిన నల్లగొండ, కరీంనగర్, చేవెళ్ల బహిరంగ సభల్లో పాల్గొన్నారు. ఉమ్మడి నల్లగొండ, వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో 'పొలంబాట' పేరిట బస్సుయాత్ర నిర్వహించారు. తాజాగా ఎన్నికల నేపథ్యంలో పక్షం రోజులకు పైగా కేసీఆర్ పూర్తిగా క్షేత్ర స్థాయిలోనే ఉండేలా బస్సు యాత్ర షెడ్యూల్‌ను రూపొందించారు. పర్యటనలో భాగంగా సాయంత్రం సమయాల్లో రోడ్ షోల ద్వారా పార్లమెంటు అభ్యర్థులకు మద్దతుగా కేసీఆర్ ప్రచారం చేస్తారు. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఉదయం 11 గంటల లోపు స్థానికంగా రైతులు, మహిళలు, యువత, దళితులు, గిరిజనులు, మైనారిటీలు తదితర సామాజికవర్గాలతో ప్రత్యేకంగా భేటీ అవుతారు. ఈ భేటీలకు సంబంధించిన ఏర్పాట్లపై స్థానిక నేతలతో సంప్రదింపులు దాదాపుగా పూర్తయ్యాయి.

100 వాహనాల కాన్వాయ్‌తో..

ఈ నెల 24న తెలంగాణ భవన్ నుంచి కేసీఆర్ ప్రత్యేక బస్సులో మిర్యాలగూడకు బయలుదేరి వెళతారు. యాత్ర పొడవునా ఆయన వెంట సుమారు వంద వాహనాలతో కూడిన కాన్వాయ్ అనుసరించే అవకాశముంది. ఎన్నికల సంఘం ప్రవర్తనా నియమావళికి లోబడి రోడ్ షోలు సాగేలా ప్రణాళిక రూపుదిద్దుకుంటోంది. ఇప్పటికే కేసీఆర్ పర్యటనకు సంబంధించి ఈసీ, పోలీసు అనుమతులు కోసం బీఆర్‌ఎస్ దరఖాస్తు చేసింది. ఇక కేసీఆర్‌కు సెక్యూరిటీ, ఆయన వెంట వచ్చే వారికి భోజనం, వసతి తదితర సౌకర్యాలపై సూక్ష్మ స్థాయిలో ప్లానింగ్ చేస్తున్నారు. పార్టీ నేతలు కర్నె ప్రభాకర్, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, దేశపతి శ్రీనివాస్, గ్యాదరి బాలమల్లుతో పాటు కొందరు యువనేతలు పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. కేసీఆర్ భద్రతకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తూ పార్టీ పరంగా సెక్యూరిటీ ఏర్పాట్లను సమీక్షిస్తున్నారు.

అనుసరించనున్న యువత, విద్యార్థి విభాగాలు

కేసీఆర్ బస్సు యాత్ర వెంట పార్టీ యువత, విద్యార్థి విభాగాల నాయకులు అనుసరించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. రోడ్ షోల సందర్భంగా కేసీఆర్ వెంట బస్సులో పార్టీ లోక్‌సభ అభ్యర్థితో పాటు సంబంధిత నియోజకవర్గం పరిధిలోని ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జిలు ఉంటారు. రోడ్ షో ముగిసిన తర్వాత రాత్రి బస వద్దే ఎక్కడికక్కడ సంబంధిత పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని కీలక నేతలతో కేసీఆర్ సమన్వయ సమావేశం నిర్వహించి ఎన్నికల దిశా నిర్దేశం చేస్తారు.

నీరా'జనం' పట్టేలా..

కేసీఆర్ పర్యటన విజయవంతం చేసేందుకు సర్వశక్తులూ ఒడ్డాలని బీఆర్‌ఎస్ నిర్ణయించింది. అడుగడుగునా జనం నీరాజనం పట్టేలా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. అవసరమైన జన సమీకరణ కోసం స్థానికంగా ప్రణాళిక రూపొందించుకోనున్నారు. బస్సు యాత్ర పురస్కరించుకుని దేశపతి శ్రీనివాస్, రసమయి బాలకిషన్ పర్యవేక్షణలో కొత్త పాటల రికార్డింగ్ శరవేగంగా జరుగుతుండగా, ఇప్పటికే కొన్ని పాటలు విడుదల య్యాయి.

పద్మ అవార్డులు స్వీకరించిన
వెంకయ్య నాయుడు, మిథున్ చక్రవర్తి



రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా పద్మ అవార్డు అందుకుంటున్న వెంకయ్యనాయుడు

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు, సులభ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు బిందేశ్వర్ పాఠక్ తదితర ప్రముఖులు పద్మ అవార్డులను అందుకున్నారు. సోమవారం రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ముగ్గురికి పద్మ విభూషణ్, 8 మందికి పద్మ భూషణ్, 55 మందికి పద్మశ్రీ అవార్డులను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అందజేశారు. వెంకయ్య నాయుడు, పాఠక్ మరణించడంతో ఆయన భార్య అమోల్, భరతనాట్యం కళాకారిణి పద్మా సుబ్రహ్మణ్యం పద్మ విభూషణ్ స్వీకరించారు. నటుడు మిథున్ చక్రవర్తి, గాయని ఉషా ఉత్తుప్, యూపీ మాజీ గవర్నర్ రామ్ నాయక్, పారిశ్రామికవేత్త సీతారాం జిందాల్ పద్మ భూషణ్ అవార్డును అందుకున్నారు. తెలంగాణకు చెందిన బుర్రవీణ కళాకారుడు దాసరి కొండప్ప, చిందు యక్షగానం కళాకారుడు గడ్డం సమ్మయ్య, ప్రసిద్ధ బంజారా కవి కేతావత్ సోమ్‌లాల్ రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి జై శంకర్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఇప్పటి వరకు విడతలుగా సగం మంది ఈ అవార్డులను అందుకోగా మరికొందరికి వచ్చే వారం జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి ప్రదానం చేయనున్నారు.

కవిత బెయిల్ పిటిషన్‌పై మే 2న తీర్పు

- సీబీఐ కేసులో ముగిసిన వాదనలు
- ఈడీ కేసులో నేడూ కొనసాగనున్న విచారణ



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ స్కామ్‌కు సంబంధించిన సీబీఐ కేసులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిలు పిటిషన్‌పై ప్రత్యేక కోర్టు తీర్పు రిజర్వు చేసింది. మే 2న తీర్పు వెలువరిస్తామని తెలిపింది. ఇదే స్కామ్‌పై ఈడీ కేసులో బెయిల్‌పై వాదనలు మంగళవారం కూడా కొనసాగనున్నాయి. సీబీఐ, ఈడీ కేసుల్లో కవిత వేర్వేరుగా దాఖలు చేసిన బెయిలు పిటిషన్లను రౌజ్ అవెన్యూ కోర్టు న్యాయమూర్తి కావేరి బవేజా సోమవారం విచారించారు. సీబీఐ కేసులో కవిత తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. ఈడీ కేసులో జ్యుడీషియల్ కస్టడీలో ఉండగా సీబీఐ అధికారులు అరెస్టు చేయాల్సిన అవసరం లేదని అన్నారు. కవిత సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున స్టార్ క్యాంపెయినర్‌గా ఉన్నారని తెలిపారు. ఏడేళ్ల కన్నా తక్కువ శిక్ష పడే కేసుల్లో బెయిలు మంజూరు చేయొచ్చని చెప్పారు. మహిళ అనే అంశాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని బెయిల్ మంజూరు చేయాలని కోరారు. మరోవైపు ఈ కుంభకోణంలో కీలక పాత్ర పోషించిన కవిత బయటకు వస్తే కేసును ప్రభావితం చేస్తారని, సాక్ష్యాలను ధ్వంసం చేస్తారని సీబీఐ తరఫు న్యాయవాది ఆరోపించారు. బెయిలు ఇచ్చేందుకు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇరుపక్షాల వాదనల అనంతరం న్యాయమూర్తి తీర్పు రిజర్వు చేస్తున్నట్లు తెలిపారు.

సాక్ష్యాలు ధ్వంసం చేయలేదు: సింఘ్వీ

ఈడీ కేసులో బెయిల్ పిటిషన్‌ను న్యాయమూర్తి మధ్యాహ్నం విచారించారు. కవిత తరఫు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. బుచ్చిబాబు, మాగుంట రాఘవలకు బెయిలు వచ్చిన తీరును ఆయన వివరించారు. బుచ్చిబాబు నాలుగు స్టేట్‌మెంట్ల తర్వాత బెయిల్ వచ్చిందని, మాగుంట రాఘవ, శరత్‌చంద్రారెడ్డిలకు కూడా అప్రూవర్‌గా మారిన తర్వాతే బెయిల్ వచ్చిందని చెప్పారు. దీంతోపాటు రాఘవ తండ్రి మాగుంట శ్రీనివాసులురెడ్డి ఎన్డీయే అభ్యర్థిగా లోక్‌సభకు పోటీ చేస్తున్నారన్నారు. అప్రూవర్‌గా మారుతూ కవితకు వ్యతిరేకంగా వారు ఇచ్చిన స్టేట్‌మెంట్లు ఆధారంగా చేసుకుని ఆమెను అరెస్టు చేశారని ఆరోపించారు. ఈ సమయంలో న్యాయమూర్తి జోక్యం చేసుకొని డిజిటల్ సాక్ష్యాలు ధ్వంసం చేశారా? అని ప్రశ్నించారు. తాము ఎలాంటి సాక్ష్యాలు ధ్వంసం చేయలేదని సింఘ్వీ బదులిచ్చారు. దీనిపై ఈడీ తరఫు న్యాయవాది జోహెబ్ హొస్సేన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. కవిత ఇచ్చిన ఫోన్లలో ఎలాంటి సమాచారం లభ్యం కాలేదన్నారు. ఉద్దేశపూర్వకంగా సమాచారం డిలిట్ చేశారని ఆరోపించారు.

ఇంట్లో పనివారికి ఆ ఫోన్లు ఇచ్చారు

తాను వాడుకొన్న తర్వాత ఇంట్లో పనివారికి కవిత ఫోన్లు ఇచ్చారని వారు డేటా డిలిట్ చేసుకొని వాడుకున్నట్లున్నారని సింఘ్వీ తెలిపారు. మూడు ఫోన్లు ఇంట్లో పనివారికి ఇచ్చారని సింఘ్వీ చెబుతుండగా.. తాము నోటీసులు ఇచ్చిన తర్వాతే ఫోన్లలో సమాచారం డిలిట్ అయినట్లుగా ఫోరెన్సిక్ పరీక్షలో తేలిందని జోహెబ్ అన్నారు. ఈ సమయంలో కొంతసేపు బ్రేక్ కావాలని కొంత సమాచారం కోర్టుకు వివరిస్తామని సింఘ్వీ న్యాయమూర్తిని అభ్యర్థించారు. బ్రేక్ తీసుకున్న తర్వాత కోర్టు సమయం ముగియడానికి ఎక్కువ సేపు ఉండదని, వాదనలు పూర్తి చేయడానికి ఆ సమయం సరిపోతుందా? అని సింఘ్వీని న్యాయమూర్తి ప్రశ్నించారు. మంగళవారం కూడా వాదనలు కొనసాగిస్తామని ఆయన చెప్పడంతో.. మంగళవారం మధ్యాహ్నానికి విచారణ వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి తెలిపారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసుల్లో ఈడీ మార్చి 15న కవితను అరెస్టు చేయగా, ఏప్రిల్ 11న సీబీఐ అరెస్టు చేసింది. ఇలావుండగా జ్యుడీషియల్ కస్టడీ ముగియడంతో మంగళవారం ఉదయం ప్రత్యేక కోర్టులో కవితను అధికారులు హాజరు పరచనున్నారు.



గుండాల మండల కేంద్రంలో బండమీద ఆరబోసిన ధాన్యం వర్షానికి కొట్టుకుపోయిన దృశ్యం

అకాల వర్షం.. తడిసిన ధాన్యం

సాక్షి, యాదాద్రి: యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం), గుండాల, మోత్కూరు, అడ్డగూడూరు, రామన్నపేట మండలాల్లో ఆదివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది. గుండాల మండల కేంద్రంలో బండపై ఆరబెట్టిన ధాన్యం పక్కనే ఉన్న చెరువులోకి కొట్టుకుపోయింది. అలాగే పండ్ల తోటలకు నష్టం వాటిల్లింది. సుమారు 126 ఎకరాల్లో మామిడి కాయలు నేలరాలాయి. గుండాల మండలం పెద్దపడిశాల, అడ్డగూడూరు మండలం కంచనపల్లిలో పిడుగుపాటుకు రెండు ఎద్దులు మృతి చెందాయి. పలు చోట్ల చెట్లు విరిగిపడగా విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి.

తడిసిన ధాన్యాన్ని కొనాలని రైతుల ధర్నా

ఆత్మకూరు(ఎం): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ఆత్మకూరు (ఎం) మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ వద్ద బీజేపీ, బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సోమవారం రైతులు ఆందోళన చేపట్టారు. లారీలు రాకపోవడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం ఇస్తున్న మద్దతు ధరతోపాటు క్వింటాకు రూ. 500 బోనస్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ లక్ష్యం.. దూరమే!

▶ మొదటి పేజీ తరువాయి

ఇటీవలే ఈ సర్వే నివేదిక ఏఐసీసీకి వెళ్లిందని తెలుస్తోంది. మొత్తం 17 స్థానాలకు గాను 10 లేదా 11 చోట్ల పార్టీకి గెలుపు అవకాశాలున్నాయని ఇందులో వెల్లడైందని సమాచారం. మరోవైపు రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం కూడా 3 సర్వేలను వేర్వేరుగా నిర్వహించిందనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి టీం నేరుగా పర్యవేక్షిస్తోన్న ఈ సర్వేలు కూడా మెజార్టీ సీట్లు వస్తాయనే అంచనాలనే వెల్లడించాయని తెలుస్తోంది. 9 చోట్ల గెలిచే అవకాశముందని ఒక సర్వే స్పష్టం చేస్తుండగా, మరో 2 సర్వేలు అంతకు మించి ఒకటి రెండు స్థానాల్లో చాన్స్ ఉందని చెపుతున్నాయని సమాచారం.

సిటీ పరేషాన్ మళ్లీ తప్పదా?

ఉత్తర తెలంగాణలో ప్రస్తుతం బీజేపీ ప్రాతినిధ్యం వహిస్తోన్న ఓ స్థానంతో పాటు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనికి వచ్చే మరో రెండు స్థానాల్లో గెలుపు చాలా దూరంలో ఉందని, ఈ మూడుచోట్లా గెలవాలంటే చాలా కష్టపడాల్సి వస్తుందని సర్వేల్లో తేలినట్టు తెలుస్తోంది. ఇక్కడ బీజేపీ అభ్యర్థులు ముందంజలో ఉన్నారని కూడా వెల్లడైనట్టు సమాచారం. జీహెచ్ఎంసీతో సంబంధమున్న మరో నియోజకవర్గంతో పాటు సీఎం రేవంత్ ప్రాతినిధ్యం వహిస్తోన్న ఉమ్మడి జిల్లాలోని ఒకచోట కూడా బీజేపీతో తీవ్ర పోటీ ఉందని, అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎక్కువ చోట్ల గెలిచిన హైదరాబాద్ శివార్లలోని మరో లోక్‌సభ స్థానంలో ఆ పార్టీతో టఫ్ ఫైట్ జరుగుతుందని సర్వేలు వెల్లడించాయని తెలుస్తోంది. హైదరాబాద్‌లో ఎలాగూ ఎంఐఎం హవానే కొనసాగుతుందని తేలినట్టుగా గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇవి కాకుండా మిగిలిన చోట్ల మాత్రం గెలుపు అవకాశాలున్నాయని, ఎన్నికల వరకు అప్రమత్తంగా ఉంటే ఆయా స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించే చాన్స్ ఎక్కువగా ఉందని సర్వేలో తేలినట్టు సమాచారం.

సర్వేలకు అనుగుణంగా ప్రచారం

గెలుపు కోసం కష్టపడాల్సి ఉంటుందని సర్వేల్లో తేలిన నియోజకవర్గాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టేందుకు టీపీసీసీ నాయకత్వం సిద్ధమవుతోంది. సర్వే ఫలితాల ఆధారంగా ఆయా నియోజకవర్గాలకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఏఐసీసీ నేతలు, ఇతర కాంగ్రెస్ ముఖ్యులను ఎన్నికల ప్రచారానికి పంపాలని, ఆయా స్థానాల్లో ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకుని ముందుకెళ్లాలని యోచిస్తోంది. కష్టపడాల్సిన స్థానాల్లో నేతలను ఎక్కువగా మోహరించడం, పోలింగ్ బూత్‌ల వారీగా లెక్కలు తెప్పించుకుని పార్టీ నేతలు, కేడర్‌ను ప్రజల్లోకి పంపడం లాంటి వ్యూహాలకు పదును పెడుతోంది.

క్లుప్తంగా...

సీఏఏను కాంగ్రెస్ ఎన్నికల కోసం వాడుకుంటోంది

- బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కోసమే సీఏఏను వాడుకుంటోందని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ మండిపడ్డారు. అధికారంలోకి వస్తే సీఏఏను రద్దు చేస్తామని కేంద్ర మాజీ మంత్రి చిదంబరం చెప్పడంతో పాటు ఇది ఒక వర్గానికి వ్యతిరేకమని ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. భారత్‌లో ముస్లింలకు ఉన్న స్వాతంత్రం గురించి చిదంబరం మర్చిపోయారా అని ఆయన ప్రశ్నించారు. ముస్లిం దేశాల్లోనూ లేని విధంగా వారు ఇక్కడ భద్రత, రక్షణ పొందుతున్నారని చెప్పారు. సీఏఏను రద్దు చేస్తామని చెప్పడం ద్వారా కాంగ్రెస్‌కు హిందువులపట్ల ఎంత వ్యతిరేకత ఉందో అర్థమవుతోందన్నారు. సోమవారం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ఓటమి నైరాశ్యంలో బీజేపీపై బురద చల్లే ప్రయత్నాలు చేస్తోందన్నారు. దేశవ్యాప్తంగా ప్రజలు మోదీ మూడోసారి ప్రధాని కావాలని కోరుకుంటున్నట్టు చాలా స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో...ఇతర పార్టీల కంటే తెలంగాణలో బీజేపీ అత్యధిక సీట్లలో గెలవబోతోందని, ఇక్కడ రాజకీయ పరిస్థితులను గమనిస్తే భవిష్యత్తు బీజేపీదేనని స్పష్టమవుతోందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో బీఆర్ఎస్ కనుమరుగు అయ్యిందని ఆయన ఎద్దేవా చేశారు.

వడదెబ్బతో వృద్ధుడు మృతి



అయోధ్య రాములు

శంకరపట్నం: కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన తాటికొండ అయోధ్య రాములు (80) సోమవారం వడదెబ్బతో మృతి చెందాడు. రాములు ఇంటివద్దే ఉంటున్నాడు. రెండ్రోజులుగా ఎండలు ఎక్కువగా ఉండటంతో అస్వస్థతకు గురయ్యాడు. ఈ క్రమంలో సోమవారం మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

మెదక్‌కు కాంగ్రెస్ పార్టీ ఏమీ చేయలేదనడం విడ్డూరం

- టీపీసీసీ అధికార ప్రతినిధి భవానీరెడ్డి

సాక్షి, హైదరాబాద్: మెదక్‌కు కాంగ్రెస్ పార్టీ ఏమీ చేయలేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అనడం విడ్డూరమని టీపీసీసీ అధికార ప్రతినిధి భవానీరెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం ఆమె గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత కేసీఆర్ కుటుంబం మతిభ్రమించి మాట్లాడుతోందన్నారు. బీడీఎల్, బీహెచ్ఈఎల్ లాంటి సంస్థలు తీసుకొచ్చి లక్షలాది మందికి ఉపాధి కల్పించిన ఘనత కాంగ్రెస్‌ది కాదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మెదక్‌ను కోలుకోని విధంగా దెబ్బ తీశారని, ప్రాజెక్టులు కట్టామంటున్న బీఆర్ఎస్ నేతలు.. కొత్తగా ఒక్క ఎకరానికైనా నీళ్లు ఇచ్చారా? అని భవానీరెడ్డి నిలదీశారు. ఎల్లంపల్లి నుంచి కొండపోచమ్మలోకి నీరు ఎత్తిపోసుకుని కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీరు తరలించారని ఆరోపించారు. ప్రస్తుతం బీఆర్ఎస్ నుంచి ఎంపీగా పోటీ చేస్తున్న వెంకట్రామిరెడ్డి గతంలో పునరావాసంపై నిలదీసిన రైతులను బెదిరించారని, నిర్బంధించారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ చెప్పింది చేసి చూపిస్తోందని, దానికి ఆరు గ్యారంటీలే నిదర్శనమన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాబోతోందని, హరీశ్‌రావు మితిమీరిన మాటలు మాట్లాడకుంటే మంచిదని భవాని హితవు పలికారు.

ఏనుగుల మంద సంచారంపై అటవీ శాఖ అప్రమత్తం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులో మళ్లీ ఏనుగుల మంద సంచరిస్తోందన్న సమాచారంతో రాష్ట్ర అటవీ శాఖ అప్రమత్తమైంది. కొన్ని రోజుల క్రితం మహారాష్ట్ర నుంచి వచ్చిన ఓ ఏనుగు రాష్ట్రంలో ఇద్దరి మృతికి కారణమైంది. అటవీ అధికారులు శ్రమించి దానిని తిరిగి మహారాష్ట్ర అడవుల్లోకి పంపించిన విషయం తెలిసిందే. తాజాగా మళ్లీ ఏనుగుల మంద సంచరిస్తోందన్న సమాచారంతో అటవీ అధికారులు అప్రమత్తమయ్యారు. సోమవారం దూలపల్లి అటవీ అకాడమీలో అన్ని జిల్లాల ముఖ్య అటవీ శాఖ అధికారులతో పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఏనుగుల మంద తిరిగి తెలంగాణలోకి ప్రవేశిస్తే ఎదురయ్యే ఇబ్బందుల గురించి చర్చించారు. శాఖ పరంగా చేపట్టాల్సిన కార్యక్రమాల్లో భాగంగా.. అక్కడున్న గ్రామ ప్రజలకి, రైతులకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఏనుగుల మందను ఎలా తిరిగి పంపాలన్న విషయంపై జిల్లాల అధికారులకు పలు సూచనలు చేశారు. ఏనుగుల కదలికలపై కన్నేసి ఉంచాలని, అధునాతన సాంకేతిక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పీసీసీఎఫ్ (వైల్డ్ లైఫ్) ఎంసీ ఫర్గయిన్, పీసీసీఎఫ్ (ప్రొటెక్షన్ అండ్ విజిలెన్స్) డైరెక్టర్ ఈలుసింగ్, పీసీసీఎఫ్ (కంపా) డా. సువర్ణ, అడిషనల్ పీసీసీఎఫ్ సునీతా భగవత్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'గ్యారంటీ'గా కాంగ్రెస్ మెడలు వంచుతాం

- కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్.. సిద్దిపేట జిల్లాలో పర్యటన

హుస్నాబాద్/ ఎల్కతుర్తి: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకుంటే కచ్చితంగా ఆ పార్టీ మెడలు వంచుతామని కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ అన్నారు. తనను ఓడించేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కుట్రలు చేస్తున్నాయని చెప్పారు. సోమవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్, హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఆయన పర్యటించారు. హుస్నాబాద్‌లో పార్టీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో బండి మాట్లాడుతూ, తాము శ్రీరాముడిని ఆరాధిస్తుంటే కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల్లో వణుకు పుడుతోందని, వారెందుకు భయపడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, లేకుంటే ఆ పార్టీ నేతలను గ్రామాల్లో తిరగనివ్వమని స్పష్టం చేశారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ఎంపీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. గ్రామ పచాయతీలకు నేరుగా కేంద్రం నిధులు ఇస్తే వాటిని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇతర పనులకు మళ్లించిందన్నారు. సర్పంచ్‌లు తమ గ్రామాల అభివృద్ధి కోసం అప్పులు చేసి పనులు చేస్తే, బిల్లులు ఇవ్వకుండా వారిని బిచ్చగాళ్లుగా మార్చిందని చెప్పారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్

బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్..

గతంలో బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందని, వడ్ల కొనుగోలులో గంపగుత్తగా కటింగ్ పెడుతోందని బండి సంజయ్ ఆరోపించారు. ఎల్కతుర్తి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ వందరోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని నమ్మించి ఓట్లు దండుకున్న కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు దేవుళ్లమీద ఒట్టుపెట్టి ఆగస్టు 15వ తేదీలోపు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామంటూ మరోసారి మోసం చేస్తోందన్నారు. హామీలను అమలు చేయకుండా రైతులను గోస పెడుతున్న ఈ ప్రభుత్వం, రుణమాఫీ అమలు కోసం రూ.30 వేల కోట్లను విడుదల చేస్తుందంటే నమ్మేదెవరని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే వెంటనే వడ్లకు బోనస్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

అసహనంతోనే కేసీఆర్‌పై రేవంత్ తిట్లదండకం

- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి
- ప్రభుత్వాన్ని నడపడంలో సీఎం విఫలమయ్యారు
- రేవంత్ ఓటమిని అంగీకరించారు



సాక్షి, యాదాద్రి, నల్లగొండ టూటౌన్: భువనగిరి సభలో సీఎం రేవంత్‌రెడ్డి తన ఉపన్యాసంతోనే కాంగ్రెస్ పార్టీ ఓటమిని అంగీకరించారని మాజీ మంత్రి, సూర్యాపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన భువనగిరి, నల్లగొండల్లో మీడియాతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోతున్నామనే అసహనంతోనే రేవంత్.. కేసీఆర్‌పై తిట్ల దండకం అందుకున్నారన్నారు. 120 రోజుల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో ఇప్పుడు ప్రజలు కేసీఆర్‌ను గుర్తు చేసుకుంటున్నారన్నారు. ప్రజలు తన మాటలు నమ్మే పరిస్థితిలో లేరని, రేవంత్‌రెడ్డి దేవుని మీద ప్రమాణాలు చేసి హామీలు అమలు చేస్తానంటున్నారని విమర్శించారు. ప్రభుత్వాన్ని నడపడంలో రేవంత్‌రెడ్డి విఫలమయ్యారన్నారు. ఈ నెల 24, 25 తేదీల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్ షోలను విజయవంతం చేయాలని జగదీశ్‌రెడ్డి ప్రజలను కోరారు.

మోదీకి మూటలు మోస్తున్న రేవంత్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. రాహుల్ గాంధీతో పాటు ప్రధాని మోదీకి కూడా మూటలు పంపిస్తున్నారని జగదీశ్‌రెడ్డి అన్నారు. తాను జానారెడ్డి, జైపాల్‌రెడ్డిని కాదని రేవంత్‌రెడ్డి అంటున్నారని, అంటే వారు చేతకానివారని ఆయన ఉద్దేశమా? అని ప్రశ్నించారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి సీఎం అయ్యే అర్హత ఉందన్న రేవంత్ వ్యాఖ్యలపై ఉత్తమ్, భట్టి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు మాట్లాడాలన్నారు. తెలంగాణ నీటిని ఆంధ్రకు అమ్ముకుని డబ్బులు సంపాదించిన కోమటిరెడ్డి సోదరులు ఇతరుల గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. కోమటిరెడ్డి సోదరులు సినిమాల్లో విలన్ల మాదిరిగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. జగదీశ్‌రెడ్డి వెంట మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్‌కుమార్, బూడిద భిక్షమయ్యగౌడ్, భువనగిరి బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్ తదితరులు ఉన్నారు.

రేవంత్‌కి పాలనలో అనుభవం శూన్యం

- పొన్నాల లక్ష్మయ్య
- దేవుడి మీద ప్రమాణాలు కాదు.. హామీలు నెరవేర్చండి



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పాలన అనుభవం ఏ మాత్రం లేదని, పాలనకు బదులుగా పనికి మాలిన మాటలు మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య విమర్శించారు. దేవుళ్ల మీద ప్రమాణాలు చేయడానికి బదులుగా ఎన్నికల హామీలపై ఇచ్చిన డెడ్‌లైన్లకు కట్టుబడి అమలు చేయాలన్నారు. బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో సోమవారం పొన్నాల మీడియాతో మాట్లాడారు. బాధ్యతగా మాట్లాడాల్సిన రేవంత్‌రెడ్డి సీఎం పదవిని అడ్డు పెట్టుకుని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారన్నారు. బీజేపీతో కాంగ్రెస్ ప్రభుత్వానికి ముప్పు ఉందని కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను రేవంత్ వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. తన ప్రభుత్వాన్ని కేసీఆర్ కూలుస్తారని రేవంత్ చేస్తున్న ప్రచారంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామన్నారు. జానారెడ్డి, జైపాల్‌రెడ్డి వంటి సీనియర్ నాయకులను కూడా రేవంత్ చులకన చేస్తున్నారని పొన్నాల ఆగ్రహం వ్యక్తంచేశారు. రేవంత్ ప్రభుత్వం ఎంతో కాలం కొనసాగదని, గతంలో ఎంతో మంది సీఎంలను చూసిన ప్రజలు.. రేవంత్‌ను కూడా కొంత కాలం భరిస్తారని ఎద్దేవాచేశారు.

నీటి సరఫరాలో అంతరాయాలొద్దు

- తాగునీటి సమస్యపై సీఎస్ సమీక్ష
- అధికారులు నిరంతరం పరిస్థితిని సమీక్షించాలి
- కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రానున్న నెల రోజుల పాటు తాగునీటి సరఫరా పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. నీటి సరఫరాలో అంతరాయాలు రాకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మున్సిపల్, నీటిపారుదల, పంచాయితీ రాజ్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి రాష్ట్రంలో తాగునీటి సరఫరా పరిస్థితిని సమీక్షించారు. సరఫరాలో అంతరాయం ఉన్న ప్రాంతాలను గుర్తించి ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని ఆమె స్పష్టం చేశారు. నగరంలో నీటి పరిస్థితిని ప్రస్తావిస్తూ సంబంధిత సీజీఎం ముందస్తు అనుమతితో మాత్రమే నిర్వహణ పనులు చేపట్టాలని, ఆయా ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా ప్రత్యామ్నాయ తాగునీటి సరఫరా చేయాలని ఆదేశించారు. సీజీఎంలు ప్రతిరోజూ తమ పరిధిలోని మేనేజర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి నీటి సరఫరాను పర్యవేక్షించాలన్నారు. అదే విధంగా మిషన్ భగీరథ, ప్రజారోగ్య విభాగం అధికారులు కూడా నిరంతరం పరిస్థితిని గమనిస్తుండాలన్నారు.

మే నెలాఖరు వరకు లోటుండదు

నాగార్జునసాగర్ నుంచి నీటి పంపింగ్ ఇప్పటికే ప్రారంభమైందని, మే నెలాఖరు వరకు రాష్ట్రంలో తాగునీటి సరఫరాకు ఎలాంటి లోటు ఉండదని అధికారులు ఈ సందర్భంగా సీఎస్‌కు వివరించారు. ఉద్దేశపూర్వకంగా కృత్రిమ కొరత సృష్టించే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డైరెక్టర్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ దివ్య మాట్లాడుతూ, లీకేజీలు ఏవైనా ఉంటే వెంటనే సరిచేస్తున్నామని, ప్రతి మున్సిపాలిటీలో హెల్ప్ లైన్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఇరిగేషన్ శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఎండీ హెచ్ఎండబ్ల్యూఎస్‌బీ సుదర్శన్‌రెడ్డి తదితరులు భేటీలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ బీసీ, మాదిగల వ్యతిరేక ప్రభుత్వం

- బీజేపీ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని కాంగ్రెస్ బీసీ, మాదిగల వ్యతిరేక పార్టీ అని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆరోపించారు. కాంగ్రెస్‌లో బీసీ నేతలు ఇప్పటికైనా కళ్లు తెరిచి నాయకత్వాన్ని నిలదీయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి బీసీల విషయంలో, వారి అభ్యున్నతి విధానాల రూపకల్పన విషయంలో పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని మండిపడ్డారు. సోమవారం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ ఈ వర్గాలు సామాజికంగా, రాజకీయంగా రాణించేందుకు కాంగ్రెస్ ఇప్పటిదాకా చేసింది శూన్యమని దుయ్యబట్టారు. గతం నుంచి అనంతరామ్, మురళీధర్‌రావు, పుట్టుస్వామి కమిషన్ వంటివి వేశాక, వాటి నివేదికల ఆధారంగా కార్యాచరణ రూపొందించే విషయంలో మాత్రం ఎలాంటి చొరవ చూపలేదన్నారు. ఎంపీ ఎన్నికల నేపథ్యంలో రైతులను మభ్యపెడుతూ, ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి రకరకాల ప్రకటనలు చేస్తున్నారని ప్రభాకర్ ధ్వజమెత్తారు. వందరోజుల్లోనే రుణమాఫీ అమలు అని గతంలో చెప్పి, ఇప్పుడు కొత్తగా భగవంతుడు సాక్షి అంటూ ప్రలోభాలకు గురిచేస్తుండటాన్ని తప్పుబడుతున్నామన్నారు.

మోదీని పోటీకి అనర్హుడిగా ప్రకటించాలి

- టీపీసీసీ నేత నిరంజన్

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ రాజస్తాన్‌లో చేసిన విద్వేష పూరిత ప్రసంగానికి గాను జాతికి క్షమాపణలు చెప్పాలని లేదంటే ఆయనను ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హుడిగా ప్రకటించాలని టీపీసీసీ కోరింది. ఈ మేరకు టీపీసీసీ ఎన్నికల సమన్వయ కమిటీ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ సోమవారం కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్‌కు లేఖ రాశారు. మోదీ వ్యాఖ్యలు రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉన్నాయని, దేశంలో మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు ఆయన ప్రయత్నించారని, ఇది ఎన్నికల కోడ్‌కు విరుద్ధమని ఆ లేఖలో పేర్కొన్నారు. ఓట్ల కోసం మత విద్వేషాలను రెచ్చగొట్టకూడదని, కులాలు, వర్గాలు, మతాలు, భాషలకు వ్యతిరేకంగా ఎన్నికల ప్రచారంలో మాట్లాడవద్దని నిబంధనలు చెపుతున్నాయని, ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దేశ ప్రజలకు మోదీ చేత బహిరంగ క్షమాపణలు చెప్పించాలని, లేదంటే ఎన్నికల్లో పోటీకి అనర్హుడిగా ప్రకటించాలని లేఖలో నిరంజన్ డిమాండ్ చేశారు.

మాదిగ జాతికి కాంగ్రెస్ ద్రోహం

- మోత్కుపల్లిని పరామర్శించిన మందకృష్ణ

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ గతంలో ఎన్నడూ లేని విధంగా మాదిగ జాతికి ద్రోహం చేసిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ మండిపడ్డారు. మాల సామాజిక వర్గానికి చెందిన రెండు కుటుంబాలకి రెండు టికెట్లు ఇచ్చి లక్షలాది జనాభా ఉన్న మాదిగలకు ఇవ్వకుండా ద్రోహం చేసిందని ఆయన ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌కు ఇప్పటికే మాదిగలు దూరమయ్యారని, ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి మాదిగలు ఓట్లు వేసే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. లోక్‌సభ సీట్ల కేటాయింపులో మాదిగలకు జనాభా ప్రతిపాదికన టికెట్లు ఇవ్వాలని నిరాహార దీక్ష చేపట్టి అస్వస్థతకు గురైన మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులును మందకృష్ణ పరామర్శించారు. సోమవారం నర్సింహులు ఇంటికి వెళ్లిన మందకృష్ణ ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ మాదిగలకు చేసిన అన్యాయంపై వారిద్దరి మధ్య చర్చ జరిగినట్టు ఎమ్మార్పీఎస్ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ మాదిగలకు రావాల్సిన న్యాయబద్ధమైన వాటా కోసం తాము కలిసి ముందుకు సాగుతామని చెప్పారు.



సోమవారం సలేశ్వరం తీర్థం వద్ద లింగమయ్య దర్శనానికి బారులుతీరిన భక్తులు

సలేశ్వరం.. జనసంద్రం

నల్లమలలో ప్రారంభమైన సలేశ్వరం లింగమయ్య ఉత్సవాలు

రేపటి వరకు దర్శనానికి అవకాశం

సాక్షి, నాగర్‌కర్నూల్: తెలంగాణ అమరనాథ్ యాత్రగా పేరొందిన నల్లమలలోని సలేశ్వరం లింగమయ్య ఉత్సవాలకు మొదటి రోజున భక్తులు పోటెత్తారు. లింగమయ్య స్వామిని దర్శించుకునేందుకు సోమవారం సుమారు 50వేలకు పైగా భక్తులు సలేశ్వరానికి చేరుకున్నారు. ఎత్తైన కొండలు, లోయలను దాటుకుంటూ 'వస్తున్నాం .. లింగమయ్యా..'అంటూ భక్తుల శివనామస్మరణ తో నల్లమల అభయారణ్యం మార్మోగింది. సలేశ్వర తీర్థం జలపాతం నుంచి జాలువారుతున్న నీటిలో తడిసి భక్తిపారవశ్యంలో మునిగిపోయా రు. లింగమయ్య దర్శనానికి ఈనెల 24న సాయంత్రం 6 గంటల వరకు అటవీశాఖ అనుమతించింది. హైదరాబాద్-శ్రీశైలం రహదారిపైనున్న ఫర్హాబా ద్ గేటు నుంచి వాహనాలను అటవీప్రాంతంలోకి అనుమతిస్తున్నారు. మరోమార్గమైన లింగాల మండలం అప్పాయిపల్లి-గిరిజగుండాల నుంచి భక్తులు కాలినడకన సలేశ్వరానికి చేరుకుంటున్నారు. మంగళవారం పౌర్ణమి కావడంతో భక్తుల రద్దీ పెరగొచ్చు.



నీరు తాగుతున్న చిరుతపులి

కెమెరాకు చిక్కిన చిరుతలు

జన్నారం: కవ్వాల్ టైగర్ జోన్‌లోని మంచిర్యాల జిల్లా జన్నారం అటవీ డివిజన్ ఇందన్‌పల్లి, జన్నారం అటవీ రేంజ్‌లో చిరుతపులులు కెమెరాకు చిక్కాయి. వేసవిలో నీటి కోసం వన్య ప్రాణులు అల్లాడిపోతున్నాయి. దీంతో ఇటీవల కాలంలో అటవీ అధికారులు సాసర్‌వెల్స్ ఏర్పాటు చేశారు. దప్పిక తీర్చుకోవడం కోసం సాసర్‌వెల్స్, నీటికుంటల దగ్గరికి వచ్చి నీరు తాగుతూ చిరుతలు, నీల్‌గాయిలు, మెకాలు, అడవిదున్నలు.. అటవీ అధికారులు అమర్చిన కెమెరాలకు చిక్కాయి.



సాసర్ వెల్‌లోనీరు తాగుతున్న అడవి దున్నలు



నీరు తాగుతున్న నీలుగాయిలు



ఇతరులకు మనం ఇతరులం.
- మార్కస్ అరేలియస్

సాక్షి
మంగళవారం, 23 ఏప్రిల్ 2024

పొరుగున మరో సవాలు

ఆదివారం మాల్దీవుల్లో జరిగిన పార్లమెంటరీ ఎన్నికల ఫలితాల సరళి చూశాక భారత్‌కు పొరుగున మరో సవాలు తప్పేలా లేదు. చైనా అనుకూల దేశాధ్యక్షుడు మొహమ్మద్ ముయిజుకూ, ఆయన సారథ్యంలోని పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్ (పీఎన్సీ)కీ అఖండ విజయం అందుతున్నట్టు తొలి వార్తల్లోనే తేలిపోయింది. పార్లమెంట్ 'మజ్లిస్'లోని మొత్తం 93 స్థానాల్లో 90చోట్ల పీఎన్సీ పోటీ చేసింది. 72 శాతం పోలింగే నమోదైన ఈ ఎన్నికల్లో సోమవారం ఉదయానికే ఫలితాలు వెల్లడైన 86 సీట్లలో 66 ఆ పార్టీయే గెలిచింది. సభలో మూడింట రెండు వంతులకు మించి మెజారిటీ సాధించింది. ఫలితాల అధికారిక ధ్రువీకరణకు మరో వారం పట్టవచ్చు. మే తొలివారానికి కొత్త సభ కొలువు తీరవచ్చు. అసలే భారత వ్యతిరేకిగా ముద్రపడ్డ ప్రెసిడెంట్ ముయిజు ఇక పార్లమెంట్ సాక్షిగా భారత వ్యతిరేక విధానాలను ముమ్మరం చేసేందుకు వీలు చిక్కింది. ఇదే ఇప్పుడు ఆందోళన రేపుతోంది.

నలభై అయిదేళ్ళ ముయిజు గత సెప్టెంబర్‌లో దేశాధ్యక్షుడిగా ఎన్నికై, నవంబర్‌లో పదవి చేపట్టినప్పటి నుంచి ఈ పొరుగు దేశం చైనా వైపు మొగ్గుతోంది. అయితే, కార్యనిర్వాహక వ్యవస్థకు మించి పార్లమెంట్‌కే పర్యవేక్షక అధికారాలు ఉంటాయి గనక తాజా పార్లమెంటరీ ఎన్నికలకు ముందు వరకు పరిస్థితి కొంత నయం. ముయిజుకు ముందు అధ్యక్షుడైన ఇబ్రహీమ్ మొహమ్మద్ సోలిహ్ సారథ్యంలోని మాల్దీవియన్ డెమోక్రాటిక్ పార్టీ (ఎండీపీ)దే ఇప్పటి దాకా పార్లమెంట్‌లో ఆధిక్యం. ఆ పార్టీకి 41 మంది సభ్యులుండేవారు. ఇక, ముయిజు తాలూకు పార్టీయేమో సభలో మైనారిటీ కూటమిలో భాగం. అందువల్ల నిరుడు ముయిజు అధ్యక్షుడైనా తాననుకున్న విధాన నిర్ణయాల అమలుకు తగిన మెజారిటీ సభలో లేకపోయింది. ప్రాంతీయంగా బలమైన శక్తి, సాంప్రదాయికంగా మాల్దీవుల హితైషి అయిన భారత్ పట్ల ఆయన వ్యతిరేకత తెలిసిందే. ఆ భారత వ్యతిరేక విధానాలకు ఎండీపీ ఆధిక్యంలోని పార్లమెంట్ అడ్డుపడుతూ వచ్చింది. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల్లో ఆయన పార్టీకి మెజారిటీ వచ్చింది. ఇప్పటి దాకా మెజారిటీలో ఉన్న ఎండీపీ డజను సీట్లకే పరిమితమై, ఘోరంగా ఓడింది. ఇక విధాన నిర్ణయాల్లో విశ్వరూపం చూపడానికి ముయిజుకు అడ్డుండదు.

మాల్దీవుల్లో బస చేసిన భారత సైనికులను వెనక్కి పంపిస్తానని వాగ్దానం చేసి, 2023లో ముయిజు అధ్యక్ష పీఠం ఎక్కారు. దేశ పార్లమెంట్ సహకారం లేక ఇప్పటి దాకా అది ఆగింది. ఇకపై ఆయనను ఆపడం కష్టమే. అధ్యక్ష పదవి చేపట్టిన వెంటనే ఆయన చైనా వెళ్ళి, ఆ దేశాధినేతను కలిసొచ్చారు. వస్తూనే, పేరెత్తకుండా పరోక్షంగా భారత్‌పై విమర్శలు సంధించారు. అప్పటి నుంచి ముయిజు కీలకమైన అనేక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కాంట్రాక్టుల్ని చైనా ప్రభుత్వ రంగ సంస్థలకు కట్టబెడుతూ వచ్చారు. అలా చైనాతో ఆర్థిక సహకారాన్ని పెంపొందించుకోవాలన్నది ఆలోచన. దానికి తాజా ఎన్నికలను ఓ పరీక్షగా పరిశీలకులు భావించారు. తాజా విజయంతో ఆయనకు అడ్డంకులన్నీ తొలగిపోయినట్టే. మానవతావాద కార్యకలాపాల నిమిత్తం ద్వీపదేశంలో ఉన్న భారత సైనికులను తిప్పి పంపడమే ఆయన తక్షణ అజెండా అయితే ఆశ్చర్యం లేదు. దీనికి తోడు ఎన్నికల ఫలితాలు వచ్చిందే తడవుగా... మాల్దీవులతో సమగ్ర, వ్యూహాత్మక సహకార భాగస్వామ్యాన్ని నిరంతరం పటిష్ఠం చేసుకోవాలని చూస్తున్నట్టు చైనా సోమవారం ప్రకటించింది. అది గమనార్హం.

భూమధ్యరేఖ వెంట దాదాపు 800 కి.మీలలో ఒకదానికొకటి విసిరేసినట్టుగా ఉన్న 1,192 చిన్న చిన్న పగడపు దీవుల సముదాయం మాల్దీవులు. భూతాపంతో సముద్రమట్టం పెరిగితే, పెను ముప్పులో పడే దేశాల్లో ఒకటి. చిరు ద్వీపదేశమే అయినా, హిందూ మహాసముద్రంలో వ్యూహాత్మక భద్రతా కారణాల రీత్యా భారత్‌కు కీలకమైనది. ఆది నుంచి ఆ దేశంతో మనది స్నేహబంధమే. ఆర్థికంగా, హార్దికంగా ఆ బంధం కాలపరీక్షకూ నిలిచింది. మచ్చుకు గత ఏడాది ఆఖరు నాటికి భారత్‌కు 400.9 మిలియన్ డాలర్ల మేర మాల్దీవులు ఋణపడివుంది. ముయిజు వచ్చాక సంబంధాలు కొంత దెబ్బతిన్నాయి. అయినా, భారత్ ఇప్పటి దాకా సంయమన ధోరణితో వ్యవహరిస్తూ వచ్చింది. ఎన్నికల కోసమో, మరేమో కానీ... ముయిజు సైతం గత నెలలో కొంత తగ్గినట్టు కనిపించారు. మాలేకు ఢిల్లీ ఆర్థిక సహాయాన్ని ప్రస్తావిస్తూ, మాల్దీవులకు అత్యంత సన్నిహిత మిత్రదేశంగా భారత్ కొనసాగుతుందన్నారు. కానీ, పార్లమెంటులో దక్కిన తాజా ఆధిక్యంతో ఆయన రేపు దూకుడుగా వ్యవహరించడం ఖాయమనిపిస్తోంది. అప్పుడు భారత్‌కు సిసలైన సంకటం తప్పదు.

ఇప్పటికే పొరుగున... ఉత్తరాన నేపాల్, దక్షిణాన శ్రీలంక, పశ్చిమాన పాకిస్తాన్... ఇలా అన్నీ చైనా అనుకూల వైఖరిని అనుసరిస్తున్న పరిస్థితి. ఆ జాబితాలో మాల్దీవులూ చేరింది. అవినీతి ఆరోపణలతో... చైనా అనుకూల మాజీ అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్‌కు 11 ఏళ్ళ జైలు శిక్ష పడడంతో ప్రతినిధిగా నిలబడ్డ ముయిజు అధ్యక్షుడయ్యారు. ఈసారి యమీన్ మద్దతు లేకున్నా పార్లమెంటరీ ఎన్నికల్లో కూటమిని గెలిపించారు. ఆదివారం ఎన్నికల్లోనూ ఓట్ల కోసం భౌగోళిక రాజకీయాలే పార్టీలకు చోదకమయ్యాయి. మాల్దీవుల విస్తారమైన సముద్రజల సరిహద్దులను గస్తీ కాయడం కోసం భారత్ గతంలో ఓ విమానం అందించింది. అలాంటి 3 విమానాల్ని నడుపుతున్న భారత సైనికుల్ని ఉపసంహరించుకోవాలన్నది డిమాండ్. కొత్త సర్కార్ డిమాండ్‌ను భారత్ పరిగణించక తప్పదు. ఈ పరిస్థితుల్లో ఢిల్లీ ఇక ఎంత మాత్రమూ అలసత్వం వహించడానికి వీలు లేదు. దౌత్య నైపుణ్యానికి పదునుపెట్టాలి. భౌగోళిక రాజకీయాల్లో కీలకమైన మాలేతో సంబంధాల మెరుగుదలకు ప్రయత్నించాలి. విదేశాంగ విధానంలో గొప్పంటూ జబ్బలు చరుచుకుంటున్న పాలకులు పొరుగు దేశాల్ని ఆకర్షించడంలో చైనా చూపుతున్న చాకచక్యాన్ని చూసి అవసరమైన పాఠాలూ నేర్చుకోవాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు
చైత్ర మాసం, తిథి: పౌర్ణమి తె.4.26 వరకు (తెల్లవారితే బుధవారం), తదుపరి బహుళ పాడ్యమి, నక్షత్రం: చిత్త రా.9.56 వరకు, తదుపరి స్వాతి, వర్జ్యం: తె.4.01 నుండి 5.45 వరకు (తెల్లవారితే బుధవారం), దుర్ముహూర్తం: ఉ.8.11 నుండి 8.59 వరకు, తదుపరి రా.10.50 నుండి 11.38 వరకు, అమృతఘడియలు: ప.2.49 నుండి 4.35 వరకు.

సూర్యోదయం : 5.43
సూర్యాస్తమయం : 6.13
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

అంబేడ్కర్ మాట అనుసరణీయ బాట

అభిప్రాయం



డా॥ కత్తి పద్మారావు

''వర్ణాశ్రమ వ్యవస్థ స్వార్థపరులైన కొందరు కల్పించినది మాత్రమే. మన హక్కులు వారు తీసుకున్నారు. మనకు దున్నుకోవడానికి భూమి లేదు. చేయడానికి మంచి వృత్తులు లేవు. కర్మ, అదృష్టం అనే మాటలు పక్కకు పెట్టి, మీ స్వశక్తి మీద పైకిరండి'' అన్నారు దళితులను ఉద్దేశించి అంబేడ్కర్. రాజకీయ హక్కుల్ని తేలికగా చూడవద్దనీ, రాజ్యాధికారమే కీలకమనీ బోధించారు. భారతదేశం మొత్తంగా కుల సమీకరణాలతో రాజకీయాలు నడుస్తున్నాయి. రాజ్యాంగ సృష్టికర్తను విస్మరించి రాజ్యాంగాన్ని పొగడటంలో కుల వివక్ష ఉంది. భారతదేశంలో సాంఘిక విప్లవాన్ని, కుల నిర్మూలనను 'ఆర్థిక సమతా వాదులు' విస్మరించినట్లయితే వారికి విప్లవం సుదూరంలో ఉండక తప్పదు. అంబేడ్కర్ ఆలోచనలకు మళ్లాల్సిన చారిత్రక సందర్భం వచ్చింది.

భారతదేశంలో ఈనాడు ఎన్నికలు మతోన్మాదానికీ, లౌకికవాదానికీ మధ్య యుద్ధంగా నడుస్తున్నాయి. భారత రాజ్యాంగం భారత దేశానికి ఊపిరి లాంటిది. భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘించడం అంటే లౌకికవాదాన్ని ఉల్లంఘించడమే. ఇపుడున్న పార్టీలన్నీ అంబేడ్కర్ సిద్ధాంతాలకు భిన్నంగా వ్యవహరిస్తున్నాయి. సెక్యులర్ వ్యతిరేక వాదాన్ని అనుసరిస్తున్నాయి. దళితులకు రిజర్వేషన్ సీట్లు తప్ప దళితుల జనాభా ఎక్కువ వున్న నియోజకవర్గాల్లో కూడా వారికి సీట్లు ఇవ్వటం లేదు. మనువును అంతర్గతంగా కొందరు, బహిర్గతంగా కొందరు అనుసరిస్తున్నారని చెప్పక తప్పదు.

అంబేడ్కర్ మనువునూ, మనువు విశ్లేషించిన వర్ణవ్యవస్థనూ తన తర్క వైదుష్యంతో ప్రశ్నించి అది అభూత కల్పనా వాదమని నిరూపించారు. వర్ణ వ్యవస్థలో వున్న వైరుధ్యాన్ని బయటకీడ్చి చాతుర్ వర్ణ వ్యవస్థ కల్పితమైందని చెప్పారు. ఆర్యులు గూడా మూడు వర్ణాలుగానే వున్నారనీ, శూద్రులు ప్రత్యేక వర్ణం కారనీ, వారూ క్షత్రియులలో ఒక భాగమేననీ అన్నారు. శూద్ర రాజులకు, బ్రాహ్మణులకు నిరంతరంగా సాగిన కలహాలలో ఓడిన బ్రాహ్మణులు శూద్రరాజుల చేత తక్కువగా చూడబడుతూ నిరంకుశంగా అణగద్రొక్కబడే వారని వివరించారు. దీని వలన బ్రాహ్మణులకు ద్వేషం పెరిగి కొంత కాలానికి ద్విజత్వానికి కారణమయ్యే 'జంధ్యాన్ని' శూద్రులకు నిషేధించారు. ఈ జంధ్యం ప్రాచీన భారతంలో అత్యున్నతమైన ఆర్థిక, సాంఘిక హోదాకు గుర్తుగా వుండేది. ఈ జంధ్యధారణ నిషేధంతో శూద్రులు మూడు వర్ణాల నుండి నెట్టబడి నాలుగవ వర్ణంగా రూపొందించబడ్డారని అంబేడ్కర్ తెలిపారు.

కుల వాస్తవాన్ని అంగీకరించాలి!

ఇక పంచములు వర్ణ వ్యవస్థలో భాగస్వాములు కాదని ఆయన నిరూపించారు. రాజకీయ, ఆర్థిక సంస్కరణల వల్ల మాత్రమే కుల నిర్మూలన జరుగుతుందా? అని ప్రశ్నలు అవసరమని వ్యాఖ్యానించారు. భారతదేశంలో సాంఘిక విప్లవాన్ని, కుల నిర్మూలనను 'ఆర్థిక సమతా వాదులు' విస్మరించినట్లయితే వారికి విప్లవం సుదూరంలో వుండక తప్పదు. ఒకవేళ సాంఘిక వ్యవస్థలో వున్న అంతరాల పట్ల నిర్లక్ష్య వైఖరి వహిస్తే చివరకు వారి విప్లవ సాధనలో కూడా కుల వ్యవస్థ తాలూకు దుష్ఫలితాలు ప్రతిఫలించక తప్పదు. ఈ విషయాన్ని ధ్రువీకరిస్తూ అంబేడ్కర్ ఇలా పేర్కొన్నారు: ''ఇండియాలో సాంఘిక వ్యవస్థను సోషలిస్టులు ఎదుర్కొనక తప్పదు. అలా ఎదుర్కొనకుండా విప్లవం సాధ్యం కాదు. ఒకవేళ అది సాధ్యమైనా, వారి ఆశయాలు నెరవేరాలంటే సదరు సాంఘిక వ్యవస్థతో సోషలిస్టులు కుస్తీ పట్టక తప్పదు. ఇది నా దృష్టిలో నిర్వివాదమైన సత్యం.'' ఇక్కడ సోషలిస్టులను ఉద్దేశించి చెప్పిన మాటలు కమ్యూనిస్టులకు కూడా వర్తిస్తాయి.



ఇక అంబేడ్కర్ దళితులను ఉద్దేశించి మాట్లాడుతూ, ''మూఢ నమ్మకాలను వదలిపెట్టి చుట్టూ వున్న పరిస్థితులను గమనించండి. అర్థం చేసుకోండి. మీరు చేసిన నాసిక్ సత్యాగ్రహం, మహద్ ఉద్యమం మీలో ఎంతో మార్పు తెచ్చాయి. మన ఆందోళనను ఇతర దేశాలు కూడా గుర్తించాయి. బ్రిటన్‌లోని లండన్ టైమ్స్ పత్రిక తమ ప్రభుత్వానికీ, ప్రజలకూ ఈ సమస్యను ఎత్తి చూపింది. ఈ విధమైన ఆందోళన ద్వారా మన సమస్యలు నలుగురూ గుర్తించడం జరుగుతుంది. ఈ వర్ణాశ్రమ వ్యవస్థ స్వార్థపరులైన కొందరు కల్పించినది మాత్రమే. మన హక్కులు వారు తీసుకున్నారు. మనకు దున్నుకోవడానికి భూమి లేదు. అంతా వాళ్ళే దున్నుకొంటున్నారు. మనకు చేయడానికి మంచి వృత్తులు లేవు. లాభదాయకమైనవీ, గౌరవప్రదమైనవీ అన్నీ వాళ్ళే చేసుకుంటున్నారు. మనకు హక్కులు లేకుండా చేసి ఇతరులు బాగు పడుతున్నారు. కర్మ, అదృష్టం అనే మాటలు పక్కకు పెట్టి, మీ స్వశక్తి మీద పైకిరండి'' అని చెప్పారు.

రాజ్యాధికారమే కీలకం

''ఒక మనిషిని దేవునిలా కొలవడం మంచిదికాదు. వ్యక్తి పూజ వినాశనానికి దారితీస్తుంది. దానిని మొగ్గలోనే తుంచివేయాలి. మీ సమస్యలన్నీ ఒక్కరి మీద ఉంచడం వల్ల మీకు ఒకరి మీద ఆధార పడటం అలవాటైపోతుంది. మీరు కర్తవ్యం నుండి విముఖులై బాధ్యతారహితంగా ప్రవర్తించడానికి అవకాశముంది. మీరు ఇలాంటి భావాలకూ, ఆలోచనలకూ తావిచ్చినట్లయితే మీ పరిస్థితి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయే కొయ్య దుంగలకంటే ఏ మాత్రమూ మెరుగ్గా ఉండదు. మీరు రాబోతున్న ఈ రాజకీయ హక్కుల్ని తేలికగా చూడకండి'' అని కూడా అన్నారు అంబేడ్కర్. దళితులను గూర్చి మాట్లాడిన ప్రతి సందర్భంలోనూ రాజ్యాధికారం ప్రధానమైన 'కీ' అని ఆయన చెబుతూ వచ్చారు. అగ్రవర్ణాల పార్టీలన్నీ కూడా దళితులను పావులుగా వాడుకున్నాయి. దళిత ఎంపీలు, ఎమ్మెల్యేలు చాలామంది అగ్రవర్ణాల పార్టీలకు తొత్తులుగా వున్నారు. అగ్రవర్ణాల పార్టీలు అంతర్గతంగా వీరిని అస్పృశ్యులుగానే చూస్తున్నాయి. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, విశ్వ హిందూ పరిషత్ మనువాద రాజకీయాన్ని విస్తృతి చేయటంలో భాగంగా రాజ్యాంగ హక్కులపై దాడి చేస్తున్నాయి. కార్పొరేట్ వ్యవస్థలకు కొమ్ము కాస్తున్నాయి. పేదలను మరింత పేదలుగా చేస్తున్నాయి.

భారతదేశం మొత్తంగా కుల సమీకరణాలతో రాజకీయాలు నడుస్తున్నాయి. రాజకీయాల్లో కులతత్వం, అస్పృశ్యత పెరుగుతున్నాయి. ఎన్డీయే తరపున నరేంద్ర మోదీ గానీ, ఇండియా కూటమి తరపున రాహుల్ గాంధీ గానీ రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడుతూ అంబేడ్కర్ పేరు ఎత్తకపోవడం అది రాజకీయాల్లో కుల వివక్షే అవుతుంది. రాజ్యాంగాన్ని ఎంతో శ్రమతో రూపొందించిన అంబేడ్కర్ నామవాచకాన్ని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం యేచూరి ఉచ్చరించకుండానే రాజ్యాంగ వ్యవస్థలను మోదీ ప్రభుత్వం ధ్వంసం చేసిందని అంటున్నారు. అంబేడ్కర్‌ను విస్మరించటం కూడా ఉద్దేశపూర్వకంగానే జరుగుతుంది.

తగని విస్మరణ

రాజ్యాంగ సృష్టికర్తను విస్మరించి రాజ్యాంగాన్ని పొగడటంలో కుల వివక్ష ఉంది. అస్పృశ్యత కూడా దాగి ఉంది. 111 మంది దళిత ఎంపీలు కూడా అంబేడ్కర్ నామవాచకాన్ని విస్మరిస్తున్నారు. ఆయన నిర్మించిన రాజకీయ రిజర్వేషన్‌ల ద్వారా పార్లమెంటుకు వెళ్ళి దళితుల గురించి మాట్లాడలేకపోతున్నారు. అంబేడ్కర్ సిద్ధాంతాలను అర్థం చేసుకోకుండా, సంపదను అందరికి పంచాలనే అంశాన్ని విస్మరించి ఎంపీలందరు కోట్లకు పడగలెత్తి, భూస్వాములై, దోపిడీ దారులై, నల్లడబ్బు స్వాములై నీతీ నిజాయితీ లేనివారిగా ఎక్కువమంది జీవిస్తున్నారు. ఎంపీల్లో బ్యాంకుల్లో డబ్బు ఎగ్గొట్టేవారి సంఖ్య ఎక్కువగా ఉంది. ఐపీసీ 302, 307 కేసుల్లోనే గాక, మహిళలపై అఘాయిత్యాలు చేసినవారు కూడా ఎక్కువమంది ఎన్నికల్లో నిలబడటం ఆశ్చర్యం. ఈ రోజున మేధావులు, ఆలోచనాపరులు, ఉద్యమకారులు, స్త్రీవాదులు, సామాజిక సేవకులు నిశ్శబ్దంగా ఉండడం వల్లే ఇవన్నీ జరుగుతున్నాయి. వీరందరు అంబేడ్కర్ ఆలోచనలకు మళ్లాల్సిన చారిత్రక సందర్భం వచ్చింది. ఇప్పుడున్న పార్టీలు దళిత మేధావులు, స్త్రీ ఉద్యమకారులు, లౌకికవాదులకు సీట్లు ఇవ్వకపోవడాన్ని బట్టి మనకు అర్థం అవుతున్నది ఏమంటే, భారత రాజకీయాల్లో నేడు కూడా వివక్ష, అస్పృశ్యత కొనసాగుతున్నాయి. అందుకే ఈనాడు దళిత బహుజనులు, స్త్రీలు, మైనారిటీలు స్వయంగా రాజ్యాధికారం కోసం పోరాడాలి. దళిత బహుజనుల రాజ్యాధికారమే ధ్యేయం కావాలి. అంబేడ్కర్ విప్లవ మార్గంలో నడుద్దాం.

వ్యాసకర్త దళితోద్యమ నాయకులు । 98497 41695

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఉత్తరాదికెందుకు?



ఎక్కువ మంది పిల్లలు ఉన్నవాళ్లకు వనరులు అన్యాయంగా బదిలీ అవుతున్నాయని ప్రధాని మాట్లాడారు. అలాంటప్పుడు దక్షిణ భారత వనరులు ఎందుకు ఎక్కువమంది పిల్లలున్న ఉత్తరప్రదేశ్, బిహార్ లాంటి రాష్ట్రాలకు వెళ్తున్నాయని మనం అడగాలి.

- నితిన్ శేషాద్రి, పౌర యాక్టివిస్ట్

మారిన మైండ్‌సెట్



గత పదేళ్ల మోదీ ప్రభుత్వం ద్వారా వచ్చిన అత్యంత ప్రాథమిక మార్పు - వలసవాదం నుంచి బయటపడటం. భారతీయులుగా ఉండటానికి మేము గర్వపడుతున్నామని భారతీయులు అంటున్నప్పుడు, వాళ్లు చెప్తున్నది సరిగ్గా ఇదే.

- తవ్లీన్ సింగ్, కాలమిస్ట్

ఎవరు కన్నట్టు?



ముస్లింలు ఎక్కువమందిని కంటారనీ, ప్రతిపక్షానికి ఓటేస్తే హిందువులకు ప్రభుత్వ సహాయం అందకుండా పోతుందనీ ఎన్నికల ర్యాలీలో మోదీ అన్నారు. మోదీకి ఐదుగురు తోబుట్టువులు. అమిత్ షాకు ఆరుగురు అక్కాచెల్లెళ్లు. ఏడుగురు సోదరుల్లో రవిశంకర్ ప్రసాద్ చిన్నవాడు.

- రవి నాయర్, జర్నలిస్ట్

కూడని వ్యాఖ్య



మన్మోహన్ సింగ్ మీద గొప్ప గౌరవం ఉన్నప్పటికీ (నా ఆదిత్య బిర్లా జీవిత చరిత్ర పుస్తకానికి ఆయన ముఖ్య అతిథి), 'భారత వనరుల మీద ముస్లింలకు మొదటి హక్కు ఉంది' అన్న ఆయన వ్యాఖ్య మతతత్వం కలిగినదనీ, అది కాంగ్రెస్‌ను వెంటాడుతుందనీ 2006లో కాలమ్ రాశాను. అలాగే జరిగింది.

- మిన్హాజ్ మర్చంట్, రచయిత

అమ్మకు జేజే



ధరిత్రీ దినోత్సవం (ఏప్రిల్ 22) రోజున భూమాతకు ఉత్సవం చేశాం; ఆమె ఇచ్చిన ఆకులు, పువ్వుల బహుమానాలతో. మనం భూమి. మనం భూసమాజం. మనం భూమిలో భాగం. మనం వేరుగా లేము. పునరుత్పత్తిలో, స్వీయ నిర్మాణంలో, సామరస్యంలో ఉంటూ మనం భిన్నత్వంలో భాగంగా ఉన్నాం.

- వందనా శివ, పర్యావరణవేత్త

మిగిలింది గతమే!



రోమ్ తన 2,777వ వార్షికోత్సవాన్ని జరుపుకొంది. రోమ్‌కు మిగిలివున్నదల్లా పర్యాటక స్థలంగా ఉంటూ, భూమ్మీద ఒకప్పటి గొప్ప సామ్రాజ్యపు ఘనతను నాటకీయంగా ప్రదర్శించుకోవడమే! ఆఖరికి గొప్ప సామ్రాజ్యాలు కూడా బలహీన మనుమల వల్ల ఏదో ఒకరోజున ఎలా మంట గలుస్తాయో అర్థం చేసుకోవడానికి దాని చరిత్ర చదవాలి.

- వెలీనా త్చకరోవా, జియోపొలిటికల్ స్ట్రాటెజిస్ట్

చైనాకు దగ్గరైతే...



మాల్దీవుల పార్లమెంటరీ ఎన్నికల్లో చైనా అనుకూల పార్టీ భారీ విజయం సాధించింది. చైనాకు మరీ దగ్గరైతే దానికి తగిన పర్యవసానమే ఉంటుంది. కావాలంటే, ఆఫ్రికన్ యూనియన్‌ను అడిగితే అది తెలిసిపోతుంది. మారిషస్‌లో కూడా అదే జరిగింది. ఐదేళ్ల క్రితం చైనా నిర్మించిన రోడ్లన్నీ బీటలు వారాయి, అప్పుల కుప్పలు పెరిగాయి.

- ఇంతియాజ్ మహమూద్, థింకర్

ఇన్ బాక్స్

ఆదివాసీల సాధికారతకు పెద్దపీట

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గత ఐదేళ్లుగా ఆదివాసీ వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేసింది. విద్య, వైద్య సంరక్షణ అందించడంలో గణనీయమైన పురోగతిని సాధించింది. వారి సంస్కృతిని పరిరక్షించడంతోపాటు అభివృద్ధికి ప్రోత్సాహకాలు అందించింది. అందులో భాగంగా పాడేరులో గిరిజన విశ్వవిద్యాలయం, వైద్య కళాశాల స్థాపించింది. నాలుగున్నరేళ్లలో రూ. 800 కోట్ల కేటాయింపులతో గిరిజన ప్రాంతాలను రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలతో అనుసంధానించడానికి 18 వంతెనల నిర్మాణం చేపట్టింది. ఒకప్పుడు గిరిజనులు సంక్షేమ పథకాలను అందుకోవడానికి వ్యయ ప్రయాసలకు గురికావలసి వచ్చేది. ప్రస్తుత ప్రభుత్వం వినూత్నమైన గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటివద్దకే సంక్షేమ ఫలాలను చేరుస్తోంది.

రాజ్యాంగ ఆదేశాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గిరిజన ఉప ప్రణాళిక విధానాన్ని స్వీకరించింది. గిరిజనులకు, వారి భూమికి మధ్య ఉన్న అనుబంధాన్ని గుర్తించిన ప్రభుత్వం ఏజెన్సీలోని 39,450 గిరిజన కుటుంబాలకు భూమి పట్టాలను మంజూరు చేసింది. వారి వ్యవసాయ జీవనోపాధికి భద్రత కల్పించింది. పక్కా గృహాల నిర్మాణం, విద్యుత్ సరఫరా, తాగునీరు, పంటలపై అడవి జంతువులు దాడి చేయడం వంటి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించింది.

ప్రభుత్వం 2020–23 సంవత్సరానికి ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేక పారిశ్రామిక విధానాన్ని ప్రకటించింది. ఈ విధానంలో ఈ కమ్యూనిటీల్లో వ్యవస్థాపకతను పెంపొందించడానికి ఆర్థిక ప్రోత్సాహకాలు, స్టాంప్ డ్యూటీ మినహాయింపు, పెట్టుబడి రాయితీలు, పారిశ్రామిక జోన్‌లలో భూ కేటాయింపుల్లో రిజర్వేషన్లు వంటి ప్రోత్సాహకాలు వున్నాయి. ప్రత్యేకించి, పారిశ్రామిక పార్కుల్లో అభివృద్ధి చెందిన భూముల్లో 16.2 శాతం ఎస్సీలకు, 6 శాతం ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రిజర్వు చేసి ఆ యా వర్గాల ఆర్థిక సాధికారతకు స్పష్టమైన నిబద్ధతను ప్రదర్శించారు. ఈ విధంగా సంక్షేమ పథకాలు, ఆర్థిక ప్రోత్సాహకాలు, విద్యా సంస్కరణలు, సామాజిక న్యాయంపై దృష్టి సారించడం ద్వారా, జగన్ ప్రభుత్వం ఈ వర్గాలను సాధికారపరచడంలో గణనీయమైన పురోగతిని సాధించింది. ఈ ప్రగతే భవిష్యత్ పాలనకు ఒక ఉదాహరణగా నిలుస్తుంది.

- ఓరుగంటి సుబ్బారావు,
నేషనల్ వర్కింగ్ ఛైర్మన్, ట్రైబల్ డెవలప్‌మెంట్ మిషన్ । 90001 77777

ప్రజాస్వామ్యంలో నియంతృత్వ ధోరణులు

అభిప్రాయం



చాడ వెంకటరెడ్డి

కేంద్ర ప్రభుత్వం ఎవరి ప్రయోజనాల కొరకు పాటుపడుతున్నది అనేది నేడు చర్చనీయాంశంగా ఉంది. గుప్పెడు కార్పొరేట్ సంస్థల మొండి బకాయిల పేరుతో రూ. 12 లక్షల కోట్లు మాఫీ చేశారు కదా! రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే ఒక్క రూపాయి కూడా మాఫీ చేశారా? కోట్లాది మంది వలస కార్మికుల బతుకులు భద్రత లేని బ్రతుకులు కావా! మరి వారికేం చేసిందీ ప్రభుత్వం? ఈజీఎస్ లాంటి పథకాలకు నిధులు తగ్గించడమంటే నిరుపేదల జీవితాలతో ఆడుకోవడం కాదా? 10 సంవత్సరాల బీజేపీ/ఎన్డీఏ పాలన దేనికి ప్రతీక? సంఘ్ పరివార్ శక్తుల ఆగడాలు, ఆస్తులు పెరిగిపోతున్నాయి. ప్రజాస్వామ్య విలువలను పాతరేసి ప్రతిపక్షాలు లేని ప్రజాస్వామ్యాన్ని బీజేపీ సర్కార్ కోరుకుంటోంది. ఇది నియంతృత్వానికి ప్రతీక కాదా?

మోదీ ప్రతిపక్ష ప్రభుత్వాలను పడగొట్టడం, ఈడీ, సీబీఐ దాడులతో అణగ తొక్కడం, భయ భ్రాంతులకు గురి చేయడం ద్వారా ప్రతిపక్షాలను తన చెప్పుచేతల్లోకి తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. కాలం గడుస్తున్న కొద్దీ ప్రజాస్వామ్య ప్రక్రియ మరింత పరిణతి చెందాలి. కాని మన దేశంలో అది రాను రాను వెనక్కిపోతున్నట్లు కనిపిస్తోంది. భూస్వామ్య, రాచరిక, వ్యవస్థల నుండి ప్రపంచ దేశాలు ప్రజాస్వామ్యంలోకి ప్రవేశించాయి. కానీ మన దేశంలో ప్రజాస్వామ్యం కొనసాగుతున్నా... రాచరిక వ్యవస్థలోని అవలక్షణాలను బీజేపీ అందిపుచ్చుకున్నట్లు స్పష్టమవుతోంది. ఇటీవల బీజేపీ విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోకు 'మోదీ కీ గ్యారంటీ' అని పేరు పెట్టడం ఆ కోవలోకే వస్తోంది. ఏ పార్టీ అయినా తాను ఇచ్చే హామీలను పార్టీ పేరుతో రూపొందించిన మేనిఫెస్టోలో ఉంచి విడుదల చేయడం, ప్రచారం చేయడం సహజం. కాని, ఈ సారి ఏకంగా భారత ప్రజాస్వామ్య చరిత్రలో



ప్రధానమంత్రిగా ఉన్న వ్యక్తి ఇస్తున్న హామీ (మోదీ కీ గ్యారంటీ)గా మేనిఫెస్టోను విడుదల చేసింది బీజేపీ. గతంలో 'ఇండియానే ఇందిరా... ఇందిరానే ఇండియా' అని నాటి కాంగ్రెస్ అధ్యక్షుడు డీకే బారువా అన్నారే తప్ప, స్వయంగా ఇందిరాగాంధీ అలా ప్రకటించుకోలేదు. కానీ ప్రస్తుత ఎన్నికల్లో బీజేపీ మోదీమయంగా మారిపోయింది. పార్టీ ప్రచార ప్రకటనల్లో వాడడమే కాకుండా, స్వయంగా ప్రధాని మోదీ తన ప్రసంగాలలో పదే పదే 'మోదీ కీ గ్యారంటీ' అంటూ మాట్లాడడం ఒకింత విస్మయానికి గురి చేస్తున్నది.

మోదీ మరోసారి అధికారంలోకి వస్తే... భారతదేశం సమూలంగా మారిపోతుందనీ, మన దేశం ప్రపంచంలో మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా సుసంపన్నమవుతుందనీ బీజేపీ చెబుతోంది. కానీ, ఇందువల్ల లబ్ధి పొందేదెవరు? భారతదేశం మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారినా పేదరికం మాసిపోదని ఇటీవల ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు చెప్పిన మాట వాస్తవానికి అద్దం పడుతోంది. మూడవ ఆర్థిక వ్యవస్థగా మారడం పట్ల అభ్యంతరం లేదు కాని వాటి ప్రయోజనం దేశంలో కింది స్థాయిలో ఉండే పౌరులకు దక్కాలి. ఒకవైపు శతకోటీశ్వరుల జాబితాలోని తొలి పది స్థానాలలో మన దేశానికి చెందిన ఇద్దరు పోటీ పడుతుంటే, అదే సమయంలో 'ఆకలి సూచి'లో మనం 111వ స్థానంలో ఉన్నాం. రానున్న ఐదేళ్లలో ఇంకా 80 కోట్ల మందికి రేషన్ బియ్యాన్ని ప్రభుత్వం ఇవ్వబోతున్నదంటే అర్థమేమిటి?

ఇప్పటికీ దేశంలో అనేక ప్రభుత్వాలు మారినా, ప్రజాస్వామ్యం ఆటుపోటులతో కొనసాగడానికి కారణం రాజ్యాంగ పటిష్ఠతే. అయితే మోదీ ప్రభుత్వం మళ్లీ వస్తే రాజ్యాంగాన్ని మార్చవచ్చనే అనుమానాలు బీజేపీ నాయకుల ప్రకటనలను బట్టి అర్థమవుతోంది. ఇవి ఆఖరు ఎన్నికలు కారాదు. ప్రజలు తగిన నిర్ణయం తీసుకోవాలి.

వ్యాసకర్త సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు

అన్నదాన మహిమ

'సజ్జనుండు భుజియించుటికా సిరికిన్ ఫలం బిలన్' అని జక్కరాజు వెంకట కవి రచించిన 'ఆంధ్ర కామందకము' గ్రంథంలో ఒక వాక్యం వుంది. 'ఈ భూమి మీద సంపదకు మంచివాడి ఆకలి తీరడమన్నదే సరైన ఫలం!' అని అ మాటల అర్థం. అలా కానప్పుడు ఆ సంపదకు విలువ ఉండదని, ఉండకూడదని మానవుడి అభిలాష!

'అధ్వ పరిశ్రాంతుడగు వింతవానికి, నన్నం బిడిన ఫల మట్టి దిట్టిదన బెద్ద' అని ఆంధ్ర మహాభారతం (అనుశాసనిక పర్వం, ప్రథమాశ్వాసం)లో ఉంది. 'అలసిపోయి ఆకలితో ఉన్న బాటసారికి అన్నం పెట్టడాన్ని మించిన ధర్మం లేదు. దాని వలన కలిగే ఫలం అంత ఇంత అని చెప్పడానికి వీలులేనట్టిది' అని ఆ మాటలకు అర్థం. హరిభట్టు రచించిన 'ఆంధ్ర మత్స్యపురాణం' ద్వితీయాశ్వాసంలోని ఈ కింది తేటగీతి పద్యం కూడా క్షుద్బాధను తీర్చడమనే సత్కర్మ గొప్పదనాన్ని విశదీకరించింది.



పాదలు సంపదలకు నెల్ల బుట్టినిల్లు
నిబిడ రోగాగ్నులకు నెల్ల నీరదంబు
వైభవాకరమోక్ష నివాసహేతు
వన్నదాన సమాన మన్యంబు గలదె?

ఆకలితో అలమటించేవానికి అన్నం పెట్టడం అనే పుణ్య కర్మ సకల సంపదలకు పుట్టినిల్లు వంటిది. మనిషి దేహంలో నిబిడముగా, అనగా, శరీరంలో ఎన్నాళ్ళనుంచో ఉంటూ సాంద్రమై బాధిస్తూ ఉన్న రోగములనే అగ్నులను సైతం, ఆకలితో ఉన్నవాడికి అన్నం పెట్టడం అనే కర్మ వలన సమకూరే పుణ్యం అనే నీరు ఆర్పివేయగలిగేదై ఉంటుంది. అంతేకాకుండా, పరలోకంలో వైభవంతో కూడిన మోక్షాన్ని దక్కించుకోవడానికి మార్గం చూపేదిగా ఉంటూ, మలిజన్మ అనేది లేకుండా చేసి, ఆపై మోక్షంలోనే చిరస్థాయిగా నివాసముండేలా చేయడానికి హేతువయ్యేటువంటిది అన్నదానమనే సత్కర్మ. అంతటి మహిమగలిగిన దైన అన్నదానానికి మించినది లోకంలో మరొకటి ఉన్నదా? అని ప్రశ్న వేసుకుంటే 'లేదు!' అనే సమాధానమే వస్తుంది. కాబట్టి, అన్నదాన మహిమను గ్రహించి, వీలైనంతలో ఆచరించి, శ్రేయస్సును పొందాలని పై పద్యంలో సూచితార్థంగా గ్రహించవచ్చు.

- భట్టు వెంకటరావు



కమనీయం సీతారాముల కల్యాణం

ఒంటిమిట్ట(రాజంపేట): వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి ఒంటిమిట్ట కోదండరామయ్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. శాశ్వత కల్యాణ వేదికను వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. స్వామి, అమ్మవార్లను వేదికపై కొలువు దీర్చారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, భక్తుల రామనామ స్మరణల మధ్య పురోహితులు చంద్రుడు చూస్తుండగా కల్యాణ క్రతువు చేపట్టారు. పురోహితులు అమ్మవారి మహామంగళ సూత్రాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి పక్షాన అమ్మవారి గళసీమలో మంగళ సూత్రాలను అలంకరించారు ఉల్లాసభరితంగా అక్షతారోపణ, లాజ హోమం కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు కల్యాణ వేదిక వద్ద ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. అక్కడ ఏర్పాటుచేసిన గ్యాలరీలు భక్తులతో నిండిపోయాయి. సీతారాముల కల్యాణానికి ప్రభుత్వ స్పెషల్ సీఎస్ కరికాల వలవన్ స్వామికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు.



కనుల పండువగా స్వర్ణ రథోత్సవం

తిరుమల: శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి తిరుమాడ వీధుల్లో స్వర్ణరథంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. స్వామివారి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తిరుమల వసంతోత్సవ మండపంలో మధ్యాహ్నం రెండు నుంచి నాలుగు గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామికి స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో అభిషేకం చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లు ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు.

సీఎం జగన్ కుటుంబ స్థిరాస్తులు
రూ.106.96 కోట్లు

- చరాస్తులు రూ.650.66 కోట్లు.. వివిధ కోర్టుల్లో 26 కేసులు
- సీఎం తరఫున ఒక సెట్ నామినేషన్ దాఖలు చేసిన వైఎస్ మనోహర్‌రెడ్డి
- 25న పులివెందులలో రెండో సెట్ వేయనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్



సీఎం జగన్ తరఫున ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న పులివెందుల మున్సిపల్ వైస్ చైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి, ఆడిటర్లు బాలాజీ, సనత్ తదితరులు

పులివెందుల, సాక్షి ప్రతినిధి, కడప, సాక్షి, అమరావతి: తన కుటుంబం పేరిట రూ.106.96 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. సీఎం జగన్ తరఫున పులివెందుల మున్సిపల్ వైస్ చైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి సోమవారం ఒక సెట్ నామినేషన్‌ను దాఖలు చేశారు. ఉదయం 11.45 గంటల ప్రాంతంలో ఆర్వో కార్యాలయంలో పులివెందుల అసెంబ్లీ స్థానానికి నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారి వెంకటేశ్వర్లుకు అందజేశారు. ఈ నెల 25వ తేదీన సీఎం జగన్ స్వయంగా పులివెందులలో రెండో సెట్ నామినేషన్‌ను దాఖలు చేస్తారని అనంతరం ఆయన మీడియాకు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సీఎం కార్యాలయ కోఆర్డినేటర్ జనార్దన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు హాల్ గంగాధరరెడ్డి, కోడి రమణ, కిషోర్ తదితరులు ఆయన వెంట ఉన్నారు. అఫిడవిట్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం సీఎం జగన్ పేరున మార్కెట్ విలువ ప్రకారం రూ.46.78 కోట్ల విలువైన స్థిరాస్తి ఉండగా, సీఎం సతీమణి భారతిరెడ్డి పేరిట రూ.56.92 కోట్లు, ఇద్దరు కుమార్తెలు పేరుతో చెరో రూ.1.63 కోట్ల చొప్పున స్థిరాస్తులున్నాయి. వివిధ కంపెనీల షేర్లతో సహా అన్ని రకాల చరాస్తులను పరిగణలోకి తీసుకుంటే రూ.650.66 కోట్లుగా పేర్కొన్నారు. ఇందులో సీఎం జగన్ పేరున రూ.483.08 కోట్లు, భారతిరెడ్డి పేరిట రూ.119.38 కోట్లు, కుమార్తెలు హర్షిణి రెడ్డి పేరిట రూ.24.26 కోట్లు, వర్షా రెడ్డి పేరిట రూ.23.94 కోట్ల చరాస్తులు ఉన్నట్లు పేర్కొన్నారు.

తాజాగా 2022-23లో వైఎస్ భారతి రెడ్డి వ్యక్తిగత ఆదాయం రూ.10.96 కోట్లుగా పేర్కొనగా ఆమె ఇతరులకిచ్చిన రుణాలు రూ.30.91 లక్షల మేర ఉన్నాయి. రూ.1.57 కోట్లు ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లించగా అడ్వాన్సు ట్యాక్స్ రూ.2.48 కోట్లు చెల్లించారు. ఆమె ఇతరుల నుంచి తీసుకున్న అడ్వాన్సులు, రుణాలు రూ.7,41,79,353 వరకూ ఉన్నాయి.

ఇక 2022-23 సంవత్సరానికి సీఎం జగన్ వ్యక్తిగత ఆదాయం రూ.57.74 కోట్లు కాగా ఇతరులకు ఇచ్చిన రుణాలు రూ.179.74 కోట్ల వరకూ ఉన్నాయి. రూ.4.66 కోట్లు ఇన్‌కమ్ ట్యాక్స్‌గా చెల్లించగా, ఈ ఏడాది అడ్వాన్సు ట్యాక్స్ రూ.13.95 కోట్ల మేర చెల్లించారు. ఇతరుల నుంచి తీసుకున్న అడ్వాన్సులు, రుణాలు రూ.1,1078,350 వరకూ ఉన్నాయి. తనపై వివిధ కోర్టుల్లో 26 కేసులు విచారణలో ఉన్నట్లు అఫిడవిట్‌లో జగన్ వెల్లడించారు.

క్లుప్తంగా...

శ్రీచైతన్య విజయదుందుభి

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ఎస్సెస్సీ 2023-24 ఫలితాల్లో శ్రీచైతన్య ప్రతిభ చూపింది. ఫలితాల్లో తమ ముగ్గురు విద్యార్థులు అత్యధిక మార్కులు 598 సాధించి విజయకేతనం ఎగురవేశారని శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరుగురు విద్యార్థులు 597.. 15 మంది విద్యార్థులు 596.. 31 మంది విద్యార్థులు 595 మార్కులు సాధించారన్నారు. 524 మంది విద్యార్థులు 590 ఆపైన మార్కులు సాధించినట్లు వెల్లడించారు. 3,370 మంది విద్యార్థులు మేథ్స్‌లో 100కి 100 మార్కులు సాధించినట్లు చెప్పారు. శ్రీచైతన్య స్కూల్ సగటు 600మార్కులకు గాను 509, ఓవరాల్ ఉత్తీర్ణత 98.9 శాతం అని పేర్కొన్నారు.

ఏపీ పది ఫలితాల్లో నారాయణ విజయఢంకా

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ఎస్సెస్సీ 2023-24 ఫలితాల్లో నారాయణ సత్తాచాటింది. ఎస్సెస్సీ చరిత్రలోనే అత్యధిక మార్కులతో తమ విద్యార్థిని సాయి మనస్వి 599 మార్కులతో రికార్డు సృష్టించిందని నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్స్ పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. మేథ్స్‌లో 100కి 100 మార్కులు 15.3 శాతం మంది విద్యార్థులు సాధించినట్లు వెల్లడించారు. 64 శాతం బ్రాంచుల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.

కేశవరెడ్డి ప్రభంజనం

సాక్షి, హైదరాబాద్: ఏపీ ఎస్సెస్సీ ఫలితాల్లో కేశవరెడ్డి విద్యా సంస్థల విద్యార్థులు టాప్ మార్కులతో చరిత్ర సృష్టించారు. ఎస్.సాయిస్వతేజ్ 597 మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా, టి.సాయి నిఖిత, వి.ఎస్.రోషిణి, రజియ సుల్తానా, ఎస్.ప్రశాంత్, కె.భావన 596 మార్కులతో, ఎస్.మహ్మద్ జయాన్ 595 మార్కులతో వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని విద్యాసంస్థల ఫౌండర్ చైర్మన్ ఎన్.కేశవరెడ్డి పేర్కొన్నారు. ఆరుగురు 594, 10 మంది 593, ఎనిమిది మంది 592, మరో ఎనిమిది మంది 591, పదిమంది 590, ఏడుగురు 589, పదిహేనుమంది 588 మార్కులు సాధించారని పేర్కొన్నారు.

కేకేఆర్ గౌతమ్ హవా

సాక్షి, హైదరాబాద్: ఏపీ 10వ తరగతి పరీక్షా ఫలితాలలో డా. కేకేఆర్ గౌతమ్ స్కూల్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారు. మొత్తం 600 మార్కులకుగాను పి.ప్రభాకర్ 596 మార్కులు, పి.జోషిక్రప్రియ, కె.గీతికశ్రీ, వీజీ సృజన్ సాయితేజలు 595 మార్కులు సాధించి కేకేఆర్ గౌతమ్ స్కూల్స్ విజయ బావుటా ఎగురవేశారని ఆ సంస్థ యాజమాన్యం వెల్లడించింది. ఈ బ్రాంచిలో 590 మార్కులపైన సాధించిన వారు 25 మంది ఉండగా, 580 మార్కులపైన సాధించిన వారు 182 మంది, 500పైన సాధించిన వారు 1,427 మంది ఉన్నారని పేర్కొంది.

‘పెమ్మసాని’.. చాలా ధనికస్వామి

దేశంలోనే అత్యంత డబ్బున్న ఎంపీ అభ్యర్థుల్లో ఒకరిగా గుంటూరు టీడీపీ నేత



ఆస్తులు రూ.5,705 కోట్లు.. అప్పులు రూ.1,038 కోట్లు

ఇప్పటివరకు రాజ్యసభ, లోక్‌సభలకు పోటీచేసిన అభ్యర్థుల్లో టాప్‌లో పెమ్మసాని

ఇందులో భార్య పేరున రూ.2,289.35 కోట్లు.. కుమారుడి పేరున రూ.496.27 కోట్లు

కుమార్తె పేరున రూ.496.47 కోట్లు మేర ఆస్తులు.. అలాగే, ఆభరణాలు, భూములు, భవనాలు, నగదు

ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడి

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అమ్మ ఒడి.. సర్కారు బడి
జగన్ ఇచ్చిన నమ్మకం

పిల్లలను బడికి పంపే ప్రతి తల్లికీ రూ.15వేలు ఇస్తానని మేనిఫెస్టోలో హామీ
చెప్పినట్టే అర్హులందరి ఖాతాల్లోకి తొలి ఏడాది నుంచే జమ

- కానీ ఇద్దరు పిల్లలకు ఇస్తామని.. ఒక్కరికే ఇస్తున్నారంటూ రామోజీ కేకలు
- 2019-20లో తొలి ఏడాది 42.23 లక్షల మందికి రూ.6,349 కోట్లు
- గతేడాది 2022-23లో 42.62 లక్షల మందికి రూ.6,393 కోట్లు
- కానీ కండిషన్లు పెట్టి 1.86 లక్షల మందిని తగ్గించారని ‘ఈనాడు’ అబద్ధాలు
- ‘అమ్మ ఒడి’కి బదులుగా ల్యాప్‌టాప్‌లు ఇస్తామన్నా ఇవ్వలేదని పిచ్చిరాతలు
- అమ్మ ఒడి’ ఇస్తున్నపుడు బదులుగా ల్యాప్‌టాప్‌లు ఇవ్వలేదంటే అర్థముందా?
- విద్యా వ్యవస్థ మారినా... విష ప్రచారంతో దిగజారిపోతున్న ఎల్లో ముఠా

(సాక్షి, ప్రత్యేక ప్రతినిధి): దారుణమైన అబద్ధాలు చెబుతున్నామనే సిగ్గెగ్గులు లేవు!.

పత్రిక పేరుతో పచ్చి విషాన్ని గుమ్మరిస్తున్నామన్న సోయ లేదు!.

చంద్రబాబు కోసం పూర్తి దిగంబరంగా మారిపోయామన్న ధ్యాసే.. లేదు!

ఇదీ... ‘ఈనాడు’పత్రిక, దాని యజమాని రామోజీరావు తీరు. ఎన్నికల ముంగిట చంద్రబాబును జాకీలు పెట్టి లేపడమే లక్ష్యంగా... వైఎస్ జగన్ ప్రభుత్వంపై పచ్చి అబద్ధాలతో చెలరేగిపోతున్నారు రామోజీరావు. తన రాతల్ని జనం ‘ఛీ’కొడుతున్నారని తెలిసినా లైట్ తీస్కుంటూ పూర్తిగా దిగజారిపోయారు ఈ నారా వారి కూలీ!. సోమవారం అచ్చేసిన ‘అమ్మ ఒడికి.. మామ కత్తెర’కూడా ఇలాంటిదే. దీని వెనక నిజానిజాలివిగో...

‘అమ్మ ఒడి’పథకాన్ని ఇద్దరు పిల్లలకు ఇస్తామని వైఎస్ జగన్ మీకెప్పుడు చెప్పారు రామోజీరావు గారూ? ఎన్నికలకు ముందు విడుదల చేసిన మేనిఫెస్టోలో ఏముందో కాస్తయినా చూశారా? మేనిఫెస్టోని చూసే కదా.. జనం ఓట్లేసి అఖండ విజయాన్ని అందించారు. మరి ఆ మేనిఫెస్టోలో చెప్పింది చెప్పినట్టుగా చేస్తుంటే లేనిపోని అబద్ధాలతో ఎందుకీ పెడబొబ్బలు? ‘‘పిల్లల చదువులకు ఏ పేదింటి తల్లీ భయపడకూడదు. పిల్లలను బడికి పంపితే చాలు. ఆ తల్లికి సంవత్సరానికి రూ.15,000 ఇస్తాం.’’అనే హామీని మేనిఫెస్టోలో పొందుపరిచారు వైఎస్ జగన్. ముఖ్యమంత్రి అయ్యాక దాన్ని తు.చ. తప్పకుండా తొలి ఏడాది నుంచే అమల్లోకి తెచ్చారు. 2019 జూన్‌లో అధికారం చేపట్టడంతో... అప్పటికే అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయి... స్కూళ్లు తెరిచే సమయం కనక... ఆ ఏడాది జనవరిలో తొలిసారి అమ్మ ఒడిని అందించారు. ఏకంగా 42 లక్షల 33వేల 98 మంది తల్లుల ఖాతాల్లో రూ.6,350 కోట్లను జమ చేశారు.

కోతలు పెట్టిందెక్కడ?

మూడేళ్లలో 1.86 లక్షల మంది విద్యార్థులు తగ్గిపోయారంటూ మరో దారుణమైన అబద్ధాన్ని అలవోకగా వండేశారు ఈ ఎల్లో జర్నలిస్టు. నిజానికి 2019లో అధికారం చేపట్టిన జగన్... ఆ ఏడాది అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం అందేట్లు చూశారు. దీంతో 2019-20లో ఏకంగా 42.33 లక్షల మంది తల్లులకు ఈ పథకం కింద రూ.6,349 కోట్లు అందాయి. ఇక తాజాగా గతేడాది... అంటే 2022-23లో 42.62 లక్షల మందికి ఈ పథకం కింద రూ.6,393 కోట్లు జమయ్యాయి. అంటే తొలి ఏడాదితో



పోల్చినపుడు దాదాపు 29 వేల మంది పెరిగారు తప్ప... ఒక్కరంటే ఒక్కరు కూడా తగ్గలేదు. ఇదీ... వాస్తవం.

కోవిడ్ కష్ట కాలంలోనూ... సంఖ్య పెరిగినా సరే

జగన్ గురించి ఒక్క మాటలో చెప్పాలంటే...‘కేరాఫ్ కమిట్‌మెంట్’అనాలి. ఎందుకంటే 2020- 21లో కోవిడ్ మహమ్మారి ప్రపంచాన్ని వణికించేసినపుడు అందరి ఆదాయాలూ పడిపోయాయి. కేంద్రంతో సహా దాదాపు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలూ సంక్షేమ పథకాలను నిలిపేశాయి. కానీ జగన్ మాత్రం సంక్షేమ పథకాల అవసరం ఆ సమయంలోనే ఎక్కువ ఉందని భావించారు. పేదలకు భరోసా ఇస్తూ... మరింత మందికి పథకాలను చేరువ చేశారు. చాలా మంది వ్యాపారాలు లేక, వృత్తిపనులు పోయి పేదరికంలోకి జారిపోయారు. వారంతా కొత్తగా నమోదు చేసుకోవటంతో ఆ ఏడాది అమ్మ ఒడి లబ్ధిదారుల సంఖ్య కూడా విపరీతంగా పెరిగింది. 2019-20లో 42.33 లక్షలుగా ఉన్న సంఖ్య 2020-21లో కోవిడ్ వల్ల ఏకంగా 44.48 లక్షలకు పెరిగింది. ప్రభుత్వం పెద్ద మనసుతో ఏకంగా రూ.6,673 కోట్లను లబ్ధిదారులకు జమ చేసింది. కానీ తరవాతి ఏడాది నుంచీ మళ్లీ పరిస్థితులు చక్కబడటం మొదలెట్టాయి. వృత్తి పనులు, చిరు వ్యాపారాలు మళ్లీ పుంజుకుని 2022-23 నాటికి ఆదాయాలు యథాపూర్వ స్థితికి వచ్చాయి. దీంతో వారి వారి ఆదాయ పరిమితులకు లోబడి లబ్ధిదారులూ తగ్గి... పూర్వం కన్నా కాస్త ఎక్కువగా... అంటే 42.62 లక్షలకు చేరుకున్నారు. ఇదీ జరిగింది. దీన్నెవరైనా కోత పెట్టడం అంటారా? నిబంధనలు విధించి ఆ మేరకు లబ్ధిదారుల్ని తగ్గించేశారన్న ఆరోపణలో ఏ కొంచెమైనా వాస్తవం ఉందా? ఎందుకు రామోజీరావ్ ఇంత దారుణమైన రాతలు?

అయిదేళ్లలో నాలుగుసార్లే.. అంటే ఎలా?

వైఎస్ జగన్ ప్రభుత్వం ఏర్పడింది 2019 జూన్‌లో. అప్పటికే అడ్మిషన్లు పూర్తయి, స్కూళ్లు మొదలవుతున్నాయి. ప్రభుత్వం కుదురుకుని, డేటాను సమీక్షించడానికి కొంత సమయం పడుతుంది. అయినా సరే... ఇచ్చిన మాట ప్రకారం ఆ ఏడాది మొత్తాన్ని జనవరిలో తల్లుల ఖాతాల్లో జమ చేశారు జగన్. తరువాతి ఏడాది కూడా జనవరిలోనే ఇచ్చినా... మరుసటి ఏడాది నుంచీ అనుకున్నట్టే జూన్‌లో అడ్మిషన్లకు ముందు జమచేయటం ప్రారంభించారు. ఇప్పటికి నాలుగేళ్లుగా నగదు జమచేస్తూ వస్తున్నారు. ఈ ఏడాది కూడా జూన్‌లో జమ చేస్తారు. కానీ రామోజీరావు మాత్రం... ఈ ఏడాది ఇంకా జమ చేయలేదంటూ చేతికొచ్చిన రాతలు రాయటం దివాలాకోరు తనం కాక మరేమిటి?

ల్యాప్‌టాప్‌లపైనా... దౌర్భాగ్యపు రాతలే

‘లబ్ధిదారులు కోరుకుంటే 9-12 తరగతుల పిల్లలకు అమ్మ ఒడికి బదులుగా ల్యాప్‌టాప్‌లు ఇస్తామని చెప్పిన జగన్... ఆ తరవాత మాట తప్పారన్నది రామోజీరావు చేసిన మరో పనికి మాలిన ఆరోపణ.

లబ్ధిదారులు కోరుకుంటే... అమ్మ ఒడికి బదులుగా 9-12 తరగతుల పిల్లలకు ల్యాప్‌టాప్‌లు ఇవ్వాలన్నది ప్రభుత్వం ఒకదశలో చేసిన ఆలోచన. కానీ ఈ ఆలోచన ఆచరణలోకి రాకుండానే.. ప్రభుత్వం చౌకబారు ల్యాప్‌టాప్‌లను విద్యార్థులకు అంటగట్టాలని చూస్తోందంటూ... ఇదో పెద్ద కుంభకోణమంటూ ‘ఈనాడు’విషాన్ని కక్కింది. లబ్ధిదారుల స్పందన చూశాక ప్రభుత్వం తన ఆలోచనను సమీక్షించి... అంతకన్నా మెరుగైన నిర్ణయాన్ని ప్రకటించింది. అమ్మ ఒడిని యథాతథంగా కొనసాగిస్తూనే 8వ తరగతి పిల్లలకు ఏటా ఉచితంగా ట్యాబ్‌లు ఇవ్వాలనేది ఈ నిర్ణయం. ఇలా ఇచ్చే ట్యాబ్‌లు వీరికి ఇంటర్ వరకూ పనికొస్తాయనే ఉద్దేశంతో... అంతర్జాతీయ ఎడ్యుటెక్ దిగ్గజం బైజూస్‌తో కంటెంట్ ఒప్పందం చేసుకుని ట్యాబ్‌ల పంపిణీ ఆరంభించింది. అన్ని తరగతుల పిల్లలకూ బైజూస్ కంటెంట్‌ను ఉచితంగా అందుబాటులోకి తెచ్చింది. కానీ రామోజీరావు మాత్రం అమ్మ ఒడికి బదులుగా ఇస్తానన్న ల్యాప్‌టాప్‌లు ఇవ్వలేదనే పిచ్చి వాదనే వినిపిస్తున్నారు. అమ్మ ఒడిని కొనసాగిస్తున్నపుడు దానికి బదులుగా అనే మాటెక్కడుంటుంది?

ట్యాబ్‌లపైనా పెత్తందారీ పోడక...

ఉచితంగా ట్యాబ్‌లివ్వటం కూడా రామోజీరావుకు సుతరామూ నచ్చలేదు. ఎందుకంటే తాను నడిపిస్తున్న రమాదేవి స్కూల్లో పిల్లలకో, తన మనవలు చదువుతున్న ఇంటర్నేషనల్ స్కూల్లోని పిల్లలకో ట్యాబ్‌లు ఉండాలి తప్ప ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకెందుకన్నది ఆయన ఆలోచన. దీంతో ట్యాబ్‌లలో పిల్లలు చూడకూడనివన్నీ చూస్తున్నారని, వాటి వల్ల చెడిపోతున్నారు కాబట్టి ట్యాబ్‌లు వద్దంటూ పెత్తందార్ల తరఫున కొత్త పల్లవి ఎత్తుకున్నారు. దీనిపై పేద విద్యార్థులంతా మండిపడటమే కాక.. ‘ఈనాడు’పై రాష్ట్ర వ్యాప్తంగా విరుచుకుపడటంతో వెనక్కి తగ్గారు.

ఆ మొత్తం స్కూల్ కమిటీ ఖాతాలకే జమ...

ఎగురుతున్నపుడు ఎత్తుకు గానీ... జారిపోతున్నపుడు లోతుకు గానీ హద్దులుండవు. రామోజీ రావుదీ అదే పరిస్థితి. ఆయనిప్పుడు లోతెంతో తెలియనంతగా దిగజారిపోతున్నారు. ‘ఈనాడు’మరో ఆరోపణ ఏంటంటే.. పాఠశాల, మరుగుదొడ్ల నిర్వహణ పేరుతో రూ.2 వేలు చొప్పున కోత వేశారనేది. నిజానికి ‘అమ్మ ఒడి’ఆరంభించేనాటికి ‘నాడు-నేడు’కింద స్కూళ్లను బాగు చేయటం మొదలుకాలేదు. బాగు చేశాక... అవన్నీ సక్రమంగా ఉండాలి కనక 2021లో పాఠశాల నిర్వహణ నిధిని, 2022లో టాయిలెట్ మెయింటెనెన్స్ ఫండ్‌ను ఏర్పాటు చేశారు. డబ్బులు చెల్లిస్తున్నారు కనక నిర్వహణపై నిలదీసే హక్కు తల్లిదండ్రులకు ఉంటుందనే ఉద్దేశంతోనే ప్రభుత్వం దీన్ని ఆరంభించింది. అమ్మ ఒడి నుంచి మినహాయించిన ఈ నిధులు రూ.2 వేలు నేరుగా స్కూల్/ కాలేజీ కమిటీల ఖాతాలకే జమవుతున్నాయి. తక్షణ మరమ్మతుల కోసం ఈ ఖాతాల నుంచే ఖర్చు చేస్తున్నారు. ఇది పేరెంట్స్ కమిటీలకు, ప్రజలకు తెలుసు. తెలియనిది రామోజీకే!!.

టాయిలెట్ల నిర్వహణతో తగ్గిన డ్రాప్ అవుట్లు

నాడు-నేడుతో ప్రతి ప్రభుత్వ బడిలో టాయిలెట్లు నిర్మించారు. అక్కడే దుస్తులు మార్చుకునే గది, వాష్ బేసిన్లు, టాయిలెట్లు శుభ్రం చేసే వస్తువులు అందుబాటులో ఉంచారు. దాంతో రాష్ట్ర వ్యాప్తంగా బాలికల డ్రాప్ అవుట్లు తగ్గిపోయాయి. రాష్ట్రంలోని 44,800 పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 46,661 మంది ఆయాలను నియమించి వారికి నెలకు రూ.6 వేలు గౌరవ వేతనం చెల్లిస్తున్నారు. గత మూడేళ్లలో వీరికి రూ.882 కోట్లు వేతనాలను స్కూలు కమిటీల ఖాతా నుంచే చెల్లించారు. ప్రభుత్వ చదువులంటే గిట్టని రామోజీకి ఇవన్నీ కాస్త అర్థమయ్యేలా చెప్పండర్రా!!. ఆయన్నలా వదిలేయకండర్రా!!.

ప్రతిభ చాటిన పేదింటి పిల్లలు

- విద్యా వ్యవస్థలో సీఎం జగన్ విప్లవాత్మక సంస్కరణల ఫలాలు
- పదో తరగతి ఫలితాల్లో స్పష్టంగా కనిపించిన ఉత్తీర్ణత పెరుగుదల
- గతేడాదితో పోలిస్తే 14.43 శాతం పెరిగిన ఉత్తీర్ణత
- ఈసారి ఫలితాల్లోనూ బాలికలదే పైచేయి
- మరోసారి 96.37 శాతం ఉత్తీర్ణతతో పార్వతీపురం మన్యం జిల్లా టాప్..
- 62.47 శాతంతో చివరి స్థానంలో కర్నూలు



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యా రంగంలో తెచ్చిన సంస్కరణల ఫలాలు పదో తరగతి ఫలితాల్లో మరోసారి ప్రస్ఫుటించాయి. ఒకప్పుడు కార్పొరేట్ విద్యా రంగానికే పరిమితమైన అత్యుత్తమ ఫలితాలు ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలు సొంతం చేసుకున్నాయి. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు, ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్లు, బైజూస్ కంటెంట్ ట్యాబ్‌లు, బైలింగ్యువల్ టెక్స్ట్‌బుక్స్, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లతో అందించిన డిజిటల్ బోధన ఫలాలు టెన్త్ ఉత్తీర్ణతలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. పదో తరగతి ఫలితాల్లో గతేడాదితో పోలిస్తే 14.43 శాతం అధిక ఉత్తీర్ణతతో విద్యార్థులు సత్తాచాటారు. 2023-24 పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు 6,16,615 మంది విద్యార్థులు హాజరు కాగా 5,34,574 (86 69 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణతలో మరోసారి బాలురపై బాలికలు పైచేయి సాధించారు. బాలురు 84.32 శాతం పాసవగా బాలికలు 89.17 శాతం ఉత్తీర్ణత సాధించారు. వంద శాతం ఉత్తీర్ణత పొందిన పాఠశాలలు గతేడాది 933 ఉండగా, ఈ ఏడాది ఏకంగా 2,803కు పెరిగాయి. 114 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 590కిపైగా మార్కులు సాధించారు. 550కి పైగా మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 18 వేల మంది వరకు ఉండటం విశేషం. సున్నా శాతం ఉత్తీర్ణత వచ్చిన పాఠశాలల సంఖ్య 38 నుంచి 17కు తగ్గిపోవడం బలోపేతమైన విద్యా విధానానికి అద్దం పడుతోంది. వీటిల్లో ఒక్కటే ప్రభుత్వ పాఠశాల కాగా, 13 ప్రైవేట్ అన్ ఎయిడెడ్, 3 ప్రైవేట్ ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయి. ఈసారి కూడా ఉత్తరాంధ్ర విద్యార్థులు అదరగొట్టారు. వరుసగా రెండో ఏడాది పార్వతీపురం మన్యం జిల్లా 96.37 శాతం ఉత్తీర్ణతతో మొదటి స్థానంలో నిలిచింది. 93.35 శాతంతో శ్రీకాకుళం రెండో స్థానంలో ఉంది. కర్నూలు జిల్లా 62.47 శాతం అత్యల్ప ఉత్తీర్ణతతో చివరి స్థానంలోఉంది. ఈ ఏడాది విద్యా సంవత్సరం ముగియకముందే టెన్త్ ఫలితాలను విడుదల చేసి ప్రభుత్వం చరిత్ర సృష్టించింది. మార్చి 18 నుంచి 30 వరకు పరీక్షలు జరగ్గా, ఏప్రిల్ 1 నుంచి 8 వరకు మూల్యాంకనం చేసి విద్యా సంవత్సరం ముగింపునకు ఒక్కరోజు ముందే ఫలితాలను ప్రకటించింది.

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ సోమవారం విజయవాడలో పదో తరగతి ఫలితాలను విడుదల చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ కేసులేవీ నమోదు కాకుండా పరీక్షలను విజయవంతంగా నిర్వహించామన్నారు. ఈ ఏడాది అత్యధిక ఉత్తీర్ణతతో విద్యార్థులు రికార్డు నెలకొల్పారని తెలిపారు. ఫలితాలను www. bse. ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. నాలుగు రోజుల్లో పూర్తిస్థాయి మార్కుల జాబితా, మైగ్రేషన్ సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లో, విద్యార్థి డిజీలాకర్‌లో కూడా ఉంచుతామని చెప్పారు. పరీక్షలో పాసవని విద్యార్థులు నిరాశ చెందాల్సిన అవసరం లేదని, వారికి విద్యా సంవత్సరం వృథా కాకుండా వచ్చే నెల 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. రీ కౌంటింగ్‌కు రూ.500, రీ వెరిఫికేషన్‌కు రూ.1,000 రుసుమును చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.



విరిసిన తొలి కమలం

సూరత్‌లో ఏకగ్రీవంగా గెలిచిన బీజేపీ అభ్యర్థి ముకేశ్ దలాల్

ఇద్దరు కాంగ్రెస్ నేతల నామినేషన్ల తిరస్కరణ

మిగతా ఎనిమిది మంది నామినేషన్ల ఉపసంహరణ

సూరత్: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అప్పుడే గెలుపు ఖాతా తెరిచింది. సోమవారం జరిగిన అనూహ్య పరిణామాల అనంతరం సూరత్ ఎంపీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి ముకేశ్ దలాల్ ఒక్కరే పోటీలో నిలిచారు. దీంతో ఆయన ఏకగ్రీవంగా గెలిచినట్లు ఎన్నికల అధికారి సౌరభ్ పార్థీ ప్రకటించారు. ముకేశ్‌కు గెలుపు సర్టిఫికేట్‌ను అందజేశారు. ఆయన గెలుపును ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటించిన నేపథ్యంలో సూరత్ స్థానానికి మే ఏడో తేదీన పోలింగ్ జరగదు. సూరత్ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి నీలేశ్ కుంభనీ నామినేషన్ల పత్రాలు సక్రమంగా లేవంటూ రిటర్నింగ్ అధికారి ఆదివారం నీలేశ్ నామినేషన్‌ను తిరస్కరించారు. నీలేశ్ అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించిన నేతల సంతకాలు సరిపోలడం లేదని రిటర్నింగ్ అధికారి ప్రకటించడం తెల్సిందే. నీలేశ్‌కు ప్రత్యామ్నాయంగా సురేశ్ పడ్సాలాతోనూ కాంగ్రెస్ పార్టీ నామినేషన్ వేయించింది. అయితే అది కూడా ఇతర కారణాలతో తిరస్కరణకు గురైంది. ఇక పోటీలో ఉన్న మిగతా నలుగురు స్వతంత్రులు, ముగ్గురు చిన్న పార్టీల అభ్యర్థులు, బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థి ప్యారేలాల్ భారతి సైతం తమ నామినేషన్ పత్రాలను విత్‌డ్రాకు చివరిరోజైన సోమవారం ఉపసంహరించుకున్నారు. దీంతో ముకేశ్ దలాల్ ఏకగ్రీవంగా గెలిచారు. ''ప్రధాని మోదీకి సూరత్ మొదటి కమలాన్ని అందజేసింది'' అని గుజరాత్ బీజేపీ అధ్యక్షుడు సీఆర్ పాటిల్ 'ఎక్స్'లో పోస్ట్‌చేశారు. దీనిపై కాంగ్రెస్ స్పందించింది. '' సూరత్‌లో సూక్ష్మ,చిన్న,మధ్యతరహా పరిశ్రమలు, వ్యాపార వర్గాలు బీజేపీపై గుర్రుగా ఉన్నాయి. 1984 తర్వాత తొలిసారిగా సూరత్‌లో ఓడిపోతామన్న భయంతో ఇలా మ్యాచ్‌ఫిక్సింగ్ చేశారు'' అని కాంగ్రెస్ ఆరోపించింది.


గెలుపు సర్టిఫికేట్‌ను స్వీకరిస్తున్న ముకేశ్

ఏడు దశాబ్దాల్లో 35 ఏకగ్రీవాలు

రాజ్యసభకు సభ్యులు నామినేట్ అవడం చూస్తుంటాం. లోక్‌సభలో ఏకగ్రీవం అనేది అరుదైన విషయం. కోట్లు కుమ్మరించి వ్యూహప్రతివ్యూహాలు పన్ని గెలుపు గుర్రాన్ని ఎక్కాలి. అయితే ప్రత్యర్థుల నామినేషన్లు తిరస్కరణకు గురికావడం, మిగతా వాళ్ల నామినేషన్లు ఉపసంహరించుకున్న ఘటనల్లో ఏకైక అభ్యర్థి విజయపీఠాన్ని అధిరోహించిన సందర్భాలూ ఉన్నాయి. ముకేశ్ దలాల్ ఏకగ్రీవ ఎన్నికతో ఈ అంశం మరోసారి తెరమీదకొచ్చింది. దలాల్ కన్నా ముందు ఇలా లోక్‌సభకు 1951 నుంచి ఇప్పటిదాకా 35 మంది ఎన్నికయ్యారు. 2012లో సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ భార్య డింపుల్ ఉత్తరప్రదేశ్‌లోని కన్నౌజ్ ఎంపీ స్థానం నుంచి ఏకగ్రీవంగా గెలిచారు. ఆ తర్వాత ఈ 12 ఏళ్లలో ఏకగ్రీవంగా ఎన్నకవడం ఇదే తొలిసారి. 1951లో 10 మంది, 1957లో 11 మంది, 1962లో ముగ్గురు, 1967లో ఐదుగురు, 1971లో ఒక్కరు, 1977లో ఇద్దరు, 1984లో ఒక్కరు, 1989లో ఒక్కరు, 2012లో ఒక్కరు ఏకగ్రీవంగా లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఇలా ఏకగ్రీవంగా ఎన్నికైన ప్రముఖుల్లో మాజీ ఉపప్రధాని, మాజీ ముఖ్యమంత్రి యశ్వంత్‌రావ్ బల్వంత్‌రావ్ చవాన్, జమ్మూకశ్మీర్ మాజీ సీఎం ఫరూక్ అబ్దుల్లా, ఒడిశా మాజీ సీఎం హరేకృష్ణ మహతాబ్, మాజీ కేంద్ర మంత్రి తిరువెల్లూరు తట్టై కృష్ణమాచారి, నాగాలాండ్ మాజీ సీఎం ఎస్‌సీ జమీర్, పీఎం సయీద్ ఉన్నారు.

ఎలక్షన్ బీట్

'నకలు' నాయకులు

సార్వత్రిక ఎన్నికల వేళ సెలబ్రిటీలుగా మారిన సామాన్యులు

మనిషిని పోలిన మనుషులు ఏడుగురు ఉంటారని ఓ నానుడి. మనిషిని పోలిన మనిషిని చూస్తే ఆశ్చర్యమేస్తుంది. ఇక నచ్చిన రాజకీయ నాయకుడిని పోలికలతో ఉన్న మరో మనిషిని చూస్తే కార్యకర్తలు, పార్టీ శ్రేణుల్లో కనిపించే హుషారు అంతా ఇంతా కాదు. మరో ప్రచారసభలో బిజీగా ఉండి రాలేకపోతున్న ముఖ్య నేతలు ఇంకో సభలో తమ నకలు మనిషిని రంగంలోకి దింపుతూ అక్కడి సభికుల్ని ఆశ్చర్యపరుస్తున్నారు. సభలు, సమావేశాల్లో సాధారణ ప్రజానీకాన్ని కలుస్తూ, వారితో సెల్ఫీలు దిగుతూ అసలు నేతకు జనాల్లో క్రేజ్‌ను మరింత పెంచేస్తున్నారు. దీంతో లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ఇలాంటి డూప్ నేతలకు డిమాండ్ భారీగా పెరిగింది. ప్రధాని మోదీ, యూపీ సీఎం యోగి, బెంగాల్ సీఎం మమతా బెనర్జీల డూప్‌లను చూసి ఓటర్లు ఆశ్చర్యం, ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ఫలితంగా.. సార్వత్రిక ఎన్నికల వేళ ఈ సామాన్యులు పాపులర్ అయి సెలబ్రిటీలుగా మారారు.

– సాక్షి, న్యూఢిల్లీ

మోదీ డూప్ వికాస్ మహంతే..



63 ఏళ్ల మహంతే ముంబైలో వ్యాపారం చేస్తుంటారు. ఈయన అచ్చం ప్రధాని మోదీలా ఉంటారు. మహారాష్ట్రలో బీజేపీ–శివసేన మహా కూటమి తరఫున ప్రచారం చేసేందుకు ఒప్పుకున్నారు. రానున్న రెండు నెలలు ఆయన షెడ్యూల్ బిజీగా ఉంది. స్థానిక కూటమి అభ్యర్థికి మద్దతుగా సభలు, సమావేశాలు, ఇంటింటి ప్రచారంలో పాల్గొంటున్నారు. 2013లో మోదీలా గడ్డం పెంచడం ప్రారంభించాక స్నేహితులు, పరిచయస్తులు తరచూ మోదీ అని పిలవడం మొదలెట్టారు. దీంతో మహంతే.. మోదీని అనుకరించడం మొదలు పెట్టా రు. మోదీ ప్రధాని అవడం, జాతీయ రాజకీయాల్లో మోదీ హవా మొదలయ్యాక మహంతే కూడా సెలబ్రిటీ అయ్యారు. ఎన్నికల ప్రచారాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలు, వివాహాల్లో స్పెషల్ గెస్ట్‌గా అలరిస్తున్నారు. టీవీ షోలు, వెబ్ సిరీస్‌లు, సినిమాల్లోనూ నటించారు. గుజరాతీ, మరాఠీ చిత్రాలతోపాటు, షారుఖ్ ఖాన్ నటించిన 'హ్యాపీ న్యూ ఇయర్', అక్షయ్ కుమార్ నటించిన 'మిషన్ మంగళ్' చిత్రాలలో మహంతే మెరిశారు.

బట్టతలే భాగ్యరేఖ



బట్టతల వస్తే భాగ్యరేఖ మారుతుందని పెద్దలు అంటుంటారు. ఉత్తరాఖండ్‌లోని అల్మోడాలో జన్మించిన జగదీశ్ రావత్‌కు మాత్రం ఇది కాస్తంత నిజం అయిందనే చెప్పాలి. 2017లో బట్టతల రావడం మొదలయ్యాక ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను రావత్ అనుకరించడం మొదలెట్టారు. తెలిసినవారంతా ఈయనను 'యోగిజీ' అనే పిలుస్తారు. ఇప్పటికే చిన్నపాటి విందు, వినోదాల్లో సందడి చేసిన రావత్.. గత వారం నుంచి ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో బీజేపీ తరఫున ఎన్నికల ప్రచారంలో సందడి చేస్తున్నారు. ముఖ్యమంత్రి యోగి కుటుంబ సభ్యులు నివసించే ఉత్తరాఖండ్‌లోని పట్టణ వీధుల్లోనూ అందరితో కలియతిరుగుతూ లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని రక్తికట్టించారు. ఇప్పుడు రోడ్ షోలు, ప్రచార కార్యక్రమాలకు రావాలంటూ చాలా రాష్ట్రాల్లోని బీజేపీ నేతలు ఈయనకు ఆహ్వానాలు పలుకుతున్నారు. ''తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రచారం చేయాలని కొందరు జాతీయ నేతలు నన్ను సంప్రదించారు'' అని రావత్ గుర్తుచేసుకున్నారు.

రుమా చక్రవర్తి మరో మమత



పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి మారురూపం రూమా చక్రవర్తి. కోల్‌కతాకు 70 కిలోమీటర్ల దూరంలోని కోలాఘాట్ నివాసి. ఈమె వృత్తిరీత్యా రంగస్థల నటి, నృత్యకారిణి. జాత్రా ఏక్ చిత్రంలో పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ పాత్రను పోషించి శెభాష్ అనిపించుకున్నారు. తెల్లటి చీర, సాధారణ రబ్బరు చెప్పులు ధరించి ఆ పాత్రలో దీదీని మరిపించారు. ''బంగ్లా'ర్ ఖమతా, ఎబర్ మమతా (బెంగాల్ బలం, ఈసారి మమత)' నాటకం సూపర్ డూపర్ హిట్ అయింది. 2019లో వచ్చిన 'బాఘిని: ది బెంగాల్ టైగ్రెస్'లోనూ రూమా నటించారు. బెంగాల్‌లోని పలు నియోజకవర్గాల్లో ఈ రీల్ దీదీ తెగ సందడి చేస్తున్నారు.

ఆస్తులు దోచుకోవడమే కాంగ్రెస్ లక్ష్యం

అందుకే పదేపదే ఆస్తుల పునఃపంపిణీ అంటోంది

- కాంగ్రెస్‌కు అధికారం అప్పగిస్తే సర్వం లూటీ చేస్తారు
- మన తల్లులు, అక్కచెల్లెమ్మల మంగళసూత్రాలను, బంగారాన్ని కొల్లగొడతారు
- ఉద్యోగుల ఆస్తులను సర్వే చేస్తారు.. ఆపై మింగేస్తారు
- జనం ఆస్తులను కాజేయడం కమ్యూనిస్టులు, మావోయిస్టుల ఆలోచనా ధోరణి
- విపక్ష 'ఇండియా' కూటమి అసలు ఉద్దేశాలపై ప్రజలను అప్రమత్తం చేస్తున్నా..

అలీగఢ్ ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోదీ



అలీగఢ్: అధికారంలోకి వస్తే సంపద పునఃపంపిణీ చేస్తామని కాంగ్రెస్ చెబుతోందని, వాస్తవానికి ప్రజల ఆస్తులను, మన తల్లులు, అక్కచెల్లెమ్మల మంగళసూత్రాలను, బంగారాన్ని దోచుకోవడమే ఆ పార్టీ అసలు లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మండిపడ్డారు. కాంగ్రెస్‌కు అధికారం అప్పగిస్తే మన ఆస్తులు లూటీ కావడం ఖాయం అంటూ ప్రజలను అప్రమత్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తే మొత్తం దేశ సంపదను, ప్రజల ఆస్తులను ముస్లింలకు కట్టబెడతారంటూ ఆదివారం రాజస్తాన్‌లో ఎన్నికల ప్రచారంలో మోదీ చేసిన వ్యాఖ్యలపై వివాదం చెలరేగుతుండగానే మరో సంచలనానికి ఆయన తెరతీశారు. సోమవారం ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్‌లో ఎన్నికల ప్రచార సభలో మోదీ ప్రసంగించారు. ముస్లిం మైనార్టీలు అధికంగా ఉన్న ఈ ప్రాంతంలో ముస్లింల పేరు ఎత్తకుండా కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్‌తోపాటు విపక్ష 'ఇండియా' కూటమి అసలు ఉద్దేశాలపై తన బాధ్యతగా ప్రజలను అప్రమత్తం చేస్తున్నానని చెప్పారు. ఆయన ఏమన్నారంటే...

రెండు ఇళ్లు ఉంటే.. ఒకటి లాగేసుకుంటారు

''కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే.. దేశంలో ఎవరు ఎంత సంపాదిస్తున్నారో, వారికి ఎన్ని ఆస్తులు ఉన్నాయో విచారణ జరిపిస్తామని ఆ పార్టీ యువరాజు చెబుతున్నారు. అంతేకాకుండా ఆ ఆస్తులను స్వాధీనం చేసుకొని పునఃపంపిణీ చేస్తామని అంటున్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో కూడా ఇదే విషయం చేర్చారు. ఒక్కసారి ఆలోచించండి. మన తల్లులు, అక్కచెల్లెమ్మల వద్ద ఎంతోకొంత బంగారం ఉంది. అది వారి స్త్రీధనం. ఆ బంగారాన్ని వారు పవిత్రంగా భావిస్తారు. అపురూపంగా దాచుకుంటారు. స్త్రీధనానికి రక్షణ కల్పిస్తూ ఒక చట్టం కూడా అమల్లో ఉంది. మన తల్లుల, అక్కచెల్లెమ్మల బంగారంపై ఇప్పుడు కాంగ్రెస్ నాయకుల కన్ను పడింది. అందుకే చట్టంలో మార్పు చేసి, ఆ బంగారాన్ని స్వాధీనం చేసుకుంటామని స్పష్టంగా చెబుతున్నారు. ఆడపడుచులు పరమ పవిత్రంగా భావించే మంగళసూత్రాలను దోచుకోవాలని చూస్తున్నారు. కేవలం మంగళసూత్రాలే కాదు, మహిళల వద్ద ఉన్న మొత్తం బంగారాన్ని కొల్లగొడతారట! వేతన జీవులపైనా కాంగ్రెస్ నేతలు కన్నేశారు. అధికారంలోకి వచ్చాక ఉద్యోగుల ఆస్తులపై సర్వే చేస్తామంటున్నారు. ఒకవేళ మీకు రెండు ఇళ్లు ఉన్నాయనుకోండి, అందులో ఒకటి లాగేసుకుంటారు. కాంగ్రెస్ ఏమైనా చేయగలదు. ప్రజలంతా ఈ విషయం గుర్తుపెట్టుకోవాలి. ప్రజల ఆస్తులను దోచుకోవడం అనేది ముమ్మాటికీ మావోయిస్టుల ఆలోచనా ధోరణే. కమ్యూనిస్టుల వైఖరి సైతం ఇలాగే ఉంటుంది. కమ్యూనిస్టులు, మావోయిస్టులు జనం ఆస్తులను మింగేసి ఎన్నో దేశాలను సర్వనాశనం చేశారు. ఇప్పుడు సరిగ్గా అదే విధానాన్ని మన దేశంలోనూ అమలు చేయాలని విపక్ష కాంగ్రెస్‌తోపాటు 'ఇండియా' కూటమి పార్టీలు నిర్ణయానికొచ్చాయి'' అని ప్రధాని మోదీ నిప్పులు చెరిగారు.

దోచుకోవడం జన్మహక్కుగా భావిస్తున్నారు

కుటుంబ పార్టీల నేతలు, వారసత్వ రాజకీయ నాయకులు దేశ ప్రజలను విచ్చలవిడిగా లూటీ చేసి, సంపద సామ్రాజ్యాలు నిర్మించుకున్నాయని మోదీ దుయ్యబట్టారు. వారి ఆస్తుల నుంచి పేదలకు చిల్లిగవ్వ కూడా ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ప్రజలను దోచుకోవడం జన్మహక్కుగా కాంగ్రెస్ పెద్దలు భావిస్తున్నారని మండిపడ్డారు. వారసత్వ రాజకీయాలకు చరమగీతం పాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అవినీతి, బుజ్జగింపు రాజకీయాలను అంతం చేయాలని చెప్పారు. గతంలో మన దేశ సరిహద్దుల్లో మన జవాన్లు నిత్యం ప్రాణాలు కోల్పోతూ ఉండేవారని, మన నగరాలు, పుణ్యక్షేత్రాలు బాంబుల మోతలతో దద్దరిల్లుతూ ఉండేవని గుర్తుచేశారు. తాము అధికారంలోకి వచ్చాక పరిస్థితి మారిపోయిందన్నారు. జవాన్ల మరణాలు, బాంబుల మోతలు ఇప్పుడు లేవన్నారు.

ముస్లిం మహిళలకు రక్షణ కల్పించాం..

ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు బుజ్జగింపు రాజకీయాలు చేస్తున్నాయని ప్రధానమంత్రి ధ్వజమెత్తారు. నిజానికి ముస్లింల ఆర్థిక, సామాజిక ప్రగతి కోసం ఆ పార్టీలు చేసిందేమీ లేదని విమర్శించారు. ట్రిపుల్ తలాఖ్ విధానం వల్ల ఎంతో మంది ముస్లిం ఆడబిడ్డలు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి జీవితాలు అస్తవ్యస్తమయ్యాయని అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ట్రిపుల్ తలాఖ్‌కు వ్యతిరేకంగా చట్టం తీసుకొచ్చామని, ముస్లిం ఆడపడుచుల భవిష్యత్తుకు రక్షణ కల్పించామని వివరించారు.

మోదీ వ్యాఖ్యలపై దుమారం

రాజస్తాన్‌లోని బన్స్వారా జిల్లాలో ప్రధాని మోదీ ఆదివారం చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. కాంగ్రెస్‌కు అధికారం అప్పగిస్తే ప్రజల ఆస్తులను, వారు కష్టపడి సంపాదించుకున్న డబ్బులను లాక్కొని.. చొరబాటుదారులకు, అధిక సంతానం ఉన్న వారికి కట్టబెడతారంటూ ఆయన చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్‌తోపాటు ఇతర పార్టీల నాయకులు తప్పుపడుతున్నారు. 2006లో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ చేసిన ప్రకటనను మోదీ ప్రస్తావించారు. దేశంలోని వనరులపై, సంపదపై ముస్లింలకే మొదటి హక్కు ఉందంటూ మన్మోహన్ సింగ్ చెప్పారని మోదీ తెలిపారు. అయితే, మన్మోహన్ సింగ్ అలా చెప్పినట్లు నిరూపించాలని మోదీకి కాంగ్రెస్ నేతలు సవాలు విసురుతున్నారు.

తక్షణమే చర్యలు తీసుకోండి

ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని, సుప్రీంకోర్టు తీర్పులను మోదీ ఉల్లంఘించారు ● ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ పార్టీ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజల్లో విభజన తీసుకొచ్చేలా విద్వేషపూరిత వ్యాఖ్యలు చేస్తున్నారని, ఓ వర్గాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారని, ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ప్రధానిపై చర్యలు తీసుకోవాలంటూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. సీనియర్ నేత అభిషేక్ మనూ సింఘ్వీ నేతృత్వంలో కాంగ్రెస్ నాయకుల బృందం సోమవారం ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్, ఎన్నికల కమిషనర్లు జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధూను కలిసింది. రాజస్తాన్‌లో ఆదివారం ఎన్నికల ప్రచారంలో మోదీ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను వారి దృష్టికి తీసుకొచ్చింది.

స్పందించేందుకు ఈసీ నిరాకరణ

కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై స్పందించేందుకు ఎన్నికల సంఘం సోమవారం నిరాకరించింది.

మోదీ కొత్త ఎత్తుగడలు

''దేశంలో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం తారస్థాయికి చేరాయి. అయినా అంతా బాగుందంటూ ప్రధాని నరేంద్ర మోదీ నమ్మబలుకుతున్నారు. సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి కొత్తకొత్త ఎత్తుగడలు వేస్తున్నారు''.

– 'ఎక్స్'లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

విషపూరిత భాష

''ప్రధాని మోదీ విషపూరితమైన భాష వాడుతున్నారు. 2021లో జరగాల్సిన జనగణన ఇంకా జరగలేదు. ఆ ఊసే వినిపించడం లేదు.''

– జైరామ్ రమేశ్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి

మోదీ వ్యాఖ్యలు సిగ్గుచేటు

''హిందువులు, ముస్లింల మధ్య.. దళితులు, ఇతర కులాల మధ్య ప్రధాని మోదీ విద్వేషాలు సృష్టిస్తున్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో ముస్లిం లీగ్ విధానాల తరహాలో ఉందని మోదీ చెబుతున్నారు. మా మేనిఫెస్టోపై మోదీతో చర్చకు నేను సిద్ధంగా ఉన్నాను. యువతకు ఉద్యోగాలు ఇస్తామని చెబుతున్నాం. ఇది ముస్లిం లీగ్ విధానమా? నారీ న్యాయం, పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత ముస్లిం లీగ్ విధానాలా? కాంగ్రెస్ గెలిస్తే ప్రజల ఆస్తులను ముస్లింలకు ఇచ్చేస్తారని మోదీ చెప్పడం సిగ్గుచేటు''.

ఖర్గే, ఏఐసీసీ అధ్యక్షుడు

సుమోటోగా స్వీకరించాలి

''నరేంద్ర మోదీ చాలా దారుణంగా మాట్లాడారు. సమాజంలో ప్రజల మధ్య చిచ్చుపెట్టి విద్వేషాలు రగిల్చేలా వ్యాఖ్యలు చేశారు. మోదీ ప్రసంగాన్ని సుప్రీం కోర్టు సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టాలి''

– సీతారాం ఏచూరి, సీపీఎం

మోదీకి 6గురు తోబుట్టువులు లేరా?

నాకు ఆరుగురు పిల్లలు ఉన్నారని అవహేళన చేయొచ్చు. మరి మోదీ మాటేమిటి? ఆయనకు ఆరుగురు తోబుట్టువులు ఉన్నారు. బీజేపీ నేతలు అమిత్ షా, రవిశంకర్ ప్రసాద్‌కు పెద్ద కుటుంబాలు ఉన్నాయి. ముస్లింలను చొరబాటుదారులు అనడం వారిని కించపర్చడమే అవుతుంది''

– అసదుద్దీన్ ఒవైసీ, ఎంఐఎం అధ్యక్షుడు

ముస్లింలు చొరబాటుదారులా?

''ప్రధాని మోదీ దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారు. దేశ చరిత్రలో ఎవరూ ఈ స్థాయికి దిగజారలేదు. ఆయనపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలి. మైనార్టీలు మనదేశంలో ఎన్నో దశాబ్దాలుగా ఉంటున్నారు. వారిని చొరబాటుదారులు అనడం ఏమిటి? 1950 నుంచి ఏ ప్రధానమంత్రి కూడా ఇలా మాట్లాడలేదు. ఆ పదవిలో ఉన్న వ్యక్తి అనుచితంగా మాట్లాడడం నాకు నచ్చలేదు. కాంగ్రెస్ వస్తే దేశ సంపదను ముస్లింలకు అప్పగిస్తారంటూ మోదీ చేసిన ప్రకటనపై ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ ఎందుకు మౌనంగా ఉంటున్నారో చెప్పాలి''

– కపిల్ సిబల్, కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు

మతపరమైన భావోద్వేగాలు రెచ్చగొడుతున్నారు

ఎన్నికల్లో ఓటమి తప్పదన్న భయంతోనే ప్రధాని మోదీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తున్నారు. పరిపాలనలో మోదీ ఘోరంగా విఫలమయ్యారు. ప్రజలు ఆయన పట్ల ఆగ్రహంతో ఉన్నారు. అందుకే మోదీ మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొడుతున్నారు''. – ఎం.కె.స్టాలిన్, తమిళనాడు సీఎం

జాతి వ్యతిరేక వ్యాఖ్యలు చేశారు

''ముస్లింలకు వ్యతిరేకంగా నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు ముమ్మాటికీ జాతి వ్యతిరేక వ్యాఖ్యలే. ముస్లిం సమాజాన్ని కించపర్చారు. దేశ ప్రజల్లో ముస్లింల పట్ల వ్యతిరేకత పెంచాలన్నదే మోదీ కుట్ర. దేశంలో ఓ వర్గాన్ని అవమానిస్తూ మాట్లాడడం దారుణం. దేశంలో అంతర్భాగమైన పౌరులను చొరబాటుదారులు అనడం ఎక్కడైనా ఉందా?''

– పినరయి విజయన్, కేరళ సీఎం

24,640 నియామకాలు రద్దు

నియామక నోటిఫికేషన్‌ను కొట్టేసిన కలకత్తా హైకోర్టు

కోల్‌కతా: సార్వత్రిక ఎన్నికల సమరం వేళ పశ్చిమబెంగాల్‌లో మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ సర్కార్‌కు కలకత్తా హైకోర్టులో సోమవారం గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ప్రభుత్వ ప్రాయోజిత, ఎయిడెడ్ పాఠశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలకు టీఎంసీ సర్కార్ ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దుచేస్తూ కలకత్తా హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పు ఇచ్చింది. రాష్ట్రంలో నిర్వహించిన స్టేట్ లెవల్ సెలక్షన్ టెస్ట్(ఎస్ఎల్ఎస్‌టీ)–2016 రిక్రూట్‌మెంట్ పరీక్ష ద్వారా చేపట్టిన 24,640 నియమకాలన్నీ రద్దు చేస్తున్నట్లు పేర్కొంది. నియామకాల్లో అవకతవలకు దర్యాప్తు జరిపి 3నెలల్లోగా నివేదిక ఇవ్వాలని సీబీఐను ఆదేశించింది. ఈ పోస్టుల భర్తీ కోసం కొత్తగా నియామక ప్రక్రియను చేపట్టాలని పశ్చిమబెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్‌కు ఆదేశాలిచ్చింది. తప్పుడు మార్గంలో ఉద్యోగాలు పొందిన వారంతా ఈ ఎనిమిదేళ్లలో పొందిన జీతభత్యాలను ఏడాదికి 12 శాతం వడ్డీతోసహా కలిపి నాలుగువారాల్లోపు తిరిగి చెల్లించాలని కోర్టు ఆదేశించింది. ఈ ఉపాధ్యాయ కుంభకోణం కేసులో నాటి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పార్థ ఛటర్జీ తదితరులను దర్యాప్తు సంస్థ అరెస్ట్‌చేసింది.

తీర్పును సవాల్ చేస్తామన్న మమతా బెనర్జీ

హైకోర్టు తీర్పును రాష్ట్ర సీఎం మమతా బెనర్జీ తప్పుబట్టారు. '' తీర్పు చట్టవ్యతిరేకం. ఈ తీర్పును పై కోర్టులో సవాల్‌చేస్తాం. ఉద్యోగాలు కోల్పోతున్న వారికి అండగా ఉంటా. ఎనిమిదేళ్ల జీతాలను నెలరోజుల్లోగా ఎలా చెల్లించగలరు?'' అని మమత ఆగ్రహం వ్యక్తంచేశారు. తీర్పు ద్వారా కుంభకోణాన్ని కోర్టు బయటపెట్టిన నేపథ్యంలో నైతిక బాధ్యతగా మమత సీఎం పదవికి రాజీనామా చేయాలని బీజేపీ డిమాండ్‌చేసింది.

ముయిజ్జుకు పూర్తి మెజారిటీ

మాలె: మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జు సారథ్యంలోని అధికార కూటమి పార్లమెంట్‌లో మెజారిటీ సాధించింది. మొత్తం 93 సీట్లకు ఆదివారం జరిగిన పోలింగ్‌లో కూటమి 71 సీట్లు గెలుచుకుంది. ముయిజ్జు అమలు చేస్తున్న చైనా అనుకూల విధానాలకు ప్రజలిచ్చిన సానుకూల తీర్పే ఈ ఫలితాలను అధికారపక్షం అంటోంది. ముయిజ్జుకు చెందిన పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్(పీఎన్‌సీ)కు 68 సీట్లు రాగా, మిత్రపక్షాలు 3 సీట్లు గెలుచుకున్నాయి.

రెబల్ నేత ఈశ్వరప్పపై బీజేపీ బహిష్కరణ వేటు

బెంగళూరు: పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించడంతోపాటు లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన రెబల్ నేత కేఎస్ ఈశ్వరప్ప(75)ను బీజేపీ ఆరేళ్లపాటు బహిష్కరించింది. గతంలో ఆయన రాష్ట్ర డిప్యూటీ సీఎంగాను, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో హావేరి నుంచి పోటీకి తనకు అవకాశం దక్కలేదనే కోపంతో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర, యడియూరప్పపై విమర్శలు చేసిన సంగతి తెలిసిందే.

అత్యాచార బాధిత బాలిక.. 30 వారాల గర్భ విచ్ఛిత్తికి అనుమతి

ప్రత్యేక పరిస్థితుల్లో ప్రత్యేక అధికారాన్ని వాడుతున్నట్లు సుప్రీం వెల్లడి

న్యూఢిల్లీ: అత్యాచారానికి గురై గర్భం దాల్చిన 14 ఏళ్ల బాలిక 30 వారాల గర్భ విచ్ఛిత్తికి సుప్రీంకోర్టు అసాధారణ అనుమతి మంజూరు చేసింది. మైనర్ సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ, ప్రత్యేక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, ఏప్రిల్ 4న బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును పక్కన పెడుతున్నట్లు వివరించింది. మహారాష్ట్రకు చెందిన బాలిక అత్యాచారానికి గురై గర్భం దాల్చింది. విషయం ఆలస్యంగా తెలుసుకున్న ఆమె తల్లి ఈ నెలారంభంలో బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఈ దశలో గర్భ విచ్ఛిత్తితో బాలిక ప్రాణాలకు ప్రమాదం ఉందంటూ కోర్టు ఆమె వినతిని తిరస్కరించింది. ఈ నిర్ణయంపై బాధిత బాలిక తల్లి సుప్రీంకోర్టు తలుపు తట్టారు. గత వారం విచారణ జరిపిన న్యాయస్థానం బాలిక ఆరోగ్య పరిస్థితిపై నివేదిక ఇవ్వాలంటూ ముంబైలోని లోక్‌మాన్య తిలక్ మున్సిపల్ మెడికల్ కాలేజ్, ప్రభుత్వ ఆస్పత్రి(ఎల్టీఎంజీహెచ్) డీన్‌ను ఆదేశించింది. కేవలం 14 ఏళ్ల వయస్కురాలైన బాధితురాలి ఇష్టానికి విరుద్ధంగా గర్భాన్ని కొనసాగిస్తే ఆమె శారీరక మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందంటూ నివేదిక పేర్కొంది. ఈ దశలో గర్భ విచ్ఛిత్తి చేస్తే బాధితురాలి జీవితానికి వాటిల్లే ముప్పు, ప్రసవించే సమయంలో కలిగే ప్రమాదం కంటే ఎక్కువేమీ ఉండదని కూడా అభిప్రాయపడింది. పరిగణనలోకి తీసుకున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలాల ధర్మాసనం సోమవారం మధ్యంతర తీర్పు వెలువరించింది. బాలిక కడుపులో పెరుగుతున్న పిండాన్ని తొలగించేందుకు తక్షణమే వైద్యుల బృందాన్ని ఏర్పాటు చేయాలని ఎల్టీఎంజీహెచ్ డీన్‌ను ఆదేశించింది. ఇందుకయ్యే ఖర్చును మహారాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని స్పష్టం చేసింది.

మణిపూర్‌లో రీపోలింగ్.. 81.6% ఓటింగ్

ఇంఫాల్: మణిపూర్ (ఇన్నర్)లోక్‌సభ నియోజకవర్గంలోని 11 పోలింగ్ స్టేషన్ల పరిధిలో సోమవారం జరిగిన రీపోలింగ్‌లో 81.6% ఓటింగ్ నమోదైంది. ఇక్కడ శుక్రవారం జరిగిన పోలింగ్ సందర్భంగా కాల్పుల ఘటనలు, ఈవీఎం ధ్వంసం వంటి ఘటనలు చోటుచేసుకోవడంతో ఎన్నికల సంఘం మళ్లీ పోలింగ్ నిర్వహించింది. ఈనెల 19వ తేదీన అరుణాచల్ ప్రదేశ్‌లోని లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఈవీఎంల ధ్వంసం, హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న 8 పోలింగ్ స్టేషన్ల పరిధిలో రీపోలింగ్ త్వరలోనే నిర్వహించనున్నట్లు అధికారులు చెప్పారు.

అలీగఢ్ ముస్లిం వర్సిటీ వీసీగా మహిళ

న్యూఢిల్లీ: అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా నైమా ఖాటూన్ సోమవారం నియమితులయ్యారు. ఐదేళ్ల పాటు ఆమె ఈ పదవిలో కొనసాగుతారు. వందేళ్లలో వర్సిటీ చరిత్రలో అత్యున్నత పదవిని చేపట్టిన తొలి మహిళగా నైమా చరిత్ర సృష్టించారు. ఆమె నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేశారు.

ఇన్సులిన్ కోసం అడుగుతూనే ఉన్నా

జైలు సూపరింటెండెంట్‌కు కేజ్రీవాల్ లేఖ

న్యూఢిల్లీ: కేజ్రీవాల్‌కు ఇన్సులిన్ అక్కర్లేదని, డయాబెటిక్‌తో పెద్ద ఇబ్బంది లేదని ఎయిమ్స్ వైద్యులు ఆయనకు సూచించారని తిహార్ జైలు యంత్రాంగం విడుదల చేసిన ఒక ప్రకటనపై కేజ్రీవాల్ అభ్యంతరం వ్యక్తంచేశారు. ఆ ప్రకటన పూర్తిగా అబద్ధాలతో నిండిపోయిందని ఆరోపించారు. తన నిరసన తెలియజేస్తూ ఈ మేరకు జైలు సూపరింటెండెంట్‌కు కేజ్రీవాల్ లేఖ రాశారు. లేఖను ఢిల్లీ రాష్ట్ర మహిళా మంత్రి అతిశి 'ఎక్స్'లో పోస్ట్‌చేశారు. ' జైలు యంత్రాంగం చెబుతున్నదంతా అబద్ధం. రోజూ 250–320 స్థాయిలో షుగర్ లెవల్స్ ఉంటున్నాయి. ప్రతి రోజు పరగడుపున 160–200 స్థాయిలో చక్కెరస్థాయిలు ఉంటున్న విషయాన్ని ప్రస్తావించా. గత పది రోజులుగా ఇన్సులిన్ కావాలని రోజు అడుగుతున్నా. అలాంటపుడు ఇన్సులిన్ అడగలేదు అని ఎలా అంటారు?' అని ఆగ్రహం వ్యక్తంచేశారు. '' 20వ తేదీన ఎయిమ్స్ వైద్యులు వీడియోకాల్‌లో మాట్లాడారు. షుగర్ లెవల్స్‌తో భయపడాల్సిన పనిలేదని వైద్యులు నాతో చెప్పారని జైలు యంత్రాంగం చెబుతోంది. ఇది అబద్ధం. అలాంటి భరోసా వైద్యులు నాకు ఇవ్వలేదు. మీ మెడికల్ రికార్డులు అన్నీ క్షుణ్ణంగా పరిశీలించాకే ఏదైనా సలహా ఇవ్వగలం అని మాత్రమే వైద్యులు నాతో చెప్పారు' అని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. జైలు యంత్రాంగం లేఖపై కేజ్రీవాల్ ప్రతిస్పందన నేపథ్యంలో ఆయనకు ఇన్సులిన్ అవసరమా లేదా అనేది తేల్చేందుకు మెడికల్ బోర్డ్‌ను ఏర్పాటుచేయాలని సీబీఐ, ఈడీ స్పెషల్ జడ్జి కావేరీ బవేజీ ఢిల్లీ ఎయిమ్స్‌ను ఆదేశించారు.

సాక్షి
కరీంనగర్
మంగళవారం | 23 | ఏప్రిల్ | 2024



కలెక్టరేట్‌కు పోలింగ్ సామగ్రి

కరీంనగర్ అర్బన్: లోక్‌సభ ఎన్నికల క్రమంలో పోలింగ్ సామగ్రి కరీంనగర్ కలెక్టరేట్‌కు చేరింది.పోలింగ్‌కు ఒక రోజు ముందు సిబ్బందికి అందజేయనున్నారు.



క్వింటాల్ పత్తి రూ.7,400

జమ్మికుంట: స్థానిక మార్కెట్‌లో క్వింటాల్ పత్తి గరిష్టంగా రూ.7,400 పలికింది. సోమవారం మార్కెట్‌కు 32 వాహనాల్లో 501 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తెచ్చారు.

గరిష్టం/కనిష్టం
39.0/27.0

వాతావరణం

వాతావరణం ఎండగా ఉంటుంది. వడ గాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం స్వల్పంగా ఉంది.

రెబల్ 'రెడ్డీ'!



కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిపై ఉత్కంఠ ఇంకా వీడ లేదు. ఎంపీ అభ్యర్థిగా వెలిచాల రాజేందర్‌రావు నామినేషన్ వేయగా, తనకు రావాల్సిన టికెట్ మరొకరికి ఎలా ఇస్తారంటూ అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి నామినేషన్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. –8లో

నామినేషన్ల జోరు..

- కరీంనగర్ పార్లమెంట్ స్థానానికి 13 నామినేషన్లు

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

కరీంనగర్ లోక్‌సభ స్థానానికి నామినేషన్ల ప్రక్రియ జోరందుకుంది. ఇప్పటికే ప్రధాన పార్టీల నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్ నామినేషన్ వేయగా భాజపా అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ తరపున ఆ పార్టీ నేతలు నామినేషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. సోమవారం కాంగ్రెస్ అభ్యర్థిగా వెలిచాల రాజేందర్‌రావు నామినేషన్ దాఖలు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి నామినేషన్ అందజేశారు. ఈ నెల 25తో నామినేషన్ల ప్రక్రియ ముగియనుండగా సోమవారం మంచిరోజుగా భావించిన అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ఒక్కరోజే 13 నామినేషన్లు దాఖలు కాగా ఎన్నికల అధికారి పమేలా సత్పతి వాటిని స్వీకరించారు.

కలెక్టరేట్‌లో కోలాహలం

శనివారం నామినేషన్ల ప్రక్రియ మందకొడిగా సాగగా సోమవారం ఒక్కరోజే 13 దాఖలయ్యాయి. కాంగ్రెస్ అభ్యర్థిగా రాజేందర్‌రావు నాలుగుసెట్ల నామినేషన్ పత్రాలను వేర్వేరుగా అందజేశారు. కాగా పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా చింత అనిల్ కుమార్, ఆధార్ పార్టీ అభ్యర్థిగా తాళ్లపల్లి అరుణ, సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా గట్టు రాణా ప్రతాప్, ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థిగా చిలువేరు శ్రీకాంత్, ఎంసీపీఐ అభ్యర్థిగా లింగంపల్లి శ్రీనివాసరెడ్డి, స్వతంత్ర అభ్యర్థులుగా దేవునూరి శ్రీనివాస్, బంక రాజు, అబ్బిడి బుచ్చిరెడ్డి, గవ్వల లక్ష్మి, జింక శ్రీనివాస్, బరిగె గట్టయ్యయాదవ్, ఎండీ జిషాన్ నామినేషన్లు అందజేశారు. ఇప్పటికే ఆరు నామినేషన్లు దాఖలు కాగా మొత్తం 19 నామినేషన్లు అందాయని ఎన్నికల యంత్రాంగం పేర్కొంది.

రాజేందర్‌రావు ఆస్తి రూ.26.58కోట్లు

కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్నా వెలిచాల రాజేందర్‌రావు తన కుటుంబసభ్యుల మీద రూ.26.58 కోట్లు అస్తులు ఉన్నట్లు తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అందులో చరాస్తులు తన పేరు మీద రూ.4.59కోట్లు, తన భార్యకు 3.66కోట్లు ఉన్నట్లు తెలిపారు. వివిధ ప్రాంతాల్లో తన కుటుంబ సభ్యుల మీద రూ.18.33కోట్ల విలువైన వ్యవసాయ, కమర్షియల్ స్థలాలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం తన చేతిలో రూ.2.14లక్షలు, తన భార్య వద్ద రూ.51,500 ఉన్నాయన్నారు. తన దగ్గర 9తులాల బంగారం, తన భార్య దగ్గర 105 తులాల బంగారం ఉందని అఫిడవిట్‌లో పేర్కొన్నారు.



కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న వెలిచాల రాజేందర్‌రావు

న్యూస్‌రీల్

'మాదిగలకు ద్రోహం చేసిన కాంగ్రెస్ పార్టీ'



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

హుజూరాబాద్: మాదిగల రాజకీయ ఎదుగుదలకు కాంగ్రెస్ పార్టీ నమ్మించి ద్రోహం చేసిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ అన్నారు. సోమవారం రాత్రి హుజూరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ.. మాట ఇచ్చి మోసం చేయడంలో కాంగ్రెస్ పార్టీ ఆరితేరిందని అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో మూడు, నాలుగు సీట్లు రావాల్సి ఉండగా ఒకటి కూడా ఇవ్వకుండా కాంగ్రెస్ అధిష్టానం, సీఎం రేవంత్ రెడ్డి కక్షపూరితంగా వ్యవహరించారని ఆరోపించారు. రెడ్డిలకు ఆరుసీట్లు, 50శాతం పైన ఉన్న బీసీలకు రెండు సీట్లు ఇచ్చారని అన్నారు. కేసీఆర్ నియంతృత్వంతో మాదిగలు నష్టపోయారని, అందుకే ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఎవరూ ఓటు వేయద్దని సూచించారు. బీజేపీ తమ సమస్యలు పరిష్కరించేందుకు హామీ ఇచ్చిందని, ఈ ఎన్నికల్లో ఆ పార్టీకే మద్దతు ఇచ్చామని అన్నారు. నాయకులు రుద్రారపు రామచంద్రం, మారెపల్లి శ్రీనివాస్, తునికి వసంత్, వెంకట్ స్వామి, డాక్టర్ తడికమళ్ల శేఖర్, బొరగల సారయ్య, రాజు పాల్గొన్నారు.

ఏజీని కలిసిన బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్



సుదర్శన్‌రెడ్డితో రాజ్‌కుమార్

కరీంనగర్‌క్రైం: రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్ జనరల్ బి.సుదర్శన్ రెడ్డిని కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ.రాజ్ కుమార్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందజేశారు. న్యాయవాదులకు ప్రస్తుతం ఇస్తున్న రూ.2లక్షల ఇన్సూరెన్స్‌ను రూ.5లక్షలకు పెంచాలని, కొత్త సభ్యులకు హెల్త్‌కార్డులు ఇవ్వాలని, జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.5వేల స్టైఫండ్ ఇవ్వాలని వినతిపత్రం అందించగా.. సానుకూలంగా స్పందించారు.

మున్సిపల్ కాంట్రాక్టర్ల సంఘం కన్వీనర్‌గా మహేందర్



దగ్గు మహేందర్

కరీంనగర్ కార్పొరేషన్: మున్సిపల్ కాంట్రాక్టర్ల సంక్షేమ సంఘం కన్వీనర్‌గా దగ్గు మహేందర్ రాకేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహేందర్ కన్వీనర్‌గా ఎన్నికవడం వరుసగా ఇది రెండోసారి. కాంట్రాక్టర్లకు సంబంధించిన సమస్యలను అధికారుల సహకారంతో పరిష్కరిస్తానని ఈ సందర్భంగా మహేందర్ తెలిపారు. తన నియామకానికి సహకరించిన సహచర కాంట్రాక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం మేయర్ యాదగిరి సునీల్‌రావును మహేందర్ రాకేశ్ ఆధ్వర్యంలో కాంట్రాక్టర్లు మర్యాదకపూర్వకంగా కలిశారు. మహేందర్‌కు మేయర్ శుభాకాంక్షలు తెలిపారు.

పేరెంట్స్.. పాఠశాలకు రండి!

- నేడు ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్, టీచర్స్ మీటింగ్
- ప్రోగ్రెస్ రిపోర్టులు, మౌలిక వసతులపై చర్చ
- రేపటి నుంచి వేసవి సెలవులు



కరీంనగర్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం సరికొత్త సంస్కరణలకు శ్రీకారం చుడుతోంది. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తూనే, అత్యధిక నిధులు కేటాయిస్తూ 'మన ఊరు– మన బడి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. తాజాగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య, పిల్లల చదువులు, ఇతరత్రా సంస్థాగత విషయాలపై మంగళవారం పాఠశాలల్లో తల్లిదండ్రులతో టీచర్లు సమావేశం(పీటీఎం) నిర్వహించాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. బుధవారం నుంచి వేసవి సెలవుల నేపథ్యంలో మంగళవారం(నేడు) చివరి పనిదినం రోజున పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహించనున్నారు.

జిల్లాలో 313 గ్రామాలు

జిల్లాలో నగరపాలకసంస్థ, 4 మున్సిపాలిటీలు, 16 మండలాలు, 313 గ్రామాలున్నాయి. జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 652 ఉన్నాయి. 12 కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయాలు, 11 మోడల్ స్కూళ్లు ఉన్నాయి. ఆయా విద్యాసంస్థల్లో సుమారు 65వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రతీ పాఠశాలకు ఇటీవల ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసింది. వీరి ఆధ్వర్యంలో ప్రతినెలా తరగతుల వారీగా తల్లిదండ్రులతో టీచర్ల సమావేశాలు నిర్వహించాలి. పిల్లలకు ప్రోగ్రెస్ కార్డులు ఇవ్వడంతో పాటు పాఠశాలల్లో మౌలిక వసతులను జూన్ 10వ తేదీలోగా పూర్తయ్యేలా కార్యాచరణ ప్రణాళికను రూపొందించనున్నారు. 'అమ్మ' ఆదర్శ కమిటీల ద్వారా పర్యవేక్షణ చేస్తూ గ్రామాల్లోని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులను భాగస్వాములను చేస్తూ పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించనున్నారు.

చర్చించాల్సిన అంశాలివే...

సమావేశంలో విద్యార్థుల చదువులో పురోగతి, హాజరు, అలవాట్లు, సమస్యలపై చర్చించాలి. పాఠశాలల్లో విద్యాప్రమాణాలు, మధ్యాహ్న భోజనం మెరుగుపరచడం, వసతులపై నివేదిక తయారు చేయాలి. విద్యార్థులకు అందించాల్సిన సాయం, హోంవర్క్ పూర్తి చేయడం, పిల్లల ప్రవర్తన, ఆసక్తులపై సమీక్షించవచ్చని విద్యాశాఖ తెలిపింది. ఫలితంగా విద్యానాణ్యతా మెరుగుపడి, అభ్యాస ఫలితాల సాధనకు దోహదం చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ ఈ మేరకు డీఈవో ద్వారా మండల విద్యాధికారులకు ఉత్తర్వులు జారీ చేయడంతో మంగళవారం చివరి పనిదినం రోజున పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ ఆ దిశగా ఉత్తర్వులు జారీ చేసింది.

రేపటి నుంచి వేసవి సెలవులు

జిల్లాలోని పాఠశాలల్లో బుధవారం నుంచి వేసవి సెలవులు ప్రకటించింది. సెలవులు మొదలయ్యాయంటే పిల్లల్లో చెప్పలేని ఆనందం. ఆ ఆనందం తల్లిదండ్రులకు కారాదు విషాదం. పిల్లలను బైకులు, సైకిళ్లకు దూరంగా ఉండాలి. అవసరమైతేనే పెద్దల సంరక్షణలో నడిపేలా చూడాలి. ఇంట్లో తరుచూ కంప్యూటర్, వీడియో గేమ్‌లు, టీవీలకు అతుక్కుపోకుండా జాగ్రత్త వహించాలి. వేసవిలో ఎండకు తిరిగి అస్వస్థతకు గురయ్యే ప్రమాదం ఉంది. పిల్లలు ఇంటి ఆవరణలో ఆడుకునేలా చొరవ తీసుకోవాలి. చెరువులు, కుంటలకు దూరంగా ఉంచడం శ్రేయస్కరం.

కాంగ్రెస్ కలిసికట్టుగా ఉంది



నామినేషన్ వేసేందుకు వెళ్తున్న కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ శ్రేణులు

- వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలి
- బీజేపీ అభ్యర్థి వెంట సీనియర్లేరి?
- బీఆర్‌ఎస్ నాయకులనైనా వినోద్ గుర్తు పడతాడా?
- బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ కార్పొరేషన్: కాంగ్రెస్‌కు కరీంనగర్ కంచుకోట అని, ఎంపీగా గెలిచి చరిత్ర సృష్టించాలని బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. విద్యావంతుడైన రాజేందర్‌రావును ప్రజలు గెలిపించాలని కోరారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ తరపున వెలిచాల రాజేందర్‌రావు నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం కలెక్టరేట్ వద్ద పొన్నం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కలిసికట్టుగా ఉందని, తామంతా రాజేందర్‌రావు విజయానికి కృషి చేస్తున్నామన్నారు. ఎల్లారెడ్డిపేట నుంచి ఎల్కతుర్తి వరకు, మల్యాల నుంచి బెజ్జంకి వరకు ప్రతీ కార్యకర్త రాజేందర్‌రావు వెంట ఉన్నారన్నారు. బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ వెంట ఆ పార్టీ సీనియర్‌లైన మురళీధర్‌రావు, సుగుణాకర్‌రావు, గుజ్జుల రామకృష్ణారెడ్డి, మెరుగు హన్మంతు, ప్రతాప రామకృష్ణ లాంటి నాయకులు ఎందుకు కనిపించడం లేదన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు తిరుపతికి రైలు నడిచేలా చూశానని, సంజయ్ ఎంపీగా ఆ రైలును ప్రతీరోజు నడిపించేలా ఎందుకు చర్యలు తీసుకోలేదన్నారు. ఇక బీఆర్‌ఎస్ అభ్యర్థివి రూ.6 కోట్లు దొరికాయని, అవినీతి డబ్బులతో ఓట్లు కొనుక్కోవాలని వినోద్‌కుమార్ ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. అసలు వినోద్‌కుమార్ తన బీఆర్‌ఎస్‌కు చెందిన నాయకులనైనా గుర్తు పడుతాడా అని ప్రశ్నించారు. అభ్యర్థి ప్రకటన అంశం హైకమాండ్ చూసుకుంటుందని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. వెలిచాల రాజేందర్‌రావు మాట్లాడుతూ తన తండ్రి జగపతిరావు చూపిన బాటలోనే ప్రజలకు సేవ చేయడం, కరీంనగర్‌ను అభివృద్ధి చేయడం ప్రధాన లక్ష్యమన్నారు. ఒకసారి వినోద్, సంజయ్‌లకు అవకాశం ఇచ్చారని, ఈ సారి తనకు ఒక అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు.

అట్టహాసంగా 'వెలిచాల' నామినేషన్

కాంగ్రెస్ పార్టీ తరపున వెలిచాల రాజేందర్‌రావు అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. అధికారికంగా ప్రకటన వెలువడకపోయినా, కాంగ్రెస్ అభ్యర్థిగానే ఆయన నామినేషన్ పర్వం కొనసాగింది. వేలాది మంది పార్టీ శ్రేణులు వెంట రాగా, నగరంలోని జ్యోతిబాపూలే మైదానం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీగా తరలివెళ్లారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, హుజూరాబాద్, కరీంనగర్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జీలు వొడితెల ప్రణవ్, పురుమల్ల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు ఆరెపల్లి మోహన్, కోడూరి సత్యనారాయణగౌడ్ తదితరులతో కలిసి నామినేషన్ వేశారు.

ఓటమి భయంతోనే మోదీ మత విద్వేషం

ఓటమి భయంతోనే ప్రధాని నరేంద్రమోదీ మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. దేశంలో మొదటి దఫా ఎన్నికలు పూర్తవగానే, మోదీకి ఓటమి భయం పట్టుకుందన్నారు. అందుకే కాంగ్రెస్ గెలిస్తే సంపదంతా ముస్లింలకే పోతుందని మత విద్వేషాలతో లబ్ధిపొందేందుకు చూస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ మేనిఫెస్టో చూస్తేనే లాగులు తడుస్తున్నాయని, పాంచ్ న్యాయ్ ద్వారా బడుగు, బలహీనవర్గాలు లబ్ధి పొందుతాయని తెలిపారు.



మాల విరమణ మండపం వద్ద స్వాములు



దీక్ష విరమణ చేస్తున్న స్వాములు

రామలక్ష్మణ జానకీ..జైబోలో హనుమాన్‌కీ..

కొండగట్టు/జగిత్యాల: 'రామలక్ష్మణ జానకీ.. జైబోలో హనుమాన్‌కీ..' అంటూ కొండగట్టులోని అంజన్న ఆలయం పులకించిపోయింది. హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. హనుమాన్ దీక్షాపరులు మాల విరమణకు వేల సంఖ్యలో తరలివచ్చారు. మంగళవారం స్వామివారి జయంతి కావడంతో సుమారు 1.50లక్షల మంది భక్తులు వస్తారని ఆలయ అధికారులు తెలిపారు. కొండపైకి వచ్చిన భక్తులు ముందుగా క్యూలైన్ ద్వారా స్వామివారిని దర్శించుకోవాలని, ఇరుముడులను ఆలయంలో ఏర్పాటు చేసిన జాలీల్లో సమర్పించాలని, పాత కోనేరు ఎదురుగా ఉన్న మెట్ల నుంచి కల్యాణకట్ట వద్ద ఏర్పాటు చేసిన లైన్ల ద్వారా మండపంలోకి వెళ్లి మాల విరమణ చేసుకోవాలని, శ్రీరామకోటి స్తూపం వద్దగల షెడ్డులో తలనీలాలు సమర్పించాలని, కోనేరులో పుణ్యస్నానం ఆచరించి.. చివరగా ప్రసాదం తీసుకుని తిరుగు ప్రయాణం కావాలని ఆలయ అధికారులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగనివ్వొద్దని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. కొండగట్టులో ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ప్రసాదం తీసుకునేందుకు 12 క్యూలైన్లు, ప్రత్యేక దర్శనం, మాల విరమణ, కేశఖండన టికెట్లకు ఆరు కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు.



స్వామివారు

నేను.. పక్కా లోకల్



బండి సంజయ్‌ని సన్మానిస్తున్న బీజేపీ కార్యకర్తలు

- నన్ను ఓడించేందుకు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కుట్రలు
- కరీంనగర్ అభివృద్ధికి రూ.12వేల కోట్లు తెచ్చా
- బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్

హుస్నాబాద్: 'నేను పక్కా లోకల్.. రూ.12 వేల కోట్ల నిధులతో కరీంనగర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేశా'నని బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ అన్నారు. హుస్నాబాద్‌లో సోమవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ముందుగా గిరిజన మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి స్వాగతం పలికారు. సమావేశంలో బండి సంజయ్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు అభ్యర్థులు దొరకక, బయటి ప్రాంతాల నుంచి తీసుకువస్తున్నారన్నారు. గత ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నయా పైసా ఇవ్వలేదని, అందుకే మాజీ సర్పంచ్‌లు బీజేపీలో చేరుతున్నారని తెలిపారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీ, కార్పొరేషన్ల అభివృద్ధికి కేంద్రమే నిధులు ఇచ్చిందన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులతోనే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కరెంట్ బిల్లులను కట్టిందన్నారు. పల్లెల అభివృద్ధికి పాటుపడిన సర్పంచ్‌లను నిలువునా మోసం చేసిందన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు ఎందుకు ఓటు వేయాలో ప్రజలు ఆలోచించాలన్నారు. కరీంనగర్ ఎంపీగా నన్ను ఓడించేందుకు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు లోపాయికారి ఒప్పందం చేసుకున్నాయని ఆరోపించారు.'హుస్నాబాద్ ఎమ్మెల్యే నన్ను వెధవ అంటున్నారు. ఆయనపై నాకు ఎలాంటి ద్వేషం లేదు. ఆయన నన్ను ఎంత తిట్టినా పడతా'నని బండి అన్నారు. హామీలపై మొదట శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్, ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్ నాయక్, పార్టీ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.



అశ్వవాహనంపై రామయ్య

ఇల్లందకుంట: అపరభద్రాద్రి ఇల్లందకుంట శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీరా మనవమి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకుడు శేషం రామాచార్యులు, అర్చకుడు శేషం వంశీధరచార్యులు మంత్రోచ్ఛారణ మధ్య స్వామివార్లను ఆలయం చుట్టూ ఊరేగించారు. అనంతరం తెప్పోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈవో కందుల సుధాకర్, సురేందర్‌రెడ్డి, కదారి కుమారస్వామి, కొత్త శ్రీనివాస్, పెద్దికుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటేసి గోసపడుతున్రు



మాట్లాడుతున్న వినోద్‌కుమార్

- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్

మల్యాల: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేసినందుకు ఇప్పుడు ప్రజలందరూ గోసపడుతున్నారని, ఇప్పుడు బీజేపీకి ఓటేస్తే ఆగమైతరని కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మల్యాలలో సోమవారం రాత్రి రోడ్‌షో చేపట్టారు. చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. అంగడి బజార్‌లో వినోద్ మాట్లాడుతూ.. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ బడి తేలే.. గుడి తేలేదని, ఐదేళ్లలో కనీసం ఐదు రూపాయలు తేలేదని ఎద్దేవా చేశారు. తెలంగాణకు 23 నవోదయ పాఠశాలలు రావాల్సి ఉండగా కేంద్ర ప్రభుత్వం ఒక్కటీ ఇవ్వలేదన్నారు. ఓట్ల కోసం బండి సంజయ్ వస్తే నిలదీయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేగా ఓడిపోతే ఎంపీగా పోటీ చేసేందుకు కరీంనగర్ ఆయనకు పునరావాసమా..? అని ప్రశ్నించారు. తనను ఎంపీగా గెలిపిస్తే కరీంనగర్‌కు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ తీసుకొస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ గారడీ మాటలు, మోసపూరిత హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెడుతోందని, నాలుగు నెలల్లోనే రాష్ట్రప్రభుత్వంపై ప్రజలు విసుగుచెందారని తెలిపారు. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంత హక్కుల కోసం పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుక కావాలని, ఇందుకు వినోద్ కుమార్‌ను గెలిపించుకోవాలని కోరారు.

క్లుప్తంగా

కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించాలి



మాట్లాడుతున్న ఆనంద్‌గౌడ్

గంగాధర(చొప్పదండి): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ గెలుపు కోసం కృషి చేయాలని ఆ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ కోరారు. గంగాధర మండలంలోని గర్శకుర్తి గ్రామంలో సోమవారం చొప్పదండి, కరీంనగర్, హుస్నాబాద్ నియోజకవర్గాల ఓబీసీ మోర్చా సామాజిక సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రతీ బూత్‌లో బీజేపీ అభ్యర్థికి మెజార్టీ వచ్చేలా బూత్ కమిటీలతోపాటు ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పని చేయాలని సూచించారు. నాయకులు విఠల్, నందనం దివాకర్, విజయ్‌భాస్కర్, సుధ, దూలం కల్యాణ్, ఆకుల రాజేందర్, దుబ్బల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బిర్లా స్కూల్లో క్రికెట్ అకాడమీ ఏర్పాటు



క్రీడాకారులతో ప్రిన్సిపాల్ తదితరులు

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ బైపాస్‌లోని బిర్లా ఇంటర్నేషనల్ స్కూల్లో సోమవారం రోహిత్ శర్మ క్రికెట్ అకాడమీని ఏర్పాటు చేశారు. విద్యార్థుల్లో క్రీడాప్రతిభను పెంపొందించి, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో జాతీయస్థాయి కోచ్‌లతో ఈ అకాడమీని ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ బబిత విశ్వనాథన్ తెలిపారు. దీన్ని స్కూల్ చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించారు. దీంతోపాటు ఇతర క్రీడల్లో విద్యార్థులకు వేసవి క్రీడా శిబిరం ఏర్పాటు చేశారు. ఆర్చరీ, స్కేటింగ్, బాస్కెట్‌బాల్, లాన్ టెన్నిస్ క్రీడల్లో ఆసక్తి ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ సూచించారు.

108 సిబ్బందికి రాష్ట్రస్థాయి అవార్డు



ప్రశంసాపత్రం ఇస్తున్న డైరెక్టర్ వెంకటేశం

ధర్మపురి: 108 అంబులెన్స్ విభాగంలో అత్యుత్తమ సేవలందించిన ఇద్దరు సిబ్బందికి రాష్ట్రస్థాయి అవార్డు దక్కింది. పోతు అనిల్‌కుమార్ (ఈఎన్‌టీ) ఎంఏ.ఖయ్యూం అలీ(పైలట్) కొన్నేళ్లుగా ధర్మపురి ప్రభుత్వ ఆస్పత్రి అంబులెన్సులో పని చేస్తున్నారు. రోడ్డు ప్రమాద బాధితులు, అనారోగ్య సమస్యలున్నవారిని, గర్భిణులను సరైన సమయంలో ఆస్పత్రికి తీసుకెళ్లడంలో వారి సేవలకు గుర్తింపు లభించింది. సోమవారం హైదరాబాద్‌లోని 108 హెడ్ ఆఫీస్‌లో సంస్థ రాష్ట్ర డైరెక్టర్ వెంకటేశం, రాష్ట్ర హెడ్ ఆఫీసర్ ఖలీద్(ఎస్‌హెచ్‌వో) చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను, అవార్డు అందుకున్నారు.

గీత కార్మికుడికి గాయాలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని సబ్బితం గ్రామానికి చెందిన బొంగోని చంద్రశేఖర్ అనే గీత కార్మికుడు సోమవారం ప్రమాదవశాత్తు ఈత చెట్టు పైనుంచి కింద పడ్డాడు. ఈ ఘటనలో ఆయనకు గాయాలయ్యాయి. స్థానికులు పెద్దపల్లి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందున్నాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గీత పారిశ్రామిక సంఘం నాయకులు కోరారు.

గొంతు కోసుకుని మహిళ ఆత్మహత్యాయత్నం

వీర్నపల్లి(సిరిసిల్ల): అనారోగ్యాన్ని భరించలేక ఓ మహిళ గొంతు కోసుకున్న సంఘటన వీర్నపల్లి మండలం మద్దిమల్లలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన పొట్ల సుజాత(38) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. సోమవారం మధ్యాహ్నం తీవ్ర మనస్తాపానికి గురై గొంతు కోసుకొంది. వెంటనే అప్రమత్తమైన కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిసింది.

స్కూల్లో చోరీకి యత్నం

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలం తిమ్మాపూర్ ప్రాథమిక పాఠశాలలో గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి చోరీకి యత్నించి విఫలమయ్యారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. పాఠశాల ఆఫీస్ గదిలో టీవీ, ఇతర పరికరాలు ఉండడంతో చోరీకి యత్నించారని తెలిపారు. పోలీసులకు సమాచారం అందించగా వారు విచారణ చేపట్టారు. గతంలోనూ చోరీకి యత్నించారని గ్రామస్తులు తెలిపారు. రాత్రి పూట పాఠశాల ప్రాంగణంలో మందుబాబులు మద్యం సేవిస్తున్నారని చెప్పారు. పోలీసులు దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

రెబల్ రెడ్డీ!

- 25న నామినేషన్ వేసేందుకు సిద్ధమైన మాజీ ఎమ్మెల్యే
- అలిగిన ప్రవీణ్‌రెడ్డికి అధిష్టానం పిలుపు
- త్యాగానికి విలువలేకుండా పోయిందని ఆవేదన
- కాంగ్రెస్ బలగంతో వెలిచాల రాజేందర్‌రావు నామినేషన్
- పోటాపోటీ నామినేషన్లతో పార్టీలో పెరగనున్న వేడి

సాక్షిప్రతినిధి,కరీంనగర్: కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిపై ఉత్కంఠ ఇంకా వీడలేదు. పార్టీ సూచనల మేరకు సోమవారం ఎంపీ అభ్యర్థిగా వెలిచాల రాజేందర్‌రావు నామినేషన్ వేయగా, తనకు రావాల్సిన టికెట్ మరొకరికి ఎలా ఇస్తారంటూ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి కూడా నామినేషన్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో హస్తం పార్టీలో పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేస్తున్నారన్న సమాచారం ఒక్కసారిగా వేడి పెంచింది. పార్టీ ఇంతవరకూ ఎవరికీ బీఫారం ఇవ్వకపోవడంతో ప్రవీణ్‌రెడ్డి వర్గంలో ఆశలు ఇంకా సజీవంగానే ఉన్నాయి. తమ నేతకు టికెట్ ఇప్పించేందుకు చివరి వరకు పోరాడుతామని స్పష్టం చేస్తున్నారు. అవసరమైతే రెబల్‌గా బరిలో దిగాలన్న యోచనలో ప్రవీణ్‌రెడ్డి ఉన్నట్లు తెలుస్తోంది.

సోమవారం హడావుడి..

సోమవారం కరీంనగర్‌లో పలు ఆసక్తికర పరిణామాలు జరిగాయి. ఇప్పటికే తానే అభ్యర్థినంటూ ప్రచారం మొదలుపెట్టిన వెలిచాల రాజేందర్‌రావు మధ్యాహ్నం మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, ఆది శ్రీనివాస్‌లతో కలిసి నామినేషన్ వేశారు. మరోవైపు వెంటనే బయల్దేరి హైదరాబాద్ రావాల్సి ందిగా హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డికి గాంధీ భవన్ నుంచి పిలుపువచ్చింది. బయల్దేరిన ప్రవీణ్‌రెడ్డికి అధిష్టానం, పార్టీ పెద్దల నుంచి ఎలాంటి హామీ దక్కలేదని తెలిసింది. ఈ విషయం తెలిసి ప్రవీణ్‌రెడ్డి వర్గం అగ్గి మీద గుగ్గిలం అవుతోంది. హుస్నాబాద్, హుజూరాబాద్, మానకొండూరు, కరీంనగర్ నియోజకవర్గాల్లో తమ నేత కుటుంబానికి అభిమానులు వేలాదిగా ఉన్నారని, తమను కాదని ఇతరులకు ఎలా టికెట్ ఇస్తారని మండిపడుతున్నారు.

బరిలో అల్గిరెడ్డి

పార్టీ నుంచి ఎలాంటి స్పష్టమైన హామీ రాకపోవడం ప్రవీణ్‌రెడ్డిని తీవ్ర ఆవేదనకు గురిచేసింది. పార్టీ పెద్దలు చెప్పిన మాట విని, తాను ఎమ్మెల్యే సీటును త్యాగం చేస్తే, తీరా తనకే ఎంపీ సీటు ఇవ్వకుండా పారాచ్యూట్ లీడర్లకు ఇవ్వడంపై ఆయన



అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి

వర్గీయులు భగ్గుమంటున్నారు. ఇదే సమయంలో పార్టీపై ఆయన వర్గీయులు మరింత ఒత్తిడి పెంచాలని నిర్ణయించారు. ఇదే సమయంలో అల్గిరెడ్డితో బుధవారం నామినేషన్ వేయించాలని వ్యూహం రూపొందిస్తున్నారు. 25వ తేదీన నామినేషన్ వేయించాలని, ఆ తరువాత అధిష్టానం పెద్దలు చర్చలకు పిలుస్తారని, అప్పుడు బరిలో ఎవరి నిలుస్తారు? ఏ కారణం చేత టికెట్ కన్‌ఫర్మ్ చేస్తున్నారు? ఎవరికి చేస్తున్నారు? తప్పుకున్న వారి భవిష్యత్తు ఏంటి? అన్న విషయాలపై స్పష్టత వస్తుందని భావిస్తున్నారు. స్పష్టమైన హామీ రాని పక్షంలో బరిలో రెబెల్‌గా నిలబడాలని ఆయన వర్గీయులు ప్రవీణ్‌రెడ్డిపై ఒత్తిడి తెస్తున్నారు.

పాత గొడవలతో కుటుంబంపై దాడి

- వాహనాలు ధ్వంసం
- ముగ్గురికి గాయాలు



చికిత్స పొందుతున్న కనకయ్య

కోనరావుపేట(వేములవాడ): పాత గొడవలను మనసులో పెట్టుకొని, ఓ కుటుంబంపై దాడి చేసిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. బాధితుల కథనం ప్రకారం.. కోనరావుపేట మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన కుతాడి బాబు కుటుంబానికి, లోకిని ఎల్లవ్వ, ప్రశాంత్‌ల కుటుంబానికి గొడవ ఉన్నాయి. 15 రోజుల క్రితం బాబు తమ ఇంట్లోకి వచ్చి, రూ.50 వేలు ఎత్తుకెళ్లాడని, పుస్తెలతాడు దొంగతనానికి ప్రయత్నించాడని ఎల్లవ్వ, ప్రశాంత్ కోనరావుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో బాబు, అతని తండ్రి కనకయ్య, భార్య శిరీష ఇంట్లో భోజనం చేస్తుండగా లోకిని సతీశ్, ప్రశాంత్, దేవయ్య, ఇతర కుటుంబసభ్యులు కారంపొడి, గొడ్డళ్లతో వచ్చి దాడి చేశారు. ఇంటి ఎదుట ఉన్న కారు, ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేశారు. ఈ ఘటనలో ఆ ముగ్గురికీ గాయాలయ్యాయి. బాబు ప్రాణభయంతో తన కుటుంబసభ్యులతో కలిసి పరుగులు పెట్టాడు. మల్కపేటలోని స్నేహితుడి సాయంతో సిరిసిల్లలోని ఆస్పత్రికి వెళ్లాడు. విషయం తెలుసుకున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అంజనేయులు ఆస్పత్రికి వెళ్లి, వివరాలు సేకరించారు. బాబు ఫిర్యాదు మేరకు సతీశ్, ప్రశాంత్, దేవయ్యలతోపాటు వారి కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నూతన దంపతులకు ప్రమాదం

- కల్వర్టు కిందకు దూసుకెళ్లిన కారు
- కుటుంబసభ్యులతో కలిపి ఐదుగురికి గాయాలు
- పెళ్లి కూతురు పరిస్థితి విషమం వేములవాడలో వివాహం అనంతరం ఇంటికి వెళ్తుండగా ఘటన

మానకొండూర్: వివాహ వేడుక పూర్తి చేసుకొని, నూతన వధూవరులు, వారి కుటుంబసభ్యులు కారులో ఇంటికి వెళ్తున్నారు.. దారిలో ప్రమాదవశాత్తు వాహనం అదుపుతప్పి నిర్మాణంలో ఉన్న కల్వర్టు కిందకు దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారులో ఉన్న ఐదుగురికి గాయాలయ్యాయి. పెళ్లికూతురు పరిస్థితి విషమంగా ఉంది. వివరాల్లోకి వెళ్తే.. హనుమకొండకు చెందిన రిటైర్డ్ ఎస్సై దామెర సురేందర్ కుమారుడు తిలక్ వివాహం స్వాతితో ఆదివారం వేములవాడలో జరిగింది. సోమవారం సురేందర్, ఆయన భార్య, కౌసల్య, నూతన దంపతులు, పెళ్లి కూతురు చెల్లెలు విద్య కారులో హనుమకొండకు బయలుదేరారు. మార్గమధ్యలో మానకొండూర్ మండలంలోని గట్టుదుద్దెనపల్లి వద్ద కరీంనగర్–వరంగల్ నేషనల్ హైవే పనుల్లో భాగంగా నూతనంగా కల్వర్టు నిర్మిస్తున్నారు. కారు అక్కడికి చేరుకోగానే అదుపుతప్పి కల్వర్టు కిందకు దూసుకెళ్లింది.



ప్రమాదానికి గురైన కారు

ఈ ప్రమాదంలో వాహనంలో ఉన్నవారికి బలమైన గాయాలయ్యాయి. నవవధువు స్వాతి పరిస్థితి విషమంగా ఉంది. శంకరపట్నం మండల ఈఎంటీ శ్రీధర్, పైలట్ హరికృష్ణ సంఘటన స్థలానికి చేరుకొని, క్షతగాత్రులను 108 వాహనంలో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. నిద్రమత్తు వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు చర్చించుకున్నారు.

హెచ్చరిక బోర్డులేవి?

నేషనల్ హైవే పనులు జరుగుతున్నా ఇక్కడ ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. రహదారి వెంట వెళ్తున్న కారు ఉన్నట్టు ఉండి కల్వర్టు కిందకు దూసుకెళ్లిందని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, పనులు జరుగుతున్న ప్రదేశంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అత్తారింటికి వస్తూ.. అనంతలోకాలకు..

- గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి
- గవిచర్ల సమీపంలో ఘటన

సంగెం(వరంగల్): అత్తారింటికి వస్తున్న ఓ యువకుడు గుర్తుతెలియని వాహనం ఢీకొని అనంతలోకాలకు వెళ్లాడు. ఈ విషాద ఘటన సంగెం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం కందుగుల గ్రామానికి చెందిన బదలగాని నవీన్(28)కు వరంగల్ జిల్లా సంగెం మండలం తీగరాజుపల్లి గ్రామానికి చెందిన ప్రియాంకతో నాలుగున్నర ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి మూడేళ్ల కూతురు ఆద్యశ్రీ, మూడు నెలల బాబు ఉన్నారు. కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న నవీన్ అత్తారింటిలో ఉన్న భార్యాపిల్లలను చూడడానికి ఆదివారం రాత్రి స్నేహితుడి ద్విచక్రవాహనంపై తీగరాజుపల్లికి వస్తున్నాడు. మరికాసేపట్లో అత్తవారింటికి చేరుకునే క్రమంలో గవిచర్ల సమీపంలో కట్టుకాలువ వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొని పారిపోయింది. ఈ ఘటనలో నవీన్‌కు తీవ్రగాయాలై పడి ఉండగా తీగరాజుపల్లి గ్రామానికి చెందిన జుర్రు ప్రశాంత్, అల్లితిమ్మాపూర్‌కు



నవీన్ (ఫైల్)

చెందిన కొంగ ప్రవీణ్ చూసి సంగెం జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న మృతుడి భార్య ప్రియాంక, తండ్రి కేర్ల నగేష్‌తో కలిసి వెళ్లి చూడగా కొన ఊపిరితో ఉన్న నవీన్‌ను 108లో ఎంజీఎంకు తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై ప్రియాంక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎల్. నరేష్ పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్య

జగిత్యాల క్రైం: ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు జగిత్యాల పట్టణ ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రూరల్ మండంలోని చల్‌గల్ గ్రామానికి చెందిన కోట శ్రీనయ్య(26) అర్బన్ మండలంలోని అంబారిపేటలో గేదెల కాపరిగా పని చేస్తున్నాడు. రెండు నెలల క్రితం అతనికి రజిత అనే యువతితో వివాహమైంది. కాగా, కొంతకాలంగా శ్రీనయ్యకు మతిస్థిమితం సరిగా ఉండటం లేదు. ఈ క్రమంలో రెండుసార్లు ఆత్మహత్యాయత్నం చేశాడు. సోమవారం సాయంత్రం అంబారిపేటలోనే చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి పోచయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రూ.15 లక్షలు పట్టివేత



నగదు చూపుతున్న పోలీసులు

జమ్మికుంట(హుజూరాబాద్): వాహన తనిఖీల్లో సోమవారం భారీగా నగదు పట్టుకున్నట్లు హుజూరాబాద్ డివిజన్ ఏసీపీ శ్రీనివాస్‌జీ తెలిపారు. టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని గ్రేన్ మార్కెట్ ఏరియా రోడ్డులో టౌన్ సీఐ రవి ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో జమ్మికుంట పట్టణంలోని మోత్కుల గూడెంకు చెందిన పొనగంటి సురేశ్ తన బైక్‌లో రూ.15 లక్షలు తరలిస్తూ పట్టుబడ్డాడు. ఎలాంటి అనుమతి పత్రాలు చూపకపోవడంతో సీజ్ చేసి, జిల్లా ఎన్నికలు, ఐటీ శాఖ అధికారులకు అప్పగించినట్లు ఏసీపీ పేర్కొన్నారు.

ప్లాస్టిక్ వాడుతున్న హోటళ్లకు జరిమానా

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలో ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు నగరపాలక సంస్థ చేపట్టిన చర్యలు కొనసాగుతున్నాయి. హోటళ్లలో ప్లాస్టిక్ ప్లేట్స్, కవర్స్ విరివిగా వాడుతుండటంపై నగరపాలిక కమిషనర్ శ్రీనివాస్ ప్రత్యేక దృష్టి సారించారు. వరుసగా హోటళ్లను తనిఖీ చేస్తూ ప్లాస్టిక్ వినియోగిస్తున్న నిర్వాహకులకు జరిమానా విధిస్తున్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నయంగా స్టీల్, అరిటాకులు వాడుతున్న వారిని అభినందిస్తున్నారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్, అంబేడ్కర్ స్టేడియం, కమాన్ ప్రాంతాల్లోని పలు హోటళ్లను ఆయన తనిఖీ చేశారు. ప్లాస్టిక్ వినియోగిస్తున్న 7 హోటళ్లకు రూ.5,250 జరిమానా విధించారు. శానిటరీ సూపర్‌వైజర్ రాజమనోహర్, పర్యావరణ ఇంజనీర్ స్వామి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, జవాన్‌లున్నారు.

ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలి

వివాహాలు, ఇతరత్రా ఫంక్షన్‌లలో ప్లాస్టిక్‌ను వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నగరంలోని ఫంక్షన్ హాల్స్, బంకెట్‌హాల్స్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఫంక్షన్‌హాళ్లు ప్లాస్టిక్ రహితంగా ఉండాలన్నారు. అలాగే, ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలని, వ్యర్థాలను కంపోస్ట్ చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏసీపీ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



హోటల్ నిర్వాహకులకు జరిమానా విధిస్తున్న కమిషనర్ శ్రీనివాస్

ఆ ఇద్దరి నేత్రాలు సజీవం

కోల్‌సిటీ(రామగుండం): ఆ ఇద్దరు అనారోగ్యంతో మృతిచెందారు. దుఃఖంలోనూ కుటుంబసభ్యులు వారి నేత్రాలను దానం చేసి, ఆదర్శంగా నిలిచారు. వివరాల్లోకి వెళ్తే.. గోదావరిఖనికి చెందిన తాటపల్లి ఆగయ్య(86) అనే సింగరేణి రిటైర్డ్ ఎలక్ట్రీషియన్ ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన బంధువులు కోలేటి భాస్కర్, కైలాసం నేత్రదానంపై కుటుంబసభ్యులకు అవగాహన కల్పించడంతో ఆగయ్య నేత్రాలను దానం చేసేందుకు ఒప్పుకున్నారు. అలాగే, స్థానిక తిలక్‌నగర్‌కు చెందిన రాంబుచ్చమ్మ(89) కూడా ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె నేత్రాలను దానం చేయాలని స్వచ్ఛంద సంఘాల ముఖ్య సలహాదారు దయానంద్‌గాంధీ బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడటంతో ఒప్పుకున్నారు. దీంతో ఇద్దరి నేత్రాలను సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు లింగమూర్తి, రఘుపతిగౌడ్, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో టెక్నీషియన్ ఆరిఫ్ సహకారంతో సేకరించి, హైదరాబాద్‌లోని ఐ బ్యాంక్‌కు తరలించారు. నలుగురికి చూపును వచ్చేలా మృతుల నేత్రాలను దానం చేయడానికి ముందుకు వచ్చిన రెండు కుటుంబాలను ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్ అభినందించారు.



ఆగయ్య (ఫైల్)



రాంబుచ్చమ్మ (ఫైల్)

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం



మంటల్లో కాలిపోయిన ఇల్లు

ధర్మారం(ధర్మపురి): నందిమేడారం గ్రామంలో సోమవారం ప్రమాదవశాత్తు జరిగిన షార్ట్‌సర్క్యూట్‌తో మ్యాడారం సత్తయ్యకు చెందిన ఇల్లు దగ్ధమైంది. సత్తయ్య తన కుటుంబంతో కలిసి కొంతకాలంగా కొత్త ఇంట్లో నివాసం ఉంటున్నాడు. పాత ఇంట్లో మూడు బెడ్లు, ఫర్నీచర్ ఉంది. ప్రమాదవశాత్తు విద్యుదాఘతం జరిగి ఇల్లు కాలిబూడిదైంది. సుమారు రూ.10లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి శంకర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

వర్షపు నీరు పడి, నిలిచిన విద్యుత్ సరఫరా

- తీగలగుట్టపల్లి చంద్రపురి కాలనీలో తప్పిన ప్రమాదం
- 132 కేవీ విద్యుత్ లైన్‌లో భవనంపై రేకు తొలగింపు

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్ శివారు తీగలగుట్టపల్లిలోని చంద్రపురి కాలనీలో విద్యుత్ ప్రమాదం తప్పింది. 132 కేవీ విద్యుత్ కేంద్రం నుంచి కరీంనగర్‌కు సరఫరా జరిగే 132 కేవీ విద్యుత్ లైన్ సోమవారం ఉదయం కురిసిన వర్షానికి బ్రేక్‌డౌన్ కావడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో అప్రమత్తమైన విద్యుత్‌శాఖ సిబ్బంది సమస్య ఎక్కడుందో తెలుసుకునేందుకు సాయంత్రం వరకు విద్యుత్ లైన్‌ను పరిశీలించారు. అయితే, వర్షపు నీరు తీగలగుట్టపల్లిలోని ఓ భవనంపై గల రేకుల నుంచి విద్యుత్ లైన్‌పై పడటంతో బ్రేక్‌డౌన్ అయినట్లు గుర్తించారు. వెంటనే రేకును తొలగించి, ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకున్నారు. గతంలోనూ ఈ భవనం గోడను విద్యుత్ లైన్ తగులుతుండటంతో తొలగించారు. కాగా, ఎండతీవ్రతకు విద్యుత్ వైర్లు సాగుతుండటం వల్లే ఇలా జరిగిందని అధికారులు తెలిపారు. విద్యుత్ లైన్ల కింద ఉన్న ఇళ్ల యజమానులు అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ రూరల్ ఏడీఈ రాజు సూచించారు.



రేకు తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

యువతి అదృశ్యం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లికి చెందిన యువతి బండారి సుజాత(27) ఆదివారం తెల్లవారుజామున అదృశ్యమైంది. సుజాత తండ్రి బాబు ఫిర్యాదుతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. సుజాత కుటుంబ సభ్యులతో కలిసి రాత్రి ఇంట్లోనే నిద్రపోయింది. ఆదివారం ఉదయం లేచి చూసేసరికి కనిపించలేదు. కూతురు కోసం చుట్టు పక్కల ఇళ్ల, బంధువుల ఇళ్లలో గాలించినా ఆచూకీ లభించలేదు. తండ్రి బాబు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉపాధి శిక్షణ నిధులు స్వాహా

- పీఎంకేకే స్కీంకు సంబంధించి రూ.39 లక్షలు కాజేసిన వైనం
- ప్రైవేటు సంస్థ నిర్వాహకుల అరెస్టు

గోదావరిఖని(రామగుండం): ఉపాధి శిక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదలయ్యే నిధులు రూ.39 లక్షలను నకిలీ వేలిముద్రల సాయంతో స్వాహా చేశారు.. మంచిర్యాల జిల్లా కేంద్రంగా ఏర్పాటైన అల్టిమేట్ ఎనర్జీ రిసోర్స్ అనే ప్రైవేట్ సంస్థ నిర్వాకమిది. కూపీ లాగిన పోలీసులు.. నిర్వాహకులను అరెస్ట్ చేశారు. పెద్దపల్లి జిల్లా రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిరుద్యోగ యువతకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కౌశల్య కేంద్ర్ (పీఎంకేకే) పథకం ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇప్పిస్తోంది. భోపాల్ కేంద్రంగా నిర్వహిస్తున్న అల్టిమేట్ ఎనర్జీ రిసోర్స్ సంస్థకు దేశంలోని నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చే కాంట్రాక్టు బాధ్యతలు అప్పగించింది. ఈ క్రమంలో ఆ సంస్థ హైదరాబాద్‌లో కార్యాలయం ఏర్పాటు చేసి, మంచిర్యాల, హుజూర్‌నగర్, జనగామల్లో శిక్షణ కేంద్రాలు కొనసాగిస్తోంది. మంచిర్యాల సెంటర్ నిర్వాహకుడు, నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన మల్లికార్జున్ 2020 నుంచి ఏడాదికి 320 మంది చొప్పున ప్రతీ సెంటర్‌లో నిరుద్యోగులకు శిక్షణ ఇస్తున్నారు. ఇందుకోసం ఒక్కో అభ్యర్థికి కేంద్ర ప్రభుత్వం రూ.13 వేలు మంజూరు చేస్తోంది. ఈ ఏడాది నుంచి ఏటా 720 మందికి శిక్షణ ఇచ్చేందుకు అనుమతి ఇచ్చింది. అభ్యర్థుల హాజరు ఆధారంగా నిధులు విడుదల చేస్తోంది.

300 మందికి 50 మందే హాజరు..

మంచిర్యాల సెంటర్‌లో ఈ ఏడాది 300 మంది అభ్యర్థులు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. కానీ, 50 మందే హాజరవుతున్నారు. రాబడి తగ్గడంతో సంస్థ ప్రధాన కేంద్రం నిర్వాహకులు సాహిల్



నకిలీ వేలిముద్ర చూపిస్తున్న సీపీ శ్రీనివాస్

వలీ, హైదరాబాద్ ఆఫీస్ ఇన్‌చార్జి ఆవునూరి శ్రీనివాస్ సూచన మేరకు మంచిర్యాల సెంటర్ ఇన్‌చార్జి మల్లికార్జున్ హాజరు శాతం పెంచేందుకు తప్పుడు మార్గాన్ని ఎంచుకున్నాడు. నర్సంపేటకు చెందిన విజయ్ సూచనతో అదే ప్రాంతానికి చెందిన సలీంజాఫర్, వెంకటేశ్వర్లు సాయంతో 250 మంది అభ్యర్థుల ఫేక్ ఫింగర్ ప్రింట్స్ రూపొందించాడు. గైర్హాజరైన అభ్యర్థుల అటెండెన్స్‌ను బయోమెట్రిక్ మెషిన్‌లో నమోదు చేసి, కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఇలా ఇప్పటివరకు రూ.39 లక్షలు కాజేసినట్లు సీపీ వెల్లడించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రంగంలోకి దిగిన టాస్క్‌ఫోర్స్

దీనిపై సమాచారం అందడంతో రామగుండం సీపీ శ్రీనివాస్ టాస్క్‌ఫోర్స్ పోలీసులను రంగంలోకి దింపారు. ఆఫీస్ ఇన్‌చార్జి దేవేందర్‌ను విచారించగా స్కాం వివరాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో మల్లికార్జున్, నర్సంపేటకు చెందిన షేక్ సలీం జాఫర్, పి.వెంకటేశ్వర్లు, మంచిర్యాలకు చెందిన దేవేందర్‌లను అరెస్టు చేశారు. ఫేక్ ఫింగర్ ప్రింట్స్, తయారీకి వినియోగించిన మెటీరియల్, అభ్యర్థుల అటెండెన్స్ రిజిస్టర్, ల్యాప్‌టాప్, బయోమెట్రిక్ మెషిన్ స్వాధీనం చేసుకున్నారు. స్కాంలో సూత్రధారులైన భోపాల్‌కు చెందిన సాహిల్‌వలీ, హైదరాబాద్‌కు చెందిన ఆవునూరి శ్రీనివాస్‌లను అరెస్టు చేయాల్సి ఉంది. రాష్ట్రంలో ఉన్న మరో రెండు, దేశంలో ఉన్న మిగతా కేంద్రాలపై కూడా పోలీస్‌శాఖ దృష్టి సారించింది.

తల్లిదండ్రులతో గొడవపడి, పారిపోయి..

- రామగుండం చేరిన ఉత్తరప్రదేశ్ బాలిక
- గుర్తించి, కుటుంబసభ్యులకు అప్పగించిన ఆర్పీఎఫ్ సిబ్బంది

రామగుండం: ఇంట్లో గొడవపడిన ఓ బాలిక పారిపోయింది. రామగుండం రైల్వే ప్లాట్‌ఫాంపై అనుమానాస్పదంగా తిరుగుతుండగా రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్పీఎఫ్) సిబ్బంది గుర్తించినట్లు సీఐ సురేశ్‌గౌడ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌కు చెందిన పన్నెండేళ్ల విజయలక్ష్మి తండ్రి కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని ఓ వెల్డింగ్ షాపులో పని చేస్తున్నాడు. కుటుంబసభ్యులతో కలిసి స్థానికంగానే ఉంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం కుటుంబసభ్యులతో గొడవపడిన బాలిక ఇంటి నుంచి పారిపోయి,



ఆర్పీఎఫ్ పోలీసుల అదుపులో బాలిక

రామగుండం చేరుకుంది. స్థానిక రైల్వే ప్లాట్‌ఫాంపై తిరుగుతుండగా ఆర్పీఎఫ్ సిబ్బంది అనుమానించారు. ఆమెతో మాట్లాడగా కుటుంబసభ్యులకు తెలియకుండా పారిపోయి వచ్చినట్లు తెలిపింది. దీంతో వారు చైల్డ్‌లైన్ కో–ఆర్డినేటర్ సతీశ్‌ను పిలిపించారు. తర్వాత బాలిక కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చి, వారు రాగానే అప్పగించారు. కాగా, బాలికను గుర్తించిన ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ లోకేంద్రకాన్‌ను సీఐ అభినందించారు.

పోలీసుల అదుపులో ధాన్యం దొంగ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలకేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు నిల్వచేసిన ధాన్యాన్ని అపహరించిన సంఘటనలో సోమవారం ఓ దొంగను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొనుగోలు కేంద్రంలో రైతులు నిల్వచేసిన ధాన్యం రాశుల్లో నుంచి దాదాపు ఐదు కింటాళ్ల ధాన్యం దొంగతనం చేసి దన కుప్పలో కలుపుకున్నట్లు గుర్తించిన రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సదరు దొంగను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. కాగా ఇదే వ్యక్తి గతంలో ద్విచక్రవాహనాలు, జేసీబీల బ్యాటరీలను అపహరించిన సంఘటనలో పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

మావోయిస్టులు పోలీసుల గౌరవవందనం స్వీకరించాలి

గోదావరిఖని(రామగుండం): మావోయిస్టులు చట్టసభలకు ఎన్నికై పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరించాలని రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ కోరారు. సోమవారం రామగుండం పోలీసు కమిషనర్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మంచిర్యాల డీసీపీ అశోక్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావుతో కలిసి మావోయిస్టుల ఫొటోలతో ముద్రించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అజ్ఞాతంలోని మావోయిస్టులు పోరాటం చేయాల్సింది అడవిలో కాదని, జనజీవనంలోకి వచ్చి ప్రజాసమస్యలపై చట్టబద్ధంగా పోరాడాలన్నారు. ప్రజలు మావోయిస్టులకు సహకరించవద్దని కోరారు. పోస్టర్లపై ముద్రించిన ఫొటోల్లో ఉన్నవారు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. సమాచారం అందించిన వారికి నగదు బహుమతి అందజేస్తామని చెప్పారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని వివరించారు. మావోయిస్టుల గురించి తెలిస్తే.. సీపీ, రామగుండం– 08728 271333, డీసీపీ, పెద్దపల్లి 87126 56502, డీసీపీ, మంచిర్యాల 87126 56503, ఎస్బీ 87126 56596 ఫోన్‌నంబర్లకు కాల్‌చేసి సమాచారం ఇవ్వాలని సీపీ కోరారు.



వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న సీపీ శ్రీనివాస్

క్లుప్తంగా

కాంగ్రెస్ ఎలక్షన్ వార్‌రూమ్ ప్రారంభం



మాట్లాడుతున్న పీసీసీ వార్‌రూమ్ ఇన్‌చార్జి పవన్

కరీంనగర్ కార్పొరేషన్: లోకసభ ఎన్నికల నేపథ్యంలో నగరంలోని డీసీసీ కార్యాలయంలో ప్రత్యేకంగా వార్‌రూమ్‌ను ఏర్పాటు చేశారు. సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి పీసీసీ వార్‌రూమ్ ఇన్‌చార్జి పవన్ మల్లాడి వార్‌రూమ్‌ను ప్రారంభించారు. వార్‌రూమ్ ద్వారా కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన ఎన్నికల వ్యవహారాలు, ఫిర్యాదులు, సూచనలు, సలహాలు, అభిప్రాయాలు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. బూత్ స్థాయిలో కమిటీ సభ్యులు నిర్వహించాల్సిన ప్రచార సరళిపై ప్రచార సామగ్రి, ఏఐసీసీ ద్వారా వచ్చిన 3లక్షల న్యాయ్ గ్యారంటీ కార్డులు అందజేయబడుతుందన్నారు. అనంతరం హుస్నాబాద్, మానకొండూర్, కరీంనగర్ మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, బ్లాక్ అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులతో వార్‌రూమ్‌లో సమావేశం ఏర్పాటుచేసి ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై నాయకులకు దిశా నిర్దేశం చేశారు.

సన్మానం


మాధవిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో శ్రీభూనీల చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో జరిగిన పూజలో పాల్గొన్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్ సతీమణి మాధవిని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. అనంతరం మాధవి మాట్లాడుతూ ఎంపీగా వినోద్‌కుమార్ చేసిన అభివృద్ధి పనులను చూసి మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కరీంనగర్ మండల అధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, ఎంపీటీసీ బుర్ర తిరుపతిగౌడ్, మాజీ సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి, నాయకులు కూర శ్యాంసుందర్‌రెడ్డి, చింతల లక్ష్మణ్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షల ఫలితాలు విడుదల

కరీంనగర్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు టైలరింగ్, డ్రాయింగ్‌కు సంబంధించి ఫిబ్రవరిలో జరిగిన పరీక్షల ఫలితాలు సోమవారం వెలువడ్డాయని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. టెక్నికల్ టీచర్స్ కోర్సు 42 రోజుల శిక్షణకు సోమవారం హైదరాబాద్ ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. కరీంనగర్ జిల్లాకు సంబంధించి 42 రోజుల శిక్షణ కార్యక్రమం ధన్గర్‌వాడీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉంటుందని , ఈ శిక్షణకు హాజరయ్యేవారు మంగళవారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. దరఖాస్తు వెంట పదో తరగతి మెమో, టీసీసీ లోయర్ గ్రేడ్ మెమో, ఒక ఫొటో జత చేయాలని పేర్కొన్నారు.

టేబుల్ టెన్నిస్ క్రీడా సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

కరీంనగర్‌స్పోర్ట్స్: టేబుల్ టెన్నిస్ క్రీడా సంఘం జిల్లా కార్యవర్గాన్ని సోమవారం కరీంనగర్‌లోని జీఎస్ అకాడమీలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శరత్‌కుమార్, ఉపాధ్యక్షులుగా శ్రీధర్‌గౌడ్, బి.మహేశ్, ఎన్.మహిపాల్, ప్రధాన కార్యదర్శిగా సురేందర్‌సింగ్, సహాయ కార్యదర్శి ఎం.వికాస్ కుమార్, కోశాధికారిగా గౌతమ్‌రెడ్డి, కార్యనిర్వాహక కమిటీ సభ్యులుగా రజినీకాంత్‌రెడ్డి, సంతోష్, శ్రీహర్ష, శ్రీకరచారిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శరత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో టేబుల్ టెన్నిస్ క్రీడాభివృద్ధికి తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి, డీవైఎస్ఓ శ్రీకాంత్‌రెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ బాధ్యులు నందెల్లి మహిపాల్, జనార్దన్‌రెడ్డిలు అభినందించారు.

అదృశ్యం కేసు నమోదు

జమ్మికుంట: పట్టణానికి చెందిన ఓ యువతి అదృశ్యం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ రవి సోమవారం తెలిపారు. మున్సిపల్ పరిధిలోని హనుమడ్లపల్లి గ్రామానికి చెందిన ఓ యువతి మార్చి 6వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఆచూకీ కోసం బంధువుల ఇళ్లలో వెతికినప్పటికీ ఫలితం లేకపోవడంతో తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు.

బాలభవన్ పిలుస్తోంది

- 25 నుంచి వేసవి శిక్షణ తరగతులు
- మృదంగం, చిత్రలేఖనం, ఆర్ట్ క్రాఫ్ట్, నృత్యం, గాత్రంలో తర్ఫీదు


కరీంనగర్‌లోని బాలభవన్


నృత్యంలో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

కరీంనగర్‌కల్చరల్: మన సంస్కృతి, సంప్రదాయాలు అంటేనే కళారూపాలు. శాస్త్రీయ నృత్యాలు, సంగీతం, వాయిద్యం ఇలా ఎన్నో కళలు మన సంస్కృతి మూలాలు. చిన్నతనం నుంచి మన సంస్కృతిని తెలుసుకోవడంతో పాటు మన కళను సాకారం చేసుకునే సువర్ణ అవకాశాన్ని చిన్నారులకు నగరంలోని బాలభవన్ ఉచితంగా అందిస్తోంది. ఈనెల 24తో పాఠశాలలకు వేసవి సెలవులొస్తున్నాయి. పిల్లల్లోని సృజనాత్మకతకు పదును పెట్టడానికి పాటలు, నృత్యం, గ్రాతం, చిత్రలేఖనం వంటి వివిధ అంశాల్లో శిక్షణతో పాటు పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభకు వెలికితీయడానికి బాలభవన్ సిద్ధమవుతోంది. ఈనెల 25 నుంచి కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో గల బాలభవన్‌లో శిక్షణ తరగతులు ప్రారంభకానున్నాయి.

కలెక్టర్, విద్యాశాఖ సహకారంతో..

కలెక్టర్, విద్యా శాఖ సహకారంతో బాలభవన్ ఆధ్వర్యంలో ప్రత్యేకమైన ఆయా రంగాల్లో నిపుణులతో 5–16 ఏళ్ల లోపు విద్యార్థులకు వివిధ కళల్లో శిక్షణ ఇస్తున్నారు. ఈనెల 25 నుంచి జూన్ 8వ వరకు ప్రతీరోజు ఉదయం 8 గంటల నుంచి ఒంటి గంట వరకు వివిధ విభాగాల్లో శిక్షణ జరుగనుంది. విద్యార్థులు ఆధార్, పాస్‌పోర్ట్ సైజు ఫొటో సమర్పించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

వివిధ కళల్లో శిక్షణ

ఎస్.కృష్ణకుమార్ పర్యవేక్షణలో చిత్రలేఖనం, కె.మంజులాదేవి శిక్షణలో గాత్ర సంగీతం, మాస్టర్ శ్రీధర్ నేతృత్వంలో మృదంగం, డాన్స్ మాస్టర్ సంగెం రాధకృష్ణ నృత్యంలో, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ విభాగంలో సూర్యశ్రీ శిక్షణ ఇస్తుంది. వీటితో పాటు కర్ణాటక గాత్రం, లలిత సంగీతం , దేశభక్తి గేయాలు, వాయిద్యాల పరికరాలు, మృదంగం, తబల, కంజీరాలో శిక్షణ, జానపద నృత్యం, క్లాసికల్ (సెమి), వెస్టరన్, చిత్రలేఖనంలో పెన్సిల్ పెయింటింగ్, హ్యాండ్ రైటింగ్, వాటర్ పెయింటింగ్, టైలరింగ్ ఎంబ్రాయిడరీ, బ్యూటీషియన్, మగ్గం, గ్లాస్ పెయింటింగ్, పాట్ పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, వ్యర్థ పదార్థాలతో (క్రాఫ్ట్) మెహందీ తదితర విభాగాల్లో నిపుణులతో తర్ఫీదు ఇవ్వనున్నారు.

సద్వినియోగం చేసుకోండి

పిల్లలు మానసిక వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేసే కళలను బాలభవన్‌లో నేర్చుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన ఉంది. ప్రభుత్వ సహకారంతో నిర్వహిస్తున్న ఈ ఉచిత శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని తమలోని నైపుణ్యాలు పెంచుకోవాలి. 45 రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రదానం చేస్తాం.
– కట్టా మంజులాదేవి, బాలభవన్ పర్యవేక్షురాలు


సప్తగిరికాలనీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

భవితపైనే ధ్యాస

- ముగిసిన ఎస్ఏ–2 పరీక్షలు
- సెలవుల్లో సమయం వృథా చేయమంటున్న 9వ తరగతి విద్యార్థులు
- 'పది'లో 10 జీపీఏ పైనే దృష్టి అంటున్న చిన్నారులతో 'సాక్షి' చిట్‌చాట్


సుభాష్‌నగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): పాఠశాలల స్థాయి పరీక్షలు ముగిశాయి. వేసవి సెలవులు వస్తున్నాయంటే చిన్నారుల ఆనందానికి హద్దులుండవు. ఎంతో సంతోషంతో గంతులేస్తారు. కానీ.. ఏడాది పాటు పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు ఇక వేసవి సెలవులను భవిష్యత్‌లో తమకు ఉపయోగపడే విధంగా వినియోగించుకోవాలని భావిస్తున్నారు ప్రస్తుత తొమ్మిదవ తరగతి విద్యార్థులు. సోమవారంతో పరీక్షలు ముగియగా.. కరీంనగర్‌లోని సప్తగిరికాలనీ, సుభాష్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని 9వ తరగతి విద్యార్థులను 'సాక్షి' పలకరించింది. వచ్చే సంవత్సరం పదో తరగతిలో పదికి పది జీపీఏ గ్రేడ్ సాధించేందుకు సాధన చేస్తామని కొందరు.. పదో తరగతిలో ఆటల క్లాస్‌లు ఉండవు ఈ సమ్మర్ హాలీడేస్‌లోనే ఆడేస్తామని మరికొందరు.. టైం వేస్ట్ చేయమంటూ.. ఇలా ఎవరికి తోచిన ఆలోచనలు వారు 'సాక్షి'తో వెల్లడించారు.

వేసవిలో అందుబాటులో కోర్సులు

విద్యార్థులకు సమ్మర్ హాలీడేస్‌లో కంప్యూటర్ కోర్సులు, స్పోకెన్ ఇంగ్లిష్, సబ్జెక్టుల ట్యూషన్స్, డ్రాయింగ్, ఆర్ట్ క్లాస్‌లు, సమ్మర్ స్పోర్ట్స్ క్యాంపులు, మ్యూజిక్, డ్యాన్స్ క్లాస్‌లతో పాటు ఎన్నో రకాల వాటిని నేర్చుకునేందుకు అందుబాటులో ఉన్నాయి. పదో తరగతి విద్యార్థులకు సబ్జెక్టుకు సంబంధించిన ట్యూషన్‌లను కూడా వాడుకోవచ్చునని అంటున్నారు పలువురు విశ్లేషకులు.

10జీపీఏ కోసం సాధన చేస్తా..


పదో తరగతిలో 10 జీపీఏ కోసం ఇప్పటి నుంచే సాధన ప్రారంభిస్తా. హాలీడేస్‌ను వృథా చేయను. అన్ని సబ్జెక్టులను ఒకసారి చూసుకుంటా. గ్రామర్‌పై దృష్టి పెడుతా. మ్యాథ్స్, సైన్స్‌కు ఎక్కువ సమయం కేటాయిస్తా.
– సభా

రైటింగ్‌పై దృష్టి పెడతా..


తొమ్మిదవ తరగతి పరీక్షలు ముగిశాయి. వచ్చే ఏడాది పదోతరగతిలో ఎక్కువ మార్కులు సాధించాలంటే హ్యాండ్ రైటింగ్ బాగుండాలి. డబుల్‌రూల్, ఫోర్‌రూల్ బుక్స్ తీసుకొని తెలుగు, హిందీ, ఇంగ్లిష్ రైటింగ్ ప్రాక్టీస్ చేస్తా.
– ఎం. అభినయ

ట్యూషన్‌కు వెళ్తా..


సమ్మర్ హాలీడేస్ వేస్ట్ చేయను. ఎంజాయ్‌తో పాటు ట్యూషన్ క్లాస్‌లకు ప్లాన్ చేసుకుంటా. వచ్చే ఏడాదిలో పదో తరగతిలో మంచి జీపీఏ సాధించేందుకు కృషి చేస్తా. వీక్ ఉన్న సబ్జెక్ట్‌లపై దృష్టి పెడుతా.
– ఎం. రాంచరణ్

సమ్మర్ క్యాంప్‌లకు వెళ్తా..


వేసవి సెలవులంటేనే సమ్మర్ స్పోర్ట్స్ క్యాంప్‌లు. ఏటా అంబేడ్కర్ స్టేడియంలో పలు క్రీడల్లో కోచింగ్ క్యాంపులు నిర్వహిస్తారు. ఏదైనా ఒక క్రీడలో కోచింగ్ తీసుకుంటా. రోజూ సమ్మర్ క్యాంప్ ముగిసిన వెంటనే స్టడీస్‌పై దృష్టి పెడుతా.
– కె.శివచరణ్

'పది'లో మంచి జీపీఏ సాధిస్తా


వేసవి కాలం సెలవులంటేనే సంతోషంగా గడుపుతాం. కానీ ఈ సమ్మర్ హాలీడేస్ మొత్తం స్టడీస్‌కే కేటాయిస్తా. పదో తరగతిలో మంచి జీపీఏ సాధించడానికి కష్ట పడుతా. వీక్ ఉన్న సబ్జెక్ట్‌పై శ్రద్ధగా చదువుకుంటా. 10 జీపీఏ లక్ష్యంతో సాధన చేస్తా.
– జి.శ్రీధర్

పల్లకిలో చెన్నకేశవస్వామి ఊరేగింపు


పల్లకిలో చెన్నకేశవస్వామిని తీసుకొస్తున్న భక్తులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో శ్రీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం చెన్నకేశవస్వామికి పల్లకిసేవ నిర్వహించారు. ఈనెల 19న శ్రీభూనీల చెన్నకేశవ స్వామిల కల్యాణం నిర్వహించగా స్వామి వారు అలకబూని లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి వెళ్లారు. సోమవారం గ్రామస్తులు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలతో ఊరేగింపుగా లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి తరలివెళ్లారు. అనంతరం పల్లకీలో చెన్నకేశవస్వామిని భక్తుల మేళతాళాలు, డప్పు చప్పుళ్ల నడుమ ఊరేగింపుగా చెన్నకేశవ ఆలయానికి తీసుకొచ్చారు. వేదపండితులు సుధాకర్‌శర్మ, కమలాకర్, శ్రీనివాస్‌శర్మల ఆధ్వర్యంలో రాత్రి ఆలయంలో నిత్యహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బుర్ర తిరుపతిగౌడ్, కరీంనగర్ సింగిల్‌విండో చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు కూర నరేశ్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, అనంతరెడ్డి, చింతల లక్ష్మణ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ సమావేశం వాయిదా



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మయ్య

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. సోమవారం ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య అధ్యక్షతన సమావేశం ప్రారంభించారు. లోకసభ ఎన్నికల కోడ్ అమలుతో పాటు ఎంపీటీసీ సభ్యుల కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ ప్రకటించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ వేల్పుల నారాయణ, ఎంపీడీవో ఎ.సంజీవరావు, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, మిషన్ భగీరథ డీఈ ప్రభాకర్, ఏడీఈ సూర్యప్రకాశ్, పీఆర్ ఏఈ రమణారెడ్డి, ఏవో సత్యం , బొమ్మకల్ పశువైద్యాధికారి రామకృష్ణ, ట్రాన్స్‌కో ఏఈలు తిరుపతి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి మండల పరిషత్ సమావేశం..

కొత్తపల్లి: కొత్తపల్లి మండల ప్రజా పరిషత్ సమావేశం కోరం లేక వాయిదా పడింది. కరీంనగర్‌లోని కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ పిల్లి శ్రీలతమహేష్ అధ్యక్షతన ప్రారంభమైన సమావేశానికి సభ్యులు గైర్హాజరు కావడంతో వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో ప్రభు ప్రకటించారు. జెడ్పీ కో ఆప్షన్ సాబీర్ పాషా, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ధరిత్రి దినోత్సవం



మాట్లాడుతున్న లక్ష్మణ్‌రావు


సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో..

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని లయోలా కళాశాల ప్రాంగణంలో సోమవారం సర్వోదయ సేవా సమితి ఆధ్వర్యంలో ధరిత్రి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణవేత్త తోట లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ కాలుష్యం నుంచి భూమాతను రక్షించుకుందామని అన్నారు. మానవాళికి ముప్పువాటిల్లే ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తి నిషేధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి సామ నారాయణ, కోశాధికారి కొమురవెల్లి వెంకటేశం, ఉపాధ్యక్షులు కట్కూరి సుధాకర్, జిందం మధూకర్, గంగిశెట్టి సత్యనారాయణ, ఆంథోని తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో..

కరీంనగర్‌రూరల్: నగునూరులోని సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో సోమవారం సైన్స్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ ధరిత్రి దినోత్సవంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనిషిపై ఉందని ప్రిన్సిపాల్ జి. సమత అన్నారు. ఈ సంవత్సరం ధరిత్రి దినోత్సవం ప్రధాన ఉద్దేశం ప్లానెట్ వర్సెస్ ప్లాస్టిక్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుష్మ, అధ్యాపకులు గీతారాణి, రోహిణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య రక్షణ కోసం కాంగ్రెస్‌నే గెలిపించాలి


మాట్లాడుతున్న కొరివి వేణుగోపాల్

కరీంనగర్: భారతదేశంలో ప్రజాస్వామ్య రక్షణ కోసం కాంగ్రెస్ పార్టీనే ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. సోమవారం ప్రజామిత్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ దేశానికి, రాష్ట్రానికి అవసరం కనుక ప్రజామిత్ర గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేసిందన్నారు. ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు ప్రజామిత్రతో పాటు అన్ని ప్రజాసంఘాలు, కుల సంఘాలు కలిసి పనిచేయాలని కోరారు. దేశ అభివృద్ధి, ప్రజల క్షేమాన్ని ఆకాంక్షించే కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సమావేశంలో ప్రజామిత్ర నాయకులు సిగిరి శ్రీధర్, తరాల్ల నర్సయ్యలు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల కార్యాచరణ ప్రకటిస్తాం



మాట్లాడుతున్న బొల్లం లింగమూర్తి

కరీంనగర్: పార్లమెంట్ ఎన్నికల్లో ఏ పార్టీకి మద్దతు ఇవ్వాలనేది ఈనెల 25న బీసీ సంక్షేమ సంఘం కార్యాచరణ ప్రకటిస్తుందని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లం లింగమూర్తి అన్నారు. సోమవారం సంఘ కార్యాలయంలో బీసీ సంక్షేమ సంఘం కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి కాల్వ మధుబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. బీసీల జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలని కొన్నేళ్లుగా అనేక ఉద్యమాలు చేపట్టామన్నారు. కొన్ని శతాబ్దాల నుంచి బీసీలకు విద్యా, ఉద్యోగ రంగాల్లో అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీసీల సత్తా చూపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు అజయ్, వేణుగోపాల్, ఆంజనేయులు, కోటేశ్వర్, శ్రీనివాస్, రమేశ్, ఓదెలు, మహేశ్, రాజు, అనిల్, తిరుపతిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి

హుజూరాబాద్: ముదిరాజ్‌లను బీసీ–ఏలో చేర్చాలని ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సమ్మయ్య ముదిరాజ్ సోమవారం ప్రకటనలో కోరారు.

'సుడా' వెలుగులు నిరంతరం


రాజీవ్ రహదారిలో పగలు వెలుగుతున్న సెంట్రల్ లైట్లు, వెలుగుతున్న లైటు(ఇన్‌సెట్)

- నిర్వహణలోపంతో విద్యుత్ వృథా

కరీంనగర్‌రూరల్: కరీంనగర్‌కు నాలుగు వైపులా సుడా నిధులతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైట్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. లైట్లు ఎప్పుడు వెలుగుతాయో.. ఎప్పుడు ఆరిపోతున్నాయో తెలియ ని పరిస్థితి నెలకొంది. కొన్ని ప్రాంతాల్లో ఆన్ ఆఫ్ విధానం లేకపోవడంతో నిరంతరం లైట్లు వెలుగుతుండటంతో విద్యుత్ వృథా అవుతోంది. ఏడాది క్రితం ఎన్టీఆర్ విగ్రహం నుంచి బొమ్మకల్ ఫ్లైఓవర్ మీదుగా రాజీవ్ రహదారిలో గుంటూరుపల్లి స్టేజీ వరకు సెంట్రల్ లైట్లు ఏర్పాటు చేశారు. అయి తే సెంట్రల్ లైట్ల నిర్వహణను సుడా పట్టించుకోవ డం లేదనే ఆరోపణలున్నాయి. ప్రధానంగా బొమ్మకల్ స్టేజీ నుంచి చల్మెడ ఆనందరావు ఆస్పత్రి వరకు ఉన్న లైట్లు కొన్ని రోజుల నుంచి నిరంతరం వెలుగుతున్నాయి. మిగితా చోట్ల మాత్రం రాత్రివేళల్లో మాత్రమే లైట్లు వెలుగుతున్నాయి. గత నెలలో గుంటూరుపల్లి స్టేజీపై ప్రైవేట్ బస్సు బోల్తాపడిన సంఘటనలో మూడు సెంట్రల్‌లైటింగ్ స్తంభాలు విరిగిపోయాయి. ఇప్పటివరకు వాటి స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా సుడా అధికారులు స్పందించి సెంట్రల్ లైట్ల నిర్వహణను సక్రమంగా చేపట్టి విద్యుత్ వృథాను అరికట్టేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆరని మంట.. తగ్గని పొగ



నగర శివారులోని డంప్‌యార్డులో మంటలు ఆరడం లేదు. ఫలితంగా కమ్ముకుంటున్న పొగ తగ్గడం లేదు. ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. సోమవారం సైతం ఎన్టీఆర్ విగ్రహం వద్ద బైపాస్‌ప్రాంతం పొగమయమైంది. స్థానికులు, దుకాణదారులు ఇబ్బందులు పడ్డారు. పొగ ఎక్కువ కావడంతో పలువురు యాజమానులు షాపులు బంద్‌చేసి వెళ్లిపోయారు. స్థానికులు అనారోగ్యానికి గురికాకముందే మున్సిపల్ సిబ్బందితో చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

'కాకతీయ స్మార్ట్ కిడ్స్'లో గ్రాడ్యుయేషన్ డే


సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

కరీంనగర్: నగరంలోని కాకతీయ స్మార్ట్ కిడ్స్ పాఠశాలలో కిండర్ గార్డెన్ స్టూడెంట్స్‌కు సోమవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ దంపతులు గున్నాల క్రాంతికుమార్–అర్చన వేడుకలను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ చదివి పై తరగతులకు వెళ్తున్న విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ క్రాంతికుమార్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ నల్ల దశరథం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

Affidavit

కొండంత ఆస్తులు

- చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డి కుటుంబ ఆస్తులు రూ.4,490 కోట్లు
- దంపతుల చేతిలో ఉన్న నగదు రూ. 9 లక్షలే.. వేల కోట్లున్నా.. సొంత వాహనం లేదు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కుటుంబ ఆస్తులు రూ.4,490 కోట్లకుపైగా ఉన్నట్టు ఆయన తన ఎన్నికల అఫిడవిట్‌లో చూపించారు. వేల కోట్ల ఆస్తులు ఉన్నా, దంపతుల పేర, కొడుకు పేరు మీద కూడా సొంతంగా ఒక్క వాహనం కూడా లేకపోవడం గమనార్హం. విశ్వేశ్వర్‌రెడ్డి పేరున రూ.1178 కోట్లకు పైగా, ఆయన భార్య సంగీతా రెడ్డి పేరున రూ. 3203 కోట్లకు పైగా, ఆయన కుమారుడు వీరజ్ మాధవ్‌రెడ్డి పేరున రూ.107 కోట్ల ఆస్తులు ఉన్నట్టు పేర్కొన్నారు. ఇక కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చేతిలో రూ.మూడు లక్షలు, ఆయన భార్య చేతిలో మరో ఆరు లక్షల నగదు మాత్రమే ఉన్నట్టు చూపించారు. ఆయన పేరున వివిధ బ్యాంకుల్లో అప్పు రూ.1.76 కోట్లు ఉండగా, ఆయన భార్య పేరున రూ.12.06 కోట్ల అప్పు ఉన్నట్టు చూపించారు. కొండా పేరున చేవెళ్లలో 3ఎకరాలు, ధర్మసాగర్‌లో 43.26 ఎకరాలు, కమ్మెటలో 2 ఎకరాలు, కుమ్మెరలో 21.13 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్టు చూపించారు. ఆయన భార్య సంగీతారెడ్డి పేరున రాజేంద్రనగర్ మండలం నార్సింగిలో ఎకరం, ఏపీలోని చిత్తూరు జిల్లా ఇర్యాల్ గ్రామంలో 14.13 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్టు ప్రకటించారు. చేవెళ్ల మండలం గండంగూడలో ఐదు ఓపెన్ ప్లాట్లు, బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12 సహా ఉస్మాన్‌గంజ్, జూబ్లీహిల్స్‌లో కమర్షియల్ బిల్డింగ్స్, బంజారాహిల్స్ సహా పుప్పాల్‌గూడలో రెసిడెన్షియల్ బిల్డింగ్స్ ఉన్నట్టు ప్రకటించారు. విశ్వేశ్వర్‌రెడ్డి యూనివర్సిటీ ఆఫ్ మద్రాసులో బ్యాచిలర్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, న్యూజెర్సీలోని ఎన్‌జేఐటీలో ఎంఎస్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. విశ్వేశ్వర్‌రెడ్డిపై వివిధ పీఎస్‌లలో నాలుగు కేసులు ఉన్నాయి.

రూ.1.29 కోట్ల అప్పున్న సీతారాం నాయక్

మహబూబాబాద్: మహబూబాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్‌కు రూ.1.29కోట్ల అప్పు ఉన్నట్టు అఫిడవిట్ సమర్పించారు. సీతారాంనాయక్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యులు (భార్య శారద, కుమారులు డాక్టర్ రాకేష్, రాజేష్) ఆస్తుల వివరాలు (చరాస్తులు- నగదు, బ్యాంక్, డిపాజిట్లు, ఇనూరెన్స్‌లు, బంగారం, వాహనాలు) అంతా కలిపి రూ1,21,86,402 విలువ ఉంటాయని చూపించారు. స్థిరాస్తులు (వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, ప్లాట్లు, ఇల్లులు) కలిపి రూ. 1,87,00,000 విలువ ఉంటాయని, మొత్తం ఆస్తుల విలువ రూ 3,08,86,402గా పేర్కొన్నారు.

కారు లేని సుధీర్

సాక్షి, వరంగల్: వరంగల్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మారపల్లి సుధీర్‌కుమార్ కుటుంబానికి రూ.2,04,96,997 స్థిరా, చరాస్తులున్నాయి. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో 2.09 ఎకరాలు, హనుమకొండ లష్కర్ సింగారంలో 300 గజాల ఓపెన్ ప్లాట్, భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో 708 గజాల్లో నివాసభవనం సుధీర్ కుమార్ పేరిట ఉన్నాయి. ఆయనకు కారులేదు. భార్య శోభారాణి పేరు మీద కమలాపురం మండలం ఉప్పల్‌లో 2.00 ఎకరాలు, ఐనవోలు మండలం వనమాల కనపర్తి గ్రామంలో 13.31 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఎటువంటి అప్పులు లేవు.

కడియం కావ్యకు ఇల్లు, భూములు లేవు

సాక్షి, వరంగల్: వరంగల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యకు సొంతిల్లు లేదు. గుంటభూమి కూడా లేదు. ఎటువంటి క్రిమినల్ కేసులు లేవు. కడియం కావ్య కుటుంబ ఆస్తులు రూ.1,55,01,028 ఉన్నాయి. ఆమెకు రూ.31,12,711 విలువ చేసే ఇన్నోవా క్రైస్టా కారు, రూ.15,96,840 విలువచేసే 20 తులాల బంగారం ఉంది. భర్త మహమ్మద్ నజీరుల్లా షేక్‌కు రూ.86,42,303, రూ.5,88,240 స్థిరాచరాస్తులున్నట్టుగా పేర్కొన్నారు.

పట్నం సునీత కుటుంబ ఆస్తులు రూ.60.72 కోట్లు

సాక్షి,మేడ్చల్ జిల్లా: మల్కాజ్‌గిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతారెడ్డి తమ కుటుంబానికి రూ.60.72 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నట్టు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. కాగా సునీతారెడ్డి పేరిట రూ.1.50 కోట్లు, మహేందర్‌రెడ్డి పేరిట రూ. కోటి రూపాయలు అప్పులు ఉన్నాయని, రాజధాని అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకులో మార్టిగేజ్ రుణం తీసుకున్నారు. తన వద్ద రూ.55 వేలు, తన భర్త వద్ద రూ.లక్ష , కుమారుడి వద్ద రూ.50 వేల నగదు ఉన్నట్టు వివరించారు.

కింగ్ ఎవరు?



సాక్షిప్రతినిధి, కరీంనగర్

హైదరాబాద్ స్టేట్..ఉమ్మడి ఏపీ నుంచి.. నేటి తెలంగాణ వరకు రాష్ట్రం ఏదైనా కరీంనగర్ జిల్లా మాత్రం సెంటిమెంట్ జిల్లాగా.. ఉద్యమాల ఖిల్లాగా పేరొందింది. తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమాలకు రాజకీయ కేంద్రంగా నిలిచిన కరీంనగర్ నిరంతరం సెంటిమెంట్‌తోపాటు రాజకీయ వైవిధ్య తీర్పులకు రాజధానిగా నిలుస్తూ తన ప్రత్యేకతను చాటుకుంటోంది. దళిత, చేనేత, ఎన్నారై, మహిళలు మెజారిటీగా ఉన్న ఈ నియోజకవర్గంలో వెలమ సామాజికవర్గ నేతలు తమ పట్టు నిలుపుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటివరకు 17 సార్లు లోక్‌సభ ఎన్నికలు జరిగితే కరీంనగర్ నుంచి ఏడుగురు వెలమలు 40 ఏళ్లపాటు ప్రాతినిధ్యం వహించడం రాజకీయంగా వారి పట్టుకు నిదర్శనం. తొలి ఎంపీ బద్దం ఎల్లారెడ్డి తర్వాత మరోసారి రెడ్డి నేత ఇక్కడ ఎంపీ కాలేదు. ఎల్.రమణ, పొన్నం ప్రభాకర్, బండి సంజయ్ ముగ్గురూ బీసీలే. 1957లో ఎమ్మార్ కృష్ణ ఇక్కడ నుంచి ఎంపీగా గెలిచిన దళిత నేత.

- కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్‌ల హోరాహోరీ
- మూడుపార్టీలకు విజయం ప్రతిష్టాత్మకం
- దళిత, ఎన్నారై, మహిళలే నిర్ణయాత్మక శక్తులు
- ఇదీ కరీంనగర్ ఎంపీ సెగ్మెంట్ ముఖచిత్రం



సంజయ్ | వినోద్ | రాజేందర్ రావు

ఉద్యమాలు, సెంటిమెంటే ఇక్కడ తీర్పు

కరీంనగర్ నియోజకవర్గ ఆవిర్భావం నుంచి విలక్షణ తీర్పులకు పుట్టినిల్లు. ఉద్యమాలు, భావోద్వేగాల ఆధారంగా సాగిన పలు ఎన్నికల్లో ఓటర్లు వైవిధ్య ఫలితాలను కట్టబెట్టి తమ ప్రత్యేకత చాటుకుంటున్నారు. వాస్తవానికి 1971లో తొలిదశ తెలంగాణ ఉద్యమంలో ఇక్కడ మర్రి చెన్నారెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రజాసమితి (టీపీఎస్)ని ఆదరించి మేనేని సత్యనారాయణను ఎంపీగా గెలిపించారు. తర్వాత మలిదశ ఉద్యమం 2001లో ఇదే కరీంనగర్ కేంద్రంగా ఉమ్మడి రాష్ట్రంలో మొదలైంది. ఆ ఉద్యమాన్నీ అక్కున చేర్చుకున్నారు. జై తెలంగాణ నినాదంతో 2004లో ఇక్కడ నుంచి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు గెలిచారు. 2006 ఉపఎన్నికలో రెండు లక్షల మెజారిటీ ఇచ్చిన ఓటర్లు, 2008లో మాత్రం కేవలం 16వేలకు పరిమితం చేసి ప్రత్యేకత చాటారు. 2019లో సరిహద్దుల్లో ఉద్రిక్తత, హిందువులపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు, జాతీయభావం ఆధారంగా సాగిన ఓటింగ్‌లో (1998, 1999 తర్వాత) బీజేపీకి పట్టం కట్టారు. గతంలో టీడీపీ చేయి పట్టి నడిచిన బీజేపీ ఒంటరిగా బలోపేతం కావడం మొదలైంది కూడా ఇక్కడ నుంచే. అదే 2004లో వైఎస్ పాదయాత్రకు బ్రహ్మరథం పట్టిన స్థానికులు కాంగ్రెస్‌- టీఆర్‌ఎస్ కూటమికి జైకొట్టారు.

ఎవరి ప్రభావం ఎంత?

దళితులు, చేనేతలు, ఎన్నారైలు, మహిళలు సెగ్మెంట్‌లో నిర్ణయాత్మక శక్తులు. సిరిసిల్లలో 58,000 చేనేతల ఓట్లు ఉన్నాయి. దళితులు ఇక్కడ చాలా కీలకం చొప్పదండి: 58,000, మానకొండూరు: 56,000 కరీంనగర్ : 50,000, వేములవాడ: సిరిసిల్లలో సుమారు 80వేల మంది, హుజూరాబాద్, హుస్నాబాద్.. మొత్తం కలిపి దాదాపు 2,60,000 పైచిలుకు ఓట్లు ఉంటాయి. ఇక ఎన్నారైల విషయానికి వస్తే.. సిరిసిల్ల: 22,362, వేములవాడలో 10,025, చొప్పదండి 22,321, మానకొండూరు 10451, హుజూరాబాద్: 9267, హుస్నాబాద్ 9040, కరీంనగర్ 12,951 మొత్తంగా 1,06,513 మంది గల్ఫ్ ఓటర్లు ఉన్నారు. వీరి కుటుంబాలను కూడా కలిపితే దాదాపు మూడింతల ఓట్లు ఉంటాయి. ఇక మొత్తంగా 17.92 లక్షల ఓటర్లలో మహిళ ఓట్లు చూసినప్పుడు 9.14 లక్షల మంది ఉన్నారు. వీరు పురుషుల కంటే 50,000 అధికంగా ఉండటం గమనార్హం.

కరీంనగర్ స్కాన్

కేంద్రమంత్రులు వీరే..!

కరీంనగర్ నుంచి ఎంపీలుగా గెలిచిన వారిలో ఇప్పటివరకు ఇద్దరు కేంద్రమంత్రులుగా పని చేశారు. వారిలో తొలుత 1999లో ఎంపీగా విజయం సాధించిన చెన్నమనేని విద్యాసాగర్‌రావు వాజ్‌పేయి కేబినెట్‌లో కేంద్ర సహాయమంత్రిగా పనిచేశారు. తర్వాత 2004లో ఇక్కడ నుంచి ఎంపీగా గెలిచిన కేసీఆర్ మన్మోహన్‌సింగ్ కేబినెట్‌లో కేంద్రమంత్రిగా సేవలందించారు.

ఆయా అసెంబ్లీ సెగ్మెంట్‌లలో ఓటర్లు ఇలా....

సెగ్మెంట్	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
కరీంనగర్	1,81,025	1,81,372	43	3,62,440
చొప్పదండి	1,13,599	1,21,523	6	2,35,128
వేములవాడ	1,07,768	1,17,506	32	2,25,306
సిరిసిల్ల	1,19,124	1,25,965	8	2,45,097
మానకొండూరు	1,09,943	1,14,902	1	2,24,846
హుజూరాబాద్	1,21,282	1,27,963	7	2,49,252
హుస్నాబాద్	1,21,069	1,25,075	5	2,46,149
మొత్తం	8,73,810	9,14,306	102	17,88,218

ప్రస్తుతం పోటీ వీరి మధ్యే..

ఇక్కడ మూడు ప్రధాన పార్టీలు ఈసారి కరీంనగర్‌కు చేజిక్కించుకోవాలని ప్రయత్నిస్తున్నాయి. బీజేపీ సిట్టింగ్ ఎంపీ బండి సంజయ్ రెండోసారి విజయంపై కన్నేశారు. తద్వారా కేంద్ర మంత్రి కావాలని ఆయన వ్యూహం. బీఆర్‌ఎస్ నుంచి మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్ బరిలో ఉన్నారు. కరీంనగర్‌ను తిరిగి చేజిక్కించుకోవాలని పట్టుదలగా ఉన్నారు. ఇక కాంగ్రెస్ నుంచి వెలిచాల రాజేందర్‌రావు పోటీకి సై అంటున్నారు. సోమవారం నామినేషన్ కూడా దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ప్రస్తుతానికి మూడు పార్టీలు హోరాహోరీగా ప్రచారం చేస్తున్నాయి.

2019 ఎంపీ ఎన్నికల్లో అభ్యర్థులకు వచ్చిన ఓట్లు..

బీజేపీ	బండి సంజయ్	4,98,276
టీఆర్‌ఎస్	వినోద్‌కుమార్	4,08,768
కాంగ్రెస్	పొన్నం ప్రభాకర్	1,79,258

బెంగళూరుకు ఖమ్మం పంచాయితీ!

ఏఐసీసీ చీఫ్ ఖర్గేతో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి భేటీ

అధిష్టానానికి తన అభిప్రాయాన్ని ఫోన్ చేసి చెప్పిన మంత్రి తుమ్మల

సాక్షి, హైదరాబాద్: ఖమ్మం లోక్‌సభకు పోటీ చేసే కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక పంచాయితీ బెంగళూరుకు చేరింది. ఎన్నికల బరిలో ఎవరిని దింపాలన్న విషయమై చర్చోపచర్చలు జరుపుతున్న కాంగ్రెస్ హైకమాండ్.. సోమవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలను బెంగళూరుకు పిలిపించింది. దీంతో వారిద్దరూ బెంగళూరు వెళ్లి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సమావేశమై చర్చించారని గాంధీ భవన్ వర్గాల ద్వారా తెలిసింది. ఈ చర్చల సందర్భంగా ఖమ్మం నుంచి స్థానిక నేతను పోటీలో ఉంచాలా లేక స్థానికేతరులకు అవకాశం ఇవ్వాలా అనే అంశం ప్రస్తావనకు వచ్చినట్టు సమాచారం. తాము కోరుతున్న విధంగా తమ కుటుంబ సభ్యులు లేదా బంధువులకు ఖమ్మం నుంచి అవకాశం కల్పించాలని మంత్రులు కోరారని తెలియవచ్చింది. ఒకవేళ సామాజిక వర్గాల లెక్కల ప్రాతిపదికన కమ్మ సామాజికవర్గానికి టికెట్ ఇవ్వాలనుకుంటే స్థానిక నేతకే అవకాశం ఇవ్వాలని ఇరువురు నేతలు ఖర్గేను కోరినట్లు చర్చ జరుగుతోంది. వారి అభిప్రాయాలు విన్న ఖర్గే మరోమారు రాష్ట్ర నాయకత్వంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పినట్లు సమాచారం. మరోవైపు ఏఐసీసీ నుంచి ఖమ్మం జిల్లాకే చెందిన మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కూడా ఈ విషయమై చర్చించారు. తుమ్మల ఫోన్లో తన అభిప్రాయాన్ని పార్టీ అధిష్టానానికి తెలియజేశారు.

రఘురామిరెడ్డికేనా...?

ఖమ్మం లోక్‌సభ బరిలో ఆశావహులు చాలా మందే ఉన్నారు. మల్లు నందిని, పొంగులేటి ప్రసాదరెడ్డి, తుమ్మల యుగంధర్‌లతోపాటు మంత్రి పొంగులేటి వియ్యంకుడు రామసహాయం రఘురామిరెడ్డి, కమ్మ సామాజిక వర్గం నుంచి జెట్టి కుసుమకుమార్, వంకాయలపాటి రాజేంద్రప్రసాద్‌ల పేర్లను ఇప్పటికే అధిష్టానం పరిశీలించింది. నిజామాబాద్ జిల్లాకు చెందిన మండవ వెంకటేశ్వరరావు పేరు కూడా తెరపైకి వచ్చింది. స్థానిక, స్థానికేతర కోణంలో పాలేరు నియోజకవర్గానికి చెందిన కమ్మ సామాజిక వర్గం నేత రాయల నాగేశ్వరరావు పేరును కూడా పరిశీలించారనే చర్చ జరుగుతోంది. కానీ టికెట్ మాత్రం రఘురామిరెడ్డికి లేదా ప్రసాద రెడ్డిలలో ఒకరికి దక్కుతుందన్న ప్రచారం కొనసాగుతోంది.

మెదక్ బరిలో టీఆర్‌ఎస్

నామినేషన్ దాఖలు చేసిన మురళి



సిద్దిపేట అర్బన్: మెదక్ బరిలో టీఆర్‌ఎస్ ఏంటి అని ఆశ్చర్యపోతున్నారా? ఇక్కడ టీఆర్‌ఎస్ అంటే తెలంగాణ రాజ్య సమితి పార్టీ. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు సిద్దిపేట జిల్లా పొన్నాల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు తుపాకుల బాలరంగం తెలంగాణ రాజ్య సమితి (టీఆర్‌ఎస్)ని స్థాపించి ఎన్నికల సంఘం వద్ద రిజిస్టర్ చేశారు. ఈసీ గ్యాస్ సిలిండర్ గుర్తును కూడా కేటాయించింది. సిద్దిపేట జిల్లాలో కాకుండా మిగతా చోట్ల పోటీ చేస్తామని ప్రకటించినా.. చివరికి బీఆర్‌ఎస్‌కు మద్దతు తెలిపింది. టీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్న తుపాకుల బాలరంగం బీఆర్‌ఎస్ నిర్వహించే సమావేశాలకు, సభలకు హాజరవుతూనే టీఆర్‌ఎస్ పార్టీని నిర్వహిస్తున్నారు. ఆయన కుమారుడు తుపాకుల మురళి సోమవారం నామినేషన్ దాఖలు చేశారు.

కాంగ్రెస్ పాలనతో వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం

బీఆర్‌ఎస్ నేత రాకేశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పాలనలో వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం అయ్యాయని, మైనారిటీల ఆస్తులను ప్రైవేటు పరం చేసే కుట్ర జరుగుతోందని బీఆర్‌ఎస్ నేత రాకేశ్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ నాంపల్లిలో వక్ఫ్ భూమిలో ఉన్న పెద్ద భవనాన్ని ప్రైవేటు వ్యక్తులకు కారు చౌకగా కట్టబెడుతున్నారని ధ్వజమెత్తారు.

భారీగా లోక్‌సభ నామినేషన్లు

144 మంది అభ్యర్థులు.. 169 నామినేషన్లు

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికలకు రాష్ట్రంలో సోమవారం భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. ఐదురోజున మొత్తం 144 మంది అభ్యర్థులు 169 నామినేషన్ సెట్లను సంబంధిత ఎన్నికల అధికారులకు సమర్పించారు. బీజేపీ అభ్యర్థులు కొండా విశ్వేశ్వరరెడ్డి (చేవెళ్ల), ధర్మపురి అర్వింద్ (నిజామాబాద్), బీబీ పాటిల్ (జహీరాబాద్), భరత్‌ప్రసాద్ (నాగర్‌కర్నూల్), సైదిరెడ్డి (నల్ల గొండ), సీతారాం నాయక్ (మహబూబాబాద్), కాంగ్రెస్ పార్టీ నుంచి పట్నం సునీత (మల్కాజిగిరి), ఆత్రం సుగుణ (ఆదిలాబాద్), వెల్చాల రా జేందర్‌రావు (కరీంనగర్), సురేశ్ షెట్కార్(జహీరాబాద్), మల్లురవి (నాగర్‌కర్నూల్), బీఆర్‌ఎస్ నుంచి కాసాని జ్ఞానేశ్వర్(చేవెళ్ల), క్యామ మల్లేశ్ (భువనగిరి), శ్రీనివాస్‌యాదవ్ (హైదరాబాద్), మారేపల్లి సుధీర్‌కుమార్ (వరంగల్), ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ (నాగర్‌కర్నూల్), మజ్లిస్ నుంచి అసదుద్దీన్ ఒవైసీ (హైదరాబాద్) నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్ర, రిజిస్టర్డ్ పార్టీల నుంచి కూడా పలువురు నామినేషన్లు దాఖలు చేశారు.

400 సీట్లలో నల్లగొండ ఉండాలి

కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు

నల్లగొండ టూటౌన్: అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పాటుపడడంతోపాటు భారత్‌ను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపిన బీజేపీదే మరోసారి అఖండ విజయమని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ధీమా వ్యక్తం చేశారు. సోమవారం నల్లగొండలో బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపుడి సైదిరెడ్డి నామినేషన్ వేసిన సందర్భంగా నిర్వహించిన భారీ బైక్ ర్యాలీలో కిరణ్ రిజిజు మాట్లాడారు. ఎన్‌డీఏ 400 సీట్లు గెలువబోతోందనీ, అందులో నల్లగొండ ఉండాలని వ్యాఖ్యానించారు. 70 ఏళ్ల స్వతంత్ర భారతంలో ఆదివాసీలకు ప్రాధాన్యత కల్పించి మహిళను రాష్ట్రపతిగా, తనను కేంద్ర మంత్రిగా చేసిన ఘనత మోదీకే దక్కిందన్నారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. నల్లగొండ గడ్డపై కాషాయ జెండా ఎగురవేసి జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులను పీకేసే సమయం వచ్చిందన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బీజేపీ ఎక్కడుందని మాట్లాడుతున్నారని, ఇదే మాట కామారెడ్డికి వచ్చి అనాలని సవాల్ చేశారు. రాహుల్ పేరు ఎత్తకుండా రేవంత్‌రెడ్డి తనను చూసి ఓటేయాలని అడగడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు.



ర్యాలీలో అభివాదం చేస్తున్న కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి. చిత్రంలో నల్లగొండ బీజేపీ అభ్యర్థి సైదిరెడ్డి తదితరులు

ప్రజలకు కాంగ్రెస్‌పై నమ్మకం పోయింది



వంద రోజుల్లోనే వ్యతిరేకత వచ్చింది

8 నుంచి 10 స్థానాల్లో కారుదే విజయం: కేటీఆర్

సిరిసిల్ల: రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో నమ్మకం పోయిందని, సమస్యలపై ప్రజల పక్షాన కొట్లాడే పార్టీగా బీఆర్‌ఎస్‌పై విశ్వాసం కుదిరిందని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో చాలా స్థానాల్లో స్వల్ప తేడాతోనే కాంగ్రెస్ విజయం సాధించిందని, అనేక చోట్ల బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులు గెలుపు అంచుల వరకు వచ్చారని చెప్పారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పై వంద రోజుల్లోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని అన్నారు. సోమవారం ఆయన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ శ్రేణులతో సమావేశమై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సమస్యలే ఎజెండాగా, కాంగ్రెస్, బీజేపీ మోసాలను ఎండగడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కొట్లాడుదామని కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కాంగ్రెస్‌కు ఓటు వేయకపోతే ఫ్రీ బస్సు తీసేస్తామంటున్నారని, దీనిపై ప్రజలు ఆలోచన చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకే విజయావకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. 8 నుంచి 10 స్థానాల్లో గెలిచే అవకాశం ఉందని సర్వే సంస్థలు చెబుతున్నాయని వివరించారు.

స్వార్థ ప్రయోజనాల కోసమే పార్టీ వీడుతున్నారు

కొందరు నేతలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీని వీడి వెళ్తున్నారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. పార్టీలో చేరాలని బీఆర్‌ఎస్ నాయకులపై కాంగ్రెస్ నాయకులు ఒత్తిడి తెస్తున్నారని, చేరని వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఎవరూ అధైర్యపడొద్దని, కష్టకాలంలో పార్టీ వెంట, తన వెంట నిలిచిన ప్రజలకు అండగా ఉంటానని చెప్పారు.

ఐదేళ్లలో సంజయ్ ఏం చేశాడు?

ఐదేళ్లుగా కరీంనగర్ ఎంపీగా ఉన్న బండి సంజయ్ ఈ నియోజకవర్గానికి చేసిందేమీ లేదని కేటీఆర్ విమర్శించారు. 'ఐదేళ్లలో ఒక్క పాఠశాల కానీ ఒక్క కళాశాల కానీ తీసుకొచ్చాడా? ఒక్క గుడి కట్టాడా? ఒక్క పరిశ్రమనైనా తీసుకొచ్చాడా?'అని ప్రశ్నించారు. రూపాయి పనిచేయని బండి సంజయ్‌కి ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. మోదీ పదేళ్ల పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకాయని, తెలంగాణకు ఏమీ చేయని బీజేపీకి, కరీంనగర్‌కు నయాపైసా పని చేయని బండి సంజయ్‌కి ఓటు ఎందుకు వేయాలో ప్రజల్లో చర్చపెట్టాలని కోరారు.

10న సిరిసిల్లలో కేసీఆర్ రోడ్‌షో

బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్ గెలుపుతో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకోవచ్చని కేటీఆర్ అన్నారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా మే 10న సిరిసిల్లలో కేసీఆర్ రోడ్ షో ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయకపోతే రాజీనామా చేస్తావా?



సీఎం రేవంత్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్

ఆయన మాటలను జనం నమ్మేస్థితిలో లేరు

కొండాపూర్(సంగారెడ్డి)/నర్సాపూర్: 'ఆగస్టు 15వ తేదీలోగా రైతులకు రుణమాఫీ చేయకపోతే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తావా?'అని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు.. సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. సోమవారం సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్లేపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అధికారంలోకి రాగానే డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు? 'రైతుబంధు పూర్తిగా ఇవ్వలేదు.. పైగా ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తా అంటున్నారు. సీఎం మాటలను ప్రజలెవరూ నమ్మేస్థితిలోలేరు'అని అన్నారు. కాంగ్రెస్‌ను ఎందుకు ఓడించాలో చెప్పాలని ప్రతిపక్షాలను అడుగుతున్నారని, మిమ్మల్ని ఓడించడానికి వంద కారణాలు ఉన్నాయని చెప్పారు. రుణమాఫీ, రైతు భరోసా, ధాన్యానికి బోనస్, ఆసరా పెన్షన్ పెంపు, మహిళలకు రూ.2,500 సాయం, కల్యాణలక్ష్మికి అదనంగా తులం బంగారం, నిరుద్యోగభృతిపై మాట తప్పినందుకు కాంగ్రెస్‌ను ఓడించాలని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి అంటే మాటల కోతలు.. కాంగ్రెస్ అంటే కరెంట్ కోతలేనని ఎద్దేవా చేశారు. నాలుగున్నర నెలల్లోనే ఏదేదో చేసినట్టు.. ఓటేయకపోతే పథకాలు బంద్ అవుతాయని బ్లాక్ మెయిల్ చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అంటే కరువు, కరెంట్ కోతలు, మంచినీళ్ల కష్టాలు, అవినీతి అని అన్నారు. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రాం రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

అప్పుడు నూకలు బుక్కమని.. ఇప్పుడు ఓట్లు ఎలా అడుగుతారు?

తెలంగాణ ప్రజలను నూకలు బుక్కమన్న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ఇక్కడి ప్రజలను ఓట్లు ఎలా అడుగుతారని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ అధికారంలో ఉండగా కేంద్ర ప్రభుత్వం ధాన్యం కొనకపోతే కేసీఆర్‌తో సహా మంత్రులు, ఎమ్మెల్యేలంతా వెళ్లి ఢిల్లీలో ధర్నా చేశామని తెలిపారు. అప్పుడు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్.. ధాన్యం కొనలేమని చెప్పడంతో పాటు యాసంగి వడ్లు నూకలు అవుతాయని అన్నారని గుర్తు చేశారు. బీజేపీ మేనిఫెస్టోలో రైతులకు మేలు చేసే ఎలాంటి హామీలు లేవని విమర్శించారు. దళితుల వర్గీకరణ చేస్తామని బీజేపీ అసెంబ్లీ ఎన్నికలప్పుడు హామీ ఇచ్చిందని, హామీ ఇచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా ఇంత వరకు వర్గీకరణకు ఒక్క అడుగు ముందుకు వేయలేదని అన్నారు.

నామినేషన్ సమర్పిస్తున్న కొండా విశ్వేశ్వరరెడ్డి. చిత్రంలో పీయూష్ గోయల్, కె.లక్ష్మణ్ తదితరులు



మోదీ హ్యాట్రిక్ ఖాయం

విశ్వేశ్వర్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

సాక్షి, రంగారెడ్డి జిల్లా: బీజేపీని ఓడించేందుకు ప్రతిపక్షాలు తమ సిద్ధాంతాలను పక్కన పెట్టి ఇండియా కూటమి పేరుతో ఏకమయ్యాయని కేంద్ర పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ విమర్శించారు. ఆ కూటమిలోని పార్టీలకు ఒకరంటే మరొకరికి పడదని, రాహుల్ గాంధీ కేరళకు వెళ్లి విజయన్‌ను, బెంగాల్‌కు వెళ్లి మమతా బెనర్జీని విమర్శించడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి ఎదురు లేదని, మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమని అన్నారు. చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సోమవారం రాజేంద్రనగర్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో గోయల్ మాట్లాడుతూ దేశంలోని నిరుపేదలు, మహిళలు, యువత సహా అన్ని వర్గాల ప్రజల కోసం నరేంద్ర మోదీ ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. మోదీ అనుసరించిన సమర్థవంతమైన విధానాలతో భారత్‌లో పేదరికం తగ్గిందని, 2030 నాటికి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతోందని అన్నారు.

భారీ మెజార్టీతో గెలుస్తా: కొండా

దేశం కోసం అహర్నిశలు పని చేస్తున్న మోదీని మరోసారి ప్రధానిని చేయడానికి చేవెళ్ల ప్రజలు సిద్ధంగా ఉన్నారని కొండా విశ్వేశ్వర్ రెడ్డి చెప్పారు. తాను భారీ మెజార్టీతో గెలువబోతున్నానని, గెలిచిన వెంటనే కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రత్యేక నిధులను తీసుకొచ్చి చేవెళ్లను అభివృద్ధి చేస్తానని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో ఎంపీ కె.లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి పాల్గొన్నారు.

25న సిద్దిపేటలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభ

సాక్షి, హైదరాబాద్: బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం శాఖమంత్రి అమిత్‌షా రాష్ట్ర పర్యటనలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఈనెల 25న జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని బాన్సువాడలో జరిగే బహిరంగసభలో ఆయన పాల్గొంటారని తొలుత బీజేపీ ప్రకటించింది. తాజాగా మారిన షెడ్యూల్‌ప్రకారం 25న ఉదయం 11 గంటలకు మెదక్ పార్లమెంట్ పరిధిలోని సిద్దిపేటలో అమిత్‌షా బహిరంగసభ ఉంటుందని సోమవారం బీజేపీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సభలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్, రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి అభయ్‌పాటిల్, మెదక్ ఎంపీ అభ్యర్థి ఎం.రఘునందన్ రావు పాల్గొంటారని బీజేపీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి తెలిపారు.

రాజస్తాన్‌లో ఆసక్తికరంగా ఎన్నికల పోరు

- 13 లోక్‌సభ స్థానాలకు 26న పోలింగ్
- బరిలో గహ్లోత్, వసుంధర కుమారులు
- గెలుపు మాజీ సీఎంలిద్దరికీ ప్రతిష్టాత్మకమే

రెండో విడతలో... నువ్వా నేనా!?

రాజస్తాన్‌లో ఎన్నికల క్రతువు ముగింపునకు చేరుకుంటోంది. మొత్తం 25 లోక్‌సభ స్థానాలకు గాను 12 చోట్ల ఏప్రిల్ 19న తొలి విడతలో పోలింగ్ పూర్తయింది. మిగతా 13 స్థానాలకు 26న రెండో విడతలో పోలింగ్ జరగనుంది. వీటిలో పలు స్థానాల్లో బీజేపీతో కాంగ్రెస్ హోరాహోరీ తలపడుతోంది. గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో ఒక్క సీటు కూడా నెగ్గలేకపోయిన హస్తం పార్టీ ఈసారి రికార్డును ఎలాగైనా మెరుగుపరుచుకోవాలని పట్టుదలగా ఉంది. ఈ నేపథ్యంలో రాజస్తాన్‌లో రెండో విడతలో పోలింగ్ జరగనున్న కీలక స్థానాలపై ఫోకస్...


- సాక్షి, నేషనల్ డెస్క్

రాజ్‌సమంద్


• మహిమా సింగ్

ఇక్కడ బీజేపీ అనూహ్యంగా కొత్త ముఖమైన మేవాడ్ రాజవంశీకుడు, ఎమ్మెల్యే విశ్వజీత్‌సింగ్ భార్య మహిమా సింగ్‌కు టికెటిచ్చింది. రాజస్తాన్‌లో రాజ్‌పుత్‌లు నిర్ణాయక శక్తి. గుజరాత్ బీజేపీ నేత పురుషోత్తం రూపాలా ఇటీవల రాజ్‌పుత్‌లపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో పార్టీపై వారంతా తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలో రాజ్‌పుత్‌లను ఆకట్టుకునేందుకు మహారాణా ప్రతాప్ వంశీకుడైన విశ్వజిత్ భార్యకు బీజేపీ వ్యూహాత్మకంగా టికెటిచ్చింది. కాంగ్రెస్ తొలుత సుదర్శన్‌సింగ్ రావత్‌కు టికెటివ్వగా ఆయన అనూహ్యంగా వైదొలగి షాకిచ్చారు. దాంతో తొలుత బిల్వారా అభ్యర్థిగా ప్రకటించిన దామోదర్ గుర్జర్‌ను హడావుడిగా రాజ్‌సమంద్ నుంచి బరిలో దించింది. మహిమ తమ కుటుంబపు మేవాడ్ రాజవంశ వారసత్వాన్నే ప్రచారంలో ప్రధానంగా ప్రస్తావిస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

టోంక్-సవాయ్ మధోపూర్


• సుఖ్‌బీర్‌సింగ్

ఈ లోక్‌సభ స్థానంలో గుర్జర్లు, మీనాలతో పాటు ముస్లింల ప్రాబల్యం ఎక్కువ. మీనా సామాజికవర్గానికి 4 లక్షలు, గుర్జర్లకు 3.5 లక్షల పై చిలుకు ఓట్లున్నాయి. 1.8 లక్షల మంది ముస్లిం ఓటర్లున్నారు. మొత్తమ్మీద ఇక్కడ గ్రామీణ ఓటర్ల సంఖ్య ఎక్కువ. బీజేపీ సిటింగ్ ఎంపీ సుఖ్‌బీర్‌సింగ్ జౌన్‌పురియాది గుర్జర్ సామాజికవర్గమే. 2014, 2019 ఎన్నికల్లో సునాయాసంగా నెగ్గిన ఆయన ఈసారి హ్యాట్రిక్ కోసం ప్రయత్నిస్తున్నారు. 2019లో కేంద్ర మాజీ మంత్రి అయిన కాంగ్రెస్ నేత నమోనారాయణ్ మీనాను జౌన్‌పురియా ఓడించారు. ఈసారి కాంగ్రెస్ నుంచి మీనా సోదరుడు, ఎమ్మెల్యే హరీశ్ మీనా బరిలో ఉన్నారు. ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని 8 అసెంబ్లీ స్థానాల్లో ఇటీవలి ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ చెరో సగం గెలుచుకున్నాయి. దాంతో లోక్‌సభ పోరు హోరాహోరీ సాగుతుందని భావిస్తున్నారు.


• హరీశ్ మీనా

జాలోర్


• వైభవ్ గహ్లోత్

కాంగ్రెస్ తరఫున మాజీ సీఎం అశోక్ గహ్లోత్ కుమారుడు వైభవ్ పోటీ చేస్తున్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో ఆయన జోధ్‌పూర్ నుంచి పోటీ చేసి కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ చేతిలో ఘోర ఓటమి చవిచూశారు. దాంతో గహ్లోత్ ఈసారి వ్యూహాత్మకంగా తమ సామాజికవర్గం ఓట్లు ఎక్కువగా ఉన్న జాలోర్‌ను కుమారుని కోసం ఎంచుకున్నారు. ఈసారి కూడా వైభవ్ ఓటమి చవిచూస్తే ఆయన రాజకీయ జీవితం దాదాపుగా ముగిసినట్టేనని భావిస్తున్నారు. దాంతో అశోక్ గహ్లోత్ కాలికి బలపం కట్టుకుని నియోజకవర్గమంతా స్వయంగా కలియదిరుగుతూ కుమారుని విజయం కోసం చెమటోడుస్తున్నారు. తనను గెలిపిస్తే నియోజకవర్గంలో చేపట్టబోయే సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఏకరువు పెడుతూ 'వాగ్దానపత్రం' పేరిట వైభవ్ ప్రత్యేకంగా మేనిఫెస్టోనే విడుదల చేయడం విశేషం! ఇక్కడ బీజేపీ సిట్టింగ్ ఎంపీ దేవ్‌జీ పటేల్‌ను పక్కనపెట్టి లుంబారాం చౌదరి అనే కొత్త ముఖానికి అవకాశమిచ్చింది.

బన్స్‌వారా


• మహేంద్రజీత్‌సింగ్

ఇది దక్షిణ రాజస్తాన్‌లోని గిరిజన ప్రాబల్య నియోజకవర్గం. ఎస్టీ రిజర్వుడు స్థానం. బీజేపీ ఇక్కడ ప్రముఖ గిరిజన నేత మహేంద్రజీత్‌సింగ్ మాల్వియాను కాంగ్రెస్ నుంచి చేర్చుకుని మరీ టికెటిచ్చింది. దాంతో గిరిజన ఓట్ల కోసం కాంగ్రెస్ చివరి నిమిషంలో భారత్ ఆదివాసీ పార్టీ (బీఏపీ)తో పొత్తు పెట్టుకుంది. ఈ స్థానాన్ని తమకే కేటాయిస్తుందని ఆ పార్టీ భావించింది. కానీ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అర్వింద్ దామోర్‌ను హస్తం పార్టీ బరిలో దించింది. ఈ చర్యతో ఆగ్రహించిన బీఏపీ కూడా తన అభ్యర్థిని ప్రకటించింది. దాంతో ఇక్కడ ముక్కోణపు పోరు నెలకొంది! ఇక్కడ కూడా కాంగ్రెస్ తొలుత మాజీ మంత్రి అర్జున్‌సింగ్ బామనియాకు టికెటివ్వగా ఆయన పోటీకి నిరాకరించడం విశేషం!

బార్మేర్


• రవీంద్రసింగ్ భాటీ

పశ్చిమ రాజస్తాన్‌లోని ఈ స్థానంలో సిట్టింగ్ ఎంపీ, కేంద్ర మంత్రి కైలాశ్ చౌదరి మరోసారి బీజేపీ తరఫున బరిలో ఉన్నారు. కానీ ఆయన పనితీరుపై స్థానికుల్లో తీవ్ర అసంతృప్తి ఉంది. దాంతో ఆయన మోదీ మేజిక్‌నే నమ్ముకున్నారు. తనను కాకుండా మోదీని చూసి ఓటేయాల్సిందిగా ప్రతిచోటా ప్రజలను వేడుకుంటున్నారు! ఇక్కడ జాట్లు, రాజ్‌పుత్‌ల ఓట్లు నిర్ణాయకం. కాంగ్రెస్ ఇటీవలే హనుమాన్ బెనీవాల్‌కు చెందిన ఆర్‌ఎల్పీని వీడిన ఉమ్మేదా రాంకు టికెటిచ్చింది. కానీ బీజేపీ రెబెల్, ఎమ్మెల్యే రవీంద్రసింగ్ భాటీ వారిద్దరికీ ముచ్చెమటలు పట్టిస్తున్నారు. మంచి కరిష్మా ఉన్న ఈ యువ నేత సభలకు జనం విరగబడుతున్నారు. ఇటవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గానే నెగ్గిన భాటీ లోక్‌సభకు కూడా స్వతంత్ర అభ్యర్థిగానే పోటీ చేస్తుండటం విశేషం.


• కైలాశ్ చౌదరి

కోటా


• ఓం బిర్లా

ఇక్కడ బీజేపీ తరఫున లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా బరిలో ఉన్నారు. వసుంధర రాజేకు సన్నిహితుడైన బీజేపీ మాజీ ఎమ్మెల్యే ప్రహ్లాద్ గుంజల్ కాంగ్రెస్‌లో చేరి ఆ పార్టీ తరఫున బరిలో నిలిచారు. మరో స్థానిక బీజేపీ ప్రముఖుడు హడోతీ చేరిక తన అవకాశాలను మరింత మెరుగుపరుస్తుందని కాంగ్రెస్ ఆశ పడుతోంది. ఈ నేపథ్యంలో బిర్లాను గెలిపించుకోవడాన్ని బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రధాని మోదీ ఇక్కడ ఇప్పటికే ఎన్నికల ర్యాలీలో పాల్గొని జోష్ తెచ్చారు.

ఝలావర్-బరన్


• దుష్యంత్‌సింగ్

బీజేపీ నుంచి మాజీ ముఖ్యమంత్రి వసుంధరా రాజె సింధియా కుమారుడు దుష్యంత్‌సింగ్ బరిలో ఉన్నారు. ఆయన విజయం కోసం వసుంధర చెమటోడుస్తున్నారు. నియోజకవర్గానికే పరిమితమై సుడిగాలి ప్రచారం చేస్తున్నారు. ఇప్పటిదాకా నాలుగుసార్లు లోక్‌సభ ఎన్నికల్లో నెగ్గిన దుష్యంత్ తన పనితీరు చూసి ఓటేయాల్సిందిగా ప్రజలను అభ్యర్థిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఊర్మిలా జైన్ భయా నుంచి గట్టి పోటీ ఎదుర్కొంటున్నారు.

చిత్తోడ్‌గఢ్


• సీపీ జోషి

ఈ రాజ్‌పుత్ ప్రాబల్య స్థానం నుంచి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సీపీ జోషి బరిలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి రాష్ట్ర మాజీ మంత్రి ఉదయ్‌లాల్ అంజనా పోటీ చేస్తున్నారు. బీజేపీ పట్ల రాజ్‌పుత్‌ల్లో నెలకొన్న గట్టి అసంతృప్తి నేపథ్యంలో ఇక్కడ కూడా మోదీ ఫ్యాక్టర్‌నే పార్టీ నమ్ముకుంది. 2014, 2019ల్లో వరుసగా నెగ్గిన జోషి ఈ నియోజకవర్గ చరిత్రలో తొలిసారి హ్యాట్రిక్ కొడతానని ధీమాతో ఉన్నారు. 2019లో ఆయన చేతిలో ఓడిన కాంగ్రెస్ అభ్యర్థి గోపాల్‌సింగ్ ఎద్వా ఇటీవలే బీజేపీలో చేరడం ఆ పార్టీకి కలిసొస్తుందని భావిస్తున్నారు. ఇక అంజనా తాను రైతుబిడ్డనని చెప్పుకుంటూ ఓట్లడుగుతున్నారు. తనను గెలిపిస్తే ఓపియం సాగు చేసే స్థానికుల సమస్యను పార్లమెంటులో లేవనెత్తుతానని హామీ ఇవ్వడం విశేషం!

ప్రచారాస్త్రాలు

బీజేపీ

- మోదీ కరిష్మా
- బీజేపీ ప్రభుత్వ అభివృద్ధి అజెండా
- అయోధ్య రామమందిర నిర్మాణం
- ఆర్టికల్ 370 రద్దు
- రాజ్‌పుత్, జాట్, గిరిజనులపై ప్రత్యేక దృష్టి
- రాష్ట్రంలో గహ్లోత్ సారథ్యంలోని గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేపర్ లీకేజీ, అక్రమ మైనింగ్‌పై చర్యల దిశగా అడుగులు

కాంగ్రెస్

- బీజేపీకి గట్టి పోటీ ఇవ్వగల స్థానాలపై ప్రత్యేక దృష్టి
- ఎన్నికల బాండ్ల పథకం
- దర్యాప్తు సంస్థల దుర్వినియోగం
- గహ్లోత్ సర్కారు సంక్షేమ పథకాలు
- 100 రోజుల హామీ అమలులో రాష్ట్ర బీజేపీ ప్రభుత్వ వైఫల్యం

కురువృద్ధుల ఓటోత్సాహం

వందేళ్లకు పైబడ్డ ఓటర్లు 2 లక్షల పైనే

ఈ లోక్‌సభ ఎన్నికల్లో వందేళ్ల పై బడిన ఓటర్లు ఏకంగా 2,18,442 మంది ఉన్నారు. వీరిలో యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో పలువురు 110 ఏళ్లు దాటిన ఓటర్లూ ఉన్నారు! 1951–52లో జరిగిన తొలి లోక్‌సభ ఎన్నికల నుంచి 2019 దాకా మొత్తం 17 సాధారణ ఎన్నికల్లోనూ ఓటేసిన అరుదైన రికార్డు వీరిది! తాజాగా 18వ లోక్‌సభ ఎన్నికల్లోనూ ఓటేసేందుకు కూడా వీరంతా ఉత్సాహంగా ఉన్నారు. శతాధిక ఓటర్లలో మహారాష్ట్రలో అత్యధికంగా 52,908 మంది ఉన్నారు.

బాధ్యతగా ఓటు..

వందేళ్లు దాటిన వయసులో సొంత పనులు చేసుకోవడం దేవుడెరుగు, నడవడమే కనాకష్టం. అయినా ఈ వయసులోనూ ఓటేసి మ సామాజిక బాధ్యతను నెరవేర్చి తీరతానంటున్నారు 103 ఏళ్ల భగవతి ప్రసాద్. ఆయనది ప్రయాగ్‌రాజ్ జిల్లా హనుమాన్‌గంజ్ తహసీల్‌లోని కరణ్‌పూర్ గ్రామం. ''నేను, నా భార్య 1952 నుంచీ ఓటేస్తున్నాం. పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటేస్తే సంతోషంతో పాటు కాస్త గర్వం కూడా కలుగుతుంటుంది'' అన్నారు. అయితే గతంలో ఉండే హడావుడి ఇప్పటి ఎన్నికల్లో లోపించిందంటూ పెదవి విరిచారాయన. ''నాలాంటి వారికి ఏ ఎన్నిక చివరిదో చెప్పలేం. కనుక ఈసారి ఓటేసేందుకు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నా'' అన్నారు ప్రయాగ్‌రాజ్‌లోని గోహాని గ్రామానికి చెందిన 101 ఏళ్ల కేసరి దేవి.

శతాధిక ఓటర్లు అధికంగా ఉన్న రాష్ట్రాలు..

మహారాష్ట్ర	52,908
రాజస్థాన్	20,000
కర్ణాటక	17,000
హరియాణా	10,759
గుజరాత్	10,322

- సాక్షి, నేషనల్ డెస్క్

కింగ్ వర్సెస్ సిద్ధు

మైసూరు లోక్‌సభ స్థానంలో ఆసక్తికర పోరు

- బీజేపీ నుంచి మైసూర్ రాజ కుటుంబ వారసుడు
- ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సీఎం సిద్ధరామయ్య
- కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం తీవ్రంగా కృషి

మైసూరు-కొడగు లోక్‌సభ స్థానంలో ఎన్నిక కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మైసూరు రాజకుటుంబ వారసుని మధ్య యుద్ధంగా మారింది. బీజేపీ ఇక్కడ సిట్టింగ్ ఎంపీ ప్రతాప్ సింహ బదులు యదువీర్ కృష్ణదత్త చామరాజ వడయార్‌ను రంగంలోకి దింపింది. కాంగ్రెస్ తరఫున పీసీసీ అధికార ప్రతినిధి ఎం.లక్ష్మణ పోటీలో ఉన్నారు. ఇది సిద్ధరామయ్య సొంత జిల్లా కావడంతో ఈ ఎన్నిక ఆయనకు ప్రతిష్టాత్మక అంశంగా మారింది. దాంతో లక్ష్మణ గెలుపు కోసం సర్వశక్తులూ ఒడ్డుతున్నారు...

- సాక్షి, నేషనల్ డెస్క్


• సిద్ధరామయ్య

మైసూరులో సిద్ధరామయ్యకు ఎంత బలముందో, రాజకుటుంబానికి అంతకన్నా ఎక్కువ ప్రభావం చూపగల సత్తా ఉంది. యదువీర్ ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. సిద్ధూ కూడా మైసూరులో విడిది చేసి మరీ కాంగ్రెస్ ప్రచార సరళిని స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలోని 8 అసెంబ్లీ స్థానాల ఆఫీస్ బేరర్లతో నిత్యం భేటీ అవుతూ దిశానిర్దేశం చేస్తున్నారు. లక్ష్మణ గెలుపు బాధ్యతలను స్థానిక ఎమ్మెల్యేలు, నాయకులకు అప్పగించారు. మొత్తమ్మీద 2.5 లక్షల ఓట్ల మెజారిటీని లక్ష్యంగా నిర్దేశించారు! బీజేపీకి చెక్ పెట్టేందుకు రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ హామీలను ఇంటింటికీ మరింతగా ప్రచారం చేయాలని ఆదేశించారు.


• కృష్ణదత్త చామరాజ వడయార్

రెండు దశాబ్దాల తరువాత..

మైసూరు రాజకుటుంబం రెండు దశాబ్దాల తరువాత ఎన్నికల బరిలో దిగుతోంది. గతంలో మైసూరు రాజు శ్రీకాంతదత్త నరసింహరాజ వడయార్ నాలుగుసార్లు ఎంపీగా గెలిచారు. 2004లో ఓడాక ఆయన మళ్లీ పోటీ చేయలేదు. మైసూరులో పటిష్టమైన ఓటుబ్యాంకున్న జేడీ(ఎస్)తో పొత్తు ఈసారి మరింత కలిసొస్తుందని బీజేపీ ఆశలు పెట్టుకుంది. కాంగ్రెస్ చేస్తున్న 'సామాన్యుడు వర్సెస్ రాజు' ప్రచారాన్ని యదువీర్ తోసిపుచ్చుతున్నారు. ''ప్రజాస్వామ్య భారతంలో ఎవరూ రాజు కాదు. అందరూ సమానులే'' అని ప్రచారంలో పదేపదే చెబుతున్నారు.

వొక్కలిగ కార్డు..

మైసూరు ప్రాంతంలో వొక్కలిగల ఆధిపత్యం ఎక్కువ. దాంతో అదే సామాజికవర్గానికి చెందిన లక్ష్మణను గెలిపించుకోవాలంటూ వారికి కాంగ్రెస్ పిలుపునిస్తోంది. ఇక్కడ కాంగ్రెస్ వొక్కలిగలకు టికెటివ్వడం 1977 తర్వాత ఇదే తొలిసారి! ఈ సామాజిక వర్గానికి చెందిన సిట్టింగ్ ఎంపీ ప్రతాప్ సింహకు బీజేపీ టికెట్ నిరాకరించడాన్ని కాంగ్రెస్ తన ప్రచారంలో ప్రముఖంగా ప్రస్తావిస్తోంది. అయితే సిద్ధరామయ్య పక్కా వొక్కలిగల వ్యతిరేకి అంటూ బీజేపీ దీటుగా ప్రచారం చేస్తోంది. దాంతో సిద్ధరామయ్య మరింత జాగ్రత్త పడుతున్నారు. వడియార్‌పై ఎలాంటి అభ్యంతరకర విమర్శలూ చేయొద్దని నేతలకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. మైసూర్ లోక్‌సభ స్థానంలో మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువ. విజేతను నిర్ణయించడంలో వారే కీలకం. దాంతో రాష్ట్ర ప్రభుత్వ పథకాల ప్రధాన లబ్ధిదారులైన మహిళేనంటూ కాంగ్రెస్ ఇక్కడ జోరుగా ప్రచారం చేస్తోంది.


సంకీర్ణ వైఫల్యం

- 11వ లోక్‌సభలో హంగ్
- రెండేళ్లలో ముగ్గురు ప్రధానులు
- 13 రోజులకే వాజ్‌పేయి రాజీనామా
- దేవెగౌడ, గుజ్రాల్ చెరో 11 నెలలే

1996లో తొలిసారిగా పీవీ నరసింహారావు రూపంలో నెహ్రూ కుటుంబేతర నేత సారథ్యంలో కాంగ్రెస్ ఎన్నికలకు వెళ్లింది. చిరస్థాయిగా గుర్తుండే పనులు చేసినా పీవీ ప్రజల మనసు గెలవలేకపోయారు. అవినీతి ఆరోపణలకు తోడు పార్టీలో వర్గపోరు తారాస్థాయికి చేరింది. అర్జున్ సింగ్, నారాయణ్‌దత్ తివారీ బయటికొచ్చి ఆలిండియా ఇందిరా కాంగ్రెస్ (తివారీ) పేరిట వేరుకుంపటి పెట్టుకున్నారు. జమ్మూ కశ్మీర్, పంజాబ్ హింస మరింత మైనసయ్యాయి. బాబ్రీ మసీదు విధ్వంసం కాంగ్రెస్ అవకాశాలను బాగా దెబ్బ తీసింది.


కూటముల కష్టాలు

దేశవ్యాప్తంగా ప్రాంతీయ పార్టీలతో కలసి బలమైన కూటమి కోసం కాంగ్రెస్, బీజేపీ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. వాటికి ప్రత్యామ్నాయంగా సీపీఐ, సీపీఎం, జనతాదళ్, టీడీపీలతో నేషనల్ ఫ్రంట్ కూటమి ఏర్పాటైంది. అయితే కనీస ఉమ్మడి కార్యక్రమాలపై వాటి మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. 1996 ఏప్రిల్ 27, మే 2, 7 తేదీల్లో లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ ఓటు బ్యాంకు 28.8 శాతానికి తగ్గి 140 స్థానాలకు పరిమితమైంది. 1991లో ఆదుకున్న దక్షిణాదిలో ఈ దఫా పార్టీ తీవ్రంగా నష్టపోయింది. ఏపీలో 22 సీట్లు రావడమే కాస్త ఊరట. బీజేపీ 20.29 శాతం ఓట్లతో 161 సీట్లు గెలిచి ఏకైక పెద్ద పార్టీగా నిలిచింది. జనతాదళ్ 46 స్థానాలతో కుదేలైంది.



పార్టీలను చీలిస్తేనే మా ప్రభుత్వం నిలబడుతుందంటే, అలాంటి నైచ్యానికి దిగజారే బదులు విపక్షంలో కూర్చోవడానికే ఇష్టపడతాం. నా 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇప్పటిదాకా ఎన్నో ప్రభుత్వాలు కొలువుదీరడం, కుప్పకూలడం చూశాను. కానీ ఆ పరిణామాలన్నీ అంతిమంగా భారత ప్రజాస్వామ్యాన్ని బలోపేతమే చేశాయి. నేనిప్పుడు చేయబోయే రాజీనామా కూడా అదే కోవకు చెందుతుందని పూర్తి నమ్మకముంది.

- 1996 మే 27న ప్రధాని పదవికి రాజీనామా సందర్భంగా పార్లమెంటులో చేసిన చిరస్మరణీయ ప్రసంగంలో వాజ్‌పేయి


• గుజ్రాల్


• దేవెగౌడ

11వ లోక్‌సభలో పార్టీల బలాబలాలు

(మొత్తం స్థానాలు 545)

పార్టీ	స్థానాలు
బీజేపీ	161
కాంగ్రెస్	140
జనతాదళ్	46
సీపీఎం	32
తమిళ మానిల కాంగ్రెస్	20
ఎస్పీ	17
డీఎంకే	17
టీడీపీ	16
శివసేన	15
బీఎస్పీ	11
సీపీఐ	12
ఇతరులు	58

సాహసోపేత నిర్ణయాలతో దేశానికి నూతన దిశానిర్దేశం చేసినా 1996లో ప్రజా తీర్పు పీవీ సర్కారుకు వ్యతిరేకంగా వచ్చింది. ఏ పార్టీకీ సొంతంగా మెజారిటీ రాలేదు. బీజేపీ తన బలాన్ని మరింత పెంచుకుని 161 స్థానాలతో అతి పెద్ద పార్టీగా అవతరించింది. వాజ్‌పేయి తొలిసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా అది 13 రోజుల ముచ్చటే అయింది. ప్రాంతీయ పార్టీలతో కూడిన నేషనల్ ఫ్రంట్, కాంగ్రెస్ సంకీర్ణ ప్రయోగమూ 11 నెలలకే కొండెక్కింది. గుజ్రాల్ సర్కారు కూడా అంతకుమించి సాగకపోవడంతో 11వ లోక్‌సభ రెండేళ్లకే చరిత్రలో కలిసిపోయింది...

- సాక్షి, నేషనల్ డెస్క్

గతం

కుర్చీలాట

ఏకైక పెద్ద పార్టీగా నిలిచిన బీజేపీని ప్రభుత్వ ఏర్పాటుకు రాష్ట్రపతి శంకర్‌దయాళ్ శర్మ ఆహ్వానించారు. 1996 మే 15న వాజ్‌పేయి తొలిసారి ప్రధానిగా ప్రమాణం చేశారు. కానీ ప్రాంతీయ పార్టీల మద్దతు కోసం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దాంతో 13 రోజులకే వాజ్‌పేయి రాజీనామా చేశారు. రెండో పెద్ద పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుకు ఆసక్తి చూపలేదు. మరోసారి ప్రధాని పదవి చేపట్టేందుకు వీపీ సింగ్ తిరస్కరించడంతో జనతాదళ్ నేత హెచ్‌డీ దేవెగౌడ పేరును ప్రధాని పదవికి సీపీఎం దిగ్గజం, బెంగాల్ సీఎం జ్యోతిబసు ప్రతిపాదించారు. జనతాదళ్, నేషనల్ ఫ్రంట్‌లోని పార్టీలతో, కాంగ్రెస్ బయటి నుంచి మద్దతుతో యునైటెడ్ ఫ్రంట్ ఏర్పడింది. 1996 జూన్ 1న దేవెగౌడ ప్రధానిగా ప్రమాణం చేశారు. కానీ 11 నెలలకే కాంగ్రెస్ మద్దతు వెనక్కు తీసుకోవడంతో రాజీనామా చేశారు. కాంగ్రెస్‌తో మెరుగైన సంబంధాలున్న ఐకే గుజ్రాల్ 1997 ఏప్రిల్ 21న ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. ఆయన సర్కారూ ఎంతోకాలం సాగలేదు. రాజీవ్‌గాంధీని బలితీసుకున్న ఎల్టీటీఈ పట్ల సానుభూతితో వ్యవహరించిన డీఎంకేను సంకీర్ణం నుంచి తొలగించాలని కాంగ్రెస్ పట్టుబట్టింది. అందుకు గుజ్రాల్ తిరస్కరించడంతో ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించింది. దాంతో 11 నెలలకే గుజ్రాల్ సర్కారూ కుప్పకూలింది. 1998లో రెండేళ్లకే లోక్‌సభకు మళ్లీ ఎన్నికలు జరిగాయి.

• జిత్తులమారి బాబు కోసం...

గ్రామాల్లోకి గుంట నక్కలు



బాబు కోసం సిద్ధమైన టీడీపీ ఎన్‌ఆర్‌ఐల మంద

- గుంపులు గుంపులుగా రాష్ట్రంలోకి ప్రవేశించి ఎన్నికల అక్రమాలు
- కులోన్మాదం, డబ్బు మదంతో ప్రజలను ఏమార్చేందుకు ప్రయత్నాలు
- గ్రామాల్లోకి వెళ్లి ఓటర్లను ప్రలోభ పెట్టడంపై దిశా నిర్దేశం
- కోమటి జయరాం నేతృత్వంలో శిక్షణ
- వైఎస్సార్‌సీపీ ఓటర్లను ప్రభావితం చేయడమే లక్ష్యం
- ఇప్పుడు డబ్బు వెదజల్లి అధికారంలోకి వస్తే పిండుకుందామంటూ మార్గ నిర్దేశం
- సోషల్ మీడియాలో వీర విహారం చేస్తున్న ప్రత్యేక ఎన్‌ఆర్‌ఐ బ్యాచ్‌లు
- విరాళాల సేకరణ నుంచి ఓట్లు వేయించే వరకు కీలక బాధ్యతలు
- ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదమంటున్న విశ్లేషకులు.. ఈసీ దృష్టి పెట్టాలని సూచన

కులోన్మాదం, డబ్బు, మదంతో బలుపెక్కడం వల్ల వచ్చే నోటి దురుసుతో టీడీపీ ఎన్‌ఆర్‌ఐ గుంట నక్కలు రెచ్చిపోతున్నాయి. ఒకడు వైసీపీ వెధవలంటాడు.. మరొకడు చేసేద్దాం, ఏసేద్దాం.. అంటాడు. ఇంకొకడు అందరినీ కొనేద్దామంటాడు.. ఆ నాకొ.. ఈ నాకొ.. అంటూ దొమ్మ పొగరుతో మాట్లాడుతున్నారు.. ఇప్పుడు రూపాయి ఖర్చు పెడితే రేపు మన బాబు వంద రూపాయలిస్తారు.. సుడిగాలిలా పని చేయాలంటూ గాలిలో వచ్చిన కొలెస్ట్రాల్ గాళ్లనంతా పోగేస్తున్నారు.

ఏమైనా చేసేద్దాం.. జగన్ పిచ్చోళ్లను డబ్బులిచ్చి కొందాం.. కొన్ని ఓట్లు ఉన్న వెధవలకు రెండు మూడు లక్షలు పడేద్దాం.. జగన్‌పై ఇప్పుడు చేస్తున్న దుష్ప్రచారం సరిపోదు.. ఇంకా.. ఇంకా పెంచేద్దాం.. అందరూ నమ్మేలా కొన్ని సంఘటనలకు మనం మరికొంత కల్పించి చెబుదాం.. జగన్ వస్తే ఆస్తులు లాక్కుంటారని ప్రచారం చేద్దాం.. ఎన్నికల ప్రచారంలో మన బాబు గారు కొంచెం వెనుకబడ్డారు.. కొన్ని ప్రాంతాల్లో జనం జగన్‌ను బాగా నమ్ముతున్నారు.. దానిని మనం ఎలాగైనా సరే రివర్స్ చేయాలి' అని టీడీపీ ఎన్‌ఆర్‌ఐ గుంట నక్కలు గుంపులు గుంపులుగా ఊళ్ల మీద పడ్డాయి.

ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఒంటరిగా ఎదుర్కోలేక అపవిత్ర పొత్తులు.. రకరకాల కుయుక్తులు.. తెర వెనుక ఎందరో సాయం తీసుకుంటున్న చంద్రబాబు తాజాగా తనకు అనుకూలంగా ఉండే ఎన్‌ఆర్‌ఐ గుంట నక్కల్ని గుంపులు గుంపులుగా రంగంలోకి దించారు. సొంత గ్రామాలకు సేవ చేసే ముసుగులో వేలాది మందిని రాష్ట్రంలోకి తీసుకువచ్చి టీడీపీ శ్రేణులతో కలిపి వారిని తన కోసం పని చేయిస్తున్నారు. వీరంతా ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ఓటర్లను తమకు అనుకూలంగా మలుచుకునేందుకు రకరకాల గిమ్మిక్కులు ప్రదర్శిస్తున్నారు. చంద్రబాబు కోసం ఇప్పుడు ఎంత దబ్బయినా ఖర్చు చేసి, ఆ తర్వాత అధికారంలోకి వస్తే అంతకు పదింతలు దండుకోవాలనే లక్ష్యంతో ఈ గుంట నక్కలు రాష్ట్రంలో విచ్చలవిడిగా స్వైర విహారం చేస్తున్నాయి.

సాక్షి, అమరావతి : చంద్రబాబును మళ్లీ సీఎంగా చేసుకోవాలని, అందుకోసం ఎంతకైనా తెగించాలని, ఏమైనా చేయాలని టీడీపీ అనుకూల ఎన్‌ఆర్‌ఐ గుంపులు పరితపించిపోతున్నాయి. టీడీపీ ఎన్‌ఆర్‌ఐ విభాగం సమన్వయకర్త కోమటి జయరాం నేతృత్వంలో నిస్సిగ్గుగా రంగంలోకి దిగాయి. ఈ గుంపులన్నింటితో ఇటీవల మంగళగిరి టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సదస్సే ఇందుకు నిదర్శనం. టీడీపీ ఎన్‌ఆర్‌ఐ విభాగం ద్వారా వివిధ దేశాల్లో ఆ పార్టీకి మద్దతుగా ఉన్న వారు ఈ సదస్సుకు హాజరయ్యారు. సుమారు ఐదు వేల మందిని ఈ ఎన్నికల్లో ప్రత్యక్షంగా పని చేయించేందుకు ప్రణాళిక రూపొందించగా, ఇప్పటికే నాలుగు వేల మంది పచ్చ ఎన్‌ఆర్‌ఐలు రాష్ట్రానికి వచ్చారు. మిగిలిన వారు త్వరలో వచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. ఇక్కడికి వచ్చిన వారితో ఇటీవలే ఒక వర్క్‌షాప్ నిర్వహించి వారు చేయాల్సిన పనుల గురించి వివరించారు.

భారీగా విరాళాల సేకరణ

పచ్చ ఎన్‌ఆర్‌ఐలు మొన్నటి వరకు టీడీపీకి విరాళాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఇక్కడికి వచ్చే ముందే ఆయా దేశాల్లో ఉన్న వారి నుంచి భారీగా విరాళాలు సేకరించి చంద్రబాబు, లోకేశ్‌కు పంపారు. ఇక్కడికి వచ్చాక మళ్లీ ఇప్పుడు విరాళాలు సేకరించే పని మొదలు పెట్టారు. అందుకోసం ప్రత్యేకంగా ఒక వెబ్‌సైట్‌ను చంద్రబాబు ఇటీవలే ప్రారంభించారు. భారీగా విరాళాలు ఇచ్చిన వారిని కోమటి జయరాం, సతీష్ వేమన వంటి వారు చంద్రబాబు వద్దకు తీసుకెళ్లి పరిచయం చేస్తున్నారు. కొంతమందిని లోకేశ్, బ్రాహ్మణిల వద్దకు తీసుకెళుతున్నారు. కోమటి జయరాం నేతృత్వంలో ఇప్పటికే రూ.500 కోట్ల విరాళాలను టీడీపీకి సమకూర్చినట్లు తెలుస్తోంది. పది రోజుల్లో ఇంకా భారీగా విరాళాలు సేకరించి చంద్రబాబుకు ఇచ్చేందుకు ఆయన విశ్వప్రయత్నం చేస్తున్నారు. ఇక్కడికి వచ్చిన వారు తాము పని చేసే దేశాల నుంచి వెబ్‌సైట్ ద్వారా నిధులు తెప్పిస్తున్నారు.

ఓటర్లను కొనేయాలి..

ఎన్నికలు సమీపించడంతో ఈ గుంపులన్నీ ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ఓటర్లను ప్రలోభపెట్టే పనిని ప్రారంభించాయి. తమ గ్రామాలు, పట్టణాల్లో టీడీపీ శ్రేణుల ద్వారా వైఎస్సార్‌సీపీ కుటుంబాలను గుర్తించి, వారిని టీడీపీకి అనుకూలంగా ఓటు వేసేందుకు సిద్ధం చేయడానికి పూనుకున్నారు. ఈ విషయాన్ని కోమటి జయరాం ఇటీవల జరిగిన టీడీపీ ఎన్‌ఆర్‌ఐల సమావేశంలో స్పష్టంగా చెప్పారు. 'ఏదో ఒక విధంగా వైఎస్సార్‌సీపీ ఓటర్లను ప్రభావితం చేయాలి. అవసరమైతే ఆ వెధవలను మూడు, నాలుగు లక్షల రూపాయలు ఇచ్చి కొనేయాలి' అని సూచించారు. ఇలా ప్రతి నియోజకవర్గంలో కనీసం వెయ్యి కుటుంబాలను మార్చాలని వారికి దిశా నిర్దేశం చేశారు. ఇందుకోసం వారు మొదట జగన్ హయాంలో రాష్ట్రం అభివృద్ధి చెందలేదని, పెట్టుబడులు రాలేదని, రాజధాని లేదనే ప్రచారాన్ని ఆయా ప్రాంతాల్లో చేస్తున్నారు. ఆ విషయాలను వైఎస్సార్‌సీపీ కుటుంబాల్లో కొందరికి చెబుతూ చంద్రబాబు వస్తే ఉద్యోగాలు వస్తాయని, పరిశ్రమలు వస్తాయని మాట్లాడుతున్నారు. చంద్రబాబు హయాంలో ఏం జరిగిందో, ఎంత నష్టం జరిగిందో తమకు తెలుసని చెప్పిన వారిని.. లొంగదీసుకునేందుకు వారి అవసరాల గురించి తెలుసుకుంటున్నారు. చదువుకున్న వారు ఉంటే ఉద్యోగం ఇప్పిస్తామని, వైద్యం అవసరం ఉంటే అదంతా తాము చూసుకుంటామని చెబుతున్నారు. చివరిగా ఆర్థికంగా ఉపయోగపడతామని డబ్బు ఇవ్వజూపుతున్నారు. ఇదంతా ఒక ప్రణాళిక ప్రకారం తెలిసిన స్థానికుల ద్వారానే చేస్తున్నారు.

జగన్‌పై 'సోషల్' విషం

మరోవైపు ఏపీకి వచ్చిన గుంపులతోపాటు వివిధ దేశాల్లో ఉండి రాలేని టీడీపీ అభిమాన ఎన్‌ఆర్‌ఐలు సోషల్ మీడియాలో వైఎస్ జగన్‌కు వ్యతిరేకంగా విపరీత ప్రచారం చేస్తున్నారు. ఎల్లో మీడియా పత్రికలు బరి తెగించి అడ్డగోలుగా వ్యవహరిస్తున్నట్లే సోషల్ మీడియాలోనూ అదే పనిగా విషం కక్కుతున్నారు. వైఎస్ జగన్, వైఎస్సార్‌సీపీకి సంబంధించిన ప్రతి విషయాన్ని ప్రజల్లోకి నెగిటివ్ యాంగిల్‌లో తీసుకెళ్లి తప్పుదోవ పట్టించేలా ప్రచారం చేస్తున్నారు. ఫేస్‌బుక్, ఎక్స్ (ట్విటర్), ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, వాట్సాప్‌ను ఇందుకోసం ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. నెల రోజుల్లో నే ఈ తరహా ఖాతాలు ఆ మాధ్యమాల్లో పుట్టగొడుగుల్లా పుట్టుకురావడమే ఇందుకు నిదర్శనం. వైఎస్ జగన్ ప్రతి చర్యను హేళన చేయడం, తప్పు పట్టడం, చంద్రబాబు చేసిన ప్రతి పనినీ పొగడడం, గొప్పగా కీర్తించడమే పనిగా పెట్టుకున్నారు. కొత్తగా వేలాది వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి విచ్చలవిడిగా ఇదే ప్రచారాన్ని వైరల్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందుకు పచ్చ మీడియా తన వంతుగా శక్తి వంచన లేకుండా సహకారం అందిస్తోంది.

పచ్చ గుంపులతో ప్రజాస్వామ్యానికే ప్రమాదం

ప్రజల అభిప్రాయాలతో పని లేకుండా కేవలం చంద్రబాబుకు ప్రయోజనం చేకూర్చి, తద్వారా తాము లబ్ధి పొందాలనే ఇలాంటి ఎన్‌ఆర్‌ఐల తీరు వల్ల ప్రజాస్వామ్యానికే ప్రమాదం అని రాజకీయ విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుల దురభిమానంతో, డబ్బు ఉందనే పొగరుతో ప్రజల్ని ఏమార్చాలని చూడడం ప్రమాదకరమని వాపోతున్నారు. అడ్డూ అదుపు లేకుండా రెచ్చిపోతున్న వీరిని నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెబుతున్నారు. తక్షణం ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకుని టీడీపీ ఎన్‌ఆర్‌ఐలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గుసగుస

'చిరు'బరానంద!



హరోం హర.. అత్తిలి చిరబరా.. వాస్తు చెబుతాం.. నిధులు చెబుతాం.. అంటూ విక్రమార్కుడులో రవితేజ బయల్దేరినట్లు మెగాస్టార్ చిరంజీవి కూడా మొహమాటానికి పోయి బీజేపీ ఎంపీ అభ్యర్థి కోసం మాటసాయం చేశారు. దీంతో పాత యవ్వారాలన్నీ సోషల్ మీడియాలో ట్రోల్ అవుతున్నాయి. 2004లో టీడీపీ అభ్యర్థి అశ్వనీదత్ కోసం ముఖాన్ని అరువిచ్చి భంగపడ్డారు. 2009లో తనే ప్రజారాజ్యం పార్టీని పెట్టి, తనను, అభ్యర్థుల్ని గెలిపించాలని కోరితే.. రెండింట ఓ చోట ఆయన్ని, అధిక సీట్లలో ఆ పార్టీ అభ్యర్థుల్ని ఈడ్చి కొట్టారు. దీంతో రాజకీయాలు తన ఒంటికి సరిపడవంటూ సైడైపోయిన అన్నయ్య పద్ధతిగా సినిమాలు చేసుకోక.. 'పద్మ'రుణం తీర్చుకునేందుకు మాట సాయం చేస్తున్నారేమోనని ఫ్యాన్స్ డౌటనుమానం..!

తోక పార్టీ



పులికి తోకలా ఉండటం కన్నా.. పిల్లికి తలగానే ఉంటాను.. వీఐపీ2 సినిమాలో హీరో ధనుష్ డైలాగ్ ఇది. ఏపీలో బీజేపీ పరిస్థితి దీనికి పూర్తి రివర్స్. టీడీపీకి తోకపార్టీ కంటే హీనంగా మారింది. దీనికి పార్టీ రాష్ట్ర నాయకత్వం చంద్రబాబుకు అమ్ముడుపోవడమే కారణమన్న ఆరోపణలున్నాయి. పంపకాల్లో బీజేపీకి బలం లేని గ్రామీణ ప్రాంత సీట్లను కేటాయించారు. అర్బన్‌లో నాలుగిచ్చినా.. అందులో ముస్లిం ప్రాబల్యమున్న స్థానాలున్నాయి. ఆశలు పెట్టుకున్న ఒకటీ అరా స్థానాల్లో కూడా బీజేపీ నేతల్ని కాకుండా టీడీపీ నుంచి అరువు తెచ్చుకుని బీజేపీ తరఫున బరిలో నిలిపారు. దీంతో కేంద్ర నాయకత్వం బాబు మెడలు వంచి దక్కించుకున్న స్థానాలకు విలువ లేకుండా పోతోందని బీజేపీ సీనియర్ నేతలు, స్థానిక నాయకులు గగ్గోలు పెడుతున్నారు.

రె'బెల్స్'



పొత్తులతో ఒక్కటైన పార్టీలకు స్వపక్ష నేతలే చెమటలు పట్టిస్తున్నారు. చంద్రబాబు వెన్నుపోట్లకు బలైనవారు రెబల్స్‌గా మారి ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. పొత్తులు కట్టిన ప్రతిసారీ బాబు చేతిలో బలైపోవడం బీజేపీకి అలవాటైన పని. ఈసారి వదినమ్మ పురందేశ్వరి పుణ్యమా అని కాస్త ఎక్కువగా బీజేపీకి నష్టం కలిగించగలిగారట. దీనికి తోడు కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసినవారిని కాదని, పార్టీ ఫండ్ కోసం కొత్తవారికి సీట్లు కట్టబెట్టడంపై టీడీపీ నేతలే ఎదురుతిరుగుతున్నారు. పాడేరు, మడకశిర, ఉండి తదితర చోట్ల టీడీపీ నేతలు, గన్నవరంలో బీజేపీ నేత రెబల్‌గా నామినేషన్లు దాఖలు చేశారు. రెండు రోజుల్లో రెబల్స్ నామినేషన్లు డబుల్ డిజిట్‌కు చేరుకుంటాయని టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు చెవులు కొరుక్కుంటున్నాయి.

తెంటూ.. తంటా

విజయనగరం జిల్లా తెర్లాం(ప్రస్తుత బొబ్బిలి) నియోజకవర్గంలో ఒకప్పుడు తెంటు లక్ష్మునాయుడు బొబ్బిలి రాజులకు ఎదురొడ్డి నాగలి గుర్తుపై పోటీ చేశారు. నియోజకవర్గంలో అత్యధికులుగా ఉన్న బీసీలపై రాజుల పెత్తనమేంటని ప్రశ్నిస్తూ ప్రచారంలో ఊదరగొట్టారట! తర్వాతి తరంలో ఆయన కుమారుడు జయప్రకాష్ కూడా రాజులకు వ్యతిరేకంగానే ఉండేవారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. పరిస్థితి మారింది. తాత పేరే పెట్టుకున్న జయప్రకాష్ తనయుడు లక్ష్మునాయుడు(రాజా) మాత్రం బొబ్బిలి రాజులకు దాసోహమయ్యారు. బేబినాయన వెంట ప్రచారంలో పాల్గొనడాన్ని చూసిన జనం తాత పరువు తీసేశావు కదయ్యా.. అంటూ గుసగుసలు పోతున్నారు.

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

సర్వనాశనం నిజమే!



ఊరూ, వాడ వాడ బాబు తెరిపించిన బెల్ట్ షాపులు సర్వనాశనం	నాడు లబ్ధిదారుల కడుపుకొట్టిన కాలకేయులంతా సర్వనాశనం	అదిగో, ఇదిగో రాజధాని అంటూ మోసం చేసిన రియల్టర్‌లు సర్వనాశనం
ప్రజలను పీల్చి పిప్పి చేసిన జన్మభూమి కమిటీలు సర్వనాశనం	ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసిన దందా సర్వనాశనం	పేదల నోటికాడి రేషన్‌ను పక్కదారి పట్టించిన మాఫియా సర్వనాశనం
ప్రతి పనికీ వెల కట్టి.. లంచాలు వసూలు చేసిన వ్యవస్థ సర్వనాశనం	నీకింత, నాకింత అంటూ దోచుకుతిన్న దుర్మార్గ వ్యవస్థ సర్వనాశనం	ఈ ఐదేళ్లలో ఇవన్నీ సర్వనాశనం అయ్యాయి కాబట్టే చంద్రబాబు అరుపులు
కాల్ మనీ సెక్స్ రాకెట్‌తో వేధించుకుతిన్న కేటుగాళ్లంతా సర్వనాశనం	బంగారం పండే భూములను బీడుగా మార్చిన బ్యాచ్ సర్వనాశనం	మళ్లీ ఆ వ్యవస్థలను తేవాలన్నదే దుష్టచతుష్టయం, దత్తపుత్రుడి లక్ష్యం

బాబు దోపిడీతో కుదేలైన రాష్ట్రాన్ని సంస్కరణలతో పునర్నిర్మిస్తున్న సీఎం జగన్

రాష్ట్రంలో 2014 నుంచి 2019 వరకు తను కష్టపడి నిర్మించిన అవినీతి సామ్రాజ్యం అంతా సర్వనాశనం అయిపోయిందని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఊరూరా రంకెలేస్తున్నారు. అక్రమంగా సంపాదించడం, దుష్టచతుష్టయం అంతా కలిసి పంచుకోవడమే ధ్యేయంగా బాబు ఐదేళ్ల పాలన సాగింది. 2019లో వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కాగానే ఆ అవినీతి సామ్రాజ్యం బీటలువారింది. ఒక్కో అక్రమ వ్యవస్థ కుప్పకూలుతూ వచ్చింది. ఆ దుర్మార్గ వ్యవస్థలన్నింటినీ సీఎం వైఎస్ జగన్ సర్వనాశనం చేసింది వాస్తవమే. వాటన్నింటినీ కూకటివేళ్లతో పెకిలించి వేయడంతో చంద్రబాబుతో కూడిన దుష్టచతుష్టయం, ఆయన దత్తపుత్రుడు గావుకేకలు పెడుతున్నారు. ఏ వ్యవస్థలు నాశనం అయ్యాయో.. ఏ వ్యవస్థలు బాగుపడ్డాయో ఐదేళ్లుగా జనం చూస్తూనే ఉన్నారు.

సాక్షి, అమరావతి : అందినకాడికి దోచుకోవడం.. వారంతా కలిసి పంచుకోవడమే లక్ష్యంగా సాగిన దందాకు రాష్ట్రంలో బ్రేక్ పడటంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అంతా సర్వనాశనం చేశారంటూ చంద్రబాబు గగ్గోలు పెడుతున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు సృష్టించిన ప్రజాకంటక వ్యవస్థలను సీఎం వైఎస్ జగన్ సర్వనాశనం చేసింది వాస్తవమే. బెల్ట్ షాపులు, కాల్ మనీ సెక్స్ రాకెట్లు, ప్రైవేటు విద్యా సంస్థల దోపిడీ మొదలు.. అమరావతి రియల్ ఎస్టేట్ వ్యాపారం వరకు చంద్రబాబు సృష్టించిన ఆ వ్యవస్థలకు రూపు లేకుండా చేశారు. చంద్రబాబు దోపిడీ మార్గాలకు పూర్తిగా అడ్డుకట్ట పడింది. కమీషన్ల కోసం తాను ఏర్పాటు చేసుకున్న వ్యవస్థలను సీఎం వైఎస్ జగన్ చావుదెబ్బ తీయడంతో చంద్రబాబు బెంబేలెత్తిపోతున్నారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి 1995లో అధికారాన్ని చేజిక్కించుకున్న చంద్రబాబు.. మద్యపాన నిషేధాన్ని ఎత్తేయడం ద్వారా 1994 ఎన్నికల్లో టీడీపీ ఇచ్చిన హామీని తుంగలో తొక్కి ప్రజలను మోసం చేశారు. మద్యం షాపులకు అనుబంధంగా వాడవాడన బెల్ట్‌షాపులు తెరిపించి 1995 నుంచి 2004 వరకు మద్యాన్ని ఏరులై పారించి, కమీషన్లు దండుకున్నారు. విభజన తర్వాత 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. మద్యం షాపులకు అనుబంధంగా 43 వేల బెల్ట్ షాపులు తెరిపించారు. తద్వారా భారీ ఎత్తున కమీషన్లు పుచ్చుకున్నారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక ఆ బెల్ట్ షాపులన్నింటినీ లేకుండా చేశారు. చంద్రబాబు కమీషన్లకు చిహ్నమైన బెల్ట్ షాపులను సర్వనాశనం చేశారు.

కాలకేయుల దాష్టీకాలకు అడ్డుకట్ట

ప్రభుత్వ సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం 2014లో జన్మభూమి కమిటీలనే రాజ్యాంగేతర వ్యవస్థను చంద్రబాబు తెరపైకి తెచ్చారు. ఆ కమిటీలను టీడీపీ నేతలతో నింపేశారు. పెన్షన్ దగ్గర నుంచి ఆదరణ పథకం కింద పని ముట్లు దాకా ఏ పథకం కింద లబ్ధి పొందాలన్నా ఆ కమిటీల ఆమోదం తప్పనిసరి. వాటిని పొందడానికి అర్హత ఉన్నా సరే.. ఆ కమిటీల్లోని పచ్చ కాలకేయుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగి.. అడిగినంత మేర లంచాలు ఇచ్చుకున్నా పథకాల ద్వారా లబ్ధి చేకూర్చేవారు కాదు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక అర్హతే ప్రామాణికంగా.. వివక్ష, లంచాలకు తావులేకుండా అందరికీ సంక్షేమ పథకాల ఫలాలను అందిస్తున్నారు. పచ్చ కాలకేయులతో చంద్రబాబు ఏర్పాటు చేసిన రాజ్యాంగేతర వ్యవస్థ అయిన ప్రజాకంటక జన్మభూమి కమిటీలను సర్వనాశనం చేశారు.

బినామీల విద్యా వ్యాపారానికి చెక్

నారాయణ విద్యా సంస్థల అధినేత పొంగూరు నారాయణ.. చంద్రబాబుల మధ్య అవినాభావ సంబంధం ఉంది. చంద్రబాబు బినామీ నారాయణ. ప్రభుత్వ బడులను నాశనం చేసి.. ప్రజలను ప్రైవేటు స్కూళ్ల వైపు మళ్లించి.. నారాయణ వంటి విద్యా వ్యాపారిని ముందుపెట్టి, భారీ ఎత్తున ఫీజులు పెంచేసి ఆకాశమే హద్దుగా దోపిడీకి పాల్పడ్డారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేశారు.

ఇంగ్లిష్ మీడియంలో సీబీఎస్‌ఈ సిలబస్ బోధిస్తున్నారు. అమ్మ ఒడి కింద విద్యార్థుల తల్లులకు రూ.15 వేలు.. జగనన్న విద్యా కానుక కింద పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగ్, యూనిఫామ్స్, సాక్స్‌లు, బూట్లతోపాటు గోరు ముద్ద పథకం ద్వారా రుచికరమైన భోజనం పెడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధన చేస్తుండటంతో ప్రైవేటు పాఠశాలల దోపిడీకి చెక్ పడింది. తద్వారా చంద్రబాబు బినామీల విద్యా వ్యాపారాన్ని సీఎం వైఎస్ జగన్ సర్వనాశనం చేశారు.

కాల్ మనీ సెక్స్ రాకెట్ పీడ విరగడ

వ్యవసాయ రుణాలు రూ.87,612 కోట్లు, డ్వాక్రా రుణాలు రూ.14,205 కోట్లు మాఫీ చేస్తానని 2014 ఎన్నికల్లో హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక వాటికి తూట్లు పొడిచారు. దాంతో రైతులు, మహిళలు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఇదే అదనుగా వడ్డీ వ్యాపారులు, కాల్‌మనీ సెక్స్ రాకెట్‌గాళ్లు అధిక వడ్డీకి రుణాలు ఇచ్చి.. సకాలంలో చెల్లించని మహిళల మాన ప్రాణాలతో చెలగాటమాడారు. విజయవాడలో వెలుగు చూసిన కాల్‌మనీ సెక్స్ రాకెట్ దురాగతాలే అందుకు పరాకాష్ట. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ రూపంలో పేదల ఖాతాల్లో రూ.2.70 లక్షల కోట్లు జమ చేశారు. పొదుపు సంఘాల మహిళలకు సున్నా వడ్డీకే విరివిగా రుణాలు అందిస్తున్నారు. సీఎం జగన్ ఆర్థికంగా తోడ్పాటు అందిస్తుండటంతో వడ్డీ వ్యాపారులు, కాల్‌మనీ సెక్స్ రాకెట్‌గాళ్లను రుణం కోసం ఆశ్రయించాల్సిన అగత్యం లేకుండా పోయింది. చంద్రబాబు సృష్టించిన కాల్ మనీ సెక్స్ రాకెట్లను సీఎం జగన్ సర్వనాశనం చేయడంతో వాటి పీడ విరగడైందని ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

నామినేషన్ దందాకు ముగింపు

అడిగినంత కమీషన్లు ఇచ్చిన కాంట్రాక్టర్లకు నామినేషన్ పద్ధతిలో వేలాది కోట్ల పనులను చంద్రబాబు అప్పగించారు. జాతీయ ప్రాజెక్టు పోలవరం హెడ్ వర్క్స్ పనుల్లో ఏకంగా రూ.2,917 కోట్ల విలువైన పనులు ఈనాడు రామోజీరావు వియ్యంకుడికి చెందిన నవయుగకు నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టడమే అందుకు తార్కాణం. నీరు–చెట్టు కింద ఏకంగా రూ.పది వేల కోట్ల విలువైన పనులను కాంట్రాక్టర్ల ముసుగేసుకున్న టీడీపీ నేతలు, కార్యకర్తలకు కట్టబెట్టి ప్రభుత్వ ఖజానాను దోచుకున్నారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక చంద్రబాబు నామినేషన్ దందాకు ముగింపు పలికారు. అప్పట్లో నామినేషన్ పద్ధతిలో ఇచ్చిన పనులను రద్దు చేసి.. వాటికి రివర్స్ టెండరింగ్ నిర్వహించి ప్రభుత్వ ఖజానాకు భారీ ఎత్తున ఆదా చేశారు. ఒక్క పోలవరం హెడ్ వర్క్స్ పనులకు నిర్వహించిన రివర్స్ టెండరింగ్‌లోనే ప్రభుత్వ ఖజానాకు రూ.780 కోట్లు ఆదా కావడమే అందుకు నిదర్శనం. చంద్రబాబుకు కమీషన్ల వర్షం కురిపించిన నామినేషన్ పద్ధతిని సీఎం జగన్ సర్వనాశనం చేశారు.

అమరావతి రియల్ ఎస్టేట్ కలలు కల్లలు

సంక్షోభాన్ని అవకాశంగా మల్చుకుని.. రాజధాని లేని రాష్ట్రానికి దేవతల రాజధానిని తలదన్నేలా అమరావతిని నిర్మిస్తానని 2014లో చంద్రబాబు ప్రగల్భాలు పలికారు. ఓత్ ఆఫ్ సీక్రెసీని తుంగలో తొక్కి.. రాజధాని ఏర్పాటుపై ముందే వందిమాగధులకు లీకులు ఇచ్చి ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడి రైతుల నుంచి తక్కువ ధరలకే భూములు కాజేశారు. అలా కొల్లగొట్టిన భూముల సమీపంలోనే రాజధానిని ఏర్పాటు చేశారు. రాజధానిలో 1,691 ఎకరాలను సింగపూర్ ప్రైవేటు సంస్థలకు స్టార్టప్ ఏరియా ప్రాజెక్టు పేరుతో కట్టబెట్టి.. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి రూ.లక్ష కోట్లకుపైగా దోపిడీకి చంద్రబాబు స్కెచ్ వేశారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక స్టార్టప్ ఏరియా ప్రాజెక్టును రద్దు చేసి చంద్రబాబు రియల్ ఎస్టేట్ కలలను కల్లలు చేశారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా.. మూడు ప్రాంతాల మనో భిప్రాయాల మేరకు మూడు రాజధానులు ఏర్పాటు చేయాలని నిర్ణయించడంతో చంద్రబాబు అమరావ తి రియల్ ఎస్టేట్ వ్యాపారం కలలు కల్లలయ్యాయి.



ఏపీలో టెన్త్ క్లాస్ ఫలితాలు వచ్చాయి.
టెన్త్‌లో స్టేట్ టాపర్ ఓ అమ్మాయి.
పేరు... వెంకట నాగసాయి మనస్వి.
ఎన్ని మార్కులొచ్చాయంటే...
వందకు వంద. వందకు వంద.
ఇలా ఒకటి కాదు... రెండు కాదు...
ఏకంగా ఐదు సబ్జెక్టుల్లో
వందకు వంద.
హిందీలో మాత్రం
ఒకటి తగ్గించుకుంది.
మొత్తంగా 600కి
599 మార్కులు!!
పేపర్‌లు దిద్దే
టీచర్లకే ఓ పరీక్ష.

టీచర్‌గారమ్మాయి! స్టేట్ ఫస్ట్!!

ఆకుల వెంకట నాగసాయి మనస్విది ఏలూరు జిల్లా, నూజివీడు పట్టణం. ఈ అమ్మాయి పదోతరగతిలో రాష్ట్రస్థాయిలో అత్యధిక మార్కులు సాధించింది. ఏటా ఎవరో ఒకరు ఈ రికార్డు సాధిస్తారు. కానీ ఇన్ని మార్కులు తెచ్చుకోవడం ఆమె సాధించిన మరో రికార్డు. 600కి ఒక్క మార్కు తక్కువగా 599 మార్కులతో ఉత్తీర్ణత సాధించడం పదవ తరగతి పరీక్షలకు కూడా రికార్డే.

మా నాన్నే హీరో!

చదువుకోవడమే జీవిత లక్ష్యం అన్నట్లు చదువుకుంటున్న మనస్వి నేపథ్యం కూడా పుస్తకాలమయమే. ఆమె తల్లి నాగ శైలజ, తండ్రి నాగ వరప్రసాదరావు ఇద్దరూ గవర్నమెంట్ స్కూల్ టీచర్‌లు. వెంకట నాగ సాయి మనస్వి వారి ఏకైక సంతానం. మనస్వికి క్లాసు పుస్తకాలు చదవడమే కాకుండా మంచి రీడింగ్ హ్యాబిట్ కూడా ఉంది. అయితే హాబీగా చదివే పుస్తకాలు కూడా కాలక్షేపం కోసం అన్నట్లు ఉండవు, మంచి సబ్జెక్టు ఉన్నవే కావడం విశేషం. సిలబస్ ద్వారా తెలుసుకున్న విషయాలకు మరికొంత సమాచారాన్ని అందించేవిగా ఉంటాయి. ''నా రోల్ మోడల్ మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్. స్పోర్ట్స్‌లో క్రికెట్ అంటే క్రేజ్. కానీ ఆడడానికి సమయం ఉండదు. మ్యాచ్ వస్తుంటే వీలయినంత సేపు చూస్తాను. విరాట్ కోహ్లీ ఆట నచ్చుతుంది. సినిమాలు చూస్తాను కానీ చాలా తక్కువ. నాకు నచ్చే హీరో రామ్ చరణ్. అందరికంటే ఈ ప్రపంచంలో నాకు అత్యంత ఇష్టమైన వ్యక్తి మా నాన్న. మా నాన్న కంటే బెస్ట్ హీరో మరెవరూ ఉండరు. ఆయన ఎప్పుడూ ఖాళీగా ఉండరు. నాన్న పాతికేళ్ల కిందట డీఎస్సీ రాశారు. కానీ ప్రభుత్వ ఉద్యోగం రాలేదు. దాంతో ట్యూషన్‌లు చెప్పారు. వ్యవసాయం చేశారు. గత ఏడాది గవర్నమెంట్ చేసిన రిక్రూట్‌మెంట్‌లో నాన్నకు ఉద్యోగం వచ్చింది. తన చదువుకు తగిన ఉద్యోగం వచ్చే వరకు ఆయన నిరాశపడకుండా ఎదురుచూశారు'' అని సంతోషంగా చెప్పింది మనస్విని. ఇంతలో వాళ్ల తల్లి మాట్లాడుతూ ''మనస్వి చిన్నప్పటి నుంచి చదువులో చురుగ్గా ఉండేది. పదవ తరగతిలో చాలా కష్టపడింది. ఇక చాలు నిద్రపొమ్మని చెప్పినా వినేది కాదు. అర్ధరాత్రి వరకు చదువుతూనే ఉండేది. సిలబస్ పూర్తికాకపోతే తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి చదువుకునేది. మంచి మార్కులు వస్తాయనుకున్నాం. కానీ ఇన్ని మార్కులు తెచ్చుకుంటుందని, రికార్డు సాధిస్తుందని ఊహించలేదు. తల్లిదండ్రులుగా మాకు ఇంతకంటే సంతోషం మరి ఏముంటుంది'' అని ఆనందం వ్యక్తం చేశారామె. అత్యధిక మార్కుల సాధనలో మనస్వి రికార్డును భవిష్యత్తులో మరొకరు బ్రేక్ చేయడం అంత సులువు కాకపోవచ్చు. మనస్వి మార్కుల రికార్డు ఎప్పటికీ ఆమెకే ఉండిపోవచ్చు కూడా.

– ఉమ్మా రవీంద్ర రెడ్డి, సాక్షి, ఏలూరు జిల్లా



టెక్స్ట్ బుక్ చదివాను!

టెన్త్ క్లాస్ మార్కుల లిస్ట్ మనకు జీవితమంతా తోడు ఉంటుంది. డేట్ ఆఫ్ బర్త్ కోసం మాత్రమే కాదు మనకు చదువు మీద ఉండే ఇష్టానికి ప్రతిబింబం. అందుకే అంత ఎక్కువ కష్టపడ్డాను. మా అమ్మానాన్న నా కోసం తీసుకుంటున్న శ్రద్ధ అంతా ఇంతా కాదు. వారికి నేనివ్వగలిగిన గొప్ప బహుమతి మంచి మార్కులే. పరీక్షలకు ప్రిపరేషన్‌లో నేను గైడ్‌లు, నోట్స్ కంటే ఎక్కువగా టెక్స్ట్‌బుక్స్ చదివేదానిని. టాపర్ అనే లక్ష్యాన్ని పెట్టుకోలేదు. కానీ మంచి మార్కులు రావాలని కష్టపడ్డాను. మొత్తానికి నేను కోరుకున్నదానికంటే మించిన ఫలితాన్ని అందుకున్నాను. సంతోషంగా ఉంది. నాకు మ్యాథ్స్ ఇష్టం. ఐఐటీలో ఇంజినీరింగ్ చేసి జీవితంలో ఉన్నత స్థానంలో స్థిరపడాలనేది నా లక్ష్యం.

- ఆకుల వెంకట నాగ సాయి మనస్వి,
టెన్త్ క్లాస్ స్టేట్ టాపర్, ఆంధ్రప్రదేశ్.

నేడు ప్రపంచ పుస్తక దినోత్సవం

ఆత్మవిశ్వాసం నుంచి లోతైన విషయ విశ్లేషణ వరకు పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాల గురించి శాస్త్రీయ పరిశోధనలు నొక్కి చెబుతున్నాయి. పిల్లలకు 'పాఠ్యపుస్తకం' తప్ప కాల్పనిక పుస్తకాలు చదవడం అనేది కలగా మారిన ఈ కాలంలో, పిల్లలను స్క్రీన్ ఎడిక్షన్ నుంచి దూరం చేసి పుస్తక పఠన అభిరుచిని పెంపొందించడానికి కేరళకు చెందిన రియా జార్జ్ 'కుటుబుక్ యూ' స్టార్టప్ ద్వారా కృషి చేస్తోంది. పిల్లల అభిరుచిని దృష్టిలో పెట్టుకొని బుక్ సబ్‌స్క్రిప్షన్ సర్వీస్ ప్రారంభించింది. 'రైజింగ్ రీడర్స్' నినాదంతో 'సోనాలీస్ బుక్ క్లబ్' ఫౌండర్, నటి సోనాలీ బింద్రేతో 'కుటుబుక్ యూ' కలిసి పని చేస్తోంది.



● సోనాలీ బింద్రే, రియా జార్జ్

మిషన్ ఆర్‌ఆర్
రైజింగ్ రీడర్స్

కోవిడ్ టైమ్ అనేది పిల్లలను స్క్రీన్‌కు హత్తుకుపోయేలా చేయడమే కాదు అదొక వ్యసనం అయ్యేలా చేసింది. పుస్తకం పఠనం అనేది అరుదైన దృశ్యం అయింది. ఈ నేపథ్యంలో స్క్రీన్ టైమ్‌ను, పుస్తక పఠనంతో బ్యాలెన్సింగ్ చేయడానికి పిల్లల ముందుకు వచ్చింది చిల్డ్రన్స్ బుక్ సబ్‌స్క్రిప్షన్ సర్వీస్ ... కుటుబుక్ యూ.

కుటుబుకు అంటే... పుస్తకాలను బాగా ఇష్టపడడం, పుస్తకాల పురుగు అని అర్థం.

మన జాతీయ విద్యావిధానంలో లైబ్రరీ కల్చర్ వెల్లివిరియడం ఒకటి. పిల్లలు పుస్తకాల సంస్కృతికి దూరం అవుతున్న నేపథ్యంలో, పాఠ్యపుస్తకాల గురించి తప్ప పర పుస్తకాల గురించి మాట్లాడడం కాలహరణం అనే అపోహ పాతుకుపోయిన కాలంలో పుస్తకాల వెలుగును 'కుటుబుక్ యూ'లాంటి సంస్థలు పిల్లలకు దగ్గర చేస్తున్నాయి.

'కాలం ఎంత మారినా సరే కొన్నిటిని రీప్లేస్ చేయలేము.. పుస్తకం అలాంటిదే' అంటున్న బుక్‌యూ, పుస్తకపఠనం వల్ల సంతోషస్థాయి పెరగడం, టాకింగ్ స్కిల్స్, క్రియేటివిటీ, ఇమాజినేషన్ మెరుగుపడడం, శక్తిమంతం కావడం గురించి ప్రచారం చేస్తోంది.

'పుస్తకాన్ని మీ పిల్లలకు నేస్తం చేయండి' నినాదంతో కేరళలోని వయనాడ్ నుంచి మొదలైంది కుటుబుక్ యూ. పిల్లల వయసు, అభిరుచిని బట్టి కుటుబుక్ యూ 'బుక్ బాక్స్' నుంచి నచ్చిన పుస్తకాన్ని ఎంపిక చేసుకోవచ్చు. పిల్లలను లైఫ్‌లాంగ్ రీడర్‌లుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తోంది కుటుబుక్ యూ.

'పుస్తకాలకు పిల్లలు దూరం అవుతున్నారని బాధపడుతుంటాం. అయితే పిల్లలను పుస్తకాలతో ప్రేమలో పడేలా చేయడం అంత కష్టమేమీ కాదు. సరైన సమయంలో సరైన పుస్తకాలు ఇవ్వాలి. పిల్లలకు తమవైన ఆసక్తులు ఉంటాయి. ఆ ఆసక్తిని, పుస్తకంతో మ్యాచ్ చేయాలి. ఒక ఎడ్యుకేటర్‌గా నాకు పిల్లల మనస్తత్వం బాగా తెలుసు. పుస్తకాలను బాగా ఇష్టంగా చదివే పిల్లలను, పుస్తకాలు అంటేనే ముఖం అటు తిప్పుకునే పిల్లలను చూశాను. పుస్తకాలు అంటే అయిష్టంగా ఉండే పిల్లలు కూడా ఏదో ఒక సందర్భంలో తమకు నచ్చిన పుస్తకం చదవడం ద్వారా పఠనాసక్తిని పెంచుకోవడాన్ని చూశాను' అంటుంది 'కుటుబుక్ యూ' చీఫ్ బుక్స్ క్యూరేటర్ రియా జార్జ్. నిట్, కాలికట్‌లో ఇంజినీరింగ్ చేసిన జార్జ్ ఐఎంటీ, ఘజియాబాద్‌లో ఎంబీఏ చేసింది. 'కరికులమ్ అండ్ టీచింగ్'లో మాస్టర్స్ డిగ్రీ చేసింది. ఫిన్‌ల్యాండ్, సింగపూర్‌లోని విద్యావేత్తలతో కలిసి పనిచేసింది.

పుస్తకపఠన ఆసక్తిని పిల్లల్లో పెంపొందించడానికి జార్జ్ ఎంతోమంది తల్లిదండ్రులతో మాట్లాడి రకరకాల ఐడియాలతో వారికి మార్గనిర్దేశం చేస్తోంది. ఒక పుస్తకానికి సంబంధించిన హైలైట్స్‌ను ఏ5 సైజ్ కార్డుల ద్వారా పిల్లలకు చేరువ చేయడం, ఒక పుస్తకాన్ని పిల్లలు చదవడం పూర్తి చేసిన తరువాత ఆ పుస్తకానికి సంబంధించిన యాక్టివిటీస్ రూపొందించడం... ఆ ఐడియాలలో కొన్ని.

పుస్తకంతో కొత్త ప్రపంచంలోకి...

గత ఏడు సంవత్సరాలుగా సోనాలీస్ బుక్ క్లబ్ (ఎస్‌బీసీ) అనేది నా ప్యాషన్ ప్రాజెక్ట్. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఎంతోమంది పుస్తక ప్రేమికులతో కనెక్ట్ అయ్యాను. పుస్తకం రెక్కలతో మేము కొత్త ప్రపంచంలోకి వెళ్లాం. ఎన్నో పుస్తకాల గురించి మాట్లాడుకున్నాం. రచయితలతో చర్చలు చేశాం. పిల్లలతో కలిసి పుస్తకాలు చదువుకున్నాం. పుస్తకాలు చదవడం అనేది మా పిల్లాడికి బాగా ఇష్టమైన అభిరుచిని చేయడానికి కృషి చేస్తున్నాను. కుటుంబ బంధాలను బలోపేతం చేయడంలో, పిల్లలతో అర్థవంతమైన సంభాషణలు జరపడంలో పుస్తకం కీలక పాత్ర పోషిస్తుంది. మా పిల్లాడితో కలిసి పిల్లల పుస్తక ప్రపంచంలోకి వెళ్లడం నాకు ఇష్టమైన పని. రైజింగ్ రీడర్స్ ఉద్యమంలో భాగం కావడం నాకెంతో సంతోషాన్ని ఇస్తోంది.

-సోనాలి బింద్రే, ఎస్‌బీసీ ఫౌండర్



సాగుబడి
భరణి కార్తె : ఏప్రిల్ 27 నుంచి

ఈ సంవత్సరం వేసవిలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ప్రజలతోపాటు పశు పక్ష్యాదులు కూడా దీర్ఘకాలం పాటు వడగాడ్పులను ఎదుర్కోవలసిన గడ్డు పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ప్రతికూల వాతావరణం పాడి పశువులను పోషిస్తున్న రైతులకు పెను సవాళ్లు విసురుతోంది. పాడి పశువులు అధిక వేడి వత్తిడికి గురైతే పాల దిగుబడి తగ్గిపోవటంతో పాటు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉంది. ముఖ్యంగా అధిక పాలదిగుబడినిచ్చే ఆవులు, గేదెలు ఇతర పశువులతో పోల్చితే ఎక్కువ ఇబ్బందిపడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో కర్ణాటకకు చెందిన 'అక్షయకల్ప' సంస్థ పాడి పశువులను ఎండ వేడిమి ముప్పు నుంచి కాపాడుకునే అనేక మెలకువలను రైతులకు సూచిస్తోంది. ప్రత్యేక డిజైన్‌తో ఆ సంస్థ రూపొందించిన పశువుల షెడ్డు పశువులు వేడి వత్తిడిని తట్టుకోవటానికి ఎంతగానో ఉపయోగపడటంతో పాటు పాల దిగుబడిని కూడా పెంచుతోందని అక్షయకల్ప ఆర్గానిక్ ప్రతినిధి డాక్టర్ తేజేశ్వర్ రెడ్డి 'సాక్షి సాగుబడి'తో చెప్పారు. ఆసక్తికరమైన ఈ వివరాలతో ప్రత్యేక కథనం...

వేడి ఒత్తిడి చిత్తు!

● పశువులను కట్టెయ్యకుండా దొడ్డిలో స్వేచ్ఛగా వదలటం వేడి ఒత్తిడి (హీట్ స్ట్రెస్)ని ఎదుర్కొనే దిశగా చెయ్యాల్సిన మొదటి పని ● గోడల్లేని విశాలమైన షెడ్లతో పాటు పందిరి/షామియానాలతో కృత్రిమ నీడను కల్పించాలి ● తుంపర్ల వాన ఏర్పాటు చేయాలి / తరచూ పశువులను నీటితో తడుపుతూ ఉండాలి ● ఒంటి మీద తడి గోనె పట్టా వెయ్యాలి ● పుష్కలంగా నీటిని, పోషకాలతో కూడిన మేత అందుబాటులో ఉంచాలి.



● వేడిని తట్టుకునేలా వినూత్నంగా అక్షయకల్ప డిజైన్ చేసిన ఓపెన్ షెడ్



● చల్లదనం కోసం వేసిన టెంట్లు



15 నుంచి 27 డిగ్రీల సెల్షియస్ ఉష్ణోగ్రతలో సంకరజాతి పాడి ఆవులు సౌకర్యవంతంగా జీవిస్తూ మంచి పాల దిగుబడిని అందిస్తాయి. దేహంలో సహజ జీవక్రియ ద్వారా పుట్టే వేడికి వాతావరణంలో అధిక వేడి తోడైనప్పుడు జంతువు వేడి ఒత్తిడికి గురవుతుంది. అప్పుడు పశువు దేహంలో శక్తి వినియోగంలో మార్పు వస్తుంది. ప్రాధాన్యం పాల ఉత్పత్తి వైపు నుంచి ఆరోగ్య నిర్వహణ వైపు మళ్ళుతుంది. పశువు వేడి వత్తిడి (హీట్ స్ట్రెస్)కి గురైనప్పుడు దాని నిర్వహణ అవసరాలు 35% వరకు పెరుగుతాయి. పాల ఉత్పత్తి, పునరుత్పత్తి, ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు పడతాయి. అందువల్ల, వాతావరణంలో ఉష్ణోగ్రత సాధారణ స్థాయిని మించి పెరుగుతూ ఉన్నప్పుడు పశు పోషణకు రైతులు అప్రమత్తతతో వ్యవహరించటం అవసరం.

ఉష్ణోగ్రతను నియంత్రించే షెడ్డు

పాడి పశువులు, ముఖ్యంగా సంకరజాతి ఆవులు, ఎండ వేడిమిని సమర్థవంతంగా తట్టుకోవాలంటే సాధారణంగా నిర్మించే పద్ధతిలో కాకుండా ప్రత్యేక డిజైన్‌ను అనుసరిస్తే మేలని 'అక్షయకల్ప' రైతులకు సూచిస్తోంది. ఉష్ణోగ్రతను నియంత్రించే పశువుల షెడ్‌ల నమూనాకు ఈ సంస్థ నిపుణులు కొన్ని ఏళ్ల క్రితమే రూపకల్పన చేశారు. ఎంపిక చేసిన డెయిరీ ఫామ్‌లలో ఈ 'ఉష్ణోగ్రతను నియంత్రించే షెడ్‌ల'ను పైలట్ ప్రాతిపదికన అమలు చేశారు. సత్ఫలితాలు సాధించిన తర్వాత ఇతర రైతులకు ఈ నమూనాను సంస్థ సూచిస్తోంది. షెడ్డు నాలుగు వైపుల నుంచీ సహజంగా గాలి, వెల్తురు వచ్చేలా, విశాలంగా, తగినంత ఎత్తు ఉండాలి. అన్ని వైపులా సహజ గాలి, వెల్తురు పారాడే వీలు కల్పించటంతోపాటు.. వేడి గాలి వెళ్లిపోడానికి పైకప్పు మధ్యలో ఖాళీ స్థలం వదలాలి. పైకప్పు ఆస్బెస్టాస్ రేకులకు బదులు జింక్ రేకులు వాడాలి. సౌకర్యవంతమైన ఫ్లోరింగ్‌ను కలిగి ఉండటం ఈ నమూనా ముఖ్యాంశాలు.

పెరిగిన పాల దిగుబడి

తమ డిజైన్ ప్రకారం ప్రత్యేకంగా రూపొందించిన షెడ్‌లలో 2016 నుంచి 2022 మధ్య కాలంలో పెరిగిన ఆవుల రోజువారీ సగటు పాల దిగుబడి (సాంప్రదాయ షెడ్‌లలో పెరిగిన ఆవులతో పోలిస్తే) 1.2 లీటర్ల నుంచి 3.7 లీటర్ల మేరకు అధికమని తమ అధ్యయనంలో తేలిందని అక్షయకల్ప ఆర్గానిక్ ప్రతినిధి డాక్టర్ తేజేశ్వర్ రెడ్డి తెలిపారు.

ఈ షెడ్లను కూడా చౌకగానే నిర్మించవచ్చు. ఒక అంచనా ప్రకారం.. గోడలతో మూసివేసినట్లుండే సంప్రదాయ షెడ్ నిర్మాణానికి రూ. 3,20,725 ఖర్చు అవుతూ ఉంటే.. అక్షయకల్ప నమూనా ప్రకారం నాలుగు వైపులా గోడలు లేకుండా ఎత్తుగా నిర్మించే షెడ్డుకు రూ. 1,70,000 ఖర్చవుతుందని తెలిపారు. ఈ షెడ్డు వల్ల పెరిగిన ఉత్పాదకత రైతులకు అధిక ఆర్థిక ప్రయోజనాలను అందిస్తుందని అక్షయకల్ప రైతుల అనుభవాలు చెబుతున్నాయి.

వేడి ఒత్తిడిని ఎదుర్కొనే ఉపాయాలు

● ఆవులను ఎప్పుడూ షెడ్డు కింద కట్టేసి ఉంచకూడదు. చుట్టూ గట్టి కంచె ఉన్న దొడ్డిలో గోడలు లేకుండా ఎత్తుగా నిర్మించిన షెడ్‌లో స్వేచ్ఛగా తిరగనివ్వాలి ● వడ గాడ్పులు ఉన్నప్పుడు తరచూ నీటిని తుంపర్లుగా చల్లేందుకు పశువుల షెడ్డులో మైక్రో స్ప్రింక్లర్లు లేదా మిస్టర్లను ఏర్పాటు చేసుకోవాలి ● ఇది వీలుకాకపోతే తడిపిన గోనె పట్టాలను పశువు నడుముపై వేసి చల్లదనాన్ని కలిగించాలి. పట్టా తడి ఆరిపోకుండా గమనించాలి ● అధిక వేడి ఉండే రోజుల్లో పశువులు వీలైతే దొడ్డిలోని చెట్ల నీడన సేద తీరే అవకాశం కల్పించాలి లేదా షామియానా వంటి కృత్రిమ నీడను ఏర్పాటు చెయ్యాలి ● ఎక్కువ పశువులను తక్కువ స్థలంలో ఉంచవద్దు. ఇరుకు స్థలంలో ఎక్కువ పశువులు ఉంటే శరీరంలో అధికంగా ఉష్ణం పెరుగుతుంది. గాలి ప్రసరణ తగ్గుతుంది ● నిరంతరం స్వచ్ఛమైన నీటి సరఫరా పుష్కలంగా ఉండేలా చూడాలి. ఆవులు వేడి వాతావరణంలో ఎక్కువ నీరు తాగి శరీర ఉష్ణోగ్రతను నియంత్రించుకోవటానికి అవకాశం కల్పించాలి ● పరిసరాలను చల్లబరచడానికి స్ప్రింక్లర్లు లేదా మిస్టర్లను అమర్చండి లేదా శరీరంపై నేరుగా నీరు చల్లండి ● చల్ల పూటల్లోనే మేత, దాణా ఇవ్వండి ● వేడి ఒత్తిడి సమయంలో ఆవు జీవక్రియకు తోడ్పడేందుకు తగిన శక్తి, ప్రొటీన్, ఖనిజాలతో కూడిన సమతుల్య దాణాను అందించండి ● జంతువులపై ఒత్తిడిని తగ్గించడానికి చల్లని సమయాల్లోనే పాలు పితకండి ● పశువులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయా? శ్వాసక్రియ రేటు పెరుగుతోందా? మేత తీసుకోవడం తగ్గిందా? వంటి వేడి ఒత్తిడి లక్షణాలు ఏమైనా ఉన్నాయా అని క్రమం తప్పకుండా గమనిస్తూ ఉండండి. ● టెంపరేచర్ హ్యూమిడిటీ ఇండెక్స్(హెచ్ టి ఐ) 68 దాటితే జాగ్రత్త పడాలి. 98 దాటితే ప్రమాదం



● షెడ్ లోపల అమర్చిన ఫాగర్లు

● అతి తీవ్రమైన వడ గాడ్పులను తట్టుకోవటానికి అత్యవసర ప్రణాళికలు సిద్ధం చేసుకోండి. ఆపత్కాలంలో జంతువులను త్వరగా చల్లబరచడానికి, అవసరమైతే తక్షణ వైద్యం అందించే ఏర్పాట్లు చేసిపెట్టుకోండి ● వీలైతే వేడిని తట్టుకోగల పాడి పశువుల జాతులను ఎంపిక చేసుకోండి

ప్రతికూలంలోనూ అధిక పాల దిగుబడి

ఉష్ణోగ్రత 15 – 27 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉంటే పాడి పశువులు హాయిగా ఉంటాయి. ఆవుల జీవక్రియ వేడిని పుట్టిస్తుంటుంది. మేతను జీర్ణం చేసుకునే క్రమంలో విడుదలయ్యే శక్తి వల్ల పశువు దేహంలో వేడి పుడుతుంది. వాతావరణంలో వేడి అధికంగా ఉంటే, అది శరీరంలోని సూక్ష్మజీవుల అసమతుల్యతకు కారణమై జీర్ణక్రియను నిరోధిస్తుంది. జంతువు దేహంలో అసౌకర్యం కలుగుతుంది. వేడిని తగ్గించే చర్యలు తీసుకోలేకపోతే అవి ఒత్తిడికి గురవుతాయి. ప్రత్యేక నమూనాలో షెడ్లను నిర్మించటంతో పాటు ఇతర జాగ్రత్తలు పాటిస్తే వడగాడ్పుల నుంచి పాడి పశువులను కాపాడుకోవచ్చు. ప్రతికూల వాతావరణంలోనూ అధిక పాల దిగుబడి కూడా పొందవచ్చన్నది మా రైతుల అనుభవం.

- డాక్టర్ తేజేశ్వర్ రెడ్డి (86390 80108),
అక్షయకల్ప ఆర్గానిక్ ప్రతినిధి



బయో ఫిష్ ట్యాంకుల్లో తక్కువ ఖర్చుతో చేపల సాగు!



బయో ఫిష్ ట్యాంకులు.. తమిళనాడులో చిన్న, సన్నకారు చేపల రైతులకు ఈ చిన్నపాటి కృత్రిమ చెరువులు ఆక్వా సిరులు కురిపిస్తున్నాయి. చేపల పెంపకంలో అనుభవం లేని వారు కూడా మత్స్య శాఖ వద్ద శిక్షణ పొంది తక్కువ పెట్టుబడితో, కొద్దిపాటి చోటులో బయో ఫిష్ ట్యాంకులను ఏర్పాటు చేసుకుంటూ కుటుంబ ఆదాయాన్ని పెంపొందించుకుంటున్నారు. ఇనుప మెష్‌లో టార్పాలిన్ వేసి, అందులో నీటిని నింపి చేపలు పెంచుతున్నారు. తక్కువ నీటితోనే చేపల పెంపకం చేపట్టగలుగుతున్నామని రైతులు చెబుతున్నారు. ఒక్కో బయో ఫిష్ ట్యాంకులో 450 తిలాపియా, లాబ్‌స్టర్ వంటి చేపలను పెంచుతున్నారు. ఇంటి దగ్గరే రెండు ట్యాంకులు పెట్టుకొని వెయ్యి చేపల వరకు పెంచుతున్నారు. దీనిపైన వల కప్పి కొంగలు, కాకుల నుంచి చేపలను రక్షించుకుంటున్నారు. మహిళలకు 60%, పురుషులకు 40% సబ్సిడీతోపాటు లబ్ధిదారులకు తమిళనాడు మత్స్య శాఖ తగిన శిక్షణ కూడా ఇవ్వటంతో ఆక్వా రంగంలో పూర్వానుభవం లేని వారు కూడా ఆసక్తి చూపుతున్నారు.

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

శభాష్ గుకేశ్...

క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో విజేతగా నిలిచిన భారత యువ గ్రాండ్‌మాస్టర్

విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఈ ఘనత సాధించిన రెండో భారతీయ ప్లేయర్‌గా గుర్తింపు	ఈ టైటిల్ సాధించిన పిన్న వయస్కుడిగా కొత్త రికార్డు	త్వరలో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ కోసం డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్‌తో పోరు	రూ. 78 లక్షల 50 వేల ప్రైజ్‌మనీ సొంతం



భారత చెస్‌లో నవయువ శకం ఆరంభమైంది. ఐదుసార్లు ప్రపంచ చాంపియన్, భారత దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఎవరు అనే ప్రశ్నకు సాధికారిక సమాధానం దొరికింది. ప్రతిష్టాత్మక క్యాండిడేట్స్ క్లాసికల్ చెస్ టోర్నమెంట్ ఓపెన్ విభాగంలో భారత యువ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ చాంపియన్‌గా నిలిచాడు. అంతా అనుకున్నట్లు జరిగితే త్వరలోనే క్రీడాభిమానులు 17 ఏళ్ల గుకేశ్ రూపంలో విశ్వనాథన్ ఆనంద్ తర్వాత భారత్ నుంచి రెండో ప్రపంచ చాంపియన్‌ను చూడవచ్చు. ప్రపంచ కిరీటం కోసం డిఫెండింగ్ ప్రపంచ చాంపియన్‌కు ప్రత్యర్థిని నిర్ణయించే క్యాండిడేట్స్ టోర్నీలో భారత్ నుంచి ఓపెన్ విభాగంలో ఏకంగా ముగ్గురు క్రీడాకారులు ప్రజ్ఞానంద, విదిత్ సంతోష్ గుజరాతీ, గుకేశ్ అర్హత సాధించడం... చివరకు తనకంటే ఎంతో మెరుగైన రేటింగ్ ఉన్న మేటి గ్రాండ్‌మాస్టర్లకు దీటుగా ఆడి గుకేశ్ విజేతగా అవతరించడం విశేషం.

టొరంటో: అంచనాలకు మించి రాణించి భారత చెస్ యువ గ్రాండ్‌మాస్టర్, తమిళనాడు కుర్రాడు దొమ్మరాజు గుకేశ్ కొత్త చరిత్ర సృష్టించాడు. ప్రతిష్టాత్మక క్యాండిడేట్స్ చెస్ టోర్నీ ఓపెన్ విభాగంలో టైటిల్ సాధించిన పిన్న వయస్కుడిగా గుకేశ్ రికార్డు నెలకొల్పాడు. 8 మంది మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య డబుల్ రౌండ్ రాబిన్ లీగ్ ఫార్మాట్‌లో 14 రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో 17 ఏళ్ల గుకేశ్ 9 పాయింట్లతో విజేతగా నిలిచాడు. 40 ఏళ్లుగా గ్యారీ కాస్పరోవ్ (1984లో 22 ఏళ్లు) పేరిట ఉన్న ఈ రికార్డును గుకేశ్ బద్దలు కొట్టాడు.

• 13వ రౌండ్ తర్వాత గుకేశ్ 8.5 పాయింట్లతో ఒంటరిగా ఆధిక్యంలో ఉన్నాడు. హికారు నకమురా (అమెరికా), నిపోమ్‌నిషి (రష్యా), ఫాబియానో కరువానా (అమెరికా) 8 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచారు. దాంతో చివరిదైన 14వ రౌండ్ ఈ నలుగురికీ కీలకంగా మారింది. నకమురతో జరిగిన గేమ్‌ను నల్లపావులతో ఆడిన గుకేశ్ 71 ఎత్తుల్లో 'డ్రా' చేసుకొని 9 పాయింట్లతో అగ్రస్థానాన్ని పదిలం చేసుకున్నాడు. మరోవైపు నిపోమ్‌నిషి-కరువానా మధ్య జరిగిన గేమ్‌లో ఫలితం వచ్చి ఉంటే ఈ ఇద్దరిలో ఒకరు గుకేశ్‌తో 9 పాయింట్లతో సమఉజ్జీగా నిలిచేవారు. ఇలా జరిగి ఉంటే సమఉజ్జీల మధ్య ప్లే ఆఫ్ గేమ్‌లను వేరుగా నిర్వహించి విజేతను నిర్ణయించేవారు.

• అయితే 109 ఎత్తులపాటు సుదీర్ఘంగా సాగిన నిపోమ్‌నిషి-కరువానా మధ్య గేమ్ చివరకు 'డ్రా'గా ముగియడంతో గుకేశ్ ఎదురులేని విజేతగా అవతరించాడు. ఈ క్రమంలో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ కోసం ప్రస్తుత ప్రపంచ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా)తో పోటీపడేందుకు గుకేశ్ అర్హత సంపాదించాడు. ఈ టోర్నీలో గుకేశ్ 5 గేముల్లో గెలిచి, 8 గేమ్‌లను 'డ్రా' చేసుకొని, ఒక గేమ్‌లో మాత్రమే డో ఓడిపోయాడు. నకముర, నిపోమ్‌నిషి, కరువానా 8.5 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంతో సరిపెట్టుకున్నారు.

ఓపెన్ విభాగం ఫైనల్ ర్యాంకింగ్

ర్యాంక్	ప్లేయర్	దేశం	పాయింట్లు
1	గుకేశ్	భారత్	9
2	నకమురా	అమెరికా	8.5
3	నిపోమ్‌నిషి	రష్యా	8.5
4	కరువానా	అమెరికా	8.5
5	ప్రజ్ఞానంద	భారత్	7
6	విదిత్ సంతోష్	భారత్	6
7	ఫిరూజా	ఫ్రాన్స్	5
8	అబసోవ్	అజర్‌బైజాన్	3.5

నోట్: స్కోరు సమమైనచోట మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించారు

• భారత్‌కే చెందిన మరో ఇద్దరు గ్రాండ్‌మాస్టర్లు విదిత్ తన చివరి గేమ్‌ను అలీరెజా ఫిరూజాతో 14 ఎత్తుల్లో 'డ్రా' చేసుకోగా... అబసోవ్‌తో జరిగిన గేమ్‌ను ప్రజ్ఞానంద 53 ఎత్తుల్లో గెలిచాడు. విజేతగా నిలిచిన గుకేశ్‌కు 88,500 యూరోల (రూ. 78 లక్షల 50 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.

• డింగ్ లిరెన్‌తో 14 గేమ్‌లపాటు జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్ మ్యాచ్ ఈ ఏడాది చివర్లో జరిగే అవకాశముంది. వేదికను, తేదీలను అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) త్వరలోనే ప్రకటిస్తుంది. 2014లో విశ్వనాథన్ ఆనంద్ తర్వాత క్యాండిడేట్స్ చెస్ టోర్నీ టైటిల్ గెలిచిన రెండో భారతీయ ప్లేయర్‌గా గుకేశ్ గుర్తింపు పొందాడు. క్లాసికల్ విభాగంలో విశ్వనాథన్ ఆనంద్ ఐదుసార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచాడు.

"నాకు చాలా సంతోషకరమైన క్షణమిది. టోర్నీ ఆరంభం నుంచి ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతంగా ఆడేందుకు ప్రయత్నించా. చివరి రౌండ్ గేమ్ ఆడిన తర్వాత టైబ్రేక్ కోసం సిద్ధమవుతూనే ఉన్నా. కానీ అదృష్టవశాత్తూ అలాంటి అవసరం రాలేదు. గెలుపు తర్వాత నా తల్లిదండ్రులతో మాట్లాడా. వారు చాలా ఆనందంగా ఉన్నారు. వరల్డ్ చాంపియన్‌షిప్ ఫైనల్ గురించి ఆలోచించే సమయం లభించలేదు. కొద్ది రోజులు ఆటకు విరామం ఇచ్చి ఆపై అన్ని రకాలుగా సన్నద్ధమవుతా. ఆ మ్యాచ్ కోసం ఎంతో ఎదురు చూస్తున్నా. -గుకేశ్


యంగెస్ట్ చాలెంజర్ గుకేశ్‌కు అభినందనలు. ప్రతికూల పరిస్థితుల్లోనూ నువు చూపించిన ఆటతో మేమంతా గర్వంగా ఉన్నాం. ఈ క్షణాలను ఆస్వాదించు. -విశ్వనాథన్ ఆనంద్



17 ఏళ్లకే ఎంత గొప్ప విజయం. నీ ఈ ప్రయాణం వరల్డ్ చాంపియన్‌గా మారే వరకు సాగాలి. -సచిన్ టెండూల్కర్

గుకేశ్ ఘనత చూసి దేశం గర్విస్తోంది. అతని ప్రతిభ, అంకిత భావాన్ని ఈ ఫలితం చూపించింది. ఎంతో మందికి ఇది స్ఫూర్తిగా నిలుస్తుంది. -నరేంద్ర మోదీ, ప్రధాని"

హంపికి రెండో స్థానం





వైశాలి

క్యాండిడేట్స్ టోర్నీ మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి 7.5 పాయింట్లతో రెండో స్థానాన్ని దక్కించుకోగా, వైశాలి 7.5 పాయింట్లతో నాలుగో స్థానాన్ని సంపాదించింది. 8 మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య 14 రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో చైనా ప్లేయర్ టాన్ జోంగి 9 పాయింట్లతో విజేతగా నిలిచింది. మహిళల వరల్డ్ చాంపియన్ జు వెన్‌జున్ (చైనా)తో ప్రపంచ టైటిల్ కోసం టాన్ జోంగి తలపడుతుంది. చివరిదైన 14వ రౌండ్‌లో హంపి 62 ఎత్తుల్లో టింగ్‌జి లెపై... వైశాలి 45 ఎత్తుల్లో కాటరీనా లాగ్నోపై గెలుపొందారు. ఈ టోర్నీలో హంపి 3 గేముల్లో నెగ్గి, 9 గేమ్‌లను 'డ్రా' చేసుకొని, 2 గేముల్లో ఓడిపోయింది. వైశాలి 6 గేముల్లో గెలిచి, 5 గేముల్లో ఓడిపోయి, 3 గేమ్‌లను 'డ్రా'గా ముగించింది. హంపి, టింగ్‌జి లె, వైశాలి 7.5 పాయింట్లతో సమఉజ్జీగా నిలిచినా మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించారు.

ఇంతింతై...



అనతికాలంలోనే అద్భుత ఫలితాలు సాధించిన గుకేశ్

దాదాపు ఐదేళ్ల క్రితం... గుకేశ్ 12 ఏళ్ల 7 నెలల 17 రోజుల వయసులో గ్రాండ్‌మాస్టర్ అయ్యాడు. ప్రపంచ చెస్‌లో ఈ ఘనత సాధించిన అతి పిన్న వయస్కుడిగా నిలిచే రికార్డును అతను 17 రోజుల తేడాతో కోల్పోయాడు. దీనిపై స్పందిస్తూ...'ఇలాంటి ఘనతను సాధించకపోయినా మాగ్నస్ కార్ల్‌సన్ ఏ స్థాయికి వెళ్లాడో తెలుసు కదా. నాకు అతనే స్ఫూర్తి. ఈ పిన్న వయస్కుడి రికార్డులు పెద్ద విషయం కాదు. నా లక్ష్యాలు చాలా పెద్దవి' అంటూ అతను ఆత్మవిశ్వాసంతో బదులిచ్చాడు. ఇదే దృక్పథం అతడిని ఇప్పుడు ఈ స్థాయికి చేర్చింది. 17 ఏళ్ల వయసులో క్యాండిడేట్స్ టోర్నీలో విజేతగా నిలిచి వరల్డ్ చాంపియన్‌కు అతను సవాల్ విసరబోతున్నాడు. తాజా టోర్నీలో కూడా తన విజయంపై ఎప్పుడు ధీమా వచ్చిందంటే 'ఏడో రౌండ్' తర్వాత అని సమాధానమిచ్చాడు. సాధారణంగా టర్నింగ్ పాయింట్‌గా ఎవరైనా ఫలానా గెలుపు గురించి చెబుతారు. కానీ ఈ ఏడో రౌండ్‌లో అతను అలీరెజా ఫిరూజా చేతిలో ఓడిపోయాడు. 'నేను ఓడినా సరే ఆ గేమ్‌లో చాలా బాగా ఆడాను. ఆ పరాజయం నాలో మరింత పట్టుదలను పెంచింది. అప్పుడే నేను టైటిల్ గెలవగలననే నమ్మకం కలిగింది' అని చెప్పడం గుకేశ్ ఆత్మవిశ్వాసాన్ని చూపిస్తోంది.

అమ్మా, నాన్న అండతో...



చదరంగం బోర్డుపై ఎత్తుకు పైఎత్తులు వేసేందుకు గుకేశ్ ప్రయాణం ఏడేళ్ల వయసులో మొదలైంది. గోదావరి జిల్లా నుంచి చెన్నైకి వెళ్లి స్థిరపడిన తెలుగు కుటుంబం వారిది. తండ్రి రజినీకాంత్ ఈఎన్‌టీ వైద్యుడు కాగా తల్లి పద్మాకుమారి మైక్రోబయాలజిస్ట్. మదరాసులో చెస్ చాంపియన్ల ఫ్యాక్టరీ వంటి వేలమ్మాల్ స్కూల్‌లో అతను ఓనమాలు నేర్చుకున్నాడు. గత రెండు దశాబ్దాల్లో ఇక్కడి నుంచే సేతురామన్, ఆదిబన్, ప్రజ్ఞానంద, వైశాలి తదితర గ్రాండ్‌మాస్టర్లు వచ్చారు. ఇలాంటి ఆటగాళ్ల వల్లే వరల్డ్ స్కూల్ గేమ్స్‌లో వేలమ్మాల్ విద్యాసంస్థలు వరుసగా ఐదేళ్లు చాంపియన్‌గా నిలిచాయి. మరోవైపు తల్లిదండ్రుల మద్దతు, ప్రోత్సాహం గుకేశ్ సరైన దిశలో నడిపించాయి. కెరీర్ ఆరంభంలో కొడుకుతో టోర్నీలకు వెళ్లేందుకు రజినీకాంత్ చాలా సార్లు తన వైద్య బాధ్యతలు దూరం కావాల్సి వచ్చింది. తర్వాతి రోజుల్లో అతనితో పాటు తల్లి ప్రయాణించడం మొదలైంది. గుకేశ్ ఒక్కసారి చెస్‌లో అడుగు పెట్టాక పూర్తిగా దానిపైనే దృష్టి పెడుతూ పగలు రాత్రి కష్టపడ్డాడు. నాలుగో తరగతి తర్వాత స్కూల్‌కు రెగ్యులర్‌గా వెళ్లడం ఆపేసిన ఈ అబ్బాయి తన పట్టుదల, సాధనతో పూర్తిగా చెస్‌పైనే దృష్టి పెట్టాడు. అతని శ్రమకు ఫలితం దక్కుతూ వేగంగా దూసుకుపోయాడు. ఆసియా స్కూల్ చాంపియన్‌షిప్‌లో, ఆసియా యూత్, వరల్డ్ యూత్ చాంపియన్‌షిప్‌లలో టైటిల్స్ సాధించి అతను అందరి దృష్టిలో పడ్డాడు. ఢిల్లీ ఇంటర్నేషనల్ ఓపెన్‌లో 2019 సంక్రాంతి పండగ రోజున గుకేశ్ భారత 60వ గ్రాండ్‌మాస్టర్‌గా మారిన క్షణాన తల్లిదండ్రులు ఎంతో భావోద్వేగానికి గురయ్యారు.

వరుస విజయాలతో...



2017 అక్టోబరులో ఒక 11 ఏళ్ల ప్రతిభావంతుడైన ఆటగాడు, ఎలాంటి ఐఎం లేదా జీఎం నార్మ్‌లు లేని కుర్రాడిగా గుకేశ్ ఉన్నాడు. అయితే తర్వాతి 16 నెలలు తిరిగేసరికి అంతా మారిపోయింది. ఈ సమయంలో అతను మూడు ఐఎం నార్మ్‌లు, మూడు జీఎం నార్మ్‌లు సాధించడంతో పాటు 2500 ఎలో రేటింగ్ దాటేశాడు. ఈ 16 నెలల కాలంలో గుకేశ్ అసాధారణ రీతిలో 276 గేమ్‌లు ఆడాడు! ఆ తర్వాత పోటీల స్థాయి పెరిగిన కొద్దీ అతని ఆట మరింత రాటుదేలింది. ప్రతిష్టాత్మక జూలియస్ బేర్ టోర్నీ గెలుచుకున్న తర్వాత భారత జట్టు చెస్ ఒలింపియాడ్‌లో కాంస్యం సాధించడంలో అతను కీలక పాత్ర పోషించాడు. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం 2700 రేటింగ్‌ను కూడా దాటడంతో పాటు ర్యాపిడ్ టోర్నీలో కార్ల్‌సన్‌నూ ఓడించాడు. గత ఏడాది సెప్టెంబరులో అతని 'ఆనందం' రెట్టింపైంది. లైవ్ రేటింగ్‌లో విశ్వనాథన్ ఆనంద్‌ను దాటి అతను ర్యాంకింగ్స్‌లో భారత అత్యుత్తమ ఆటగాడిగా నిలిచాడు.

అదే శైలి...అదే తత్వం

12 ఏళ్ల వయసులోనే ఎంతో పరిపక్వతతో మాట్లాడిన గుకేశ్ ఇప్పుడు టీనేజర్‌గా కూడా అతని ఆటలాగే అంతే ప్రశాంతతను చూపిస్తాడు. గెలుపు, ఓటమి ఎదురైనా అతను భావోద్వేగాలు ప్రదర్శించడు. కఠిన పరిస్థితుల్లోనూ ఒత్తిడికి లోను కాకుండా ఆడటం అతని శైలి. క్యాండిడేట్స్ విజేతగా నిలిచిన తర్వాత అతని గురించి నార్వే దిగ్గజం, ప్రపంచ మాజీ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ వ్యాఖ్యానిస్తూ 'నేను అతడిని తక్కువగా అంచనా వేశాను. నాతో పాటు చాలా మంది అనుకున్నదానికంటే గుకేశ్ చాలా బలమైన ఆటగాడు' అని ప్రశంసించడం విశేషం. ఇప్పుడు 17 ఏళ్లకే వరల్డ్ చాంపియన్‌కు చాలెంజ్ విసిరే స్థాయికి చేరిన ఈ చెన్నై చిచ్చరపిడుగు త్వరలోనే విశ్వ విజేతగా నిలవడం కష్టం కాకపోవచ్చు.

-సాక్షి క్రీడా విభాగం

'పద్మశ్రీ' బోపన్న...



రాష్ట్రపతి భవన్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా 'పద్మశ్రీ' పురస్కారాన్ని స్వీకరిస్తున్న భారత టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్న

కోహ్లికి జరిమానా



న్యూఢిల్లీ: బెంగళూరు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లికి జరిమానా విధించారు. ఆదివారం కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా ఫీల్డ్ అంపైర్ కోహ్లిని క్యాచ్ అవుట్‌గా ప్రకటించారు. దీనిపై కోహ్లి తీవ్రస్థాయిలో అసహనాన్ని ప్రదర్శించాడు. హర్షిత్ రాణా వేసిన బంతి ఫుల్‌టాస్ కావడంతో నోబాల్‌గా ప్రకటించాలని రివ్యూకు వెళ్లాడు. అయితే అతను క్రీజ్ వెలుపలకి వచ్చి షాట్ ఆడటంతో టీవీ అంపైర్ కోహ్లి అప్పీల్‌ను తిరస్కరించారు. అయినా సరే కోహ్లి అంపైర్‌పై ఆగ్రహంతో పెవిలియన్ చేరాడు. ఈ నేపథ్యంలో మ్యాచ్ రిఫరీ ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిని అతిక్రమించిన కోహ్లి మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత విధించారు.

'శత'క్కొట్టిన యశస్వి



యశస్వి జైస్వాల్

• రాజస్తాన్ రాయల్స్ ఘనవిజయం
• సందీప్ శర్మకు 5 వికెట్లు
• ముంబై జట్టుకు ఐదో ఓటమి

జైపూర్: మరో ధనాధన్ 'షో'తో రాజస్తాన్ రాయల్స్ ఐపీఎల్‌లో ఏడో విజయాన్ని సాధించింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో రాయల్స్ 9 వికెట్ల తేడాతో ముంబై ఇండియన్స్‌ను ఓడించింది. మొదట ముంబై 9 వికెట్ల నష్టానికి 179 పరుగులు చేసింది. తిలక్ వర్మ (45 బంతుల్లో 65; 5 ఫోర్లు, 3 సిక్సలు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. రాజస్తాన్ సీమర్ సందీప్ శర్మ (4-0-18-5) ముంబైను దెబ్బ కొట్టాడు. అనంతరం రాజస్తాన్ రాయల్స్ 18.4 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 183 పరుగులు చేసి గెలిచింది. ముంబై బౌలర్ల భరతం పట్టి ఓపెనర్ యశస్వి జైస్వాల్ (60 బంతుల్లో 104 నాటౌట్; 9 ఫోర్లు, 7 సిక్సలు) అజేయ శతకం సాధించి జట్టును గెలిపించాడు.

స్కోరు వివరాలు

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) సామ్సన్ (బి) బౌల్ట్ 6; ఇషాన్ (సి) సామ్సన్ (బి) సందీప్ 0; సూర్యకుమార్ (సి) పావెల్ (బి) సందీప్ 10; తిలక్ వర్మ (సి) పావెల్ (బి) సందీప్ 65; నబీ (సి అండ్ బి) చహల్ 23; నేహల్ (సి) సందీప్ (బి) బౌల్ట్ 49; హార్దిక్ (ఎల్బీడబ్ల్యూ) (బి) ఆవేశ్ ఖాన్ 10; డేవిడ్ (సి) పరాగ్ (బి) సందీప్ 3; కొయెట్జీ (సి) హెట్‌మైర్ (బి) సందీప్ 0; చావ్లా (నాటౌట్) 1; బుమ్రా (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు)** 179. **వికెట్ల పతనం:** 1-6, 2-6, 3-20, 4-52, 5-151, 6-170, 7-176, 8-176, 9-177. **బౌలింగ్:** బౌల్ట్ 4-0-32-2, సందీప్ 4-0-18-5, ఆవేశ్ 4-0-49-1, అశ్విన్ 4-0-31-0, చహల్ 4-0-48-1. **రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్:** యశస్వి (నాటౌట్) 104; బట్లర్ (బి) చావ్లా 35; సామ్సన్ (నాటౌట్) 38; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (18.4 ఓవర్లలో వికెట్ నష్టానికి)** 183. **వికెట్ల పతనం:** 1-74. **బౌలింగ్:** పాండ్యా 2-0-21-0, బుమ్రా 4-0-37-0, తుషార 3-0-28-0, కొయెట్జీ 2-0-25-0, నబీ 3-0-30-0, పియూశ్ చావ్లా 4-0-33-1, తిలక్ 0.4-0-8-0.

ఐపీఎల్‌లో నేడు

చెన్నై × లక్నో
వేదిక: చెన్నై

రాత్రి 7:30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	8	7	1	14	0.698
కోల్‌కతా	7	5	2	10	1.206
హైదరాబాద్	7	5	2	10	0.914
చెన్నై	7	4	3	8	0.529
లక్నో	7	4	3	8	0.123
గుజరాత్	8	4	4	8	-1.055
ముంబై	8	3	5	6	-0.227
ఢిల్లీ	8	3	5	6	-0.477
పంజాబ్	8	2	6	4	-0.292
బెంగళూరు	8	1	7	2	-1.046

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

సినిమా

ఒక్క ఫైట్... ఇరవైఆరు రోజులు



• చిరంజీవి

చిరంజీవి ఇరవైఆరు రోజుల పాటు ఇరగదీశారట. రౌడీ గ్యాంగ్‌ని రఫ్ఫాడించారట. ఇదంతా ఆయన హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వంభర' కోసమే. వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా నటిస్తున్నారు. యూవీ క్రియేషన్స్‌పై విక్రమ్, వంశీ, ప్రమోద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా ఈ సినిమా కోసం 26 రోజులుగా తీస్తున్న ఓ భారీ యాక్షన్ షెడ్యూల్ సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ-''ఫ్యాంటసీ యాక్షన్ అడ్వెంచర్‌గా రూపొందుతోన్న చిత్రమిది. ఈ చిత్రం కోసం ప్రొడక్షన్ డిజైనర్ ప్రకాశ్ నిర్మించిన 54 అడుగుల హనుమాన్ విగ్రహంతో కూడిన సెట్‌లో రామ్-లక్ష్మణ్ మాస్టర్స్ పర్యవేక్షణలో ఓ ఫైట్‌ని చిత్రీకరించాం. చిరంజీవి, ఫైటర్స్ మధ్య ఉత్కంఠభరితంగా సాగే ఈ ఫైట్ ఇంటర్వెల్‌లో వస్తుంది. ఒక్క ఫైట్ సీక్వెన్స్ కోసం చిరంజీవి 26 రోజులు కేటాయించడం ఇదే తొలిసారి. ఈ హై ఓల్టేజ్ యునిక్ యాక్షన్ బ్లాక్ అటు అభిమానులను ఇటు ప్రేక్షకులను థ్రిల్‌కి గురి చేసే విధంగా ఉంటుంది'' అన్నారు. కాగా 2025 సంక్రాంతి సందర్భంగా జనవరి 10న 'విశ్వంభర' విడుదల కానుంది.


ఇక నాన్‌స్టాప్‌గా...



• కమల్‌హాసన్

తమిళనాడు లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో 'థగ్ లైఫ్' చిత్ర యూనిట్ షూటింగ్‌కి కాస్త బ్రేక్ ఇచ్చింది. ఎన్నికలు ముగియడంతో మళ్లీ షూటింగ్ ఆరంభించింది. కమల్‌హాసన్ హీరోగా మణిరత్నం దర్శకత్వంలో రూపొందిన 'నాయగన్' (నాయకుడు) తర్వాత 37 ఏళ్లకు మళ్లీ ఈ కలయికలో రూపొందుతోన్న చిత్రం 'థగ్ లైఫ్'. ఈ చిత్రం తాజా షెడ్యూల్ ఢిల్లీలో ఆరంభమైంది. ఈ విషయాన్ని చిత్ర ఛాయాగ్రాహకుడు రవి కె. చంద్రన్ సామాజిక మాధ్యమం ద్వారా స్పష్టం చేశారు. కమల్‌హాసన్, ఈ చిత్రంలో కీలక పాత్ర చేస్తున్న శింబు పాల్గొనగా ఢిల్లీలో ముఖ్య సన్నివేశాల చిత్రీకరణ ప్లాన్ చేశారట. కొన్ని రోజుల పాటు ఢిల్లీలో షూట్ చేసి, అనంతరం క్లైమాక్స్‌లో వచ్చే ఫైట్ చిత్రీకరణకు యూనిట్ సెర్బియా వెళుతుందని సమాచారం. నాన్‌స్టాప్‌గా షూటింగ్ జరిపేలా షెడ్యూల్స్ ప్లాన్ చేశారట మణిరత్నం. కాగా ఈ చిత్రంలో రంగరాయ శక్తివేల్ నాయకర్ అనే గ్యాంగ్‌స్టర్ పాత్రతో పాటు కమల్ మరో రెండు పాత్రల్లో కనిపించనున్నారని కోలీవుడ్ టాక్.

సత్యభామ డేట్ ఫిక్స్



• కాజల్

కాజల్ అగర్వాల్ లీడ్ రోల్‌లో నటించిన 'సత్యభామ' సినిమా విడుదల తేదీ ఫిక్స్ అయింది. మే 17న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. సుమన్ చిక్కాల దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నవీన్ చంద్ర, ప్రకాశ్ రాజ్ కీలక పాత్రలు పోషించారు. డైరెక్టర్ శశి కిరణ్ తిక్క సమర్పణలో బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి ఈ మూవీ నిర్మించారు. ''క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'సత్యభామ'. ఇందులో కాజల్ పవర్‌ఫుల్ పోలీసాఫీసర్ పాత్రలో నటించారు'' అని చిత్రబృందం పేర్కొంది.



• రాజీవ్ చిలక, ఫరియా అబ్దుల్లా, 'అల్లరి' నరేష్, నాని, మల్లి అంకం

కామెడీ మిస్ అయ్యాననిపించింది - నాని

''నరేష్ అద్భుతమైన నటుడు. తను బ్యాక్ టు బ్యాక్ కామెడీ సినిమాలు చేస్తుంటే వాటికి కొంచెం బ్రేక్ ఇవ్వమని చెప్పాను. కానీ, 'ఆ ఒక్కటీ అడక్కు' ట్రైలర్ చూస్తుంటే.. ఈ బ్రేక్‌లో తన కామెడీ మిస్ అయ్యాననిపించింది'' అని హీరో నాని అన్నారు. 'అల్లరి' నరేష్, ఫరియా అబ్దుల్లా జంటగా మల్లి అంకం దర్శకత్వం వహించిన చిత్రం 'ఆ ఒక్కటీ అడక్కు'. చిలకా ప్రొడక్షన్స్‌పై రాజీవ్ చిలక నిర్మించారు. భరత్ లక్ష్మీపతి సహ నిర్మాతగా వ్యవహరించిన ఈ సినిమా మే 3న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ని హీరో నాని రిలీజ్ చేసి, మాట్లాడుతూ-''ఆ ఒక్కటీ అడక్కు' ట్రైలర్ చూస్తుంటే అందరూ హాయిగా ఎంజాయ్ చేసే సినిమా అనిపిస్తోంది. ఈ మూవీ తప్పకుండా బ్లాక్ బస్టర్ అవుతుంది'' అన్నారు. ''చాలా ఏళ్ల తర్వాత మళ్లీ కామెడీ మూవీతో వస్తున్నాను. ఈ వేసవిలో ప్రేక్షకుల్ని బాగా నవ్విస్తాను'' అన్నారు 'అల్లరి' నరేష్. ''మా సినిమా చాలా అద్భుతంగా వచ్చింది'' అన్నారు రాజీవ్ చిలక. ఫరియా అబ్దుల్లా, రచయిత అబ్బూరి రవి మాట్లాడారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
560	189
73,649	22,336

విదేశీ సూచీలు (సోమ రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	15,506	▲	226
డోజోన్స్	38,418	▲	432
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,024	▲	18
డాక్స్	17,861	▲	124
షాంఘై	3,044	▼	21
నికాయ్	37,439	▲	370

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	72,875
బంగారం (99.5 స్వచ్ఛత)	72,583
వెండి (కిలో)	81,554

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.17	84.19
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	102.67	105.22
€	యూరో	ఎస్‌బీఐ	87.86	90.22
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	53.62	54.82
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.57	54.49
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.20	63.40
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.37	22.91
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.84	23.61
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.39	12.39

రిలయన్స్ ఇండస్ట్రీస్ లాభం ఫ్లాట్

- క్యూ4లో రూ. 18,951 కోట్లు
- 2023–24లో లాభాల్లో రికార్డ్



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్‌ఐఎల్) చివరి త్రైమాసికంతోపాటు పూర్తి ఏడాది(2023–24)కి ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం నామమాత్ర క్షీణతతో రూ. 18,951 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2022–23) క్యూ4లో రూ. 19,299 కోట్లు ఆర్జించింది. అయితే గతేడాది క్యూ3(అక్టోబర్–డిసెంబర్)లో సాధించిన రూ. 17,265 కోట్లతో పోలిస్తే లాభం మెరుగుపడింది. ఇక మొత్తం ఆదాయం వార్షికంగా 11 శాతం పుంజుకుని రూ. 2.64 లక్షల కోట్లకు చేరింది. కన్సాలిడేటెడ్ ఫలితాలివి. నిర్వహణ లాభం(ఇబిటా) 14 శాతం వృద్ధితో రూ. 47,150 కోట్లను తాకింది.

పూర్తి ఏడాదికి

గత ఆర్థిక సంవత్సరంలో ఆర్‌ఐఎల్ నికర లాభం కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రూ. 69,621 కోట్లకు చేరింది. 2022–23లో రూ. 66,702 కోట్లు మాత్రమే ఆర్జించింది. ఈ బాటలో మొత్తం ఆదాయం 2.6 శాతం పుంజుకుని రూ. 10 లక్షల కోట్లకు చేరింది. అంతక్రితం రూ. 9.74 లక్షల కోట్ల టర్నోవర్ నమోదైంది. వెరసి రూ. 10 లక్షల కోట్ల టర్నోవర్‌ను సాధించిన తొలి దేశీ కంపెనీగా రిలయన్స్ ఆవిర్భవించింది.

బీఎస్‌ఈలో షేర్ ధర 0.7% లాభపడి రూ.2,961 వద్ద ముగిసింది.

వ్యాపారాలు పటిష్టం



అన్ని విభాగాలూ నిర్వహణ, ఆర్థికపరంగా పటిష్ట పనితీరు చూపాయి. ఇది పలు మైలురాళ్ల సాధనకు సహకరించింది. పన్నుకుముందు లాభం రూ. లక్ష కోట్లను అధిగమించిన తొలి దేశీ కంపెనీగా రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆవిర్భవించిందని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. 10.8 కోట్లను మించిన 5జీ కస్టమర్ల ద్వారా జియో దేశ 5జీ ప్రయాణంలో ప్రధాన పాత్ర పోషిస్తోంది.

– ముకేశ్ అంబానీ, చైర్మన్, ఎండీ, రిలయన్స్ ఇండస్ట్రీస్

హైలైట్స్

- మార్చి త్రైమాసికంలో (క్యూ4) ఓ2సీ విభాగం ఇబిటా 3 శాతం వృద్ధితో 16777 కోట్లను తాకగా.. మొత్తం ఆదాయం 11 శాతం అధికంగా రూ. 1.43 లక్షల కోట్లకు చేరింది.
- రిటైల్ బిజినెస్ నికర లాభం 12 శాతం బలపడి రూ. 2,698 కోట్లకు చేరగా.. మొత్తం ఆదాయం రూ. 76683 కోట్లకు చేరింది. రూ. 5,829 కోట్ల ఇబిటా సాధించింది.
- ఆయిల్ అండ్ గ్యాస్ ఇబిటా 47 శాతంపైగా జంప్‌చేసి రూ. 5,606 కోట్లను తాకింది.
- కేజీ–డీ6 బ్లాక్ ప్రస్తుతం రోజుకి 30 మిలియన్ ప్రామాణిక ఘనపు మీటర్ల గ్యాస్‌ను ఉత్పత్తి చేస్తోంది. రోజుకి 23,000 బ్యారళ్ల చమురు (కండెన్సేట్) ఉత్పత్తవుతోంది.
- 2024 మార్చి31కల్లా చేతిలో ఉన్న నగదును పరిగణించాక నికర రుణభారం రూ. 1.16 లక్షల కోట్లకు తగ్గింది. 2023మార్చిలో రూ. 1.25 లక్షల కోట్లుగా నమోదైంది.
- వార్షిక డివిడెండ్ షేరుకు రూ.10 చొప్పున బోర్డ్ ఆమోదముద్ర వేసింది.





జియో.. భళా

రిలయన్స్ జియో క్యూ4సహా.. పూర్తి ఏడాదికి పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చిలో జియో ప్లాట్‌ఫామ్స్ నికర లాభం 12 శాతం పుంజుకుని రూ. 5,583 కోట్లను తాకింది. కన్సాలిడేటెడ్ ఆదాయం 13 శాతం బలపడి రూ. 33,835 కోట్లకు చేరింది. ఇక 2023–24లో నికర లాభం 12 శాతంపైగా ఎగసి రూ. 21,423 కోట్లను తాకగా.. మొత్తం ఆదాయం 12 శాతం అధికమై రూ. 1,09,558 కోట్లుగా నమోదైంది. క్యూ4లో ఏఆర్‌పీయూ 1.6 శాతం మెరుగై రూ. 181.7కు చేరింది. మొత్తం 10.9 మిలియన్ సబ్‌స్క్రయిబర్లు జత కలిశారు. మార్చికల్లా మొత్తం వినియోగదారుల సంఖ్య 48.18 కోట్లకు ఎగసింది. 5జీ కస్టమర్ల సంఖ్య 10.8 కోట్లకు చేరింది. జియోఎయిర్‌ఫైబర్ 5,900 పట్టణాలలో సర్వీసులు అందిస్తోంది.

ఎండీ రాజీనామా: కాగా 2013 నుంచి ఎండీగా విధులు నిర్వహిస్తున్న సంజయ్ మష్రువాలా రాజీనామా చేసినట్లు జియో పేర్కొంది. జూన్ 9 నుంచి కంపెనీని వీడనున్నట్లు వెల్లడించింది. ధీరూభాయ్ అంబానీ కాలం నుంచి ఆయన ఆర్‌ఐఎల్‌లో ఉన్నారు.

హైసెన్స్ హెచ్‌వీఏసీ ఎక్స్‌పీరియెన్స్ సెంటర్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హీటింగ్, వెంటిలేషన్, ఎయిర్ కండీషనింగ్ (హెచ్‌వీఏసీ) సంస్థ హైసెన్స్ భారత్‌లో తొలి ఎక్స్‌పీరియెన్స్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించింది. హైసెన్స్ చానెల్ పార్ట్‌నర్ ఆర్టస్ హెచ్‌వీఏసీ ఇంజనీరింగ్ ఇండియా ఈ కేంద్రాన్ని బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసింది. రెసిడెన్షియల్, కమర్షియల్ విభాగాల్లో ప్రత్యేక డిమాండ్‌లను తీర్చడానికి రూపొందించిన విభిన్న శ్రేణి హెచ్‌వీఏసీ సొల్యూషన్స్ ఇక్కడ కొలువుదీరాయని ఆర్టస్ ఎండీ లింగిరెడ్డి నవనీత్ రెడ్డి తెలిపారు. ప్రారంభోత్సవంలో హైసెన్స్ హెచ్‌వీఏసీ ఇండియా డైరెక్టర్ రాకేశ్ చౌహాన్ పాల్గొన్నారు.



నవనీత్ రెడ్డి, రాకేశ్ చౌహాన్ (కుడి)

ఇంటర్నెట్ స్పీడ్ తగ్గింది

56 శాతం నెటిజన్ల మాట ఇదే ● లోకల్‌సర్కిల్స్ సర్వేలో వెల్లడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: 'ఇంటర్నెట్ వేగం తగ్గింది. టెలికం కంపెనీ ఇచ్చిన హామీ మేరకు వేగం లేదు. మేం చెల్లిస్తున్న డబ్బులకు తగ్గట్టుగా స్పీడ్ రావడం లేదు' అంటూ కమ్యూనిటీ ప్లాట్‌ఫామ్ లోకల్‌సర్కిల్స్ వార్షిక బ్రాడ్‌బ్యాండ్ సర్వేలో 50 శాతం మందికిపైగా తమ అసంతృప్తిని వ్యక్తపరిచారు. భారత్‌లో 86 శాతం మంది యూజర్లు ప్రధానంగా ఫైబర్, బ్రాడ్‌బ్యాండ్, డిజిటల్ సబ్‌స్క్రైబర్ లైన్ లేదా ఫిక్స్‌డ్–లైన్ కనెక్షన్ ద్వారా ఇంట్లోనే ఇంటర్నెట్‌కు కనెక్ట్ అయ్యారు. వీరిలో 56 శాతం మంది ఇంటర్నెట్ వేగం తగ్గడంతోపాటు కనెక్టివిటీ సమస్యలు తలెత్తుతున్నాయని సర్వేలో వెల్లడించారు. సర్వీస్ ప్రొవైడర్‌ను మారుస్తామంటూ 70 శాతం మంది అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా 286 జిల్లాల్లో 70 వేల పైచిలుకు బ్రాడ్‌బ్యాండ్, ఫైబర్ కస్టమర్లు ఈ సర్వేలో పాలుపంచుకున్నారు. ఫిర్యాదులను పరిష్కరించడానికి టెలికం కంపెనీ 24 గంటలకుపైగా సమయం తీసుకుంటోందని 47 శాతం మంది చెప్పారు.

పేటీఎం మేడిన్ ఇండియా సౌండ్ బాక్సులు

న్యూఢిల్లీ: ఫిన్‌టెక్ కంపెనీ పేటీఎం తాజాగా మేడిన్ ఇండియా సౌండ్ బాక్స్‌లను ప్రవేశపెట్టింది. యూపీఐతో పాటు క్రెడిట్ కార్డ్ ఆధారిత యూపీఐ చెల్లింపులను వీటి ద్వారా వర్తకులు స్వీకరించవచ్చని కంపెనీ తెలిపింది. లావాదేవీ పూర్తి కాగానే వెంటనే నోటిఫికేషన్ వస్తుందని సంస్థ ఫౌండర్, సీఈవో విజయ్ శేఖర్ శర్మ తెలిపారు.

అన్‌లిమిటెడ్ నుంచి బాటమ్‌వేర్

న్యూఢిల్లీ: ఫ్యాషన్ రిటైల్ బ్రాండ్ అన్‌లిమిటెడ్ 1000 రకాల స్టైల్స్‌లో బాటమ్‌వేర్ ను మార్కెట్లోకి విడుదల చేసింది. అన్ని వర్గాలకు సరిపడే భిన్నమైన కార్గోలు, స్టైలిష్ జాగర్స్, సౌకర్యవంతమైన ట్రక్ పాయింట్స్, క్యాజువల్ షర్టులతో పాటు మరెన్నో వీటిలో ఉన్నాయి. ఒక బాటమ్‌వేర్ కొంటే ఒకటి ఉచితంగా పొందవచ్చు. పరిమితకాలంగా ఉండే ఈ ఆఫర్‌ను సద్వినియోగం చేసుకునేందుకు దగ్గర్లోని అన్‌లిమిటెడ్ షోరూం సందర్శించాల్సిందిగా కంపెనీ ప్రకటన ద్వారా తెలిపింది.

UNLIMITED

భీమా జ్యువెల్స్ బ్రాండ్ అంబాసిడర్‌గా రామ్ చరణ్



ముంబై: భీమా జ్యువెల్స్ సినీ నటుడు రామ్ చరణ్‌ను తమ సంస్థ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకుంది. "సినిమా ఆకర్షణకు, కళా నైపుణ్యానికి మధ్య సరికొత్త అనుబంధం ఇది. నేటి తరం అభిరుచులకు తగ్గట్టు తీర్చిదిద్దిన కలెక్షన్లకు తోడు, చరణ్ ప్రచారం వల్ల యువతరం కస్టమర్ల సంఖ్య పెరుగుతుందని ఆశిస్తున్నాము" అని కంపెనీ చైర్మన్ బి. బిందుమాధవ్ అన్నారు. సాంప్రదాయం–నైపుణ్యాల మేలి కలయిక అయిన భీమా బ్రాండ్‌కు తాను ప్రచారకర్తగా వ్యవహరించడం సంతోషంగా ఉందని రామ్‌చరణ్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

23-4-2024 ఫామ్ ధర...	
విశాఖ	400–00
చిత్తూరు	473–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	380–00
విజయవాడ	380–00
హైదరాబాద్	360–00
వరంగల్	362–00

కొనసాగిన కొనుగోళ్లు

- పశ్చిమాసియాలో సద్దుమణిగిన ఉద్రికత్తలు
- దిగివచ్చిన క్రూడాయిల్ ధరలు
- సూచీలకు 2వ రోజూ భారీ లాభాలే

ముంబై: పశ్చిమాసియాలో యుద్ధ ఉద్రిక్తతలు సద్దుమణగడం, క్రూడాయిల్ ధరలు దిగిరావడంతో స్టాక్ మార్కెట్లలో రెండోరోజూ కొనుగోళ్ల జోరు కొనసాగింది. ఫలితంగా సోమవారం సెన్సెక్స్ 560 పాయింట్లు పెరిగి 73,649 వద్ద నిలిచింది. నిఫ్టీ 189 పాయింట్లు పెరిగి 22,336 వద్ద స్థిరపడింది. ఆసియా మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందిపుచ్చుకున్న సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభంలో కాస్త తడబడినా.., అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్థిరంగా ముందుకు కదిలాయి. ఒక దశలో సెన్సెక్స్ 680 పాయింట్లు బలపడి 73,768 వద్ద, నిఫ్టీ 229 పాయింట్లు ఎగసి 22,376 వద్ద ఇంట్రాడే గరిష్టాలను అందుకున్నాయి. లాభాల మార్కెట్లోనూ యుటిలిటీ షేర్లు మాత్రం అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 1.26%, 0.93% చొప్పున లాభపడ్డాయి.

- రెండు రోజుల్లో సెన్సెక్స్ 1,159 పాయింట్లు ర్యాలీతో బీఎస్‌ఈలో 4.97 లక్షల కోట్లు సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.397 లక్షల కోట్లకు చేరింది.



వొడాఫోన్ ఎఫ్‌పీవో సక్సెస్

VI

వొడాఫోన్ ఐడియా మొత్తం రూ. 18,000 కోట్ల సమీకరణకు చేపట్టిన ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్ (ఎఫ్‌పీవో) విజయవంతమైంది. చివరి రోజు సోమవారానికల్లా ఇష్యూ 7 రెట్లు అధికంగా సబ్‌స్క్రయిబ్ అయ్యింది. దీంతో కంపెనీ తాజాగా రూ. 12,600 కోట్లు సమకూర్చుకుంది. ఎఫ్‌పీవో షేర్లు ఈ నెల 25న లిస్టికానున్నాయి. కాగా ఎన్‌ఎస్‌ఈలో వొడాఫోన్ ఐడియా షేరు యథాతథంగా రూ. 12.90 వద్దే ముగిసింది.

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ ఎడ్‌సెట్-2024

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏపీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఎడ్‌సెట్)–2024 నోటిఫికేషన్ విడుదలైంది. బీఈడీ, బీఈడీ(స్పెషల్) కోర్సుల్లో ప్రవేశాలకు ఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి ఏదైనా బ్యాచిలర్ డిగ్రీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. బీటెక్, బీసీఏ, బీబీఎం విద్యార్థులు అర్హులే. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **పరీక్ష విధానం:** మొత్తం 150 ప్రశ్నలు మూడు విభాగాల నుంచి ఉంటాయి. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటుంది. పరీక్ష సమయం రెండు గంటలు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 18.04.2024.
- **ఆలస్య రుసుము లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.05.2024.
- **దరఖాస్తు సవరణ తేదీలు:** 22.05.2024 నుంచి 25.05.2024 వరకు
- **హాల్ టిక్కెట్ల డౌన్‌లోడ్ తేది:** 30.05.2024.
- **ప్రవేశ పరీక్ష తేది:** 08.06.2024.
- **వెబ్‌సైట్:** https://cets.apsche.ap.gov.in

యూజీసీ-నెట్-2024

యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్)–2024 నోటిఫికేషన్‌ను విడుదలచేసింది. ఈ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తుంది. యూనివర్శిటీల్లో జూనియర్ రీసెర్ ఫెలోషిప్(జేఆర్‌ఎఫ్), అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు, పీహెచ్‌డీలో ప్రవేశాలకు ఈ పరీక్షను ఏటా రెండుసార్లు నిర్వహిస్తుంటారు.

- **సబ్జెక్టులు:** అడల్ట్ ఎడ్యుకేషన్, ఆంత్రోపాలజీ, అరబ్ కల్చర్ అండ్ ఇస్లామిక్ స్టడీస్, అరబిక్, ఆర్కియాలజీ, అస్సామీ, బెంగాలీ, బోడో, బౌద్ధ, జైన, చైనీస్, కామర్స్, కంప్యూటర్ సైన్స్, క్రిమినాలజీ, జాగ్రఫీ, ఎకనామిక్స్, ఇంగ్లిష్, హోం సైన్స్, హిస్టరీ, ఫోరెన్సిక్ సైన్స్, ఇండియన్ కల్చర్, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, లింగ్విస్టిక్స్, మ్యూజిక్, సైకాలజీ, లా తదితరాలు.
- **అర్హత:** 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి. ఓబీసీ–ఎన్‌సీఎల్/ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/థర్డ్ జెండర్ కేటగిరీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు అవసరం.
- **వయసు:** జేఆర్‌ఎఫ్‌కు 01.06.2024 నాటికి 30 ఏళ్లు మించకూడదు. అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు గరిష్ట వయోపరిమితి లేదు.
- **పరీక్ష విధానం:** ఓఎమ్మార్ ఆధారిత విధానంలో పరీక్ష ఉంటుంది. పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. రెండు పేపర్లలో ఆబ్జెక్టివ్ టైప్, మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి. పేపర్–1లో 50 ప్రశ్నలు(100 మార్కులు), పేపర్–2లో 100 ప్రశ్నలు(200 మార్కులు) కేటాయించారు. పరీక్షకు మూడు గంటల వ్యవధి ఉంటుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 20.04.2024.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.05.2024
- **పరీక్ష ఫీజు చెల్లింపుకు చివరితేది:** 12.05.2024.
- **దరఖాస్తు సవరణ తేదీలు:** 13.05.2024 నుంచి 15.05.2024వరకు
- **పరీక్ష తేది:** 16.06.2024.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://ugcnet.nta.ac.in

ఎస్‌వీఎన్‌ఐఆర్‌టీఏఆర్-పీజీఈటీ-2024

కటక్(ఒడిశా)లోని స్వామి వివేకానంద నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిహాబిలిటేషన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్(ఎస్‌వీఎన్‌ఐఆర్‌టీఏఆర్).. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

- మాస్టర్ ఆఫ్ ఫిజియోథెరపీ(ఎంపీటీ)–15 సీట్లు.
- మాస్టర్ ఆఫ్ ఆక్యుపేషనల్ థెరపీ(ఎంఓటీ)–15 సీట్లు.
- మాస్టర్ ఇన్ ప్రోస్థెటిక్స్ అండ్ ఆర్థోటిక్స్ (ఎంపీఓ)–10 సీట్లు.
- **కోర్సు వ్యవధి:** రెండేళ్లు.
- **అర్హత:** కోర్సును అనుసరించి కనీసం 50% మార్కులతో బీపీటీ/బీఎస్సీ(పీటీ), బీఓటీ/బీఎస్సీ(ఓటీ), బీపీఓ/బీఎస్సీ(పీఓ) డిగ్రీ లేదా తత్సమానం ఉత్తీర్ణులై ఉండాలి.
- **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష–2024, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** సికింద్రాబాద్, విజయవాడ.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.05.2024
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ తేది:** 04.06.2024.
- **ప్రవేశ పరీక్ష తేది:** 23.06.2024.
- **ఫలితాల ప్రకటన:** 09.07.2024.
- **సెషన్ ప్రారంభం:** 01.10.2024.
- **వెబ్‌సైట్:** https://admission.svnirtar.nic.in

ఉమ్మడి ప్రిపరేషన్.. గ్రూప్స్ గెలుపు!

- టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1, 2, 3 పరీక్షల తేదీలు ఖరారు
- ఉమ్మడి వ్యూహంతో రాణించేందుకు అవకాశం
- అనుసంధాన దృక్పథం కీలకమంటున్న నిపుణులు

టీఎస్‌పీఎస్సీ గ్రూప్ సర్వీసెస్.. తెలంగాణ రాష్ట్రంలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణుల కలల కొలువులు. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షల ద్వారా డిప్యూటీ కలెక్టర్ నుంచి జూనియర్ అసిస్టెంట్ పోస్ట్‌ల వరకు.. వివిధ ఉద్యోగాలను భర్తీ చేస్తారు. వీటికి లక్షల మంది అభ్యర్థులు పోటీ పడుతుంటారు. ఇటీవల టీఎస్‌పీఎస్సీ.. గ్రూప్-1, 2, 3 పరీక్షల తేదీలను ఖరారు చేసింది. ఎక్కువ మంది అభ్యర్థులు మూడింటికీ దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో.. ఈ మూడు పరీక్షలకు కామన్ ప్రిపరేషన్‌పై ప్రత్యేక కథనం..

టీఎస్‌పీఎస్సీ విడుదల చేసిన నోటిఫికేషన్ల ప్రకారం–గ్రూప్–1లో 563 పోస్టులు, గ్రూప్–2లో 783 పోస్టులు, గ్రూప్–3లో 1,388 పోస్టులు భర్తీ చేయనున్నారు. గ్రూప్ 1 పోస్టులకు ప్రిలిమ్స్, మెయిన్స్ ద్వారా ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నారు. గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టులకు ఆబ్జెక్టివ్ తరహా రాత పరీక్షలు ఉంటాయి.

జూన్ 9న గ్రూప్1 ప్రిలిమ్స్

టీఎస్‌పీఎస్సీ ఇటీవల గ్రూప్–1, గ్రూప్–2, గ్రూప్–3 పరీక్షల తేదీలను ఖరారు చేసింది. గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షను జూన్ 9న, మెయిన్ పరీక్షలను అక్టోబర్ 21 నుంచి నిర్వహించనున్నారు. అదే విధంగా గ్రూప్–2 పరీక్ష నాలుగు పేపర్లుగా రెండు రోజుల్లో ఆగస్ట్ 7, 8 తేదీల్లో జరుగుతుంది. గ్రూప్–3 పరీక్షను మూడు పేపర్లుగా నవంబర్ 17, 18 తేదీల్లో నిర్వహించనున్నారు.

పోటీ కూడా ఎక్కువగానే

గ్రూప్–1, 2, 3 పరీక్షలకు పోటీ కూడా ఎక్కువగానే ఉంటుంది. గ్రూప్–1కు సంబంధించి మూడు లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. గతంలో విడుదల చేసిన గ్రూప్–2 నోటిఫికేషన్‌కు 5.5 లక్షలు, గ్రూప్–3 నోటిఫికేషన్‌కు 5.3 లక్షల మంది దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. ఈ గణాంకాలను పరిగణనలోకి తీసుకుంటే.. దాదాపు 80 శాతం మంది అభ్యర్థులు మూడు పరీక్షలకు సన్నద్ధమవుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఉమ్మడి సన్నద్ధత

గ్రూప్–1, 2, 3.. మూడు పరీక్షలను లక్ష్యంగా చేసుకున్న అభ్యర్థులు.. మూడింటికీ సన్నద్ధత పొందేందుకు అవకాశముంది. అందుకోసం ఆయా అభ్యర్థులు ప్రధాన లక్ష్యమైన పరీక్షకు అధిక ప్రాధాన్యమిస్తూ.. ఆ ప్రిపరేషన్‌ను మిగతా రెండు పరీక్షలతో అనుసంధానం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

సిలబస్.. ఒకే రీతి

మూడు సర్వీసులకు సిలబస్ దాదాపు ఒకే రీతిలో ఉండడం ఉమ్మడి ప్రిపరేషన్ అభ్యర్థులకు కలిసొచ్చే అంశంగా చెప్పొచ్చు. గ్రూప్–1 అభ్యర్థులు ఆబ్జెక్టివ్ విధానంలో ఉండే ప్రిలిమినరీ పరీక్షతోపాటు.. ఆ తర్వాత దశలో ఏడు పేపర్లుగా.. డిస్క్రిప్టివ్ పద్ధతిలో నిర్వహించే మెయిన్ ఎగ్జామ్స్‌కు సన్నద్ధత పొందాల్సి ఉంటుంది. గ్రూప్–1 మెయిన్స్‌కు ప్రిపరేషన్ సాగిస్తే..గ్రూప్–1 ప్రిలిమ్స్, మెయిన్స్‌తోపాటు గ్రూప్–2, 3లకు కూడా సన్నద్ధత పూర్తవుతుందని నిపుణులు పేర్కొంటున్నారు.

గ్రూప్–2, 3 పరీక్షలు పూర్తిగా ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటాయి. గ్రూప్–2ను నాలుగు పేపర్లుగా, గ్రూప్–3ను మూడు పేపర్లుగా నిర్వహించనున్నారు. గ్రూప్–2లో నాలుగో పేపర్‌గా తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఆవిర్భావంపై పరీక్ష ఉంటుంది. ఈ అంశాలను గ్రూప్–3లోని పేపర్–2, పేపర్–3లతో సమ్మిళితం చేసుకునే అవకాశం ఉంది.

సిలబస్‌కు సరితూగే పుస్తకాలు

ఉమ్మడి ప్రిపరేషన్ సాగించే అభ్యర్థులు అందుకు అనుకూలమైన పుస్తకాలను మాత్రమే చదవాలి. ఆయా పరీక్షల సిలబస్ అంశాలన్నీ ఉన్న పుస్తకాలను ఎంచుకొని ప్రిపరేషన్‌కు ఉపక్రమించాలి. ప్రధానంగా తెలంగాణ ఉద్యమ దశలకు సంబంధించి ప్రత్యేక దృష్టితో చదవాలి. మార్కెట్లో ఈ అంశానికి సంబంధించి పదుల సంఖ్యలో పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. సిలబస్‌కు సరితూగే విధంగా తెలంగాణ ఉద్యమానికి సంబంధించి అన్ని ముఖ్యమైన ఘట్టాలు ఉన్న ఒకట్రెండు పుస్తకాలను ఎంచుకోవడం మేలు చేస్తుంది. అదే విధంగా అకాడమీ పుస్తకాలను చదవడం ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

విశ్లేషణాత్మక అధ్యయనం

గ్రూప్స్ అభ్యర్థులు తమ ప్రిపరేషన్‌లో విశ్లేషణాత్మక అధ్యయనానికి ప్రాధాన్యం ఇవ్వాలి. గ్రూప్–1 ప్రిలిమ్స్, గ్రూప్–2, 3 పరీక్షలు ఆబ్జెక్టివ్ విధానంలో, బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఉంటాయి. పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉన్నప్పటికీ.. ప్రిపరేషన్ మాత్రం డిస్క్రిప్టివ్ విధానంలోనే కొనసాగించాలి. తద్వారా ఆయా అంశాలపై పూర్తి స్థాయిలో అన్ని కోణాల్లో అవగాహన లభిస్తుంది. ఫలితంగా గ్రూప్–1 మెయిన్స్‌కు కూడా సన్నద్ధత పూర్తవుతుంది.

మెయిన్స్ స్థాయి ప్రిపరేషన్

గ్రూప్ 1 అభ్యర్థులు మెయిన్స్ స్థాయిని దృష్టిలో పెట్టుకుని అధ్యయనం సాగించాలి. మెయిన్స్‌లో ఏడు పేపర్లు(పేపర్–1 జనరల్ ఎస్సే; పేపర్–2 –హిస్టరీ, కల్చర్, జాగ్రఫీ; పేపర్–3 ఇండియన్ సొసైటీ, రాజ్యాంగం, పరిపాలన; పేపర్–4 ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్; పేపర్–5 సైన్స్ టెక్నాలజీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్; పేపర్–6 తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఆవిర్భావం) ఉంటాయి. జాతీయ, రాష్ట్ర స్థాయి అంశాలు కూడా సిలబస్‌లో ఉన్నాయి. కాబట్టి గ్రూప్ 1–మెయిన్ అప్రోచ్‌తో ప్రిపరేషన్ సాగిస్తే.. గ్రూప్–2, 3లకు కూడా సన్నద్ధత లభిస్తుంది. అదే విధంగా పేపర్–ఎ పేరుతో ఇంగ్లిష్ పేపర్ నిర్వహిస్తారు. ఇది అర్హత పేపర్ మాత్రమే.



అనుసంధాన దృక్పథం

ఉమ్మడి ప్రిపరేషన్‌లో భాగంగా అభ్యర్థులు అనుసంధాన దృక్పథం అనుసరించాలి. మూడు పరీక్షల్లోని ఉమ్మడి సిలబస్ అంశాలను గుర్తించి.. వాటిని అనుసంధానం చేసుకుంటూ చదవాలి. జనరల్ స్టడీస్, కరెంట్ అఫైర్స్, ఇంటర్నేషనల్ రిలేషన్స్; భారత రాజ్యాంగం విధానం, పరిపాలన, ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్.. ఇలా అనేక అంశాలను అనుసంధానం చేసుకుంటూ చదివే వీలుంది. అభ్యర్థులు ప్రతి రోజు సగటున 8 నుంచి 10 గంటల సమయం ప్రిపరేషన్‌కు కేటాయించేలా టైమ్ టేబుల్ రూపొందించుకోవాలి.

తెలంగాణకు ప్రాధాన్యం

ప్రిపరేషన్ సమయంలో అభ్యర్థులు జాతీయం నుంచి తెలంగాణ ప్రాంత ప్రాధాన్యమున్న అంశాల వరకూ.. అన్నింటినీ ఔపోసన పట్టాలి. ముఖ్యంగా తెలంగాణ ప్రాంతానికి సంబంధించి తెలంగాణ ఉద్యమ దశలు, తెలంగాణ ఆవిర్భావ దశ, మలిదశ ఉద్యమంలో ముఖ్యమైన ఘట్టాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే విధంగా తెలంగాణ చరిత్రలో తెలంగాణ సామాజిక ముఖ చిత్రాన్ని తెలియజేసే అన్ని అంశాలను చదవాలి. సాహిత్యం, కళలు, కవులు, సంస్థానాలు, భౌగోళిక స్వరూపం, వనరులు, ప్రభుత్వ పథకాలు, రాష్ట్రంలో అమలవుతున్న కొత్త పథకాలు.. ఇలా అన్ని అంశాలపైనా దృష్టి పెట్టాలి.

ప్రత్యేక అంశాలకు ఇలా

తెలంగాణ హిస్టరీ, తెలంగాణ జాగ్రఫీ, తెలంగాణ ఎకానమీలపై అభ్యర్థులు మరింత ఎక్కువగా దృష్టిపెట్టాలి. తెలంగాణలో శాతవాహనుల నుంచి అసఫ్ జాహీల వరకూ.. ఆయా రాజ వంశాలు, రాజకీయ చరిత్ర, ముఖ్య యుద్ధాలు, ఒప్పందాలు, తెలంగాణలోని కవులు–రచనలు; కళలు; ముఖ్య కట్టడాలు–వాటిని నిర్మించిన రాజులు తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. అదే విధంగా స్వాతంత్ర్యోద్యమ సమయంలో తెలంగాణ ప్రాంత ప్రమేయం ఉన్న సంఘటనలపై అవగాహన ఏర్పరచుకోవాలి. తెలంగాణలోని ముఖ్యమైన నదులు–పరీవాహక ప్రాంతాలు; ముఖ్యమైన పంటలు; భౌగోళిక ప్రాధాన్యం ఉన్న ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలపై దృష్టి పెట్టాలి. దీంతోపాటు తెలంగాణ భౌగోళిక స్వరూపం, విస్తీర్ణం, జనాభా వంటివి తెలుసుకోవాలి. ఎకానమీలో తెలంగాణ స్థూల రాష్ట్రీయోత్పత్తి, ముఖ్యమైన పథకాలు, 2011 జనాభా గణాంకాలు; ముఖ్యమైన పరిశ్రమలు –ఉత్పత్తిదాయకత, రాష్ట్ర ప్రధాన ఆదాయ వనరులపై అవగాహన పెంచుకోవాలి. తాజా బడ్జెట్ గణాంకాలు, ఆయా శాఖలు, పథకాలకు కేటాయింపులను తెలుసుకోవాలి.

జాతీయ ప్రాధాన్యం

జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో సామాజిక సమస్యలు, వాటిపై ప్రభుత్వాలు చేసిన విధానాలకు సంబంధించి ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. కాబట్టి వీటిపై అవగాహన పెంచుకోవాలి. ముఖ్యంగా మహిళా సాధికారత, గిరిజనుల సమస్యలు వంటివి. మహిళల సాధికారత కోసం జాతీయ స్థాయిలో పలు పథకాలు తెచ్చారు. మైనారిటీలు, వెనుకబడిన తరగతులు, గిరిజన సంక్షేమం కోసం విధానాలు అమలు చేస్తున్నారు. అదే విధంగా పలు నూతన పాలసీలు రూపొందుతున్నాయి.

సొంత నోట్స్

అభ్యర్థులు ఆయా సబ్జెక్టులను చదువుతున్నప్పుడే ముఖ్యమైన అంశాలను పాయింట్ల వారీగా నోట్స్ రాసుకోవాలి. ఒక అంశాన్ని చదివేటప్పుడు అన్ని కోణాల్లో అధ్యయనం చేస్తూ ముఖ్యమైన పాయింట్లను నోట్ చేసుకోవాలి. ఉదాహరణకు సామాజిక వర్గాలనే పరిగణనలోకి తీసుకుంటే.. ఆ వర్గాల నిర్వచనానికే పరిమితం కాకుండా.. వాటి ఆవిర్భావ చరిత్ర, విస్తరణ, తాజా పరిస్థితులు.. ఇలా అన్నింటినీ చదవాలి. ఇలా చదువుతూ కీలకాంశాలతో సిద్ధం చేసుకున్న నోట్స్‌ను పరీక్ష రోజు వరకూ పదే పదే రివిజన్ చేస్తుండాలి.

ప్రాక్టీస్ టెస్ట్‌లకు హాజరు

గ్రూప్–1, 2, 3 అభ్యర్థులు ప్రిపరేషన్ సమయంలో ప్రాక్టీస్ టెస్టులు, మోడల్ టెస్ట్‌లకు హాజరవడం మేలు చేస్తుంది. దీనివల్ల ఆయా సబ్జెక్ట్‌లలో తమకు అప్పటి వరకు లభించిన పరిజ్ఞాన స్థాయిపై అవగాహన లభిస్తుంది. ఇంకా చదవాల్సిన అంశాల విషయంలో స్పష్టత వస్తుంది.

క్లుప్తంగా...

రేపు 11 గంటలకు ఇంటర్ ఫలితాలు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్ ప్రథమ, ద్వితీయ పరీక్ష ఫలితాలను ఈనెల 24న 11 గంటలకు వెల్లడిస్తున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి శ్రుతి ఓజా ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఫలితాలను అధికారికంగా విడుదల చేస్తారని ఆమె పేర్కొన్నారు. ఫలితాలు https:// tsbie. cgg. gov. in లేదా https:// results. cgg. gov. in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు.

'సాక్షి'లో ఇంటర్ ఫలితాలు

ఇంటర్ ఫలితాలను వేగంగా తెలుసుకునేందుకు 'సాక్షి'దినపత్రిక ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. www. sakshieducation. com వెబ్‌సైట్‌కు లాగిన్ అయి ఫలితాలు చూసుకోవచ్చని తెలిపింది.

జేఈఈ తుది 'కీ' విడుదల

సాక్షి, హైదరాబాద్: జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (జేఈఈ మెయిన్-2) తుది 'కీ'ని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) సోమవారం విడుదల చేసింది. దీన్ని తన అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. కొన్ని రోజుల కిందట ప్రాథమిక 'కీ'విడుదల చేసిన ఎన్‌టీఏ, అందులో వచ్చిన అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని మార్పులు, చేర్పులతో ఫైనల్ 'కీ' ఇచ్చింది. దీనిద్వారా విద్యార్థులు మార్కులను అంచనా వేసుకునే అవకాశం ఉంటుంది.

జంటనగరాల నుంచి ఆర్సికేరికి 38 ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: వేసవి రద్దీని దృష్టిలో ఉంచుకుని జంటనగరాల నుంచి బెంగళూరు సమీపంలోని ఆర్సికేరి స్టేషన్ వరకు 38 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30 నుంచి జూన్ నెలాఖరు వరకు ఈ రైళ్లు సికింద్రాబాద్, నాంపల్లి స్టేషన్ల నుంచి ఆర్సికేరికి రాకపోకలు సాగించనున్నట్లు వెల్లడించారు. ప్రతి మంగళ, బుధ, గురు వారాల్లో ఈ రైళ్లు అందుబాటులో ఉంటాయన్నారు.

ఒప్పందం ప్రకారమే ఐపీఎల్ టికెట్ల విక్రయాలు

తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ

సాక్షి, హైదరాబాద్: భాగ్యనగరంలో ఐపీఎల్ మ్యాచ్‌లకు సంబంధించి ఆన్‌లైన్ టికెట్ల విక్రయాలన్నీ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ), సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారమే జరుగుతున్నాయని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం ఉప్పల్‌లోని ప్రభుత్వ స్థలాన్ని లీజు పద్ధతిలో హెచ్‌సీఏకు కేటాయించిందని పేర్కొంది. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్వహణ పూర్తిగా హెచ్‌సీఏ ఆధ్వర్యంలోనే జరుగుతోందని వివరించింది.

ప్రభుత్వం నుంచి నిధులు రాగానే ఉద్యోగులందరికీ బాండ్ల బకాయిలు చెల్లిస్తాం

'సాక్షి' కథనంపై ఆర్టీసీ స్పందన

సాక్షి ఎఫెక్ట్

సాక్షి, హైదరాబాద్: గతంలో అమలు చేసిన వేతన సవరణకు సంబంధించి ప్రభుత్వం నుంచి నిధులు రాగానే సిబ్బంది అందరికీ బకాయిలు చెల్లిస్తామని ఆర్టీసీ ఓ ప్రకటనలో తెలిపింది. 2013 వేతన సవరణకు సంబంధించిన బకాయిల్లో బాండ్ల తాలూకు మొత్తం ఇంకా చెల్లించలేదు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వాటి చెల్లింపు కోసం రూ.280 కోట్లు మంజూరు చేశారు. స్వయంగా ఆయనే ఆ విషయాన్ని వెల్లడించారు. ఇందులో ఇప్పటివరకు కేవలం డ్రైవర్లకు మాత్రమే చెల్లించారు. మిగతా ఉద్యోగులు వాటికోసం ఎదురు చూస్తున్నారు. ఇదే విషయాన్ని వివరిస్తూ 'సాక్షి'లో సోమవారం 'డ్రైవర్లకు మాత్రమే నా'శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనికి ఆర్టీసీ ఓ ప్రకటన ద్వారా వివరణ ఇచ్చింది. రూ.280 కోట్లకు సంబంధించి ప్రభుత్వం నుంచి రూ.80 కోట్లు విడుదలయ్యాయని, వాటిని డ్రైవర్లకు చెల్లించామని, ప్రభుత్వం నుంచి మిగతా డబ్బులు రాగానే మిగతా ఉద్యోగులకు చెల్లిస్తామని స్పష్టం చేసింది.

ఎన్‌కౌంటర్ మృతులపై రూ.1.78 కోట్ల రివార్డు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో ఈనెల 16న భద్రతా బలగాలు- మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో 29 మంది మావోయిస్టులు మృతి చెందారని ఛత్తీస్‌గఢ్ పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనలో కొందరే మృతి చెందగా, మిగతా వారిని సజీవంగా పట్టుకుని కాల్చిచంపారని మావోయిస్టులు ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్ పోలీసులు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కాంకేర్ ఎన్‌కౌంటర్‌లో వివిధ కేడర్లకు చెందిన 29 మంది మావోలు మృతి చెందారని తెలిపారు. వీరి తలలపై రూ.1.78 కోట్ల రివార్డు ఉందని పేర్కొన్నారు. అలాగే, మృతుల నుంచి రూ.7.55 లక్షల విలువైన ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

ఇక వాహన శాశ్వత రిజిస్ట్రేషన్లూ

షోరూంలలోనే..!



కసరత్తు చేపట్టిన రవాణా శాఖ.. విధివిధానాలపై అధ్యయనం

- ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో అమలవుతున్న విధానం
- లోక్‌సభ ఎన్నికల అనంతరం అమల్లోకి వచ్చే అవకాశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వాహనాలు కొనుగోలు చేసిన షోరూంలలోనే శాశ్వత రిజిస్ట్రేషన్లు చేసేందుకు రవాణా శాఖ తాజాగా కసరత్తు చేపట్టింది. వాహన యజమానులకు ఇబ్బందులు తలెత్తకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయడంపై దృష్టి సారించింది. ఇప్పటికే ఈ విధానం ఏపీలో విజయవంతంగా అమలవుతుండటంతో ఇక్కడ సైతం అదే పద్ధతిని అమలు చేసేందుకు అనుసరించాల్సిన విధివిధానాలపై అధ్యయనం చేస్తోంది. గ్రేటర్ హైదరాబాద్‌లోని వాహనాల షోరూంల వివరాలతోపాటు నిత్యం నమోదయ్యే వాహనాల వివరాలను సేకరిస్తోంది. ఒక్కో డీలర్ విక్రయించే వాహనాల సంఖ్య, షోరూంలలోనే వాహనాల శాశ్వత నమోదు ప్రక్రియ చేపడితే అవసరమయ్యే సాంకేతిక పరిజ్ఞానం తదితర అంశాలపై ఈ కసరత్తు చేపట్టింది. లోక్‌సభ ఎన్నికల అనంతరం షోరూంలలోనే శాశ్వత రిజిస్ట్రేషన్ విధానం అమల్లోకి వచ్చే అవకాశం ఉన్నట్లు రవాణాశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ప్రస్తుతం షోరూంలలో వాహనాలకు తాత్కాలిక రిజిస్ట్రేషన్‌లు (టీఆర్) చేస్తున్నారు. రవాణాశాఖ నుంచే ఈ టీఆర్‌లు అందుతున్నప్పటికీ అందుకోసం వాహనదారులు ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లట్లేదు. వాహనంతోపాటు షోరూంలోనే టీఆర్ పత్రాలను తీసుకుంటున్నారు. పర్మినెంట్ రిజిస్ట్రేషన్ (పీఆర్) కూడా షోరూంలకే బదిలీ అయితే వాహనదారులకు ఇకపై పీఆర్ స్మార్ట్ కార్డులు చేతికి అందుతాయి.

2016లోనే కేంద్రం మార్గదర్శకాలు...

కేంద్రం ప్రభుత్వం రహదారి భద్రత చట్టంలో వాహనదారులకు ఊరట కల్పించే అనేక అంశాలను పొందుపరిచింది. వాహనాల రిజిస్ట్రేషన్లను షోరూంలలోనే పూర్తి చేసేలా 2016లోనే మార్గదర్శకాలు రూపొందించింది. ఏపీ సహా పలు రాష్ట్రాలు ఈ సదుపాయాన్ని వాహనదారులకు అందుబాటులోకి తెచ్చాయి. కానీ తెలంగాణలో మాత్రం వాహనాలు కొనుగోలు చేసిన సమయంలో మొదట టీఆర్ తీసుకొని ఆ తరువాత సంబంధిత ప్రాంతీయ రవాణా కార్యాలయంలో పీఆర్ పొందే విధానం కొనసాగుతోంది. అయితే ఈ ప్రక్రియ దళారులతో పాటు కొందరు అధికారుల అక్రమార్జనకు దోహదం చేస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. కేంద్రం మార్గదర్శకాలు రాష్ట్రంలోనూ అమలైతే షోరూంలోనే పీఆర్ స్మార్ట్ కార్డుతోపాటు వాహనానికి హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్ కూడా లభించనుంది.

గ్రేటర్‌లో భారీగా వాహనాల అమ్మకాలు

గ్రేటర్ హైదరాబాద్‌లోని పది ఆర్టీఏ కార్యాలయాల పరిధిలో నిత్యం సుమారు 2,500 కొత్త వాహనాల అమ్మకాలు జరుగుతున్నాయి. వాటిలో 1,600కుపైగా ద్విచక్ర వాహనాలుకాగా మిగతావి కార్లు, ఇతర వాహనాలు ఉన్నాయి. ప్రస్తుతం వాహనదారుల చిరునామా పరిధిలోని ఆర్టీఏ కార్యాలయంలో శాశ్వత రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఒక్కో కార్యాలయంలో రోజుకు వందల సంఖ్యలో శాశ్వత రిజిస్ట్రేషన్ల వల్ల వాహనాల రద్దీతోపాటు అందరి సమయం వృథా అవుతోంది. అలాగే ఆన్‌లైన్‌లో స్లాట్ నమోదు మొదలు అధికారుల తనిఖీ పూర్తయ్యే వరకు వాహనదారులు ఆర్టీఏ ఏజెంట్లను ఆశ్రయించాల్సి వస్తోంది. షోరూం రిజిస్ట్రేషన్‌లు అమల్లోకి వస్తే దళారుల అక్రమ దందాకు తెరపడనుంది.

కంటెయినర్ కిందకి దూసుకెళ్లిన కారు..





కంటెయినర్ కిందకు దూసుకెళ్లిన కారు. నవీన్ భార్గవి దంపతులు (ఫైల్)

- అక్కడికక్కడే దంపతుల దుర్మరణం
- సూర్యాపేట జిల్లాలో ఘటన

మునగాల (కోదాడ)/వైరా: రహదారి పక్కన ఆగి ఉన్న కంటెయినర్‌ను.. ఓ కారు వెనుక నుంచి అతివేగంగా ఢీకొట్టి దానికిందకి దూసుకెళ్లడంతో కారులో ప్రయాణిస్తున్న దంపతులిద్దరు దుర్మరణం పాలయ్యారు. సూర్యాపేట జిల్లా మునగాల మండలం ముకుందాపురం శివారులో సోమవారం ఈ ఘటన జరిగింది. మునగాల ఎస్‌ఐ బైరెడ్డి అంజిరెడ్డి కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా వైరా మండలం సోమవరం గ్రామానికి చెందిన సామినేని నవీన్‌రాజ్ (29)కు ఏపీలోని ఎన్టీఆర్ కృష్ణా జిల్లా విస్సన్నపేట గ్రామానికి చెందిన భార్గవి (27)తో రెండేళ్ల క్రితం వివాహం అయింది. నవీన్‌రాజ్ విజయవాడలోని శ్రీచైతన్య కళాశాలలో గణిత అధ్యాపకుడిగా పనిచేస్తుండగా, భార్గవి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. శనివారం భార్గవి పుట్టినరోజు కావడంతో దంపతులిద్దరూ తమ కారులో హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో ఉంటున్న నవీన్‌రాజ్ తల్లిదండ్రుల వద్దకు వెళ్లారు. తిరిగి సోమవారం ఉదయం ఆరు గంటలకు హైదరాబాద్ నుంచి విజయవాడకు కారులో బయల్దేరారు. మార్గమధ్యలో ముకుందాపురం శివారులో హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదురుగా రోడ్డు పక్కన ఆగి ఉన్న భారీ కంటెయినర్‌ను వీరు వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొట్టారు. కారు కంటెయినర్ కిందకి దూసుకెళ్లడంతో నవీన్‌రాజ్, భార్గవి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సమాచారం అందుకున్న మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐ బైరెడ్డి అంజిరెడ్డి, ఏఎస్‌ఐ కల్లు శ్రీనివాసరెడ్డి తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కారు కంటెయినర్ అడుగుభాగాన ఇరుక్కుపోవడంతో మృతదేహాలను వెలికి తీయడం పోలీసులకు కష్టంగా మారింది. స్థానికుల సాయంతో పోలీసులు భారీ క్రేన్, జేసీబీలతో దాదాపు గంటసేపు కష్టపడి కారును కంటెయినర్ కింద నుంచి బయటకు తీసి మృతదేహాలను వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మృతదేహాలను నవీన్‌రాజ్ స్వగ్రామం సోమవరానికి పంపించారు. పెట్రోల్ బంక్ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అంజిరెడ్డి తెలిపారు.

చదువు మాన్పించి పెళ్లి చేశారని.. నవ వధువు ఆత్మహత్య



దేవకి(ఫైల్)

చంద్రుగొండ: చదువు మాన్పించి పెళ్లి చేశారనే మనస్తాపంతో నవ వధువు బలవన్మరణానికి పాల్పడిన విషాదఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం మంగయ్య బంజర్‌లో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మంగయ్యబంజర్ గ్రామానికి చెందిన భూక్యా దేవకి(23) ఈ ఏడాది కొత్తగూడెంలోని సింగరేణి మహిళా కళాశాలలో డిగ్రీ పూర్తి చేసింది. పై చదువులకు వెళ్తానని పట్టుబట్టినా.. తల్లి ఆరోగ్యం బాగుండడం లేదనే సాకుతో కుటుంబసభ్యులు వివాహానికి ఒప్పించారు. ఇదే మండలంలోని దుబ్బతండాకు చెందిన గుగులోత్ బాలరాజుతో మార్చి 28న దేవకికి వివాహం జరిపించారు. కాగా, 16 రోజుల పండుగ నిమిత్తం నూతన వధూవరులను ఈనెల 12న మంగయ్యబంజర్ తీసుకొచ్చారు. 13వ తేదీ అర్ధరాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో దేవకి పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను మొదట జూలూరుపాడు ఆస్పత్రికి, అక్కడి నుంచి కొత్తగూడెంకు తరలించారు. ఆ తర్వాత మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, సోమవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచింది. తల్లి భూక్యా పద్మ ఫిర్యాదు మేరకు చంద్రుగొండ ఎస్సై మాచినేని రవి కేసు నమోదు చేశారు.

బడులు తెరిచేలోగా పాఠ్య పుస్తకాలు

- మే నెలాఖరు నాటికి 1.40 కోట్ల పుస్తకాలు సిద్ధం చేయాలని విద్యాశాఖ నిర్ణయం
- మొదలైన టెండర్ల ప్రక్రియ.. యూనిఫారాలనూ సకాలంలోనే అందించేలా ఏర్పాట్లు

సాక్షి, హైదరాబాద్: వేసవి సెలవుల తర్వాత ప్రభుత్వ పాఠశాలలను తిరిగి తెరిచేలోగా పాఠ్య పుస్తకాలు, యూనిఫారాలను బడులకు చేర్చాలని విద్యాశాఖ నిర్ణయించింది. రెండు విడతలుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తోంది. యూనిఫారాల తయారీ సంస్థల ఎంపికను కొత్తగా ఏర్పాటైన అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకు అప్పగించనున్నారు.

ముందే కాంట్రాక్ట్ ప్రక్రియతో..

పాఠ్య పుస్తకాలు, యూనిఫారాల పంపిణీపై ఇటీవల ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఏటా బడులు తెరిచిన రెండు, మూడు నెలల వరకు పుస్తకాల పంపిణీ జరగకపోవడం, తరగతులకు ఇబ్బంది అవడంపై అందులో చర్చించారు. దీనివల్ల ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థుల్లో ప్రమాణాలు సన్నగిల్లుతున్నాయని.. ఆలస్యంగా బోధన చేపట్టడంతో హడావుడిగా సిలబస్‌ను ముగించాల్సి వస్తోందని అభిప్రాయానికి వచ్చారు. కొన్నేళ్లుగా కాంట్రాక్టుల ప్రక్రియ లో ఆలస్యం అవుతుండటం, కాంట్రాక్టర్లకు పేపర్ సకాలంలో దొరక్క ప్రింటింగ్‌కు ఆలస్యం అవుతుండటం కూడా దీనికి కారణమని గుర్తించారు. ఈ క్రమంలో ఈసారి ముందే కాంట్రాక్ట్ ప్రక్రియ చేపట్టామని అధికారులు చెప్తున్నారు.



మే నెలాఖరు నాటికి 1.40 కోట్ల పుస్తకాలు

2024–25 విద్యా సంవత్సరంలో మొత్తంగా 1,98,06, 381 పాఠ్య పుస్తకాలు అవసరమని అధికారులు అంచనా వేశారు. గత ఏడాది పంపిణీ చేయగా 8,31,121 పుస్తకా లు మిగిలిపోయాయి. ఇంకా 1,89,75,260 పుస్తకాలు అవసరం. ఇందులో 1.40 కోట్ల పుస్తకాలను మే నెలాఖరు నాటికల్లా బడులకు చేర్చాలని నిర్ణయించారు. మిగతా పుస్తకాలను స్కూళ్లు తెరిచే నాటికి అందించవచ్చని భావిస్తున్నారు. పాఠశాల ప్రింటింగ్ విభాగం ఈ పుస్తకాలను జిల్లా కేంద్రాలకు చేరుస్తుంది. అక్కడి నుంచి మండలాలు, పాఠశాలలకు చేర్చాల్సి ఉంటుంది. గతంలో మండల కేంద్రాల నుంచి హెడ్ మాస్టర్లు స్కూళ్లకు తీసుకెళ్లే విధానం ఉండేది. ఈ విధానాన్ని గత ఏడాది మార్చారు. జిల్లా పరిధిలో అన్ని స్కూళ్లకు పుస్తకాలను పంపిణీ చేసే బాధ్యతను ఒక సంస్థకు అప్పగిస్తున్నారు.

ఆదర్శ కమిటీలకే యూనిఫారాల బాధ్యత

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏటా రెండు జతల యూనిఫారాలను అందిస్తారు. ఈ బాధ్యతను ఈసారి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అప్పగించాలని నిర్ణయించారు. గతంలో స్థానిక మహిళా సంఘాల ద్వారా దుస్తులను కుట్టించేవారు. వస్త్రాన్ని చేనేత సంస్థల నుంచి కొనుగోలు చేసేవారు. దీనివల్ల ఆలస్యమవుతోందని అధికారులు భావిస్తున్నారు. జిల్లా కేంద్రం యూనిట్‌గా ఒకే సంస్థకు యూనిఫారాల తయారీ బాధ్యతలు అప్పగించే అంశాన్ని పరిశీలిస్తున్నారు. 'అమ్మ'కమిటీలు.. స్కూళ్లలో ఎంత మందికి, ఏయే సైజుల్లో యూనిఫారాలు అవసరమనేది గుర్తిస్తాయి. యూనిఫారాలు స్కూళ్లకు చేరి, విద్యార్థులకు అందేదాకా పర్యవేక్షిస్తాయి.

నీటి వనరుల ఆక్రమణ.. సామాజిక దురాచారమే

జీవనాధారమైన నీటి వనరులను రక్షించేలా ఆదేశాలివ్వండి

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి జస్టిస్ ఎంజీ ప్రియదర్శిని లేఖ



సాక్షి, హైదరాబాద్: నీటి వనరుల ఆక్రమణ కూడా ఓ సామాజిక దురాచారం లాంటిదే. పౌరుల రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించడమే. పౌరులందరి హక్కులను దురాశపరులు ఉల్లంఘిస్తే.. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించాలి. నీటి వనరుల కబ్జాపై చర్యలు చేపట్టి ఆక్రమణలను తొలగించాలి. నీటి వనరులను తరచుగా ఆక్రమించడం చూసి రాజధానివాసులు విసుగు చెందారు. ఇకపై అలాంటి ఆక్రమణదారులను ఉపేక్షించడం ఎంత మాత్రం శ్రేయస్కరం కాదు. వెంటనే చర్యలు చేపట్టేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలి'అని కోరుతూ జస్టిస్ ఎంజీ ప్రియదర్శిని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. జల్పల్లి, ఉమ్దా సాగర్‌ను చుట్టుప్రక్కల నుంచి తీసుకొచ్చే డంపింగ్‌తో నింపుతున్నారని, తద్వారా చదునుగా మారితే ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని పత్రికల్లో వచ్చిన కథనాలపై ఆమె స్పందించారు. పాతబస్తీ నుంచి మెట్రోకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, దీంతో భూములతో పాటు చెరువుల కబ్జాకు కొందరు యత్నిస్తున్నారనే కథనాన్ని న్యాయమూర్తి.. హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. నీటి వనరుల ఆక్రమణ పరిపాటిగా మారిందని.. ప్రభుత్వం తక్షణం స్పందిస్తేనే నీటి వనరులను భావి తరాలకు అందించగలగుతామని పేర్కొన్నారు. న్యాయమూర్తి రాసిన లేఖను ప్రధాన న్యాయమూర్తి సుమోటో పిల్‌గా విచారణ చేపట్టేందుకు అంగీకరించారు. ఈ పిటిషన్ ఒకట్రెండు రోజుల్లో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం ముందు విచారణకు రానుంది.

ఎన్నికల్లో అవాంఛనీయ ఘటనలకు చోటివ్వద్దు

- మావోయిస్టుల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించండి
- అనుమానిత వ్యక్తుల విషయంలో అప్రమత్తంగా ఉండండి
- మూడు మావోయిస్టు ప్రభావిత జిల్లాల ఉన్నతాధికారులకు డీజీపీ ఆదేశం
- కొత్తగూడెం జిల్లా చర్లలో సీఆర్పీఎఫ్ క్యాంపుల పరిశీలన.. భద్రతా ఏర్పాట్లపై సమీక్ష

చర్ల/బూర్గంపాడు: లోక్‌సభ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందుజాగ్రత్తలు తీసుకోవాలని డీజీపీ రవిగుప్తా ఉన్నతాధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలానికి చేరుకున్నారు. చెన్నాపురం, ఉంజుపల్లి, పూసుగుప్పల్లో ఉన్న సీఆర్పీఎఫ్ 81వ బెటాలియన్ క్యాంపులను సందర్శించి అక్కడి అధికారులు, జవాన్లతో మాట్లాడారు. మావోయిస్టుల కదలికలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని.. అనుమానిత వ్యక్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని డీజీపీ సూచించారు. క్యాంపులున్న ప్రాంతాల్లో ముమ్మరంగా గస్తీ నిర్వహించాలని, ఆయా ప్రాంతాల్లో విస్తృతంగా కూంబింగ్ చేపట్టాలన్నారు. అనంతరం సారపాక ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, భూపాలపల్లి జిల్లాల పోలీస్ అధికారులతో రవిగుప్తా సమీక్షించారు. చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలని, నగదు, మద్యం అక్రమ రవాణాను అడ్డుకోవాలని ఆదేశించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంత పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశం అనంతరం అధికారులతో కలసి భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామిని డీజీపీ దర్శించుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు డీజీపీ (ఇంటెలిజెన్స్) శివధర్‌రెడ్డి, గ్రేహౌండ్స్ అదనపు డీజీ విజయకుమార్, సీఆర్పీఎఫ్ సౌత్ జోన్ అదనపు డీజీపీ రవిదీప్‌సింగ్ సాహు, సీఆర్పీఎఫ్ సౌత్ సెక్టార్ హైదరాబాద్ జోన్ డీజీపీ చారు సిన్హా, ఎస్‌ఐబీ డీజీపీ సుమతి, భద్రాద్రి, ములుగు, భూపాలపల్లి జిల్లాల ఎస్పీలు రోహిత్‌రాజ్, శబరీష్, కిరణ్ ప్రభాకర్ ఖరే, ఓఎస్డీ సాయి మనోహర్, ఏఎస్పీలు పరితోష్ పంకజ్, మహేష్ జితే, ట్రైనీ ఐపీఎస్ విక్రాంత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



చెన్నాపురం క్యాంపులో సీఆర్‌పీఎఫ్ అధికారులతో మాట్లాడుతున్న డీజీపీ రవిగుప్తా

సబ్ రిజిస్ట్రార్ తస్లీమా ఇళ్లపై ఏసీబీ దాడులు

రూ.2.94 కోట్ల ఆస్తుల గుర్తింపు

వరంగల్ క్రైం: ఇటీవల ఏసీబీకి చిక్కిన మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమాపై ఆదాయానికి మించి ఆస్తులున్నట్లు ఆరోపణలు రావడంతో సోమవారం అవినీతి నిరోధకశాఖ అధికారులు హనుమకొండలోని కాకతీయ కాలనీ, యాదవ నగర్‌తో పాటు భూపాలపల్లి, సూర్యాపేటలో దాడులు నిర్వహించారు. గత నెల 22న మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో లంచం తీసుకుంటూ పట్టుబడిన తస్లీమా అక్రమాస్తులపై వచ్చిన ఫిర్యాదులతో మరోసారి ఏసీబీ అధికారులు ఏకకాలంలో బంధువులు, స్నేహితుల ఇళ్లలో దాడులు నిర్వహించారు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య వివరాలు వెల్లడించారు. గ్రేడ్-1 సబ్ రిజిస్ట్రార్ తస్లీమా ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉందని తెలిపారు. భూపాలపల్లిలో డాక్యుమెంట్స్ రైటర్స్, సూర్యాపేటలో కుటుంబ సభ్యుల ఇళ్లు, హనుమకొండలో ఆమె ఇళ్లల్లో తనిఖీ చేసినట్లు చెప్పారు. సోదాల్లో ఐదు ఇళ్లకు సంబంధించిన డాక్యుమెంట్లు లభ్యమయ్యాయని, వీటి విలువ రూ.2,07,00,426 ఉంటుందని, ఆరు ఓపెన్ ప్లాట్స్ డాక్యుమెంట్స్ విలువ రూ.12,01,500, మూడు ఎకరాల వ్యవసాయ భూమి రూ.20,40,000, నగదు రూ.1,92,900, బ్యాంకు బ్యాలెన్స్ రూ.98,787, ఇంట్లో విలువైన సామాన్లు రూ.9,04,800, వాహనాల విలువ రూ.23,66,218, మొత్తం రూ.2,94,84,547 విలువ గల ఆస్తులు లభించినట్లు వెల్లడించారు. ఆదాయానికి మించిన ఆస్తులకు సంబంధించి పరిశీలన కొనసాగుతోందన్నారు.



సోదాలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

ఆర్టీసీ అధికారులపై విజిలెన్స్ నిఘా

- ఇటీవల డ్రైవర్ నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన డిపో మేనేజర్
- దీంతో అన్ని స్థాయిల్లో అధికారుల తీరుపై ఆరా !

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ అధికారులపై విజిలెన్స్ నిఘా పెట్టింది. డిపోల్లో పనిచేస్తున్న దిగువస్థాయి అధికారి మొదలు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్థాయి ఉన్నతాధికారుల వరకు.. ఆర్టీసీ విజిలెన్స్ యంత్రాంగం వివరాలు సేకరిస్తోంది. ఇటీవల హుజూరాబాద్ డిపో మేనేజర్ శ్రీకాంత్ ఓ బస్సు డ్రైవర్ నుంచి రూ.20 వేల లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖకు చిక్కారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్నాడన్న కారణంతో ఆ డ్రైవర్‌కు గతంలో చార్జిమెమో జారీ అయ్యింది. దీనిని తొలగించాలని ఆ డ్రైవర్ డిపో మేనేజర్‌ను కోరారు. ఇందుకు రూ.30 వేలు లంచం డిమాండ్ చేశాడని, అందులో రూ.10 వేలు సమర్పించగా, మిగతా మొత్తానికి డీఎం ఒత్తిడి చేయటంతో డ్రైవర్ అవినీతి నిరోధక శాఖను సంప్రదించారని అధికారులు పేర్కొన్నారు. చివరకు రూ.20 వేలు తీసుకుంటుండగా వలపన్ని డీఎంను పట్టుకున్నామని ఏసీబీ ప్రకటించింది. ఇలా కొంతమంది డీఎంలు డ్రైవర్, కండక్టర్లపై ఉన్న చార్జి మెమోల ఆధారంగా డబ్బులు వసూలు చేస్తున్నట్టు ఫిర్యాదులున్నాయి. కొందరు అంతకంటే పైస్థాయి అధికారులపై కూడా ఈ తరహా ఫిర్యాదులు వినిపి స్తున్నాయి. దీంతో సిబ్బంది పనితీరు ఎలా ఉందో ఆరా తీసి నివేదిక ఇవ్వాలని ఆర్టీసీ విజిలెన్స్‌ను ఆదేశించినట్టు తెలిసింది.

రెగ్యులర్ అధికారుల రాకతో గాడిన

ఆర్టీసీలో విజిలెన్స్ విభాగం జేడీ స్థాయిలో ఓ ఐపీఎస్ అధికారి ఆధ్వర్యంలో పనిచేస్తుంటుంది. 12 ఏళ్లుగా ఆ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైంది. రెగ్యులర్ అధికారులు కాకుండా, పదవీ విరమణ పొందిన, అవినీతి ఆరోపణలు ఉన్న వారికి అప్పగిస్తూ వస్తున్నారు. రిటైర్డ్ అయిన అధికారులు కొందరు దాన్ని చేజిక్కించుకొని డబ్బు వసూళ్లే లక్ష్యంగా పనిచేశారు. దీంతో ఆ విభాగం పూర్తిగా అవినీతిలో కూరుకుపోయింది. ఎండీగా సజ్జనార్ వచ్చిన తర్వాత దీనిని సంస్కరించి పూర్తిస్థాయిలో రెగ్యులర్ ఐపీఎస్ అధికారి ఉండేలా చూశారు. దిగువ స్థాయిలో కూడా రిటైర్డ్ అధికారులను తొలగించి రెగ్యులర్ అధికారులను నియమించటంతో నిఘా వ్యవస్థ మళ్లీ గాడిలో పడింది.



గతంలో వచ్చిన ఆరోపణలు

- కొన్నేళ్ల క్రితం పదవీవిరమణ పొందిన ఓ ఉన్నతాధికారిపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. కొత్త బస్సుల కొనుగోలు, మహిళా ప్రయాణికుల కోసం బస్సుల్లో పార్టీషన్ ఏర్పాటు పనుల నిర్వహణ లాంటి వాటిల్లో భారీగా అక్రమాలకు పాల్పడ్డారు. సీఎంకోసం బుల్లెట్ ప్రూఫ్ బస్సు కొనుగోలు సమయంలో కూడా ఆయన అక్రమాలకు తెరదీసినట్టు అప్ప ట్లో ఆరోపణలు గుప్పుమన్నాయి. దీంతో ఇప్పుడు సర్వీసులో ఉన్న సీనియర్ అధికారుల తీరుపై కూడా విజిలెన్స్ నిఘా ఉంచి వారిపై ఉన్న ఆరోపణల చిట్టా సిద్ధం చేస్తున్నట్టు తెలిసింది.
- ఓ డిపో మేనేజర్‌తో కుమ్మక్కయిన ఉన్నతాధికారి, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి చెల్లించే డబ్బులు సహా ఇతర కొన్ని నిధులు స్వాహా చేశారు. ఇది బయటకు పొక్కటంతో విచారణ జరిపి ఆ డిపో మేనేజర్‌ను విధుల నుంచి తొలగించారు. కానీ, ఉన్నతాధికారిని బదిలీ చేసి చేతులు దులుపుకొన్నారు. కొద్ది రోజుల తర్వాత ఆ అధికారిని కీలక స్థానానికి మళ్లీ బదిలీ చేశారు.
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఓ అధికారి ట్రాఫిక్ గైడ్ల నియామకంలో వసూళ్లకు పాల్పడ్డారన్న ఆరోపణలున్నాయి.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.